www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఏడు రోజుల కస్టడీకి ప్రజ్వల్

జర్మనీ నుంచి అర్ధరాత్రి ఎయిర్‌పోర్టుకు రాక.. 20 నిమిషాల్లోనే అరెస్టు చేసిన మహిళా పోలీసులు
సీఐడీ కార్యాలయంలోని సిట్ విభాగానికి తరలింపు.. తెల్లవారే వరకూ అక్కడే ఎంపీ రేవణ్ణ
సిట్ అధికారుల విచారణ.. వైద్య పరీక్షల అనంతరం కోర్టుకు
14 రోజుల కస్టడీకి ఇవ్వాలన్న సిట్.. వారం పాటు అనుమతి
ప్రజ్వల్ తండ్రి రేవణ్ణ బెయిల్ రద్దు చేయండి
హైకోర్టులో సిట్ పిటిషన్... ఎల్లుండి విచారణ 2


ప్రజ్వల్‌ను అరెస్టు చేసి తీసుకెళ్తున్న పోలీసులు

శనివారం | 1-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 63

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: నవమి ఉ. 7.25, దశమి తె. 5.04 వరకు; నక్షత్రం: ఉత్తరాభాద్ర తె. 3.16 తదుపరి రేవతి; వర్జ్యం: మ.1.47-3.17; దుర్ముహూర్తం: ఉ.5.43-7.27; అమృతఘడియలు: రా.10.46-12.16; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.42

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇంగ్లండ్ నుంచి లక్ష కిలోల బంగారం!



భారీ భద్రత నడుమ ప్రత్యేక విమానంలో ఆర్బీఐ ఖజానాకు
నిల్వ సర్దుబాట్లలో భాగంగానే భారత్‌కు ఈ స్థాయిలో తరలింపు
15 ఏళ్ల క్రితం ఐఎంఎఫ్ నుంచి ఆర్బీఐ 200 టన్నుల కొనుగోలు
కొన్నేళ్లుగా బంగారాన్ని కొంటూ బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో నిల్వ
విదేశీ మారక నిల్వల సంక్షోభంతో 1991లో బంగారం తనఖా
ఇప్పుడు 100 టన్నులను దించడం దేశ ఆర్థికశక్తికి నిదర్శనం: ఆర్బీఐ

ముంబై, మే 31: వంద టన్నుల బంగారం.. అంటే.. లక్ష కిలోలు! ఇంత భారీ స్థాయిలో బంగారం ఇంగ్లండ్ నుంచి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఖజానాకు చేరింది. 1991 తర్వాత ఇంత పెద్ద మొత్తంలో దేశానికి బంగారాన్ని తరలించడం ఇదే తొలిసారి. మరి.. ఇంత బంగారం ఎక్కడిది? చాలా దేశాల్లోని కేంద్ర బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో తమ బంగారాన్ని నిల్వ చేస్తుంటాయి. భారత్ ఇదే చేసింది. 15 ఏళ్ల క్రితం అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి 200 టన్నుల బంగారాన్ని

మిగతా 2వ పేజీలో...

అమెరికా స్పెల్ బీలో తెలంగాణ సంతతి విద్యార్థి గెలుపు

90 సెకన్లలో 29 పదాలు
తప్పుల్లేకుండా చెప్పిన బృహత్
రూ.41.64 లక్షలతో పాటు
పలు బహుమతులు సొంతం 14
బృహత్ తండ్రి స్వస్థలం నల్లగొండ



ప్రైవేట్ బడుల్లో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌ల విక్రయంపై నిషేధం

14

ఆదేశాలు జారీ చేసిన విద్యా శాఖ
సర్క్యులర్‌తో సమస్య తీరదు
కఠిన చర్యలు తీసుకోవాలి
ప్రభుత్వ పుస్తకాల పబ్లిషర్ల విజ్ఞప్తి

'గొర్రెల పంపిణీ'లో.. ₹ 700 కోట్ల గోల్‌మాల్!


రాంచందర్


కల్యాణ్‌కుమార్

టీఎస్ఎల్‌డీఏ సీఈవో రాంచందర్, మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ కల్యాణ్ అరెస్ట్
అజ్ఞాతంలో ప్రధాన నిందితుడు మొహిదొద్దీన్.. కేసులో ఇప్పటికే 10 మంది అరెస్ట్
పట్టుబడ్డ వారిలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు.. రాజకీయ ప్రమేయంపైనా దర్యాప్తు?
రాంచందర్ హయాంలోనే పెరిగిన గొర్రెల యూనిట్ ధర.. పాత ధర రూ.1.25 లక్షలు, కొత్త ధర రూ. 1.75 లక్షలు
ఒక్కో యూనిట్‌కు రూ. 20 వేలు అధికారులకు కమీషన్.. లబ్ధిదారుల వద్ద టోకెన్లు.. కాగితాలపై గొర్రెల కొనుగోళ్లు

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గొర్రెల పంపిణీ పథకంలో అంతులేని అవినీతి చోటుచేసుకుంది. ఈ పథకం బిల్లు చెల్లింపుల్లో ఏకంగా రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు ఏసీబీ దర్యాప్తులో తేలింది. కొనని గొర్రెలు కొన్నట్లు, లబ్ధిదారులకు ఇవ్వకుండానే ఇచ్చినట్లు.. కేవలం కాగితాలపైనే లావాదేవీలు నడిపించి పథకాన్ని అక్రమాలకు నిలయంగా మార్చేశారు.

ముందుగా రూ.2.10 కోట్ల గోల్‌మాల్ జరిగినట్లు కేసు నమోదు కాగా.. ఏసీబీ దర్యాప్తులో ఇప్పటివరకు లభించిన ఆధారాల మేరకు సుమారు రూ.700 కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. మరోవైపు ఈ పథకంలో బిల్లుల చెల్లింపు అక్రమాల కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ స్టేట్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (టీఎస్ఎల్‌డీఏ) సీఈవో సబావత్ రాంచందర్ నాయక్‌ను, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన కల్యాణ్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. రాంచందర్ గతంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల సహకార సంస్థ (టీఎస్ఎస్‌జీడీసీఎఫ్) ఎండీగా కూడా పనిచేశారు. కాగా, రూ.2.10 కోట్ల గోల్‌మాల్ కేసులో ఏసీబీ ఇప్పటికే 10 మంది నిందితుల్ని అరెస్ట్ చేయగా.. అందులో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. తాజా అరెస్టులతో గొర్రెల స్కాంలో అరెస్టయిన వారి సంఖ్య 12కు చేరింది. కల్యాణ్, రాంచందర్ తమ అధికారం, రాజకీయ అండదండలను అడ్డుపెట్టుకొని గొర్రెల కొనుగోలు, నిధుల చెల్లింపులో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు

మిగతా 14వ పేజీలో...

రూ.3లక్షలు ఇవ్వాల్సిందే

కేసు మూసివేతకు కుషాయిగూడ సీఐ, ఎస్సై లంచం డిమాండ్
మధ్యవర్తి నుంచి డబ్బు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

ఎన్‌వోసీకి రూ.2.50 లక్షలు

14

నిర్మాణదారుడి నుంచి డబ్బులు తీసుకుంటూ ఏసీబీకి దొరికిన ఇరిగేషన్ ఈఈ, ఇద్దరు ఏఈలు, సర్వేయర్

ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం ఏర్పాటుకు లంచం

ఏసీబీ వలలో విద్యుత్తు ఎస్ఈ, డీఈ, ఏఈ



ప్రపంచంలోనే ఎత్తైన హిమాచల్‌లోని తషిగాంగ్ పోలింగ్ కేంద్రం

నేటితో తెర

సార్వత్రిక ఎన్నికల చివరి దశ నేడే.. వారాణసీ సహా 57 కీలక స్థానాల్లో పోలింగ్
కమలనాథుల భవితవ్యానికి అగ్నిపరీక్ష.. యూపీలో ఇండీ కూటమి నుంచి గట్టి పోటీ

న్యూఢిల్లీ, మే 31 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఏడు వారాలుగా కొనసాగుతున్న సార్వత్రిక ఎన్నికల రణరంగానికి ఇక తెర పడనుంది. ఏడు దశలుగా జరుగుతున్న ఎన్నికల్లోని చివరి దశకు పోలింగ్ శనివారం జరగనుంది. ఈ దశలో కేవలం 57 స్థానాలకే పోలింగ్ జరగనున్నప్పటికీ.. అధికార బీజేపీకి ఇది అత్యంత కీలకం కానుంది. ఎనిమిది రాష్ట్రాల్లో సుమారు 10.06 కోట్ల మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఉత్తరప్రదేశ్‌లో 13 స్థానాలు, బిహార్‌లో 8, పశ్చిమబెంగాల్‌లో 9, ఒడిసాలో 6, ఝార్ఖండ్‌లో 3 స్థానాలతోపాటు పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలు, హిమాచల్‌లోని మొత్తం 4 స్థానాలకు చివరి దశలో ఎన్నికలు జరగనున్నాయి. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని వారాణసీ

మిగతా 2వ పేజీలో...

ఎగ్జిట్‌పోల్స్.. అటో.. ఇటో..!?

నేటి సాయంత్రం 6.30 గంటల తర్వాత నమూనా ఫలితాల విడుదల
మీడియా చర్చలను బహిష్కరిస్తున్నాం
4 వరకూ చర్చల్లో పాల్గొనం: కాంగ్రెస్
ఓటమిని ముందే అంగీకరించిన కాంగ్రెస్
నేటి పోలింగ్‌లో ఆ పార్టీకి ఓటు వృథా: నడ్డా
2


అక్టోబరులో పంచాయతీ ఎన్నికలు

7

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు కూడా అప్పుడే.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

నాగపూర్‌లో 56°

ప్రపంచ రికార్డుకు చేరువలో ఉష్ణోగ్రత


ఎండల తీవ్రతకు హనుమకొండ జిల్లాలో చెట్ల కింద సేద తీరుతున్న గొర్రెల కాపరులు

దేశంలో వడదెబ్బతో 79 మంది మృతి.. 25 మంది ఎన్నికల సిబ్బందే
ఉత్తరాదికి 3 రోజులు భారీ వర్షాలు.. ఢిల్లీ పరిసరాల్లో ధూళి తుపాను!
ఐఎండీ హెచ్చరిక.. జాతీయ విపత్తుగా ప్రకటించండి: రాజస్థాన్ హైకోర్టు
47.1 డిగ్రీలు.. మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో నమోదు
తెలంగాణ వ్యాప్తంగా భానుడి భగభగ.. 20 ప్రాంతాల్లో 46 డిగ్రీల పైనే
వడదెబ్బతో వేర్వేరు ప్రాంతాల్లో 11 మంది మృతి
నేడు, రేపు రాష్ట్రానికి వర్ష సూచన.. మోస్తరు నుంచి భారీ వర్షాలు!

న్యూఢిల్లీ, మే 31: దేశంలో ఉష్ణోగ్రతలు ప్రపంచ రికార్డును సమీపిస్తున్నాయి..! దేశవ్యాప్తంగా శుక్రవారం వడదెబ్బలతో 79 మంది మృతిచెందారు. వీరిలో 25 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నారు. నాగపూర్‌లో శుక్రవారం 56 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక్కడి రామదాస్‌పేట్‌లోని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్(ఏడబ్ల్యూఎస్)లో ఈ మేరకు ఉష్ణోగ్రత నమోదైనట్లు భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. ఈ ఉష్ణోగ్రత

మిగతా 2వ పేజీలో...

'ఈశాన్యం' అతలాకుతలం

రీమల్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, వరదలు.. నిరాశ్రయులైన లక్షలాది మంది
మణిపూర్ రాజ్‌భవన్‌లోకి వరద.. అసోంలో రైళ్ల రాకపోకలపై ఎఫెక్ట్.. పరిస్థితిపై షా సమీక్ష 2


ఇందిరాపార్కు వద్ద జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న లక్ష్మణ్

ట్యాపింగ్ కేసు సీబీఐకి ఇవ్వాలి

రేవంత్‌కు పౌరుషముంటే కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలి
ఇందిరా పార్కు వద్ద బీజేపీ ధర్నాలో ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్/కవాడిగూడ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ వల్లే తాను జైలుకు వెళ్లాల్సి వచ్చిందని పదే పదే చెప్పిన సీఎం రేవంత్‌కు ఏ మాత్రం పౌరుషం ఉన్నా మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ సవాల్ చేశారు. ఈ కేసులో కేసీఆర్, హరీశ్‌రావుల పాత్రను జైల్లో ఉన్న పోలీసు అధికారులు తమ వాంగ్మూలంలో బట్టబయలు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఇందిరాపార్కు వద్ద బీజేపీ నిర్వహించిన ధర్నాలో లక్ష్మణ్ మాట్లాడారు. "మీ అధినాయకత్వం నుంచి ఒత్తిడి ఉందా..? లేక మీ నాయకత్వం

మిగతా 7వ పేజీలో...

తెలంగాణ బలిదేవత కాంగ్రెస్సే

7

వందలాది మంది అమరులైంది ఆ పార్టీ వల్లే
కేటీఆర్ విమర్శలు

వేడుకలకు రండి..!

కేసీఆర్‌కు సీఎం రేవంత్ ఆహ్వానం, ప్రత్యేక లేఖ 13
సానుకూలంగా స్పందించిన బీఆర్ఎస్ అధినేత!

డబ్బుకు వ్యవస్థ దాసోహం

వ్యవస్థాగత భ్రష్టత్వానికి నిలువుటద్దం పుణె యాక్సిడెంట్ కేసు

రెండు ప్రాణాలను బలిగొన్న నిందితుడికి గులాములుగా మారిన రాజకీయ నాయకులు, పోలీసులు, వైద్య నిపుణులు
అడుగడుగునా కేసును నీరుగార్చేందుకు తీవ్ర ప్రయత్నాలు
పుణె పోలీస్ కమిషనర్‌కు డిప్యూటీ సీఎం అజిత్‌పవార్ ఫోన్
ఈ కేసులో చూసీచూడనట్టు పోవాలంటూ సలహా? 2
ఏసీపీ కుర్చీలో కూర్చోబెట్టి, నిందితుడికి పోలీసుల మర్యాదలు
రక్తనమూనాను మార్చేసి, తప్పుడు నివేదిక ఇచ్చిన వైద్యులు

"కులము గలుగువారు.. గోత్రంబు గలవారు.. విద్యచేత విర్రవీగువారు.. పసిడిగల్గువాని బానిస కొడుకులు".. అన్నాడు ఆనాడు కవి వేమన! శతాబ్దాలు గడిచినా ఆ నిత్యసత్యంలో ఏ మార్పూ రాలేదు! పుణె యాక్సిడెంట్ కేసులో.. రెండు నిండు ప్రాణాలను బలిగొన్న ఓ కారున్న మైనర్‌ను కాపాడ్డానికి రాజకీయ నాయకులు, వైద్యులు, పోలీసులు అందరూ ఒక్కటయ్యారు. డబ్బుకు, పరపతికి గులాములై వేమన మాట నిజం చేశారు!!

'యాదాద్రి ప్లాంట్' దొంగల ముఠా పట్టివేత

పరికరాల చోరీ.. హైదరాబాద్‌లో విక్రయం
రూ. 1.49కోట్ల సామగ్రి, నగదు స్వాధీనం
11 మంది నిందితుల అరెస్టు
చోరీకి గతంలో అక్కడ పనిచేసిన ఓ పోలీసు అధికారి సహకారం? 12


పవర్‌ప్లాంట్ బయట నిల్వ ఉంచిన ఇనుప సామగ్రి

విజయంతో విరమణ..!



ఏపీలో జగన్ కక్షసాధింపులకు పాల్పడినా
పోలీసు యూనిఫాంలోనే ఏబీవీ రిటైర్ 3
ప్రింటింగ్-స్టేషనరీ కమిషనర్‌గా పోస్టింగ్
మధ్యాహ్నం బాధ్యతలు.. సాయంత్రం రిటైర్

టెస్కాబ్ చైర్మన్ పదవికి 'కొండూరి' రాజీనామా

3

వైస్‌చైర్మన్ కూడా.. అవిశ్వాసం నోటీసుతో నిర్ణయం

కదం తొక్కిన ఆర్థికం

2023-24లో జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతం
ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా భారత్ 11

నైరుతిలో మరింత పురోగతి

విశాఖపట్నం, మే 31 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఈశాన్య భారతంలో అసోం, త్రిపుర, మేఘాలయలో అన్ని ప్రాంతాలకూ, పశ్చిమ బెంగాల్‌లో కొన్ని ప్రాంతాలకు విస్తరించాయి. సాధారణంగా పశ్చిమబెంగాల్‌లోకి జూన్ 5న నైరుతి ప్రవేశిస్తుంది. ఈసారి 6 రోజుల ముందే ప్రవేశించింది. ఈ ఏడాది రీమల్ తుఫాన్‌తో పాటు సానుకూల వాతావరణ పరిస్థితుల కారణంగా రుతుపవనాలు వేగంగా కదులుతున్నట్టు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఇంగ్లండ్ నుంచి లక్ష కిలోల బంగారం!

(మొదటి పేజీ తరువాయి)

కొనుగోలు చేసింది. పైగా కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున పుత్తడిని కొనుగోలు చేస్తూ వచ్చిన ఆర్బీఐ, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌లో నిల్వచేస్తూ వస్తోంది. 2024 మార్చి నాటికి ఆర్బీఐ వద్ద 822.1 టన్నుల బంగారం ఉంది. ఇందులో 413.8 టన్నులు ఇతర దేశాల్లో నిల్వ చేసి ఉంచింది. 2023లో 27.5 టన్నుల పసిడిని కొత్తగా నిల్వలో చేర్చింది. ఈ ఏడాది జనవరి-ఏప్రిల్ వ్యవధిలోనే నిరుడు కంటే ఒకటిన్నర రెట్లు అధిక బంగారాన్ని కొనుగోలు చేసింది. కాగా ఇంగ్లండ్ నుంచి 100 టన్నుల బంగారాన్ని తరలించేందుకు ప్రత్యేకంగా కొన్నినెలల పాటు కసరత్తు చేసి భారీ భద్రత నడుమ ప్రత్యేక విమానంలో భారత్‌కు తరలించారు. విదేశీ మారక నిల్వల పరంగా నెలకొన్న సంక్షోభం కారణంగా మనదేశం 1991లో ఆర్బీఐ పెద్ద ఎత్తున బంగారాన్ని తనఖా పెట్టాల్సి వచ్చింది. దీన్నే ఆర్బీఐ వర్గాలు గుర్తుచేస్తూ.. "ఆర్థికంగా భారత దేశ సామర్థ్యం, విశ్వాసం ఏ స్థాయిలో ఉందనేది స్వదేశీ ఖజానాకు ఇంత పెద్దఎత్తున బంగారాన్ని చేర్చడమే చాటుతోంది" అని వ్యాఖ్యానించాయి. "కొన్నిఏళ్ల క్రితం నుంచి ఆర్బీఐ బంగారాన్ని కొనడం మొదలు పెట్టింది. దీన్ని ఎక్కడ నిల్వ చేయాలనే దానిపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వచ్చింది. విదేశాల్లో నిల్వలు పెరిగిపోవడంతో సర్దుబాట్లలో భాగంగా కొన్ని నిల్వలను భారత్‌కు తరలించాలని నిర్ణయించాం" అని ఆ వర్గాలు పేర్కొన్నాయి.



ప్రజ్వల్‌ను ఎయిర్‌పోర్టులోనే అరెస్టు చేసి తీసుకెళ్తుతున్న పోలీసులు

ఏడు రోజుల కస్టడీకి ప్రజ్వల్

బెంగళూరు, మే 31 (ఆంధ్రజ్యోతి): లైంగిక దాడుల వివాదంలో చిక్కుకున్న జేడీఎస్ నాయకుడు, హాసన్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను సిట్ అధికారులు శుక్రవారం సాయంత్రం కోర్టులో హాజరుపరిచారు. విచారణ కోసం వారం రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. లైంగిక దాడుల పెన్‌డ్రైవ్‌లు బయటకు వచ్చిన రోజునే జర్మనీకి పరారైన ప్రజ్వల్.. 34 రోజుల తరువాత బెంగళూరుకు తిరిగి వచ్చారు. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం అర్ధరాత్రి దిగగానే ఇమిగ్రేషన్ విభాగం వద్ద మహిళా పోలీసు అధికారులు ఆయనను అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. తనను ఎవరూ తాకవద్దని, వెంటే వస్తానని చెప్పిన ప్రజ్వల్.. వారితో కదిలారు. ఎయిర్‌పోర్టులో దిగిన తరువాత 20 నిమిషాల వ్యవధిలోనే ప్రజ్వల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అక్కడి నుంచి విధానసౌధ సమీపంలోని సీఐడీ కార్యాలయంలోని సిట్ విభాగానికి తెల్లవారుజామున 2గంటలకు తీసుకెళ్లారు. రాత్రి మొత్తం ఆయన అక్కడే గడిపారు. ఉదయం నుంచి ప్రజ్వల్‌ను సిట్ అధికారులు వివిధ కోణాల్లో ప్రశ్నించారని తెలిసింది. ఆ తర్వాత ఆయన న్యాయవాదితో మాట్లాడారు. ప్రజ్వల్‌ను మధ్యాహ్నం శివాజీనగర్‌లోని బౌరింగ్ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యపరీక్షలు చేయించారు. త్వరలోనే ఆయనకు లైంగిక సామర్థ్య పరీక్షలు కూడా నిర్వహించాలని సిట్ యోచిస్తున్నట్టు తెలిసింది. కాగా, వైద్య పరీక్షల అనంతరం ఆయనను 42వ ఏసీఎంఎం కోర్టుకు (ప్రజా ప్రతినిధుల న్యాయస్థానం) తీసుకెళ్లి న్యాయాధికారి ఎదుట హాజరుపరిచారు. విచారణ కోసం 14రోజుల కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు కోర్టుకు విన్నవించారు. ప్రజ్వల్ న్యాయవాదులు, సిట్ తరఫున ప్రభుత్వ న్యాయవాదుల వాదనలు విన్న అనంతరం జూన్ 6 వరకూ ప్రజ్వల్‌ను సిట్ కస్టడీకి ఇస్తూ న్యాయాధికారి ఆదేశాలు జారీ చేశారు. ప్రజ్వల్ వ్యవహారంలో విచారణకు హాజరు కావాలని ఆయన తల్లి భవానికి సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. జూన్ 1న విచారణకు హాజరు కావాలని దర్యాప్తు అధికారి హేమంత్ కుమార్ నోటీసులో పేర్కొన్నారు. కిడ్నాప్ కేసులో ప్రజ్వల్ తండ్రి రేవణ్ణను అరెస్టు చేసి జైలుకు పంపిన విషయం తెలిసిందే. ఏడు రోజుల జ్యుడీషియల్ కస్టడీలో గడిపిన రేవణ్ణ.. కండిషన్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఇదే కేసులో భవానికి ఇప్పటికే రెండుసార్లు నోటీసులు ఇచ్చినా ఆమె స్పందించకపోవడంతో మూడోసారి నోటీసులు జారీ చేశారు. కాగా, కిడ్నాప్ కేసులో హొళె నరసీపుర జేడీఎస్ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణకు సెషన్స్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ సిట్.. కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

మహిళా అధికారుల పర్యవేక్షణలోనే...

జర్మనీ నుంచి బెంగళూరు ఎయిర్‌పోర్టులో దిగిన వెంటనే ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను ఖాకీ యూనిఫాంలో ఉన్న మహిళా పోలీసు సిబ్బంది చుట్టుముట్టారు. మహిళా ఐపీఎస్ అధికారులు సుమన్ డి పెన్నేకర్, సీమా లట్కర్ నేతృత్వంలోని ఈ బృందం ఆయన్ను అక్కడికక్కడే అరెస్టు చేశారు. అక్కడినుంచి ఆసుపత్రికి తరలించడం, ఆ తర్వాత కోర్టులో హాజరు పరచడం, తిరిగి సిట్ కార్యాలయానికి తరలించే ప్రక్రియను మొత్తం వారే పర్యవేక్షించారు. 'ప్రజ్వల్‌ను అరెస్టు చేయడానికి మహిళా అధికారులనే పంపాలని నిర్ణయించాం. ఎంపీగా తన పదవిని, అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఎంతోమంది మహిళలపై లైంగిక దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడ్డారు. అలాంటి ఆయన్ను అరెస్టు చేసేది కూడా మహిళలే అనే సందేశం ఇవ్వాలని భావించాం' అని సిట్ అధికారి ఒకరు తెలిపారు.

నాగపూర్ @ 56 డిగ్రీలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రపంచ రికార్డుకు చేరువలో ఉండడం గమనార్హం..! 1913 జూలై 10న కాలిఫోర్నియాలోని డెత్ వ్యాలీలో 56.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇదే ఇప్పటి వరకు ప్రపంచంలో అత్యధిక ఉష్ణోగ్రత. నాగపూర్‌లోని సోనేగావ్‌లో ఉన్న మరో ఏడబ్ల్యూఎస్‌లో కూడా శుక్రవారం అసాధారణంగా 54 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కాగా.. ఇటీవల ఢిల్లీలోని ముంగేశ్‌పూర్‌లో 52.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైన విషయం తెలిసిందే..! ఢిల్లీ చరిత్రలోనే ఇది అత్యధికం కాగా.. అక్కడ వెదర్‌స్టేషన్‌లోని సెన్సర్ సరిగ్గా పనిచేస్తుందో? లేదో? తనిఖీ చేస్తున్నట్లు ఐఎండీ వెల్లడించింది. ఇప్పుడు నాగపూర్‌లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవ్వడం మరోమారు చర్చకు దారితీసింది. సోషల్‌మీడియాలో నెటిజన్లు ఏకంగా ఐఎండీని "ఇక్కడ కూడా సెన్సర్ పనితీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయా" అని ట్రోల్ చేస్తున్నారు.

వడదెబ్బతో మరణాలు..

దేశంలో తీవ్రమైన ఎండలు, వడగాలులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దేశవ్యాప్తంగా వడదెబ్బతో 69 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వివరించారు. బిహార్‌లో అత్యధికంగా 32 మంది మృతి చెందగా.. వారిలో 10 మంది ఎన్నికల సిబ్బంది కావడం గమనార్హం..! ఉత్తరప్రదేశ్‌లో చోటుచేసుకున్న మరణాల్లో మరో 15 మంది ఎన్నికల సిబ్బంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో 13 మంది మిర్జాపూర్‌లో, ఇద్దరు సోన్‌భద్రలో వడదెబ్బకు గురయ్యారు. ఒడిసాలో 14, తెలంగాణలో 10 మరణాలు నమోదయ్యాయి. ఝార్ఖండ్‌లో ఐదుగురు, రాజస్థాన్‌లో మరో ఐదుగురు, ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్‌లో ఒకరు, ఢిల్లీలో మరొకరు మృతిచెందారు. ఢిల్లీలో వడదెబ్బకు మృతిచెందిన వ్యక్తి బిహార్‌లోని దర్భంగాకు చెందినవాడని అధికారులు తెలిపారు. 40 ఏళ్ల వయసున్న ఆ వ్యక్తికి ఒకేసారి శరీర ఉష్ణోగ్రత 108 డిగ్రీల ఫారిన్‌హీట్‌కు పెరిగిందని, ఆ తర్వాత అంతర్గత అవయవాలు పనిచేయక, చనిపోయినట్లు వివరించారు. ఝార్ఖండ్‌లో వడదెబ్బతో 1,326 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు పేర్కొన్నారు.



వారాణసీలో వడదెబ్బతో స్పృహ తప్పిన అధికారి

వర్ష సూచనలు

నైరుతి రుతుపవనాలు కేరళ వ్యాప్తంగా విస్తరించాయని, కర్ణాటక, తమిళనాడులో రెండ్రోజుల్లో విస్తరిస్తాయని ఐఎండీ తెలిపింది. అటు ఈశాన్య రాష్ట్రాల్లోనూ నైరుతి రుతుపవనాల రాకతో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు పశ్చిమ గాలులు, తుపాను కారణంగా జమ్మూకశ్మీర్, లద్దాఖ్, గిల్గిట్, బాల్టిస్థాన్, ముజఫరాబాద్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రానున్న రెండ్రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ పేర్కొంది. అదే సమయంలో.. యూపీ, ఢిల్లీ, చండీగఢ్, హరియాణాలోని పలు ప్రాంతాల్లో దుమ్ము తుపాను వచ్చే ప్రమాదముందని హెచ్చరించింది. కాగా, ఎండలు, వడగాలుల తీవ్రత నేపథ్యంలో జాతీయ విపత్తుగా ప్రకటించే అవకాశాలను పరిశీలించాలని రాజస్థాన్ హైకోర్టు కేంద్రానికి సూచించింది. ఇటీవలి కాలంలో వడదెబ్బతో వందల మంది మృతిచెందారని, బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది. వడగాలులు,శీతలగాలులతో మరణాల నియంత్రణ బిల్లు-2015ను ఈ సందర్భంగా ఉటంకించింది.

డేంజర్ బెల్స్

అడుగంటిపోతున్న జలాశయాలు

న్యూఢిల్లీ, మే 31: దేశంలోని ప్రధాన జలాశయాలు అడుగంటిపోతున్నాయి. ఇతర ప్రాంతాల కంటే దక్షిణాదిలో ఈ తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) డేటా ప్రకారం దేశంలోని 150 రిజర్వాయర్లలో ప్రస్తుతం నీటిమట్టాలు సగటున 23 శాతానికి పడిపోయాయి. గతేడాది ఇదే సమయానికి ఉన్న నీటి నిల్వలతో పోలిస్తే ఈ సారి 77 శాతం తక్కువ. గత వారం రిజర్వాయర్లలో దాదాపు 24 శాతం నీటిమట్టాలు ఉన్నాయి. వారంలోనే ఒక శాతం తగ్గాయి. ఇక దక్షిణాదిలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళలో గోదావరి, కృష్ణా, పెన్నా, కావేరి సహా ఇతర నదులపై నిర్మించిన 42 రిజర్వాయర్లలో ప్రస్తుతం 14 శాతం మాత్రమే నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయి. మొత్తం నీటి నిల్వల సామర్థ్యం 53.334 బిలియన్ క్యూబిక్ మీటర్లు కాగా, ప్రస్తుతం 7.317 బిలియన్ క్యూబిక్ మీటర్ల నిల్వలు మాత్రమే ఉన్నాయి. సాధారణంగా ఈ సమయానికి ప్రధాన రిజర్వాయర్లలో 44.511 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటి నిల్వలు ఉండాలని, అయితే ఈ సారి గణనీయంగా తగ్గాయని సీడబ్ల్యూసీ ఆందోళన వ్యక్తం చేసింది.

సేవలు, లావాదేవీలకు 160తో సరికొత్త సిరీస్

న్యూఢిల్లీ, మే 31: సేవలు, లావాదేవీల నిర్వహణ సంస్థలు తమ వినియోగదారులను చేరుకోవడానికి సరికొత్త నంబర్ సిరీస్‌ను కేంద్రం ప్రవేశపెట్టింది. గురువారం నుంచి అందుబాటులోకి వచ్చిన ఈ సంఖ్యతో వినియోగదారుడు తనకు అవసరమైన కాల్స్‌ను గుర్తించడం తేలిక అవుతుంది. నిన్నటి వరకూ 140 సిరీస్‌తో ఆరంభమయ్యే 10 అంకెల సంఖ్యతో కూడిన నంబరును టెలీ మార్కెటింగ్ కోసం వినియోగించేవారు. దీంతో ఆయా సంస్థలు ప్రచార ప్రకటనల కోసం, సేవలు, లావాదేవీల కోసం ఒకే సిరీస్‌తో కూడిన నంబరును వినియోగించేవి. దీంతో వినియోగదారుడు ముఖ్యమైన సేవలు, లావాదేవీలకు సంబంధించిన కాల్స్‌ని కూడా ఎత్తలేకపోయేవారు. మరోవైపు అందరికీ అందుబాటులో ఉన్న ఈ సిరీస్‌ను ఉపయోగించి మోసాలకు పాల్పడే వారి సంఖ్యకూడా పెరిగింది. ఈ ఇబ్బందిని తొలగించడానికి కేంద్రం కొత్తగా 160 ప్రారంభమయ్యే 10 అంకెల నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీనిని కేవలం సేవలు, లావాదేవీల నిర్వహణకు మాత్రమే ఉపయోగించాలి.

ఈశాన్యం అతలాకుతలం

రీమల్ తుఫాన్‌తో భారీ వర్షాలు.. నిరాశ్రయులైన లక్షలాది మంది

న్యూఢిల్లీ, మే 31: రీమల్ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, వరదలతో ఈశాన్య రాష్ట్రాలు అతలాకుతలమవుతున్నాయి. త్రిపుర, మణిపూర్, మిజోరాం, అసోం దక్షిణ ప్రాంతంలో ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. వర్షాలు, వరదలకు తోడు పలు చోట్ల కొండచరియలు విరిగిపడటంతో జనజీవనం స్తంభించిపోయింది. నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. రోడ్లు, రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అసోంలో వరదలు ముంచెత్తడం, కొండచరియలు విరిగిపడటంతో పలు మార్గాల్లో రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. అసోంలో రెండు లక్షల మందికి పైగా ప్రజలు వరద ప్రభావానికి గురయ్యారు. వరదలకు ఆరుగురు మరణించారు. అసోం, మణిపూర్‌లో బ్రహ్మపుత్ర, బరాక్ సహా ఆరు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బ్రహ్మపుత్ర, బరాక్ ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. బరాక్ ఉగ్రరూపం దాల్చడంతో పరీవాహక ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. మణిపూర్‌లో దాదాపు లక్షా 90 వేలమంది ప్రజలు నిరాశ్రయులు కాగా ముగ్గురు చనిపోయారు. దాదాపు 25 వేల ఇళ్లు దెబ్బతిన్నాయి. ఇంఫాల్‌లో రాజ్‌భవన్ సముదాయంలోకి భారీగా వరద చేరింది. రీమల్ తుఫాన్ అనంతరం ఈశాన్య రాష్ట్రాల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. నిరంతరాయంగా వర్షం పడుతుండటంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర సరుకులకు కొరత ఏర్పడింది.



ఆదుకుంటాం: అమిత్ షా

ఈశాన్య రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరద పరిస్థితిపై శుక్రవారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా సమీక్షించారు. అన్నివిధాలా సాయం చేస్తామని హామీ ఇచ్చారు. అసోం, త్రిపుర, మణిపూర్, మేఘాలయా, మిజోరాంలో వరద పరిస్థితులపై ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడినట్టు 'ఎక్స్'లో వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితిపై మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసినట్టు పోస్టు చేశారు. వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో అమిత్ షా మాట్లాడారు.

45 గంటలు.. ద్రవాహారమే..!



కన్యాకుమారి, మే 31: కన్యాకుమారిలోని స్వామి వివేకానంద రాక్‌మెమోరియల్ వద్ద ప్రధాని మోదీ గురువారం సాయంత్రం 6.45 గంటలకు ధ్యానంలో కూర్చున్నారు. ఆయన 45 గంటల పాటు ధ్యానం చేయనున్నారు. ఈ సమయంలో ప్రధాని కేవలం ద్రవాహారాన్ని మాత్రమే స్వీకరిస్తారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొబ్బరి నీళ్లు, ద్రాక్షరసం అందులో భాగంగా ఉంటాయని పేర్కొన్నాయి. 45 గంటలూ ఆయన మౌనంగానే ఉంటారని తెలిపాయి. కాషాయ దుస్తులు, జపమాలతో ధ్యాన మండపంలో ధ్యాన ముద్రలో కూర్చుని ఉన్న ప్రధానమంత్రి ఫొటోలు, వీడియోలు బయటకు వచ్చాయి. ధ్యానంలో భాగంగా శుక్రవారం సూర్యోదయ సమయంలో ఆయన సూర్యభగవానుడికి అర్ఘ్యం సమర్పించారు. మోదీ ధ్యానం శనివారం సాయంత్రానికి ముగియనుంది. కాగా, 131 ఏళ్ల కిందట స్వామి వివేకానంద ధ్యానం చేసిన చోటే ప్రధాని మోదీ కూడా 45 గంటలపాటు ధ్యానంలో కూర్చోవడం విశేషం.

ఎగ్జిట్‌పోల్స్‌పై ఉత్కంఠ

న్యూఢిల్లీ, మే 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ చివరి దశ ఎన్నికలు ముగిసిన వెంటనే ఎగ్జిట్‌పోల్స్ వెలువడనున్నాయి. శనివారం సాయంత్రం 6.30 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు విడుదల కానున్నాయి. ఎగ్జిట్‌పోల్స్‌ను సాయంత్రం 6.30 గంటల తర్వాతే విడుదల చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. ప్రజాప్రాతినిధ్య చట్టం సెక్షన్ 126ఏ(1) ప్రకారం నిబంధనలు పాటించాలని స్పష్టం చేసింది. ఇక ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎగ్జిట్‌పోల్స్ నిర్వహించేవారికి ఓటర్లు ఈసారి తమ వాస్తవ మనోగతాన్ని చెప్పే అవకాశం లేదని, గట్టి పోటీ ఉన్నందువల్ల 1-3 శాతం వరకు తప్పులు జరిగే అవకాశాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఎగ్జిట్‌పోల్స్ నిర్వాహకులు తీసుకునే నమూనాల స్థాయి వల్ల కూడా పొరపాట్లకు అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇక ఎగ్జిట్‌పోల్స్ విఫలమైన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. 2004లో ఇండియా షైనింగ్ నినాదంతో ఎన్నికలకు వెళ్లిన బీజేపీకి 240-250 వరకు సీట్లు వస్తాయని దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చింది. 2009లోనూ ఎగ్జిట్‌పోల్స్ అంచనాలు తప్పాయి. 2015లో ఢిల్లీలో ఆప్ ప్రభంజనం వీస్తుందని ఏ ఎగ్జిట్‌పోల్ కూడా అంచనా వేయలేకపోయింది. అదే ఏడాది బిహార్‌లో కూడా ఎగ్జిట్‌పోల్స్ అంచనాలకు భిన్నంగా ఆర్జేడీ-కాంగ్రెస్- జేడీయూ కూటమి ఘన విజయం సాధించింది. 2017లో పెద్దనోట్ల రద్దు అనంతరం జరిగిన యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ వస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. కానీ, బీజేపీ 300 సీట్లకు పైగా సాధించి అధికారంలోకి వచ్చింది. 2014 లోక్‌సభ ఎన్నికల్లోనూ బీజేపీ అఖండ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని అనేక ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయలేకపోయాయి. అయితే ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు, అసలు ఫలితాలు ఒకేలా వెలువడిన సందర్భాలు కూడా లేకపోలేదు. ఇదిలా ఉండగా శనివారం వెలువడే ఎగ్జిట్‌పోల్స్‌పై మీడియా చర్చలను బహిష్కరిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారని.. వారి తీర్పు ఈవీఎంల్లో భద్రంగా ఉందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 4న ఈవీఎంలను తెరిచి లెక్కిస్తారని.. ఆ లోపు ఊహాగానాలకు తావివ్వకూడదని తెలిపారు. చానెళ్ల టీఆర్‌పీ రేటింగ్‌లు పెంచుకోవడానికి పెట్టే అవనసర చర్చల్లో కాంగ్రెస్ పార్టీ పాల్గొనబోదని చెప్పారు. 4 వరకూ ఎగ్జిట్‌పోల్స్‌పై జరిగే చర్చల్లో తమ పార్టీ నేతలెవరూ పాల్గొనరని స్పష్టం చేశారు. కాగా, ఎగ్జిట్‌పోల్స్‌పై చర్చలను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడమంటే కాంగ్రెస్ పార్టీ తన ఓటమిని అంగీకరించినట్లేనని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. ఈ ఏడవ దశలో ఆ పార్టీకి ఓటేయడం వృథా అన్నారు.

నేటితో తెర

(మొదటి పేజీ తరువాయి)

నుంచి ప్రధాని మోదీ, మీర్జాపూర్ నుంచి అప్నాదళ్ (సోనీలాల్) అధినేత్రి, కేంద్ర మంత్రి అనుప్రియా పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వస్థలమైన గోరఖ్‌పూర్ నుంచి బీజేపీ సిటింగ్ ఎంపీ రవికిషన్ ఈ దశలో రంగంలో ఉన్న ప్రముఖులు. యూపీలో బీజేపీకి ఇండియా కూటమి నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. వారాణసి నుంచి రెండుసార్లు ఎన్నికైన నరేంద్రమోదీకి తిరుగులేనప్పటికీ.. పట్టువదలని విక్రమార్కుడిలా పోరాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి అజయ్‌రాయ్ ఈసారి కాశీలో మార్పు కనిపిస్తోందని చెప్పుకొంటున్నారు. మోదీ స్థానికుడు కాదని, 'బచేగా కాశీ.. హారేగా ప్రవాసీ (ప్రవాసిని పక్కకు తప్పించి కాశీని కాపాడాలి)' అంటూ ప్రచారం చేస్తున్నారు. పంజాబ్‌లోని 13 సీట్లలో గత లోక్‌సభ ఎన్నికల్లో 8 గెలుచుకున్న కాంగ్రెస్.. ఈసారి కూడా మెజారిటీ స్థానాలే లక్ష్యంగా ఉధృతంగా ప్రచారం చేసింది. రాహుల్, ప్రియాంక రాష్ట్రంలో విస్తృతంగా పర్యటించారు. అయితే ఇక్కడ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ.. కాంగ్రెస్‌ను గట్టిగా ఢీకొంటోంది. కేజ్రీవాల్ బెయిల్‌పై వచ్చి పంజాబ్‌లో పెద్ద ఎత్తున రోడ్ షోలు నిర్వహించడంతో పోటీ ఆసక్తిగా మారింది. ఈ రెండు పార్టీల మధ్య బీజేపీ, శిరోమణి అకాలీదళ్ ఎంత మేరకు ప్రభావం చూపుతాయన్నది చర్చనీయాంశంగా మారింది. ఒడిసాలో పోలింగ్ జరుగుతున్న ఆరు నియోజకవర్గాల్లో కనీసం రెండు చోట్ల బీజేడీ, బీజేపీ, కాంగ్రెస్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఇక బిహార్‌లో రాజధాని పట్నాతోపాటు నలందా, పాటలీపుత్ర, అర్రా, ససారామ్, బక్సార్ వంటి కీలక స్థానాల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఇద్దరు కేంద్ర మంత్రులు రవిశంకర్ ప్రసాద్, ఆర్కే సింగ్ తలపడుతున్నారు. ఇక హిమాచల్‌లో గత రెండు ఎన్నికల్లో మొత్తం 4 స్థానాల్లో గెలిచిన బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందా అన్నది చర్చనీయాంశమైంది.

డబ్బుకు వ్యవస్థ దాసోహం

దేశంలో వ్యవస్థలు ఎంత ఘోరంగా పనిచేస్తున్నాయి.. ఎంత అవినీతిమయమైపోయాయి అనేదానికి పెద్ద ఉదాహరణగా నిలిచిన కేసు.. పుణె యాక్సిడెంట్ కేసు! మైనారిటీ తీరని ఓ కుర్రాడు.. పూటుగా మద్యం తాగేసి, 200 కిలోమీటర్ల వేగంతో కారు నడిపి.. ఎంతో భవిష్యత్తు ఉన్న ఇద్దరు యువతీయువకుల ప్రాణాలను బలిగొంటే.. ఆ కుర్రాణ్ని కాపాడ్డానికి అతడి తండ్రి ఏకంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్‌కే ఫోన్ చేశాడు! ఆయన.. పోలీస్ కమిషనర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే.. పోలీసులపై ఒత్తిడి తేవడానికి తెల్లవారుజామున పోలీస్ స్టేషన్‌కే వచ్చి కూర్చున్నాడు!! పోలీసులు, వైద్యులు నిందితుడి తండ్రి వెదజల్లిన డబ్బుకు దాసోహమయ్యారు. అయితే.. ఇద్దరి ప్రాణాలు తీసిన నిందితుడు కేవలం మైనర్ అనే కారణంతో బెయిల్ ఇచ్చిన జువెనైల్ జస్టిస్ బోర్డు జడ్జి ఎల్ఎన్ ధన్వాడే.. బెయిల్ షరతుగా యాక్సిడెంట్లపై 300 పదాల వ్యాసం రాయాలని, 15 రోజులపాటు ట్రాఫిక్ పోలీసులతో కలిసి పనిచేయాలని ఆదేశించడమే ఈ కేసు గతి మారడానికి కారణమైంది. ప్రజాగ్రహం వెల్లువెత్తి అన్ని వ్యవస్థలూ అటెన్షన్‌లోకి రావడానికి కారణమైంది!! లేదంటే.. ఈ కేసు కేవలం ఒక 'హిట్ అండ్ రన్' కేసుగా చీకటిలో నిశ్శబ్దంగా కలిసిపోయి ఉండేదేమో! ప్రజాగ్రహం వల్లనే జువెనైల్ జస్టిస్ బోర్డు మే 22న ఈ కేసును తిరగదోడి, మళ్లీ విచారణ జరిపి.. నిందితుడికి ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసి జూన్ 5 వరకూ అతణ్ని అబ్జర్వేషన్ హోమ్‌లో ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది.

ఏసీపీ కుర్చీలో కూర్చోబెట్టి రాచమర్యాదలు..

పుణె యాక్సిడెంట్ వార్త తెలియగానే అప్రమత్తమై ఎరవాడ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన పాత్రికేయులకు అక్కడ నివ్వెరపోయే దృశ్యాలు కనిపించాయి! నిందితుడిని పోలీసులు ఏసీపీ కుర్చీలో కూర్చోబెట్టారు! అతడికి కుటుంబసభ్యులు పిజ్జా తెచ్చిపెడితే చూస్తూ కూర్చున్నారు. మృతుల బంధువులు పోలీస్‌స్టేషన్‌కు వస్తే వారితో అత్యంత అమానవీయంగా ప్రవర్తించారు. ఈ యాక్సిడెంట్‌లో చనిపోయిన యువతి సొంతూరు మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్. ఆమె తల్లిదండ్రులు, ఇతర కుటుంబసభ్యులంతా అక్కడే ఉన్నారు. పుణెలో ఆమెకు సంబంధించిన వ్యక్తి ఆమె మామయ్య ఒక్కరే ఉన్నారు. ఆమె తరఫున ఆయన పోలీస్ స్టేషన్‌కు పరిగెత్తుకు వస్తే.. 'నువ్వెవరివి? తల్లిదండ్రులు రావాలి కదా?' అని ప్రశ్నించారు. ఆయన్ను అసలు మాట్లాడనీయకుండా చేసి.. తమ పని తాము చేసుకుపోయారు. మూడేళ్ల లోపు శిక్ష పడే సెక్షన్లతో కేసు పెట్టారు. దీనిపై విమర్శలు రావడంతో మళ్లీ 304 సెక్షన్‌తో రివైజ్ చేశారు.



పుణెలో ప్రమాదానికి కారణమైన కారు

వైద్యవృత్తికే అవమానం..

మే 19న.. తెల్లవారాక ఈ వ్యవహారం పోలీస్ స్టేషన్ నుంచి ఆస్పత్రికి మారింది! అప్పటిదాకా నాయకులను, పోలీసులను 'మేనేజ్' చేసిన నిందితుడి తండ్రి.. ఆస్పత్రిలోనూ దాదాపు రూ.50 లక్షలు నీళ్లలా వెదజల్లాడు! దీంతో వైద్యులు నిందితుడి రక్తనమూనా తీసుకోవడానికి తాత్సారం చేశారు. పొద్దున తొమ్మిది గంటలకు అతణ్ని ఆస్పత్రికి తీసుకెళ్తే.. 11 గంటలకు రక్తనమూనాలను తీసుకున్నారు. ఇలా ఆలస్యం చేయడం వల్ల.. పరీక్షల్లో ఆల్కహాల్ శాతం తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. పోనీ అలా తీసుకున్న నమూనానైనా పరీక్షించి నివేదిక ఇచ్చారా అంటే.. అదీ లేదు. అతడి రక్త నమూనాను చెత్తబుట్టలో పడేసి అతడి తల్లి రక్తనమూనా పరీక్షించి తప్పుడు నివేదిక ఇచ్చారు. ఈ విషయం బయటపడడంతో బాలుడి రక్తనమూనాను మళ్లీ సేకరించి పరీక్ష చేశారు. అప్పుడు.. ఈ తప్పుడు పనికి పాల్పడిన అజయ్‌తవాడే, శ్రీహరి హల్నోర్ అనే ఇద్దరు డాక్టర్లను డిస్మిస్ చేశారు.

రాజకీయ జోక్యం..

నిందితుడైన మైనర్ తండ్రి.. పుణెలో ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో ఆయన విస్తృతంగా రాజకీయ పరిచయాలున్నాయి. ఆ పరిచయాలతోనే.. తన కొడుకును కాపాడుకునేందుకు ఆయన నేరుగా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, ఎన్సీపీ నేత అజిత్‌పవార్‌కు ఫోన్ చేసినట్టు సమాచారం. ఆయన పుణె సీపీకి ఫోన్ చేసి ఈ కేసులో చూసీ చూడనట్టు పోవాలని సూచించినట్టు ఆరోపణలున్నాయి.

మీడియాను తప్పించుకు తిరుగుతున్న జడ్జి



ఈ కేసు దేశవ్యాప్తంగా ఇంత సంచలనం కావడానికి.. వ్యవస్థల డొల్లతనం బయటపడడానికి కారణమైన జువెనైల్ జస్టిస్ బోర్డు జడ్జి ఎల్ఎన్ దన్వాడే ప్రస్తుతం మీడియాను తప్పించుకు తిరుగుతున్నారు. పాత్రికేయులు ఎన్ని ప్రశ్నలు అడిగినా.. నోరు విప్పి సమాధానం చెప్పకుండా అక్కణ్నుంచీ వెళ్లిపోతున్నారు. నిజానికి ఈ కేసులో ఆరోజు తీర్పు చెప్పాల్సింది ఈయన కాదు. బోర్డులో జ్యుడీషియల్ మెంబర్, ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్, ఇద్దరు నాన్-జ్యుడీషియల్ అపాయింటెడ్ మెంబర్లు ఉంటారు. ఇద్దరు నాన్‌జ్యుడీషియల్ మెంబర్లలో ఒకరు.. ఎల్ఎన్ ధన్వాడే. ఆరోజు ప్రిన్సిపల్ మేజిస్ట్రేట్, ఒక నాన్‌జ్యుడీషియల్ మెంబర్ సెలవులో ఉండడంతో కేసు ఈయన ముందుకు వచ్చింది.

సౌమ్యుడు.. పదవి ఇవ్వండి!

ఈ కేసులో తప్పుడు రిపోర్టు ఇచ్చిన వైద్యుడు డాక్టర్ అజయ్ తవాడే.. పుణెలోని సాసూన్ జనరల్ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్‌గా 2023 డిసెంబరులో నియమితులయ్యారు. ఆయనకు ఆ పదవి రావడానికి కారణం ఎవరో తెలుసా? ఇదే యాక్సిడెంట్ కేసులో నిందితుడి కోసం తెల్లవారుజామున పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కూర్చున్న ఎమ్మెల్యే సునీల్ టింగరే. కొవిడ్ సమయంలో డాక్టర్ అజయ్‌తవాడే అద్భుతంగా పని చేశారని.. ఆయన తనకు బాగా తెలుసని.. కాబట్టి, ఆయన్ను సాసూన్ జనరల్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా నియమించాలని విజ్ఞప్తిచేస్తూ మహారాష్ట్ర వైద్య విద్య మంత్రి హసన్ ముష్రిఫ్‌కు సునీల్ టింగరే అప్పట్లో రాసిన లేఖ ఇప్పుడు వైరల్ అవుతోంది.

ఇక.. స్థానిక ఎన్సీపీ ఎమ్మెల్యే సునీల్ టింగరేకైతే తెల్లవారుజామున 2.30 నుంచి 3.45 నడుమ.. నిందితుడి తండ్రి 45సార్లు ఫోన్ చేశారు! గాఢనిద్రలో ఉండి ఆ ఎమ్మెల్యే ఫోన్ ఎత్తకపోతే.. నేరుగా ఆయన ఇంటికి వెళ్లి, నిద్రలేపి తీసుకెళ్లి ఎరవాడ పోలీస్‌స్టేషన్‌లో కూర్చోబెట్టారు. దీనిపై అజిత్‌పవార్, సునీల్ టింగరేను ప్రశ్నిస్తే వారు చెప్పిన సమాధానం ఏంటో తెలుసా? ఎవరి ఒత్తిళ్లకూ తలొగ్గవద్దని పోలీసులకు చెప్పడానికే తాను ఫోన్ చేశానని అజిత్ పవార్.. ఒక 'బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధి'గా మాత్రమే అంత తెల్లవారుజామున హుటాహుటిన పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని సునిల్ టింగరే చెప్పారు!!

మేజర్‌గా పరిగణించవచ్చా?

జువెనైల్ జస్టిస్ యాక్ట్, 2015లోని సెక్షన్ 15 ప్రకారం.. కనీసం ఏడేళ్లు అంతకుమించి శిక్ష పడే హత్య, అత్యాచారం వంటి హేయమైన, అమానవీయ నేరాలకు పాల్పడినవారు మైనర్లైనా (16-18 ఏళ్లవారు) మేజర్లుగా పరిగణించి శిక్ష విధించే అవకాశం ఉంది. అయితే.. ఈ కేసులో నిందితుడు హత్య, అత్యాచారం వంటి హేయమైన నేరాలకు పాల్పడలేదు కాబట్టి అతణ్ని మేజర్‌గా పరిగణించి శిక్ష విధించకపోవచ్చని కొందరు న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



విజయంతో విరమణ..!

- జగన్ కక్షసాధింపులకు పాల్పడినా
- పోలీసు యూనిఫాంలోనే ఏబీవీ రిటైర్
- ప్రింటింగ్-స్టేషనరీ కమిషనర్‌గా పోస్టింగ్
- మధ్యాహ్నం బాధ్యతలు.. సాయంత్రం రిటైర్

ఏపీలో సీనియర్ ఐపీఎస్, డీజీ ర్యాంకు అధికారి ఏబీ వెంకటేశ్వరరావు అనుకున్నది సాధించారు. యూనిఫాంలో రిటైరవ్వాలన్న ఆయన ఆకాంక్ష నెరవేరింది. హైకోర్టు చెప్పిందనో, ఉన్నతాధికారుల్లో వ్యతిరేకత వ్యకమవుతుందనో తెలియదు గానీ.. ఆయన పదవీ విరమణ చేయాల్సిన శుక్రవారం నాడు జగన్ ప్రభుత్వం ఆయనకు ఎట్టకేలకు ప్రింటింగ్, స్టేషనరీ, స్టోర్ పర్చేజింగ్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చింది. ఉదయం సస్పెన్షన్ ఎత్తివేత-నియామక ఉత్తర్వులు.. మధ్యాహ్నం బాధ్యతలు.. సాయంత్రం పదవీ విరమణ చకచకా జరిగిపోయాయి. ఐదేళ్ల కక్షసాధింపులకు తెరపడింది.

(అమరావతి/విజయవాడ-ఆంధ్రజ్యోతి)



చంద్రబాబు హయాంలో ఏపీలో నిఘా చీఫ్‌గా పని చేసిన ఏబీ వెంకటేశ్వరరావుపై జగన్ ప్రభుత్వం తొలి నుంచీ కక్షగట్టింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఆ పదవి నుంచి తప్పించేలా ఎన్నికల కమిషన్‌పై ఒత్తిడి తెచ్చింది. పై స్థాయిలో ఒత్తిడి తెచ్చి పక్కకు తప్పించింది. అధికారంలోకి రాగానే లేని కేసు పెట్టింది. ఇజ్రాయెల్ సంస్థ నుంచి నిఘా పరికరాల కొనుగోలులో అవినీతి, అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో సస్పెండ్ చేసింది. చివరకు సర్వీస్ నుంచి డిస్మిస్ చేయడానికీ విశ్వప్రయత్నాలు చేసింది. కేంద్ర పరిపాలనా ట్రిబ్యునల్, హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యంతో ఆ పనిచేయలేకపోయారు. అయితే అధికారం అడ్డుపెట్టుకుని ఐదేళ్లుగా ఏబీవీని తీవ్ర ఇబ్బందుల పాల్జేశారు. అయినా ఆయన తగ్గలేదు. న్యాయ పోరాటం చేశారు. చివరకు విజయం ఆయన్నే వరించింది. తాను అనుకున్నట్లుగా పోలీస్ యూనిఫాంలోనే రిటైర్ అయ్యారు. ఏబీవీని రెండోసారి సస్పెండ్ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయడంతో పాటు ఆయన్ను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశిస్తూ క్యాట్ ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు గురువారం నిరాకరించిన సంగతి తెలిసిందే. హైకోర్టు ఉత్తర్వుల ప్రతిని ఏబీవీ స్వయంగా సీఎస్ జవహర్‌రెడ్డిని కలిసి అందజేశారు. తనకు పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. అయితే ఆయన మౌనంగా ఉండిపోయారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) ఎంకే మీనాకు కూడా ఏబీవీ కోర్టు ఉత్తర్వుల ప్రతి పంపించారు. ఈ నేపథ్యంలో ఆయన రీజాయినింగ్‌పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఆయన్ను సర్వీసులోకి తీసుకోకూడదని సీఎం జగన్ గట్టి పట్టుదలతో ఉన్నారని, కచ్చితంగా ఆయనకు పోస్టింగ్ ఇవ్వరని అధికార వర్గాల్లో తీవ్ర చర్చ కూడా నడిచింది. తెల్లవారేసరికి సీన్ మారిపోయింది. ఏమైందో ఏమో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఏబీవీపై సస్పెన్షన్ ఎత్తివేయడమే గాక రాష్ట్ర ప్రింటింగ్, స్టేషనరీ, స్టోర్ పర్చేజింగ్ కమిషనర్‌గా ఆయనకు పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీచేశారు. లండన్‌లో ఉన్న సీఎంతో సీఎస్ నేరుగా మాట్లాడి ఒప్పించినట్లు తెలుస్తోంది. గతంలో ఎక్కడైతే విధులు నిర్వహించి రెండోసారి సస్పెండయ్యారో.. అదే విభాగంలో ఏబీవీని నియమించారు.

భుజాన మోసి వీడ్కోలు

ఉదయం సీఎస్ ఉత్తర్వులు అందుకున్న వెంటనే ఏబీవీ విజయవాడ ముత్యాలంపాడులోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కార్యాలయానికి చేరుకున్నారు. ఆ శాఖ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్నాను కాబట్టి వివాదాస్పద వ్యాఖ్యలూ చేయనని అన్నారు. ఆత్మ సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నాని తెలిపారు. కాగా, మధ్యాహ్నం విధుల్లో చేరి.. సాయంత్రం ఉద్యోగ విరమణ చేసిన ఏబీ వెంకటేశ్వరరావుకు అధికారులు, శ్రేయోభిలాషులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రింటింగ్, స్టేషనరీ ఉద్యోగులు ఆయన్ను భుజాన మోస్తూ బయటకు తీసుకురావడం విశేషం.

స్థానిక ఎన్నికల్లో టీడీపీ పోటీ

పార్టీ అధినేత చంద్రబాబు

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీ సంస్థాగత బలోపేతంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని టీడీపీ అధినేత, మాజీ సీఎం ఎన్. చంద్రబాబు నాయుడు రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలకు పిలుపునిచ్చారు. యువతరాన్ని ప్రోత్సహిస్తామని ప్రకటించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని సూచించారు. త్వరలోనే రాష్ట్ర పార్టీ నూతన అధ్యక్షుడి నియామకం ఉంటుందని వెల్లడించారు. చంద్రబాబుతో టీటీడీపీ నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసంలో ఈ సమావేశం జరిగింది. పార్టీ ఏ పరిస్థితుల్లో గత అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో పోటీ చేయలేకపోయిందో వివరించిన చంద్రబాబు, వచ్చే స్థానికసంస్థల ఎన్నికలకు సన్నద్ధం కావాలని సూచించారు. పార్టీ కోసం శ్రమిస్తున్న నాయకులను ఆయన అభినందించారు. తెలుగుజాతి ఉన్నంత వరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీ కొనసాగుతుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో కొద్ది నెలలుగా జరుగుతున్న పరిణామాల దృష్ట్యా ఇక్కడ సమయం ఇవ్వలేకపోయానని.. ఇక నుంచి ఇక్కడ కూడా సమయం కేటాయిస్తానని చంద్రబాబు పార్టీ నేతలకు తెలిపారు.

ఎండ @ 47.1 డిగ్రీలు

మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో నమోదు.. శుక్రవారం రాష్ట్రంలోనే గరిష్ఠ ఉష్ణోగ్రత ఇదే

- తెలంగాణ వ్యాప్తంగా మండిన సూరీడు
- 20 చోట్ల 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు
- వడదెబ్బకు గురై 11 మంది మృతి
- నేడు, రేపు రాష్ట్రానికి వర్ష సూచన
- మోస్తరు నుంచి భారీ వర్షాలకు అవకాశం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



రాష్ట్రంలో రోహిణి కార్తె ప్రభావం కనిపిస్తోంది. సూర్యుడి భగభగలతో ఎండలు మండిపోతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రాష్ట్రంలోని 20 ప్రాంతాల్లో శుక్రవారం 46 డిగ్రీలకు పైబడి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిర్యాల జిల్లా భీమారం, పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్‌లో 47.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో, భద్రాద్రి కొత్తగూడెంలో 46.9, నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం, ఖమ్మం జిల్లాలో 46.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. పాతమంచిర్యాలలో 46.7, పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.6, మంచిర్యాల జిల్లా హాజీపూర్‌లో 46.5, జగిత్యాల జిల్లా నేరెళ్లలో 46.4, సూర్యాపేట జిల్లా కోదాడలో 46.4డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే, నల్లగొండ జిల్లా దామచర్లలో 46.3, కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 46 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఇక, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోనే అత్యధికంగా మలక్‌పేట ప్రాంతంలో 43.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

వడదెబ్బకు 11 మంది మృత్యువాత

వడదెబ్బకు గురై రాష్ట్రంలో శుక్రవారం 11 మంది ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేటకు చెందిన పల్లకొండ ఐలయ్య(75),ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేటకు చెందిన దామెర రాంబాబు(50) అనే ప్రైవేట్ ఎలక్ట్రీషియన్, నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన కర్రి రాజు (40), గుర్రంపోడుకు చెందిన రేపాక ముత్తమ్మ(64), మునుగోడు మండలం ఊకొండికి చెందిన కమ్మాలపల్లి మమత(30), వడదెబ్బకు గురై మరణించారు. ధాన్యం విక్రయించేందుకు ఐదు రోజులుగా ఐకేపీ కేంద్రం వద్దే ఉంటున్న సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం హబ్షీపూర్‌కు చెందిన మల్లీ కల్పన(24) వడదెబ్బకు గురై మరణించింది. పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లోని సిమెంట్ పరిశ్రమలో లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన జాకీర్ హుస్సేన్(60) కరీంనగర్ జిల్లా చొప్పదండికి సిమెంట్ లోడు తీసుకెళ్లి వడదెబ్బకు ప్రాణాలు కోల్పోయాడు. కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన కళ్యాణం రామక్క (75). పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌కు చెందిన ఈదునూరి కిషోర్(34), మంచిర్యాల జిల్లా కాసిపేటకు చెందిన దుర్గం భీమయ్య (55), ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని నాగోబా తండాకు చెందిన ఆత్రం లింబారావు(23) శుక్రవారం మరణించారు.

నేడు, రేపు పలు ప్రాంతాల్లో వర్షాలు

భానుడి భగభగలతో రెండ్రోజులుగా అల్లాడిపోతున్న ప్రజలకు చల్లని కబురు. శనివారం నుంచి ఎండల తీవ్రత కాస్త తగ్గనుంది. శని, ఆదివారాల్లో పగటిపూట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల్లోపే నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదివారం కొన్ని జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. ఇక నైరుతి రుతుపవనాలు శనివారం కేరళలోని మిగిలిన ప్రాంతాలు, తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని ప్రాంతాల్లోకి ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది.

శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అమిత్ షా



తిరుమల, మే 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోం మంత్రి అమిత్ షా తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం దర్శించుకున్నారు. గురువారం రాత్రి తిరుమల చేరుకున్న ఆయన శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో సతీమణి సోనాల్ షాతో కలిసి ఆలయంలోకి వెళ్లి ధ్వజస్తంభం వద్ద సాష్టాంగ నమస్కారం చేశారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం హుండీలో కానుకలు సమర్పించి, రంగనాయక మండపానికి చేరుకోగా వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో ధర్మారెడ్డి ఆయనకు శ్రీరాములవారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

7, 8 తేదీల్లో హైదరాబాద్‌లో ప్రపంచ వరి సదస్సు



- విదేశీ శాస్త్రవేత్తల రాక: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ప్రపంచ వరి సదస్సును నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను మంత్రికి అంతర్జాతీయ పంటల సంస్థ(కాలిఫోర్నియా, అమెరికా) డైరెక్టర్ మెర్సిడెజ్ జోన్స్‌తో పాటు స్థానిక నిర్వాహకులు ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యలు శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. ఈ సదస్సుకు దాదాపు 150 మంది విదేశీ వరి ధాన్యం ఎగుమతిదారులు, దిగుమతిదారులతో పాటు అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ(ఫిలిప్పీన్స్) నుండి ప్రముఖ వరి శాస్త్రవేత్తలు రానున్నారని తెలిపారు. అలాగే ఇతర రాష్ట్రాల నుండి 150 మంది వరి ఎగుమతిదారులు, వరి విత్తన కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు వస్తారని, రాష్ట్రంలోని 30 మంది అభ్యుదయ రైతులు, 30 మంది రైస్ మిల్లర్లు కూడా పాల్గొంటారని తెలిపారు. దేశీయ వరి ఎగుమతిదారులు, విదేశీ దిగుమతి దారులతో నేరుగా సంప్రదింపులు చేసుకునే అవకాశం ఉంటుందని, శాస్త్రవేత్తల ద్వారా విత్తనోత్పత్తిలో అందుబాటులో ఉన్న అధునాతన పరిజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. కాగా, విత్తనాల సరఫరాపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ఆరాతీశారు. సెక్రటేరియట్ నుంచి ఆదిలాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లతో ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు.

భౌతిక, రసాయన శాస్త్రాలపై చిన్నచూపుతో నష్టం

- ఫిజికల్ సైన్స్ ఫోరం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): భౌతిక, రసాయన శాస్త్రం పట్ల అధికారులు చిన్నచూపు చూడడం వల్ల విద్యా రంగానికి నష్టం వాటిల్లనుందని రాష్ట్ర ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు అజయ్‌సింగ్ ఆందోళన వ్యక్తం చేశారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులచే ఆరు, ఏడవ తరగతి గణిత సబ్జెక్టును బోధించమని ఇటీవలే విద్యాశాఖ కార్యదర్శి విడుదల చేసిన మెమోపై అజయ్ సింగ్ శుక్రవారం స్పందించారు. భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులను గణిత బోధనకు పరిమితం చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. విద్యా శాఖ కార్యదర్శి విడుదల చేసిన మెమోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు మేడిగడ్డకు నిపుణుల కమిటీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీను నిపుణుల కమిటీ సందర్శించనుంది. నిర్మాణపరంగా, నాణ్యత పరంగా, నిర్వహణ పరంగా లోపాలను వెలికితీయడంతో పాటు వాటికి బాధ్యులను గుర్తించేందుకు నియమించిన జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్‌కు సాంకేతిక అంశాల్లో సాయం కోసం వేసిన ఈ కమిటీ శనివారం ఆయా బ్యారేజీలను సందర్శించనుంది. సివిల్ స్ట్రక్చరల్ అంశాల కోసం ఎన్ఐటీ వరంగల్ పూర్వ ప్రొఫెసర్ సి.బి.కామేశ్వరరావు, మెకానికల్ రంగంపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ నిపుణుడు మాజీ చీఫ్ ఇంజనీర్ కె.సత్యనారాయణ, జియో టెక్నికల్ అంశాలపై ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ కె.రమణమూర్తి తదితరులతో కమిటీ వేయగా ఆ కమిటీ బ్యారేజీలను తనిఖీ చేయనుంది. జూన్ 7, 8 తేదీల్లో కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఆయా బ్యారేజీలను పరిశీలించనున్నారనే నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతులను కమిటీ పరిశీలించనుంది. ఇక మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఏ విధంగా ఉన్నాయో కేంద్ర సంస్థలతో భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయించాలని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిన విషయం విదితమే. పుణేలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్), ఢిల్లీకి చెందిన కేంద్ర మృత్తిక, ఇతర భూపదార్థాల పరిశోధన కేంద్రం(సీఎస్ఎంఆర్ఎస్)తో, హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ)తో అధ్యయనం చేయించాలని ఎన్డీఎస్ఏ సిఫారసు చేయగా.. సీడబ్ల్యూపీఆర్ఎస్ మాత్రమే స్పందించింది. ఒక్కో బ్యారేజీ పరీక్షకు రూ.కోటి ఖర్చవుతుందని అంచనాలు సమర్పించింది.

మేడ్చల్ డీఐజీ నియామక ఉత్తర్వుల కొట్టివేత

- ఆ స్థానంలో డీఐజీ రవీందర్ నియామక ఉత్తర్వులు అమలు చేయక తప్పని పరిస్థితి

హైదరాబాద్ సిటీ, మే31 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) పోస్టింగ్‌ల వ్యవహారంలో రిజిస్ట్రేషన్ల శాఖకు ఎదురుదెబ్బ. మేడ్చల్ డీఐజీగా మధుసూదన్‌రెడ్డి నియామక ఉత్తర్వులను కొట్టివేస్తూ హైకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. మేడ్చల్ డీఐజీగా రవీందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 275 మినహా మిగతా జీవోలను కొట్టివేసింది. ఈ నేపథ్యంలో గతేడాది ఆగస్టులో మేడ్చల్ డీఐజీగా రవీందర్‌ను నియమిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 275ను అమలు చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయంపై రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల్లో ఉత్కంఠ నెలకొంది. గతేడాది ఆగస్టు నుంచి రిజిస్ట్రేషన్ల శాఖలో మేడ్చల్ డీఐజీ కుర్చీ కోసం ఇద్దరు అధికారుల మధ్య వివాదం నడుస్తోంది. ఆరుగురు డీఐజీల బదిలీల్లో భాగంగా రవీందర్‌ను మేడ్చల్ డీఐజీగా నియమించారు. నిజామాబాద్ డీఐజీగా ఉన్న మధుసూదన్‌రెడ్డిని కరీంనగర్‌కు బదిలీ చేస్తూ ఆగస్టు 22న ప్రభుత్వం జీవో 275ను జారీ చేసింది. మరుసటి రోజే కరీంనగర్ డీఐజీగా నియమితులైన మధుసూదన్ రెడ్డికి మేడ్చల్ డీఐజీగా, మేడ్చల్ డీఐజీ రవీందర్‌ను కరీంనగర్ డీఐజీగా పోస్టింగ్‌ల్లో మార్పులు చేస్తూ జీవో 279ను జారీ చేశారు. జీవో 275 ద్వారా తనకు ఇచ్చిన పోస్టింగ్‌ను మార్చడంపై రవీందర్ హైకోర్టును ఆశ్రయించగా..జీవో 279ని రద్దు చేస్తూ తీర్పు వెలువడింది. జీవో నంబరు 279 రద్దు కావడంతో జీవో నంబరు 275ను అమలు చేయాల్సి ఉన్నా ఉన్నతాధికారులు అలా చేయకుండా అధికారులిద్దరిని రిజిస్ట్రేషన్ల ముఖ్య కార్యదర్శికి రిపోర్టు చేయాలని ఆదేశించారు. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 10న ప్రభుత్వం జారీ చేసిన జీవో 74, 75లోనూ గతేడాది ఆగస్టులో జారీ చేసిన జీవో నంబరు 279లో సమాచారమే యథాతథంగా ఇవ్వడంతో వివాదం మళ్లీ మొదటికొచ్చింది. ఈ అంశంపై 'ఆర్నెల్లు తిరక్కుండానే అదే ఆర్డర్!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఫిబ్రవరి 21న కథనం కూడా ప్రచురితమైంది. అనంతరం రవీందర్ హైకోర్టును ఆశ్రయించగా తాజాగా తీర్పు వెలువరించింది. జీవో 275 మినహా మిగతా ఉత్తర్వులను కొట్టివేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు తీర్పు అమలుపై ప్రభుత్వం తీసుకోబోయే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది.



తుమ్మబాల పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్

సెయింట్ మేరీస్ చర్చిలో మాజీ బిషప్ తుమ్మబాల ఖననం

- నివాళులు అర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రెజిమెంటల్ బజార్, మే 31 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో తుది శ్వాస విడిచిన హైదరాబాద్ ఆర్చ్ డయోసిస్ మాజీ బిషప్ తుమ్మబాల పార్థివ దేహాన్ని సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ బసలిక చర్చిలో ఖననం చేశారు. తుమ్మబాల పోప్ సెయింట్ జాన్‌పాల్ 2 ద్వారా 1986లో వరంగల్ రెండో బిషప్‌గా నియమితులై 25 ఏళ్లు బిషప్‌గా పనిచేశారు. అనంతరం హైదరాబాద్ ఆర్చ్ బిషప్‌గా 2011 నుంచి 2020 వరకు సేవలందించి పదవీ విరమణ పొందారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని దివ్యజ్యోతి నిలయంలో ఉంటూ అనారోగ్యంతో గురువారం తుదిశ్వాస విడిచారు. సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాల ఆవరణలో ఉంచిన తుమ్మబాల పార్థివ దేహానికి సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు.

టెస్కాబ్ ఛైర్మన్ 'కొండూరి' రాజీనామా

- వైస్‌ఛైర్మన్ మహేందర్ రెడ్డి కూడా
- అవిశ్వాసం నోటీసుతో నిర్ణయం
- కరీంనగర్ డీసీసీబీ ఛైర్మన్ పదవికి ఓకే



కొండూరి రవీందర్‌రావు

కరీంనగర్, హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ అగ్రికల్చరల్ బ్యాంకు (టెస్కాబ్) ఛైర్మన్ పదవికి కొండూరి రవీందర్‌రావు రాజీనామా చేశారు. ఆయనతోపాటు వైస్ ఛైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి కూడా తన పదవికి రాజీనామా చేశారు. టెస్కాబ్‌లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కలిపి తొమ్మిది మంది డైరెక్టర్లు ఉన్నారు. వీరిలో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ మినహా ఏడుగురు డైరెక్టర్లు ఇటీవల బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్‌లో చేరిన డైరెక్టర్లు వీరిపై ఇటీవల అవిశ్వాస నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జూన్ 10న అవిశ్వాస నోటీసుపై సమావేశం జరగనుండగా శుక్రవారమే తమ రాజీనామాలను సమర్పించారు. కరీంనగర్ కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌గా, టెస్కాబ్ ఛైర్మన్‌గా దశాబ్దకాలంగా బాధ్యతలు నిర్వర్తించిన కొండూరి రవీందర్‌రావు కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఛైర్మన్‌గా కొనసాగనున్నారు. సిరిసిల్ల నియోజకవర్గం గంభీరావుపేటకు చెందిన రవీందర్‌రావు మొదటి నుంచి కాంగ్రెస్ నాయకుడిగా ఉన్నారు. ఆయన ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. 2014లో కాంగ్రెస్ అభ్యర్థిగా, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్‌పై పోటీచేసి ఓడిపోయారు. ఏడాది తిరిగేసరికి కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. 2015లో కరీంనగర్ కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడిగా ఎన్నికైన రవీందర్‌రావు టీఆర్ఎస్ అభ్యర్థిగా టెస్కాబ్ ఛైర్మన్ పదవి చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన ఇటు కరీంనగర్ డీసీసీబీ ఛైర్మన్, అటు టెస్కాబ్ ఛైర్మన్‌గా పదవిలోనూ కొనసాగారు. కాగా, టెస్కాబ్ ఛైర్మన్ స్థానానికి రాజీనామా చేయటంతో కొండూరి రవీందర్‌రావు న్యాప్‌కాబ్ ఛైర్మన్ పదవిని కూడా కోల్పోయే అవకాశాలున్నాయి. కొత్తగా ఎన్నికయ్యే టెస్కాబ్ పాలకవర్గం.. రవీందర్‌రావును నేషనల్ బ్యాంకు ఛైర్మన్ పదవిలో కొనసాగితే అభ్యంతరంలేదని ఢిల్లీకి లేఖ రాస్తే.. ఆ పదవిలో తెలంగాణ ప్రతినిధిగా ఆయన కొనసాగుతారు. లేదంటే న్యాప్‌కాబ్ పదవిని కోల్పోతారు. కాగా, టెస్కాబ్ ఆధ్వర్యంలో గడిచిన పదేళ్లలో రూ.30 వేల కోట్లకు పైగా వ్యాపార వృద్ధి జరిగినట్లు టెస్కాబ్ ఛైర్మన్ పదవికి రాజీనామా చేసిన కొండూరి రవీందర్‌రావు ప్రకటించారు. టెస్కాబ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎవరో పదవి నుంచి దించే దాకా ఉండడం ఎందుకునే రాజీనామా చేసినట్లు ప్రకటించారు.

రాజీనామా హర్షణీయం: కేటీఆర్

బీఆర్ఎస్ నేతలు ఇద్దరు ఒకే రోజు తమ అధికారిక పదవులకు రాజీనామా చేయడం అభినందనీయమని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యమని, పదవులను గడ్డిపరకలా వదిలేయాలన్న కేసీఆర్ బాటలోనే.. వారిద్దరూ రాజీనామా చేశారని తెలిపారు.

గిరిజనులను కలవకుండా పారామిలటరీ అడ్డుకుంటోంది

- ఆటంకాలు లేకుండా అనుమతివ్వండి
- ఎస్ఎఫ్ఏఆర్ఎస్ డిమాండ్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): గిరిజనులను కలవకుండా ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక (ఎస్ఎఫ్ఏఆర్ఎస్)ను పారామిలటరీ బృందాలు అడ్డుకుంటున్నాయని ఆ వేదిక సభ్యులు పేర్కొన్నారు. 5 నెలల్లో ఛత్తీస్‌గఢ్‌లో పారామిలటరీ బలగాలు ఆదివాసీలపై మావోయిస్టులుగా ముద్రవేసి 120 మందిని హతమార్చాయని ఆరోపించారు. వారికి సంఘీభావం తెలిపేందుకు వేదిక ఆధ్వర్యంలో 60 మంది సభ్యులు నిజనిర్ధారణ బృందాలుగా ఏర్పడి ఈ నెల 30న భద్రాచలం నుంచి ఛత్తీస్‌గఢ్ పరిధిలోని ఆదివాసీ గ్రామాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారని వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ నాయకత్వంలో వెళుతున్న ఒక బృందాన్ని కుంట గ్రామం వద్ద, చిలుకా చంద్రశేఖర్ నేతృత్వంలోనే నారాయణరావు, మాదన కుమారస్వామి, జాబాలి (తెలంగాణ)తో కూడిన బృందాన్ని తెర్లగూడ వద్ద పారామిలటరీ బలగాలు ఆపివేశాయని పేర్కొన్నారు. తమ బృందాలు ఆదివాసీలను కలవకుండా బెదిరించి వెనక్కు పంపాయని ఆరోపించారు. భద్రాచలం వరకు తమను వెంటాడి ఫొటోలు తీస్తూ ముఖాల మీద లైట్లు వేస్తూ భయోత్పాతం సృష్టించాయని పేర్కొన్నారు. ప్రైవేటు వాహనాలలో వెళితే వెనక్కు పంపుతున్నందున శుక్రవారం ఆర్టీసీ బస్సులో ఎక్కి దంతేవాడ చేరుకోవాలని ప్రయత్నించగా.. చింతూరు బస్టాండ్‌లో అడ్డుకుని బస్సు దింపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ తాము గిరిజనులను కలిసేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా అనుమతివ్వాలని ఎస్ఎఫ్ఏఆర్ఎస్ సభ్యులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

తెలంగాణ వాడుకుంది 2032 టీఎంసీలే!

- పదేళ్లలో కృష్ణా నీటి వినియోగం 30.90 శాతమే
- ఏపీ వాడింది 4543 టీఎంసీలు
- బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు చేరిన ఎస్‌వోసీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి పదేళ్లలో కృష్ణా జలాల్లో తెలంగాణ 2032 టీఎంసీలు, ఏపీ 4543 టీఎంసీలు వినియోగించుకున్నాయి. మొత్తంగా రెండు తెలుగు రాష్ట్రాలు కలిపి 6575 టీఎంసీల నీటిని వాడుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రెండు రాష్ట్రాలు ఏర్పడి పదేళ్లు పూర్తవుతుండగా, శుక్రవారంతో 2023-24 నీటి సంవత్సరం (వాటర్ ఇయర్) ముగిసింది. కొత్త వాటర్ ఇయర్ శనివారం ప్రారంభం కానున్న నేపథ్యంలో 2014-15 నుంచి 2023-24 దాకా రెండు రాష్ట్రాలు ఏ మేరకు నీటిని వాడుకున్నాయని లెక్కలు తీయగా.. ఈ విషయం వెల్లడైంది. ఆంధ్రప్రదేశ్ 69.09 శాతం, తెలంగాణ 30.90 శాతం నీటిని వాడుకున్నట్లు తేలింది. వాస్తవానికి రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల వివాదం ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది. జలాల పంపిణీ కోసం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టంలోని సెక్షన్-3 ప్రకారం.. తెలంగాణ విజ్ఞప్తి చేయడంతో నీటిని పంపిణీ చేసే బాధ్యతను కేంద్రం జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్‌కు అప్పగించింది. జలాలను ఏ విధంగా పంచాలనే దానిపై తెలంగాణ, ఏపీ.. స్టేట్ ఆఫ్ కేసు(ఎస్‌వోసీ) దాఖలు చేశాయి. జూలైలో దీనిపై విచారణ ఊపందుకోనుంది. అయితే విచారణలో వేగం పెరిగితే రెండేళ్లలో వివాదం సద్దుమణుగుతుందని అధికారులు భావిస్తున్నారు. జస్టిస్ బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి 811 టీఎంసీల నీటిని గంపగుత్తగా కేటాయించిన విషయం విదితమే. అయితే రెండు రాష్ట్రాలుగా ఏర్పడ్డాక నీటి పంపిణీ కోసం తాత్కాలికంగా ఒప్పందం చేసుకున్నాయి. 2015 వాటర్ ఇయర్‌కు మాత్రమే తాత్కాలిక ప్రాతిపదికన కృష్ణా జలాల్లో 512 టీఎంసీలను ఏపీ, 299 టీఎంసీలను తెలంగాణ వినియోగించుకోవాలని ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఆ ఒప్పందం రెండేళ్లు కొనసాగగా.. 2017 నుంచి వచ్చే నీటిలో 66 శాతాన్ని ఏపీ, 34 శాతం తెలంగాణ వాడుకోవాలని నిర్ణయించాయి. కాగా, కృష్ణా బేసిన్‌కు పదేళ్లకాలంలో మూడేళ్లు లోటు వరద వచ్చింది. 2015-16లో కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలు 194 టీఎంసీలు మాత్రమే వాడుకోగా.. ఆ తర్వాత 2016-17లో 330 టీఎంసీలు, 2017-18లో 543 టీఎంసీలు వాడుకున్నాయి. 2017-18లో ఒక్క చుక్క నీరు కూడా సముద్రంలోకి వెళ్లలేదు. 2015-16లో 9.259 టీఎంసీలు సముద్రంలో కలవగా, 2018-19లో 39 టీఎంసీలు, 2023-24లో 62.60 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి.

పదేళ్లలో నీటి వినియోగం (టీఎంసీల్లో) ఇలా

సంవత్సరం	ఏపీ	తెలంగాణ
2014-15	529.330	227.743
2015-16	124.960	69.688
2016-17	282.512	153.386
2017-18	359.897	183.298
2018-19	504.476	207.298
2019-20	653.064	278.234
2020-21	618.935	253.234
2021-22	621.841	265.051
2022-23	637.996	273.300
2023-24	210	120
మొత్తం	4543	2023
	(69.09%)	(30.90%)

నీటి నిల్వకు లేని రిజర్వాయర్లు..

2021-22 వాటర్ ఇయర్ నుంచే కృష్ణా జలాల్లో 50 శాతం వాటా కోసం తెలంగాణ పట్టుబడుతోంది. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టులతోపాటు నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులు, పారిశ్రామిక, తాగునీటి అవసరాల కోసం 575 టీఎంసీల నీరు అవసరం ఉందని చెబుతోంది. అయితే కృష్ణా బేసిన్ ప్రాంతాలను పరిశీలిస్తే తెలంగాణలో నీటిని నిల్వ చేసుకోవడానికి సరిపడా రిజర్వాయర్ల నిర్మాణం జరగలేదు. పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలు పూర్తయితే దాదాపు 140 టీఎంసీలను నిల్వ చేసుకొని/వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. అదే ఏపీకి ప్రధానంగా రాయలసీమలో పెన్నా బేసిన్‌లో దాదాపు 370 టీఎంసీల నీటిని నిల్వ చేసే రిజర్వాయర్లు ఉన్నాయి. పెన్నాకు వరదలు తక్కువ కావడంతో తుంగభద్ర నుంచి శ్రీశైలం దాకా పలు రిజర్వాయర్‌ల నుంచి వరదల సమయంలో నీటిని తరలించి.. నిల్వ చేసుకొని వాడుకునే అవకాశం ఏపీకి ఉంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్‌కు నగుబాటు

ఈ ఏడాది నవంబరులో అధ్యక్ష ఎన్నికలు ఉండగా, 'హష్‌మనీ' కేసులో నేర నిర్ధారణ జరగడం అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు పెద్ద ఎదురుదెబ్బ. తనతో ఉన్న సంబంధం గురించి నోరువిప్పకుండా ఉండేందుకు పోర్న్‌స్టార్ స్మార్టీ డేనియల్‌కు ట్రంప్ భారీగా డబ్బు ముట్టచెప్పిన కేసులో మాన్‌హటన్ కోర్టు వెలువరించిన తీర్పు ఆయనకు అవమానకరమైనది. ఈ కేసులో ట్రంప్‌మీద మోపిన ముప్పైనాలుగు అభియోగాలు రుజువైనట్లు జ్యూరీ ప్రకటించింది. తుదితీర్పు వెలువరించడానికి, శిక్షఖరారు కావడానికి ఒక నెల సమయం పట్టవచ్చును. నాలుగేళ్ళవరకూ జైలుశిక్షపడుతుందన్న అంచనాలు, ఊహాగానాలను అటుంచితే, అమెరికా అధ్యక్షపదవి చేపట్టిన వ్యక్తి ఒక క్రిమినల్ కేసులో దోషిగా రుజువుకావడం ఈ దేశ చరిత్రలో ఇదే తొలిసారి.

వచ్చేనెల 11న కోర్టు తుదితీర్పు ప్రకటించిన నాలుగురోజుల్లోనే, అంటే జూలై 15న ఆయన దేశాధ్యక్ష పదవికి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేస్తారట. ట్రంప్ ప్రయాణం వేగంగా సాగుతోంది... అటు జైల్లోకి, ఇటు అధ్యక్ష భవనంవైపు అంటూ అమెరికా పత్రికలు రాస్తున్నాయి. చాలా విచిత్రమైన పరిస్థితి ఆయనది. తనను టీవీ స్టార్‌ను చేస్తానని హామీ ఇచ్చి 2006లో ట్రంప్ తనతో శృంగారంలో పాల్గొన్నారని, మాటకు కట్టుబడకపోగా, ఈ విషయం చెప్పకుండా ఉండేందుకు తనకు డబ్బు ముట్టచెప్పారన్నది ఆమె వాదన. 2016ఎన్నికల ముందు ఆమె నోరుతెరవకుండా ఉండేందుకు డబ్బు ముట్టచెప్పిన ట్రంప్ ఇప్పుడు మళ్ళీ ఎన్నికల ముందు ఆ కేసులో దోషిగా రుజువైనారు. ఈ విచారణను, కోర్టు తీర్పును ట్రంప్ తప్పుబట్టడం, రాజకీయకక్షగా అభివర్ణించడం సహజం. శిక్షపడినా కూడా ఆయన ఎన్నికల ప్రచారానికీ, పోటీకి అనర్హుడు కాబోడని, దేశాధ్యక్షుడు కావడానికి ఏ అడ్డంకీ ఉండబోదని అంటున్నారు. దిగువకోర్టు నిర్ణయాన్ని ఎలాగూ ఆయన పైకోర్టులో సవాల్ చేస్తారు.

నిజమైన తీర్పు నవంబరు 5న వెలువడుతుందని ట్రంప్ అంటున్నారు. ఒక పోర్న్‌స్టార్‌కు ఏవో ఆశలు చూపి, శృంగారం నెరపి, ఆమెకు డబ్బుముట్టచెప్పిన ట్రంప్ ప్రజలు దీనిని ఏమాత్రం పట్టించుకోరని నమ్ముతున్నారు. స్మార్టీ డేనియల్‌కు సొమ్ముచెల్లించిన విషయం రహస్యంగా ఉండాలి కనుక, తదనుగుణంగా ఖాతాల్లో ఆ మొత్తాన్ని తారుమారు చేశారు. ఎన్నికల విరాళాలనుంచి ఆ మొత్తాన్ని పోర్న్‌స్టార్‌కు పంచారని, తన న్యాయవాదిద్వారా దానిని ఆమెకు అందించారన్నది అభియోగం. ట్రంప్‌తో సంబంధం, సొమ్ముచెల్లింపు నిజమేనని స్మార్టీ డేనియల్ కోర్టుకు వచ్చిచెప్పారు, లెక్కల తారుమారు, వేర్వేరు మార్గాల్లో సర్దుబాట్లు వాస్తవమేనని సదరు న్యాయవాది కూడా అంగీకరించి జైలుపాలైనారు. విచిత్రమేమంటే, మాన్‌హట్టన్ కోర్టు తీర్పు వెలువడిన కొద్ది గంటల్లోనే విరాళాల వరదతో ట్రంప్ వెబ్‌సైట్ కాసేపు క్రాష్ అయింది.

ట్రంప్‌కు జైలుశిక్షపడవచ్చు, జరిమానాతో సరిపెట్టవచ్చు. ఇంతకంటే తీవ్రమైన కేసులు మరో మూడు ఉన్నా అవేవీ ఈ ఎన్నికలయ్యేలోగా ట్రంప్‌ను ఇబ్బందిపెట్టవు. కానీ, హష్‌మనీ కేసులో ఆయనకు శిక్షపడటం ఓటరు నిర్ణయంమీద ఎంతోకొంత ప్రభావం చూపుతుంది. ఆయన దోషిగా తేలి, స్వల్పకాలిక జైలుశిక్ష పడినా కూడా రిపబ్లికన్ పార్టీ సంకటస్థితిని ఎదుర్కోవలసి వస్తుంది. దోషిగా తేలితే ఆయన అభ్యర్థిత్వాన్ని తిరస్కరించాలని పార్టీ ఓటర్లు నిర్ణయించుకున్నట్టుగా ఈ ఏడాది ఆరంభంలో ఓ సర్వే తేల్చింది. జూలై నాటి రిపబ్లికన్ సమావేశాల్లో కూడా ఇదే వేడి ఉంటుందా అన్నది తెలియదు. రిపబ్లికన్ పార్టీ తరఫున పోటీపడుతున్న హేమాహేమీలంతా వరుసపెట్టి పక్కకు జరిగిపోతూ, ట్రంప్ ప్రధానంగా పరుగుపందెంలో నిలిచివున్న స్థితిలో ఆయనను కాదనడం అసాధ్యం. ట్రంప్ మద్దతుదారులు ఈ కేసును బైడెన్ రాజకీయ కుట్ర అంటారు, ట్రంప్ వ్యతిరేకులు ఆయనకు శిక్షపడినందుకు సంతోషిస్తారు. రాజకీయాన్ని అటుంచితే, మరోమారు దేశాధ్యక్షుడు కావాలనుకుంటున్న ఓ మాజీ అధ్యక్షుడు ఇలా వరుస కేసులు ఎదుర్కోవడం, నేరస్థుడిగా ముద్రపడటం అమెరికా పరువు ప్రతిష్ఠలకు భంగకరం. గత ఎన్నికల్లో ఓటమిని సహించక, ప్రజలు ఎన్నుకున్న బైడెన్‌కు అధ్యక్షబాధ్యతలను అప్పగించడానికి మనసొప్పక, తన అభిమానులను రెచ్చగొట్టి తీవ్ర విధ్వంసానికి కారకుడై దేశం పరువుతీసిన డోనాల్డ్ ట్రంప్‌కు మరోమారు అధికారం అప్పగించడం సరైనదో కాదో ప్రజలు నిర్ణయించుకోవాలి. నవంబరులో వారు ఇచ్చే అసలైన తీర్పుమీద అమెరికా భవిష్యత్తు, దాని పరువుప్రతిష్ఠలు ఆధారపడి ఉన్నాయి.

ఆశాభావాల ఆఖరి దశ

భారతదేశ జాతీయ ఎన్నికల చరిత్రలో అతి సుదీర్ఘమైనది అయిన 18వ సార్వత్రిక పోరు దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 57 లోక్‌సభా నియోజకవర్గాలలో శనివారం పోలింగ్‌తో ముగియనున్నది. భారతీయ జనతా పార్టీ గెలుపునకు కష్టపడవలసిన రాష్ట్రాలు, తన సంఖ్యా బలాన్ని మెరుగుపరచుకోగలనన్న ఆశాభావం ఉన్న ప్రాంతాలలో ఈ ఆఖరి దశ ఎన్నికలు జరుగుతున్నాయి. 2019లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఈ 57 స్థానాలలో 30ని మాత్రమే గెలుచుకున్నది. ఇండియా కూటమి 19 స్థానాలను గెలుచుకోగా 'అలీన' (ఏ కూటమిలోనూ భాగస్వామిగా లేని) పార్టీలు 8 స్థానాలను కైవసం చేసుకున్నాయి.


■ యోగేంద్ర యాదవ్

2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఇండియా కూటమి మరో 12 సీట్లను అదనంగా గెలుచుకునే అవకాశమున్నది ఈ దశలో ఎన్డీఏ విజయావకాశాలు, ముఖ్యంగా బెంగాల్, ఒడిషా, పంజాబ్‌లలో గతంలో కంటే అధికంగానే ఉన్నాయి. కాగా ఈ దశలో ఎన్నికలు జరగనున్న స్థానాలలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సొంత నియోజకవర్గం కూడా ఉన్నది. ప్రధానమంత్రి ప్రచారంపై పూర్తి శ్రద్ధ చూపించేందుకు వీలుగా ఈ ఏడో దశ ఎన్నికల నియోజకవర్గాలను నిర్ణయించారు. అందుకు తగ్గట్టుగానే అత్యధిక స్థానాలను గెలుచుకోవడానికి ఆయన ఉధృత ప్రచారం చేశారు. అయితే బీజేపీ శ్రేణులు ఊహించిన రీతిలో ఆ ప్రచారం విజయవంతంగా జరగలేదు.

బిహార్ భోజ్‌పూర్ ప్రాంతంలోని ఎనిమిది లోక్‌సభా నియోజకవర్గాలను గత సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ గెలుచుకున్నది. అయితే ఈసారి అవే నియోజకవర్గాలలో గెలవడం పాలక కూటమికి ఒక సవాల్‌గా ఉన్నది. 2020 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ 8లోని 6 నియోజకవర్గాలలో ఎన్డీఏ కంటే ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలకే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ప్రస్తుత పొత్తుల ప్రకారం చూస్తే ఇండియా కూటమి మూడు నియోజకవర్గాలు జెహనాబాద్, పాటలీపుత్ర, అరాహ్‌లను తప్పక గెలుచుకుంటుంది. మరో 2 శాతం ఓట్లు అదనంగా లభిస్తే ఇండియా కూటమి గెలుచుకునే స్థానాల సంఖ్య 5కు పెరుగుతుంది. ఇండియా కూటమి కూడా 5 స్థానాలను గెలుచుకోవడానికి కృతనిశ్చయంతో కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్రీయ జనతా దళ్ 'My' (ముస్లిం–యాదవ్) వ్యూహానికి స్వస్తి చెప్పి సకల సామాజికవర్గాలకు సమ ప్రాధాన్య మిచ్చే 'A to Z' వ్యూహానికి ప్రాధాన్యమిస్తోంది.

ఉత్తరప్రదేశ్‌లో ఈ సార్వత్రిక ఎన్నికలు పూర్వాంచల్‌లోని 13 నియోజకవర్గాలలో ముగియనున్నాయి. 2019 లోక్‌సభ, 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఎన్డీఏ ఈ నియోజకవర్గాలలో మంచి ఫలితాలను సాధించింది. గత సార్వత్రిక ఎన్నికలలో 11 స్థానాలను కైవసం చేసుకున్నది. ఆ తరువాత అసెంబ్లీ ఎన్నికలలో గోరఖ్‌పూర్, వారణాసి లోక్‌సభ నియోజక వర్గాల పరిధిలోని అత్యధిక సీట్లను ఎన్డీఏ గెలుచుకున్నది. ఘాజీపూర్, ఘోసి లోక్‌సభా నియోజకవర్గాల పరిధిలోని అత్యధిక అసెంబ్లీ సీట్లు ఇండియా కూటమికి దక్కాయి. అయితే ఇప్పుడు ఆ పరిస్థితులలో మార్పు వచ్చింది. మొత్తం మీద యూపీలో ఎన్డీఏ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులలో 45 శాతం మంది అగ్రకులాలవారు కాగా ఇండియా కూటమి అభ్యర్థులలో అగ్రవర్ణాలవారు 27.5 శాతం మంది మాత్రమే ఉన్నారు.

పంజాబ్‌లో బీజేపీకి విజయావకాశాలు జారిపోయాయని చెప్పక తప్పదు. కొత్త సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతుల ఆందోళన బీజేపీ–అకాలీదళ్‌ల మధ్య 25 ఏళ్ల స్నేహ బంధం తెగిపోయింది. దరిమిలా గ్రామీణ సిక్కు రైతుల ఆగ్రహావేశాలను బీజేపీ చవి చూస్తోంది హిందూ ఓట్లను నిలుపుకోవడంతో పాటు హిందూ, సిక్కు, దళిత ఓటర్ల మద్దతును సాధించుకోవడం ద్వారా కొద్ది సీట్లను గెలుచుకోవడానికి బీజేపీ శతథా ప్రయత్నిస్తోంది అదే సమయంలో కాంగ్రెస్, ఆప్ నుంచి చేర్చుకున్న సిక్కు నేతల సహాయంతో సిక్కు ఓటర్ల మద్దతును కూడా పొందేందుకు జాతీయ అధికార పక్షం ప్రయత్నిస్తోంది. అయితే ఈ ప్రయత్నాలతో లబ్ధి పొందడానికి బదులు ప్రస్తుతమున్న రెండు సీట్లలో ఒక దాన్నిగానీ లేదా రెండిటిని గానీ బీజేపీ కోల్పోయే అవకాశమున్నది. పంజాబ్‌లో ప్రధాన పోటీ అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ మధ్యే ఉన్నది. ఈ రెండూ ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు కావడం విశేషం. హిందూ, సిక్కు ఓట్లను సాధించుకోగల ఈ రెండు పార్టీల మధ్య తీవ్ర పోటీ నెలకొనడం ఆసక్తిదాయకంగా ఉన్నది. 2019లో కాంగ్రెస్ ఎనిమిది స్థానాలను గెలుచుకోగా బీజేపీ–అకాలీదళ్ కూటమి నాలుగు స్థానాలను గెలుచుకున్నది. ఆ సార్వత్రిక ఎన్నికలలో కేవలం ఒకే ఒక్క స్థానాన్ని గెలుచుకున్న ఆప్ ఆ తరువాత 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఐదింట నాలుగు స్థానాలను గెలుచుకుని రాష్ట్రంలో అధికారానికి వచ్చింది. ఆ ఫలితాల ప్రాతిపదికన చూస్తే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలలో ఆప్ 11 స్థానాలను గెలుచుకోవచ్చు.



2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఇండియా కూటమి ఈ దశ పోలింగ్‌లో మరో 12 సీట్లను గెలుచుకునే అవకాశమున్నది. యూపీ, బిహార్‌లలో ఇండియా కూటమికి, బెంగాల్, ఒడిషాలలో ఎన్డీఏకు విజయావకాశాలు గతంలో కంటే అధికంగా ఉన్నాయి. నేడు పోలింగ్ జరగనున్న స్థానాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సొంత నియోజకవర్గం వారణాసి కూడా ఉన్నది.

హిమాచల్‌ప్రదేశ్‌లో మొత్తం నాలుగు లోక్‌సభా నియోజకవర్గాలు ఉండగా కాంగ్రెస్ 2019లో ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఆ తరువాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో సాధించుకున్న ఓట్ల బలాన్ని నిలుపుకోగలిగితే ఈ సారి సిమ్లా, హమీర్‌పూర్‌లను కైవసం చేసుకోగలుగుతుంది. ఆప్ ఓట్లు కూడా కలిస్తే కాంగ్రా నియోజకవర్గం కూడా కాంగ్రెస్‌కు స్వాయత్తమవుతుంది. నాలుగో నియోజకవర్గమైన మండీలో కాంగ్రెస్ విజయానికి సానుకూల పరిస్థితులు ఉన్నాయి.

పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రాబల్యమున్న ఉత్తర బెంగాల్, జంగల్‌మహల్ ప్రాంతాలలో ఎన్నికలు ఇప్పటికే ముగిసాయి. నేడు పోలింగ్ జరగనున్న కోల్‌కతా మహానగరంలోని లోక్‌సభ నియోజకవర్గాలు 2009 నుంచి తృణమూల్ కాంగ్రెస్‌కు కంచుకోటలుగా ఉన్నాయి. ఉత్తర కోల్‌కతా లేదా దక్షిణ కోల్‌కతా నియోజకవర్గాలలో ఒకటి తమకు దక్కగలదనే ఆశాభావం బీజేపీ శ్రేణులలో ఉన్నది. కోల్‌కతాలో ప్రధాన మంత్రి ర్యాలీలకు ప్రజలు పెద్ద సంఖ్యలో రావడం బీజేపీ ఆశాభావానికి బలం చేకూర్చుతుంది. బెంగాల్ ప్రజలపై బీజేపీ తన సైద్ధాంతిక ప్రభావాన్ని ఎంతగా చూపినప్పటికీ కోల్‌కతా నగరంలో తృణమూల్ కాంగ్రెస్‌ను ఓడించగల సత్తా బీజేపీకి లేదన్నదే పలువురి అభిప్రాయంగా ఉన్నది.

జార్ఖండ్‌లో నేడు పోలింగ్ జరగనున్న మూడు నియోజకవర్గాలలో ఒకటి మాత్రమే కాంగ్రెస్ చేతిలో ఉన్నది. 2019 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రాతిపదికన చూస్తే ఆ మూడు స్థానాలూ ఎన్డీఏకే దక్కాలి. అయితే ప్రస్తుతం ఇండియా కూటమి, ఎన్డీఏ మధ్య తీవ్ర పోటీ ఉన్నది. ఈ మూడు స్థానాలను ఈ సారి తాను గెలుచుకోగలననే ఆశాభావం ఇండియా కూటమి శ్రేణుల్లో వ్యక్తమవుతోంది.

బీజేపీకి ఓట్లతో పాటు సీట్ల లబ్ధి కూడా తప్పక సమకూరే రాష్ట్రం ఏదైనా ఒకటి ఉంటే అది ఒడిషా అని చెప్పితీరాలి. ఈ రాష్ట్రంలో బీజేపీ, బిజూ జనతాదళ్ మధ్య తీవ్ర పోటీ నెలకొనివున్నది. లోక్‌సభకు, రాష్ట్ర శాసనసభకు ఏకకాలంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఆఖరి దశలో ఆరు నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. 2019లో బిజూ జనతాదళ్ వాటిలో 4 స్థానాలను గెలుచుకున్నది. వాటి పరిధిలోని 42 అసెంబ్లీ సీట్లలో 33 ఆ పార్టీకే దక్కాయి. 2022లో జరిగిన పంచాయత్ ఎన్నికలలో బిజూ జనతాదళ్ ఆ నియోజకవర్గాలపై తన పట్టును మరింత పటిష్ఠం చేసుకున్నది. ఒడిషాలో బీజేపీ తన సీట్ల సంఖ్యను బాగా పెంచుకోవాలంటే ఈ ఆఖరి దశలో అత్యధిక సీట్లను గెలుచుకోవలసి ఉంది. అందుకు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, ఆయన వారసుడుగా భావిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వికె పాండ్యన్‌పై తీవ్ర విమర్శలు చేస్తోంది. ఒడిషా అస్మిత (ఆత్మగౌరం) గురించి బీజేపీ నేతలు అధికంగా మాట్లాడుతున్నారు. మొత్తం మీద ఎన్డీఏ, ఇండియా కూటమి రెండూ ఈ ఆఖరి దశలో విజయం సాధించే ప్రాంతాలూ ఉన్నాయి, నష్టపోయే ప్రాంతాలూ ఉన్నాయి.

(వ్యాసకర్త జాతీయ కన్వీనర్, భారత్ జోడో అభియాన్)

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

అరుదైన అవకాశం ఇది, రేవంత్!



■ కె. శ్రీనివాస్

ప్రత్యేక సందర్భం

పది సంవత్సరాల కిందట ఇదే జూన్ ఒకటోతేదీ అర్ధరాత్రి. అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్ అమర వీరుల స్థూపం పరిసరాలన్నీ, విజయంతో ఉప్పొంగిన హృదయాల అలయ్ బలయ్‌లతో, ప్రాణత్యాగాల స్మరణల తడి కళ్ల తళుకులతో కిక్కిరిసిపోయాయి. తెలంగాణలోని అన్ని పట్టణాల కూడళ్లలోనూ ఆ రాత్రి అంతే ఉధృతితో ఆనందాతిరేకంలో, అమరసాధకుల స్మరణలో పరవళ్లు తొక్కింది. చరిత్రను శాసించి తమ దారికి తెచ్చుకున్న స్వప్నసాధకుల సంబరం అది!

వైఫల్యం అనాథ అట, విజయానికి వేయిమంది తండ్రులట! ప్రాణాలిచ్చినవారిని, అష్టకష్టాలు పడినవారిని విస్మరించి, తెలంగాణ సాధన కేవలం తమ ఘనకార్యమేనని ఎవరు చెప్పుకున్నా అది అన్యాయమే. దశాబ్దాల కాలం నుంచి నిప్పును నిలుపుకుంటూ వచ్చిన ఆచార్య జయశంకర్, ప్రజాకవి కాళోజీ, విశ్వవిద్యాలయ విద్యార్థులు, ప్రొఫెసర్లు, జనసభలు మహాసభలు నిర్వహించి డిక్లరేషన్లు ప్రకటించిన ప్రజాసంఘాలు, కవులు, కళాకారులు, రచయితలు.. వీరు సారవంతం చేసిన నేల మీద కదా మలిదశ ఉద్యమం మొలకెత్తింది! చివరి అయిదు సంవత్సరాల కాలంలో, కేసీఆర్ దీక్ష, తెలంగాణ తొలిప్రకటన తరువాత పరిణామాలలో తెలంగాణ సమాజంలోని అసంఖ్యాక శ్రేణులు ఉద్యమంలో పాలుపంచుకున్నాయి. రాజకీయ జేఏసీ సారథ్యంలో ప్రజలనుంచి ఏకగ్రీవ, ఏకోన్ముఖ రాజకీయ వ్యక్తీకరణ జరిగింది. 2001లో పార్టీ స్థాపించిన దగ్గర నుంచి, కల్వకుంట్ల చంద్రశేఖరరావు, తెలంగాణ రాష్ట్ర సమితి అందించిన స్థిర నాయకత్వానికి, తెలంగాణ వాదన అభివ్యక్తిలో చేసిన దోహదానికి ప్రథమ ప్రశంస అందించవలసిందే. రాష్ట్రసాధనే లక్ష్యంగా చెప్పుకునే ఒక పార్టీ రంగంలో లేనిపక్షంలో, ఉద్యమానికి ఒక ఇరుసు లేకుండా పోయేది. బహుముఖాలుగా, స్వచ్ఛందంగా విస్తరించిన ఉద్యమానికి కేసీఆర్, టీఆర్ఎస్ ఆధారబిందువులుగా ఉన్నారు. అదే సమయంలో, ఉద్యమానికి వేగాన్ని, తీవ్రతను జోడించడానికి ప్రయత్నించకుండా, రాజకీయ లాబీయింగ్ పేరుతో తాత్సారం చేయడం, ఉద్యమ సమాజం నుంచి ఉత్సాహం, చొరవ వ్యక్తమైన సందర్భాలలో వెనుకకు లాగడం చరిత్రలో నమోదైన విషయాలే. సంస్థాగత నిర్మాణం చేయకపోవడం, సైద్ధాంతిక నిబద్ధతకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల పార్టీ క్షేత్రస్థాయిదాకా పెరగలేదు. ఎన్నికల విజయాలూ నిలబడలేదు. రాష్ట్ర విభజన తీర్మానం పార్లమెంటులో ఆమోదం పొందే నాటికి టీఆర్ఎస్ నుంచి ఇద్దరు మాత్రమే లోక్‌సభ సభ్యులు ఉన్నారు.

తెలంగాణ వచ్చింది. ప్రజలు టీఆర్ఎస్‌నే ఎంచుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణలో చొరవ చూపినందుకు కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌లోనూ నష్టపోయింది. తెలంగాణలోనూ లాభపడలేదు. కాంగ్రెస్ అధిష్ఠానం వైఖరి ఎట్లా ఉన్నా, ఉద్యమంలో తెలంగాణ కాంగ్రెస్ మమేకం కాలేదనే చెప్పాలి. ఎంపీలు మాత్రం తమ గొంతును బలంగా వినిపించారు. ఒకరిద్దరు తప్ప, రాష్ట్ర మంత్రులు చివరిదాకా పదవుల్లో ఏదో సాకుతో కొనసాగుతూ వచ్చారు. ఉద్యమంతో తెలంగాణ కాంగ్రెస్‌కు బలమైన సంబంధం లేకపోవడం ఇప్పటికీ ఆ పార్టీ ధోరణుల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది.



కేసీఆర్‌కు లాగానే, రేవంత్ రెడ్డికి కూడా తెలంగాణ ముఖ్యమంత్రిత్వం ఒక అరుదైన, చారిత్రక అవకాశం. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చవలసిన కర్తవ్యంతో కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. ఉద్యమ ఆకాంక్షలను పరిపూర్తి చేయడంతో పాటు, కేసీఆర్ దోషాలను సవరించవలసిన కర్తవ్యంతో రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారు.

పదేళ్ల టీఆర్ఎస్ పాలన ప్రజలకు నిరాశనే మిగిల్చింది. కూటమి ఏర్పాటులో కాంగ్రెస్ తప్పిదం చేయకపోతే, 2018లో కూడా టీఆర్ఎస్‌కు అంతటి ఘనవిజయం దక్కకపోయేది. ఓటర్లు మరో దఫా అవకాశమిచ్చారు. కానీ, అందుకు పశ్చాత్తాపపడే పరిస్థితులు ఏర్పడి, 2023లో బీఆర్ఎస్‌ను ప్రతిపక్షానికి పంపారు. ఈ నిర్ణయం తీసుకోవడం తెలంగాణ ప్రజలకు బాధాకరమైనదే. ఉద్యమంతో పాటు నడచిన పార్టీని, నాయకుడిని నిరాకరించడమంటే అది పెద్ద నిర్ణయం. కానీ, ఉద్యమ ఆకాంక్షలకు పరిపాలనకూ పొంతన లేకపోవడం, జన నాయకుడిగా ఉండవలసిన నేత, అందని అందలం మీద కూర్చోవడం ప్రజలను బాధించింది. సమాజంలోనేకాదు, పార్టీలోకూడా ప్రజాస్వామ్యం లేకపోవడం ప్రస్ఫుటంగా కనిపించింది. తెల్లారుతుందనుకున్న తెలంగాణ బతుకు నడిరాతిరిలోనే నిలిచిపోయింది. అసంతృప్తి, అసమ్మతి వ్యతిరేకతగా పరిణమించాయి. తరువాతి కథ తెలిసిందే.

కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన కొత్తలో కలిసినప్పుడు ప్రొఫెసర్ హరగోపాల్ ఆయనకు ఒక మాట చెప్పారట. "కేసీఆర్ గారూ, మీకు చరిత్ర గొప్ప అవకాశం ఇచ్చింది. చాలా అపురూపమైన అవకాశం. సత్పరిపాలన అందించి, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి" అని. కేసీఆర్ ఆ సలహాకు తగ్గట్టు నిలబడలేకపోయారని హరగోపాల్ బాధపడుతూ ఉంటారు. కేసీఆర్ వైఫల్యం ఎనుముల రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కాగలగడానికి ఒక ముఖ్యమైన కారణం. కానీ, అదే ఏకైక కారణం కాదు. తెలంగాణ సమాజంలో బీఆర్ఎస్‌పై పెరుగుతున్న విముఖతను, ప్రత్యామ్నాయానికి ఉన్న అవకాశాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా రేవంత్ రెడ్డి తనను తాను సన్నద్ధం చేసుకోగలిగారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న ఇతర నేతలు కానీ, భారతీయ జనతాపార్టీ కానీ ప్రతిపక్షపాత్రను సమర్థంగా నిర్వహించలేదని కాదు. తనకు ఎదురెవ్వరూ లేని వాతావరణాన్ని కేసీఆర్ సృష్టించుకుని, అదే తనకు భద్రత అనుకున్నారు. కానీ, అదే ఒక భర్తీ చేయవలసిన శూన్యాన్ని కూడా సృష్టించింది. కేసీఆర్ పాలనమీద ఆయనకు దీటైన రీతిలో దూకుడుగా, ఒక్కొక్కసారి మొరటుగా కూడా మాట్లాడడమే ఫలితం ఇస్తుందని భావించి రేవంత్ అందుకు తగ్గట్టు తన ప్రయాణం సాగించారు. టీడీపీని వీడి, కాంగ్రెస్‌లోకి వచ్చిన కొంతకాలానికే పీసీసీ అధ్యక్ష స్థానం లభించిందంటే అందుకు అధిష్ఠానం ఆశీస్సులు కారణం. తెలంగాణలో బలమైన సామాజిక వర్గానికి చెందడం, వయోధికుడు కాకపోవడం ఆయనకు అదనపు యోగ్యతలయ్యాయి. బీఆర్ఎస్ విమర్శిస్తున్నట్టు, తెలంగాణ ఉద్యమంతో పరిమితమైన అనుబంధమే ఉన్నప్పటికీ, దాన్ని ఎట్లా అధిగమించాలో ఆయనకు కొన్ని సొంత ఆలోచనలు ఉన్నాయి. గద్దర్‌తో నాడు మెలగిన, కోదండరామ్‌తో నేడు మెలగుతున్న తీరు తన నాయకత్వంలోని పాలనకు ఉద్యమస్ఫూర్తి జోడించగలవని రేవంత్ నమ్ముతున్నారు. కేసీఆర్ పాలనలో లోపించిన ముఖ్యమైన దినుసు ఏదో గ్రహించబట్టే, ఆయన పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీలకు తోడు ఏడోదిగా ప్రజాస్వామ్యాన్ని హామీ ఇచ్చారు. అది ఎంతవరకు నెరవేరుతుందన్నది తెలంగాణ పౌరసమాజం గమనిస్తూ ఉన్నది. అలాగే, తాజాగా, రాష్ట్రగీతం, రాష్ట్ర చిహ్నాల విషయంలో ఏర్పడిన వివాదం ఉద్యమ విలువలకు సంబంధించిన చర్చను రేవంత్ పాలనలో మొదటిసారిగా ముందుకు తెచ్చింది.

కేసీఆర్‌కు లాగానే, రేవంత్ రెడ్డికి కూడా తెలంగాణ ముఖ్యమంత్రిత్వం ఒక అరుదైన, చారిత్రక అవకాశం. ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చవలసిన కర్తవ్యంతో కేసీఆర్ అధికారంలోకి వచ్చారు. ఉద్యమ ఆకాంక్షలను పరిపూర్తి చేయడంతో పాటు, కేసీఆర్ దోషాలను సవరించవలసిన కర్తవ్యంతో రేవంత్ ముఖ్యమంత్రి అయ్యారు. కేసీఆర్‌కు లేని అదనపు భారాలు రేవంత్ రెడ్డికి ఉన్నాయి. ఎన్నికల హామీలను పూర్తి చేయడంలో ఉండే ఆర్థిక బాధలు సరే. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వ రాజకీయ స్థిరత మీద ప్రభావం చూపే అవకాశం ఉంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే, రేవంత్ మీద కేంద్రం నుంచి, కేంద్ర ఏజెన్సీల నుంచి రకరకాల ఒత్తిళ్లు మొదలవుతాయి. గోడదాటుకు సిద్ధంగా ఉన్న బీఆర్ఎస్ శాసనసభ్యులు, తమ గమ్యాన్ని కాంగ్రెస్ వైపు కాక, బీజేపీ వైపు మార్చుకుంటారు. ఒకవేళ మోదీయేతర ప్రభుత్వం వస్తే కొంత ఊరట ఉంటుంది. ఇవన్నీ కాక, కాంగ్రెస్‌లో సహజమైన ఇంటిపోరు ఉండనే ఉంటుంది. ఇవన్నీ ఉన్నప్పటికీ, తెలంగాణ సమాజానికి నెరవేర్చవలసిన బాధ్యతల విషయంలో ఏ మాత్రం అలసత్వం సాధ్యపడదు.

విజయం మీద కాంక్ష, అపజయం అంటే భయం, ఈ రెండూ నాయకుడికి అవసరమైన లక్షణాలు. ఎంతో కొంత కీర్తి లాలస ఉండాలి, అదే సమయంలో అపకీర్తికాంక్ష ఉండకూడదు. సాధారణ రాజకీయ నాయకుడినైనా ఉత్తమ శ్రేణికి తీసుకువెళ్లగలిగే గుణాలు అవి. ప్రాంతీయ వనరుల ఆధారంగా అభివృద్ధి, ప్రాంతీయ మానవవనరులకు ఆలంబన, ఈ రెండూ టీఆర్ఎస్ ప్రభుత్వం అలక్ష్యం చేసిన లక్ష్యాలు. ప్రభుత్వాలు ఇవ్వగలిగిన ఉద్యోగాలకు మించినది తెలంగాణ ఉపాధిసమస్య. కార్పొరేట్ కంపెనీలకు భూములు లైసెన్సులు ఇవ్వడానికి మించినది తెలంగాణ అభివృద్ధి అంశం. సకలరంగాలలో తెలంగాణ అభివృద్ధిని స్వప్నించి, మార్గాలు అన్వేషించి, ప్రతిపాదనలు సిద్ధంచేసిన శాస్త్రవేత్తలు, నిపుణులు ఎందరో ఉద్యమంలో పాల్గొన్నారు. వారికి విధానరచనలో భాగస్వామ్యం ఇవ్వాలి. వ్యవసాయాది రంగాల సంక్షోభ పరిస్థితులను అధ్యయనం చేసి పరిష్కారాలు వెదకాలి. సాంస్కృతికరంగంలో తెలంగాణ తనానికి పెద్దపీట వేయాలి. గత ప్రభుత్వంలో జరిగిన మంచిపనులన్నిటినీ కొనసాగించాలి. కొత్తగా మంచిపేరు తేగలిగిన అనేక పనులను ప్రారంభించాలి. ఓట్ల ఆధారిత పథకాలు కాక, నిలకడైన అభివృద్ధికి సానుకూలతలు కల్పించాలి. చేయాలనుకోవాలే కానీ, మరో ఉద్యమమే చేయవచ్చు! ప్రజానుకూల పునర్నిర్మాణోద్యమం!!

రేవంత్ రెడ్డి లక్ష్య సాధకుడు. లేకపోతే, ఇంత స్వల్పకాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కాలేరు. ఆ లక్ష్యాలు వ్యక్తిగతం మాత్రమే కాకుండా, సామాజికం కూడా అయి ఉంటే, ఆయననుంచి మంచి ఫలితాలు ఆశించవచ్చు.

రేవంత్ పాలన మొదలయి ఎంతో కాలం కాలేదు. వ్యక్తిత్వ విశేషాలు, ప్రాధాన్యాలు ఏమిటో పూర్తిగా తెలియవు. ఎన్నికల పర్వం ముగిసిన తరువాత, రాజకీయ సంవాదాలు సద్దుమణిగిన తరువాత ఆయన మరింత పరిణతితో, గాంభీర్యంతో కనిపించవచ్చు. ఒకటి మాత్రం స్పష్టం. రేవంత్ రెడ్డి లక్ష్య సాధకుడు. లేకపోతే, ఇంత స్వల్ప కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కాలేరు. ఆ లక్ష్యాలు వ్యక్తిగతం మాత్రమే కాకుండా, సామాజికం కూడా అయి ఉంటే, ఆయననుంచి మంచి ఫలితాలు ఆశించవచ్చు.

ప్రభుత్వాచరణను స్వతంత్ర మేధావులు సమీక్షించి, సూచనలు ఇచ్చే వ్యవస్థను ఏర్పాటు చేస్తానని చెప్పిన కేసీఆర్, నోరువిప్పడానికే ఆస్కారం లేకుండా చేశారు. దానితో, నిర్బంధంలోనో, స్వచ్ఛంద మౌనంలోనో తెలంగాణ పౌరసమాజం అణగారిపోయింది. ఇప్పుడు, పది సంవత్సరాల తరువాత కూడా ఇంకా ఫలితాలను 'ఇచ్చే' పాలకుల కోసం నిరీక్షించే స్థితిలో ఉంది. ఇచ్చే, తీసుకునే సంబంధం నుంచి విముక్తమై, తాను సొంతంగా ప్రజాస్వామ్యాన్ని క్రియాశీలంగా ఆచరించాలి. ప్రభుత్వాలకు మంచిచెడ్డల కొలమానాలను అందించాలి. ప్రజాభిప్రాయ నిర్మాత కావాలి!

అజరామరమైన సృజనాసక్తి...!

ఆయనో బహుముఖ ప్రజ్ఞాశాలి. కవి, నవలాకారుడు చిత్రకారుడు– అన్నింటికీ మించి గొప్ప మానవతావాది. సౌమ్యుడు. సహనశీలి, నిబద్ధత, క్రమశిక్షణ కలవారు. గంభీరంగా కనిపించే అతి సున్నిత మనస్కుడు. కుందుర్తిగారింట పుట్టడం వలన శీలా వీర్రాజు గారితో నాకు ఊహ తెలియని రోజుల నుంచీ పరిచయం ఏర్పడింది. తాతగారి ప్రస్తావన ఏది చేయవలసి వచ్చినా శీలావి పేరెత్తకుండా ఉండటం చాలా కష్టం. ఆయన పరిచయమే గర్వకారణమైతే ఇక జీవితాంతం ఆ మనిషి సాన్నిహిత్యం, మమకారం పొందడం ఇంకెంత ఉప్పొంగిపోయే విషయమో కదా.

నాన్న చేయి పట్టుకుని నడుచుకుంటూ వాళ్ళింటికి వెళ్ళిన దారిలో మొక్కలకి మొలిచే చిన్ని కాయలను కోసుకెళితే, వాటిలో అందమైన బొమ్మలను చూపిన మాంత్రికుడు వీర్రాజు. నాకు బాగా గుర్తు– మా నాన్నని ఎవరికైనా భయపడడం నేను చూసానంటే, అది వీర్రాజు గారికే. నాన్న ఉద్యోగంలో పడో, పిల్లలూ సంసారం వలనో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డుల పనులు మర్చిపోతూ ఉండేవారు. కానీ వచ్చి మాట్లాడేంత దూరంలోనే ఇల్లున్నా కూడా వీర్రాజు గారు ఆ బాధ్యతను గుర్తుచేస్తూ ఒక ఉత్తరం రాసేవారు. ఫోన్లు లేని రోజుల్లో సరే కానీ, ఫోన్లున్న రోజుల్లో కూడా అంతే. ఆ పోస్టుకార్డు వచ్చిందంటే వీర్రాజు గారికి కోపమొచ్చిందని అర్థం. ఇక ఆపై ఆదివారం నాన్న, వెనుక నేనూ పొద్దున్నే టిఫిన్లు కూడా చేయకుండా వెళ్ళి వారింట్లో వాలిపోయేవారం, సుభద్రాదేవి గారు ఏదోటి పెడతారనే నమ్మకంతో. మా వరకూ ఆయన ఉత్తరం ఓ అల్టిమేటం. బహుశా మా నాన్నకి నాన్న లేని లోటూ, ఒక బాధ్యతాయుతమైన అన్న లేని లోటూ ఆయనే తీర్చారేమో. ఫ్రీవర్స్ ఫ్రంట్ నడపడంలో శీలావీగారి నిబద్ధతా, నిర్వహణ సామర్థ్యం చాలా అసమానమైనవి.



కళను అమ్ముకోవడం ఇష్టం లేక, డబ్బూ పేర్ల కోసం వ్యామోహం లేక, జీవితం ఎన్ని సవాళ్ళు విసిరినా, ఎన్ని సమస్యలని తెచ్చిపెట్టినా, అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని నిలబడిన మనిషి నాకు తెలిసిన శీలా వీర్రాజు గారు. ఆయన సృజనాత్మకత, స్ఫూర్తి, ఉత్తేజం, నిలువెత్తు భావుకత ఈ తరానికీ రానున్న కాలాలకీ ఆదర్శవంతం కావాలి. అందుకే ఆయనకి అడుగడుగునా తోడు నిలిచిన సుభద్రాదేవి 'శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక' ఏర్పాటును ప్రకటించారు.

వీర్రాజు గారు అనేక రచనా ప్రక్రియల్లో నిష్ణాతులు. అందంగా బొమ్మలేసేవారు. కవర్ పేజీలు తయారు చేసేవారు. జ్ఞాపికలు కూడా ఆయన సృజనాత్మకతే. బాపూ ఫాంట్‌లాగా శీలావీ ఫాంట్ కూడా ప్రత్యేకమైనది. ఆయన రంగుల మేళవింపు చాలా బాగుంటుంది. 1939 రాజమండ్రిలో పుట్టిన శీలా వీర్రాజు, 1956లో 'వెలుగు నీడలు' నవల రాసారు. దానినే 2006లో యాభై ఏళ్ళ తర్వాత 'బతుకు బాట' పేరుతో వచన కవిత్వ నవలగా రాసారు. 1957లోనే 'అస్థిపంజరం' కథ రాశారు. అంటే పద్దెనిమిదేళ్ళ వయసన్నమాట. ఆయన కవిత్వం కూడా ఎంతో ప్రయోగాత్మకంగా సాగింది. 'పడుగు పేకల మధ్య జీవితం' (ఆత్మకథ) కూడా రాశారు. 'సమాధి', 'బండి చక్రం', 'హ్లాదిని', 'రంగుటద్దాలు' మొదలైన ఎనిమిది కథా సంపుటాలతో బాటు; 'కొడిగట్టిన సూర్యుడు', 'కిటికీ కన్ను', 'ఎర్రడబ్బా రైలు', 'మళ్ళీ వెలుగు', 'హృదయం దొరికింది' వంటి ఎనిమిది కవిత్వ పుస్తకాలు; 'కాంతి పూలు', 'వెలుగు నీడలు', 'మైనా', 'కరుణించని దేవత' అనే నాలుగు నవలలు రచించారు. ఆయన స్కెచ్ పుస్తకాలను చూడ్డానికి మన రెండు కళ్ళూ చాలవు.

కళను అమ్ముకోవడం ఇష్టం లేక, డబ్బూ పేర్ల కోసం వ్యామోహం లేక, జీవితం ఎన్ని సవాళ్ళు విసిరినా, ఎన్ని సమస్యలని తెచ్చిపెట్టినా, అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొని నిలబడిన మనిషి నాకు తెలిసిన వీర్రాజు గారు. నిరాడంబరతలోనే అసలైన సంతోషం ఉంటుందని నిరూపించిన నిజాయితీపరుడు. అన్నిటికీ మించి తమకున్న అతి కాస్త ప్రతిభకే తెగ విర్రవీగే మనుషులున్న ఈ కాలంలో ఒదిగి ఉండటం వీర్రాజు గార్ని చూసి నేను నేర్చుకున్నాను. ఏదో బతికేయడం కాదు, జీవించడం నేర్చుకున్నాను. ఆయన పోయి అప్పుడే రెండేళ్ళైపోయింది. కానీ ఆయన సృజనాత్మకత, స్ఫూర్తి, ఉత్తేజం, నిలువెత్తు భావుకత ఈ తరానికీ రానున్న కాలాలకీ ఆదర్శవంతం కావాలి. అందుకే ఆయనకి అడుగడుగునా తోడు నిలిచిన శీలావీ సహచరి సుభద్రాదేవి గారు 'శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక'ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన ఎంతో ఇష్టపడే దీర్ఘ కవితా ప్రక్రియకు, చిత్రకళకూ చెరో పదిహేనువేల నగదు పురస్కారం ఇస్తున్నారు. శీలావీని చిరంజీవిగా నిలబెట్టే విధంగా ఆయన ఆశయాలకు ఆమె రూపం ఇస్తున్నారు. పుప్పాల శ్రీరాం రాసిన 'పద్దెనెమిదొందల పద్దెనిమిది' (1818) ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి దీర్ఘ కవిత. అన్వర్ చాలాప్రతిభ ఉన్న చిత్రకారులు. శీలావీ గారు మెచ్చిన గీత ఆయనది. అతని రాత కూడా అద్భుతమైనది. ఈ పురస్కారాలు లబ్దప్రతిష్ఠులకే కాక, కొత్తతరానికి కూడా ఎంతో ప్రేరణ.

శీలావీ జీవితాంతం సాహిత్య, చిత్రకళా రంగాల్లో సమానంగా కృషి చేసారు. అందులో కృషి చేస్తున్న వారిని గుర్తించాలని ఆయన కుటుంబం సంకల్పించింది. యువతరానికి ఇదొక సరికొత్త ప్రోద్బలాన్నీ, ఉత్సాహాన్నీ, ఆశనీ తప్పక ఇస్తుంది. సుభద్రాదేవి, వారి కూతురు పల్లవి, మనవరాలు ప్రశంసనీయులు. 'శీలావీ శిల్పరేఖలు' పుస్తకావిష్కరణతో బాటు సభ కూడా జయప్రదం కావాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను.

• కవిత కుందుర్తి

(నేడు శీలావీ వర్ధంతి – రవీంద్రభారతి కాన్ఫరెన్సు హాల్లో శీలావీ సాహిత్య చిత్రకళా వేదిక ఆవిర్భావ కార్యక్రమం)

ఆత్మగౌరవం ఇప్పుడు గుర్తొచ్చిందా?


రాష్ట్ర గీతం సంగీతం కూర్పు పైనా, రాష్ట్ర చిహ్నం మార్పు చేర్పులపైనా నిరసనలు, విమర్శలు సాగుతున్నాయి. తెలంగాణ ఆత్మగౌరవానికి భంగం కలిగిందని కొందరు మేధావులు వాపోతున్నారు. సహజంగానే రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ పార్టీ నాయకులు విమర్శలకు పూనుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాటు రాష్ట్ర గీతం లేకుండా పరిపాలన కొనసాగించినప్పుడు గాని, రాష్ట్ర చిహ్నం రూపకల్పన ఒనరించినప్పుడు గానీ ఎలాంటి అభ్యంతరాలు తెలియజేయని వారికి ఇప్పుడు తెలంగాణ ఆత్మగౌరవం గురించి మాట్లాడే అర్హతలు ఉన్నయా? తెలంగాణ ఆత్మగౌరవం గురించి ఎన్నడూ మల్లెత్తు రాయని, పల్లెత్తు మాట్లాడని వారు ఇప్పుడు గుండెలు బాదుకుంటున్నారు. నిమ్మకు నీరెత్తినట్టు ఉదాసీనత వహించి, వ్యూహాత్మకంగా మౌనం పాటించి, ఇప్పుడు గౌరవ మర్యాదల గురించి మాట్లాడడం సమంజసమేనా?

ఏ ఆత్మగౌరవం కోసం తెలంగాణ ఉద్యమం సాగి, ప్రాణత్యాగాల అనంతరం రాష్ట్రాన్ని సాధించిందో, అటువంటి అశేష ప్రజల ఆత్మగౌరవం కోసం రాష్ట్ర గీతం ప్రకటించవలసిందేనని ఈ మేధావుల్లో ఏ ఒక్కరూ కూడా గత దశాబ్దంలో ఏ ఒక్కనాడు కూడా నోరు తెరచి అడగలేదు. గత దశాబ్దకాలంలో అన్నం తినడానికి తప్ప నోరు తెరవనివారంతా ఇప్పుడు నిస్సిగ్గుగా మాట్లాడుతుంటే, తెలంగాణవాదులంతా చింతిస్తున్నారు. గతంలో జాగృతి ఆధ్వర్యంలో తెలంగాణేతర నటీమణులతో బతుకమ్మ ఆటలు ఆడించినప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడు ఎందుకు వచ్చిందో?

ఇక, కాకతీయుల స్వాగతతోరణం, చార్మినార్ తెలంగాణ సమాజానికి పాక్షిక ప్రతిబింబాలే కానీ పరిపూర్ణం కానేకావు. కాకతీయరాజులు ప్రజాపాలన కొనసాగించారనుకుంటే పొరపాటు. చెరువులు తవ్వించి, నీటి వసతులను కల్పించినంత మాత్రాన దయాప్రభువులు కాబోరు. సమ్మక్క సారక్కలను హతమార్చిన రక్తచరిత్ర కూడా వారిదే. అలాగే నిజాం పరిపాలన మొత్తం అణచివేతలు, నియంతృత్వం దౌర్జన్యాలతో కూడినదే. నిజాం తాబేదారుల, రజాకార్ల దురాగతాలను కూడా లెక్కలోకి తీసుకోవాలి. రాచకొండ ప్రభువుల వారసులుగా చలామణీ అయిన గత ప్రభుత్వం తెలంగాణ ఆత్మగౌరవాన్ని అడుగడుగునా కించపరచడమే గాక అడపాదడపా అవమానపరిచింది. ఇవన్నీ ప్రజల విస్మృతిలోకి వెళ్లిపోయాయని తెలంగాణ ఆత్మగౌరవవాదులు భ్రమిస్తున్నారు. ధిక్కార స్వరం, పోరాట వారసత్వం, ప్రశ్నించడం, అభిశంసించడం ప్రజల భాష–సంస్కృతుల సమున్నత సమాహారమే తెలంగాణ ఆత్మగౌరవం అవుతుంది తప్ప, రాజకీయ అవసరాలు తీర్చడంలో పావుగా ఎప్పుడూ ఉపయోగపడలేదు. ఉపయోగపడదు.

— జూకంటి జగన్నాథం, కవి, రచయిత

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





రోగుల నిలువు దోపిడీ

స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్ల దందా

- వైద్య పరీక్షల పేరిట ఇష్టారాజ్యం
- టెస్టులకు వాళ్లు పెట్టిందే రేటు
- గుట్టుగా సాగుతున్న లింగ నిర్ధారణ, అబార్షన్లు
- జాడలేని టాస్క్‌ఫోర్స్
- మామూళ్ల మత్తులో వైద్య, ఆరోగ్యశాఖ

వరంగల్ మెడికల్, మే 30 : వైద్య పరీక్షల పేరిట ప్రైవేట్ డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రజలను దోచుకుంటున్నారు. వారు చెప్పిందే రేటు అన్నట్టుగా చెల్లించాల్సి వస్తుండటంతో జనం విలవిల్లాడుతున్నారు. వైద్యుడి మాటను కాదని.. మరో చోట పరీక్షలు చేయించుకునే ధైర్యం లేక ప్రైవేట్ డయాగ్నోస్టిక్ సెంటర్ల నిర్వాహకులు పెట్టిన ఫీజును చెల్లించలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీనంతటికీ వైద్యులు, సెంటర్ల నిర్వాహకుల మధ్య జరిగే కమీషన్ల వ్యవహారమే కారణమన్నది జగమెరిగిన సత్యం. ముఖ్యంగా వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో జరుగుతున్న డయాగ్నస్టిక్, స్కానింగ్ కేంద్రాల దోపిడీపై 'ఆంధ్రజ్యోతి' కథనం.

పుట్టుకొస్తున్న డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లు

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరంలోనే లెక్కలేనన్ని డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లు పుట్టుకొచ్చాయి. ఇవన్నీ ప్రస్తుతం రోగులను పీల్చిపిప్పి చేసే కేంద్రాలుగా మారాయి. తమ లాభాలతోపాటు దళారులకు, రిఫరల్ వైద్యులకు ఇవ్వాల్సిన కమీషన్లను కూడా రోగి నుంచి వసూలు చేస్తున్నారు. దళారీ వ్యవస్థను పెంచి పోషిస్తూ రోగులకు అవసరం లేకపోయినా ఎంఆర్ఐ, సిటీ స్కాన్, ఈఈజీ లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగుల నుంచి వీరు వసూలు చేసే సొమ్ములో 50శాతం కమీషన్లు దళారులకు, రిఫరల్ వైద్యులకు చెల్లిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే ఈ కేంద్రాల్లో పరీక్షల నాణ్యతా ప్రమాణాలు కూడా అంతంత మాత్రమే ఉంటున్నాయని రోగులు వాపోతున్నారు. గుర్తింపు పొందిన సెంటర్లతోపాటు గుర్తింపు లేని సెంటర్లు కూడా వైద్య పరీక్షలు చేస్తున్నా వైద్యఆరోగ్య శాఖ అధికారులు, టాస్క్‌ఫోర్స్ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టాస్క్‌ఫోర్స్ ఎక్కడ?

గుర్తింపులేని సంస్థలతోపాటు అధిక ధరలు వసూలు చేస్తున్న స్కానింగ్, డయాగ్నోస్టిక్ సెంటర్లను గుర్తించేందుకు నియమించిన టాస్క్‌ఫోర్స్ ఎక్కడా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. నగరంలో విచ్చలవిడిగా దోపిడీ జరుగుతున్నా మౌనంగా ఉండటం వెనుక మర్మమేమిటన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సామాన్యుల పక్షాన నిలబడాల్సిన టాస్క్‌ఫోర్స్ దళారులకు అండగా ఉంటుందని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు

పలు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి లింగ యథేచ్ఛగా నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం కఠిన నిబంధనలు రూపొందించినా లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా జరుగుతున్నాయని, పరీక్షలు చేయించుకుంటున్న వారిలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారని సమాచారం. ఈ పరీక్షలు చేసేందుకు ఆర్ఎంపీ లు, పీఎంపీలు సహ కరిస్తున్నారని.. ఒక్కో లింగ నిర్ధారణ పరీక్షకు రూ. 15వేల చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇక లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన అనంతరం అవసరమైతే అబార్షన్లు కూడా చేస్తున్నారని సమాచారం. నగరంలోని కాకాజీ కాలనీ, రాంనగర్, డబ్బాల జంక్షన్, కాశీబుగ్గ, బాలసముద్రం, కాజీపేటలో పలు డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లలో ఈ తతంగం నిత్య కృత్యంగా మారింది. గతంలోనే పలుసందర్భాల్లో వెలుగులోకి వచ్చినా.. మళ్లీ కొత్త సెంటర్లు పుట్టుకొస్తుండటంతో ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నట్టు చర్చ జరుగుతోంది.

మామూళ్ల మత్తులో ఆరోగ్యశాఖ

ప్రైవేట్ డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్ల పనితీరుపై నిరంతరం నిఘా పెట్టాల్సిన వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని, ఆయా సెంటర్ల నిర్వాహకులు ఇచ్చే మామూళ్లకు అలవాటు పడి కళ్లు మూసుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డయాగ్నోస్టిక్, స్కానింగ్ సెంటర్లపై నాణ్యత ధరల విషయంలో నిరంతరం తనిఖీలు చేయకుండా మౌనంగా ఉండటం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అబార్షన్లు చేస్తున్నారని వచ్చిన సమాచారంతో పలు సెంటర్లపై దాడులు చేసిన అధికారులు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని, చట్టాలను పకడ్బందీగా అమలు చేసి నిబంధనలను తుంగలో తొక్కుతున్న ఆయా సెంటర్ల నిర్వాహకులపై నిఘా పెట్టి.. పటిష్ఠ చర్యలు తీసుకోకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పట్టుబడినా శిక్షలు లేవు..

గతేడాది మార్చి 23వ తేదీన వరంగల్ దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో మొబైల్ స్కానింగ్ మిషన్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. అలాగే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించి.. ఓ వైద్యురాలు, నర్సుపై కేసులు నమోదు చేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. ఇదే తరహాలో హనుమకొండ కాకాజీకాలనీ ప్రాంతంలో కూడా లింగ నిర్ధారణ కోసం స్కానింగ్‌లు నిర్వహిస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు కేసులు నమోదు చేశారు. కానీ ఇలా పట్టుబడుతున్న వారికి శిక్షలు పడకపోతుండటంతో.. ఆయా ఘటనల్లో దొరికిన వారు తిరిగి ఇదే దందాను మరోచోట నిర్వహిస్తున్నట్టు వైద్య, ఆరోగ్యశాఖ తనిఖీల్లో వెల్లడవుతోంది. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప ఈ దోపిడీకి అంతం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కౌంటింగ్ సరళిపై అవగాహన అవసరం

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని

వరంగల్ కార్పొరేషన్, మే 31: లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ సరళిపై సిబ్బందికి అవగాహన కలిగి ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే కంప్యూటర్ ఆపరేటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పలు సూచనలు చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి సంబంధించి 230 పోలింగ్ కేంద్రాలకు గాను 14 టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు. 16 రౌండ్లలో ఒక్కో టేబుల్ చొప్పున 14 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు జరుగుతుందని చెప్పారు. కౌంటింగ్ సమయంలో గ్రీన్, పింక్ పేపర్‌లు సీల్‌ను తీసే క్రమంలో ఏజెంట్లకు తప్పకుండా చూపించిన తర్వాతనే కౌంటింగ్ ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో పనిచేస్తున్న సిబ్బంది క్రమశిక్షణ పాటించాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలోని మొబైల్‌ఫోన్లు అనుమతి లేదని, ఎవరైనా అనివార్యంగా తీసుకువస్తే కౌంటింగ్ కేంద్రం బయట ఉంచే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ విధానంలో నిబంధనలు ఉల్లంఘించినట్లైతే సెక్షన్-128 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు నాగేశ్వర్‌రావు, ఇక్బాల్, ఎన్నికల డీటీ సుభాష్, మాస్టర్ ట్రెయినీలు సందీప్‌కుమార్, నాగరాజు, నాగేశ్వర్‌రావు, రమేష్‌లు ఉన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

- వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ హెచ్చరిక



విత్తన డీలర్ల అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝూ

వరంగల్ కలెక్టరేట్, మే 31: రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై పీడీ యాక్ట్ నమోదుచేస్తామని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విత్తన డీలర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ.. విత్తన డీలర్లు వ్యవసాయ, పోలీసు శాఖలకు సహకరించాలన్నారు. విత్తనాలు లూజుగా అమ్మితే జరిమానాతోపాటు, శిక్షకు కూడా గురికావాల్సి వస్తుందన్నారు. బీటీ-3 విత్తనాలను ప్రభుత్వం నిషేధించిందని, వాటిని ఎవరూ విక్రయించొద్దని స్పష్టం చేశారు. ఇప్పటికే జిల్లాలో ఇద్దరిపై కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీలు అబ్దుల్ బారీ, రవీందర్, ఏసీపీలు తిరుపతి, కిరణ్ కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉషా దయాల్, వ్యవసాయశాఖ అధికారులు, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

విత్తన విక్రయ దుకాణాల తనిఖీ

వరంగల్ నగరంలోని దేవి సీడ్స్, గణపతి, పున్నమి, సీతారామ తదితర విత్తన విక్రయ దుకాణాలల్లో శుక్రవారం కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్స్ దుకాణంలోని కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లను, విత్తనాల ప్యాకెట్లను, నిల్వ స్టాక్‌ను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మకూడదని, మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, కొనుగోలు, అమ్మకాలపై స్టాక్ రిజిస్టర్ నిర్వహించాలన్నారు. రైతులు కూడా కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదులను భద్రపర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి ఉషాదయాల్, ఏడీఏ సురేశ్, ఏఓలు విజ్ఞాన్, సారంగం, తహసీల్దార్ ఇక్బాల్ పాల్గొన్నారు.

కాకతీయ కళాతోరణం తొలగిస్తే
మరో ఉద్యమమే..

- తోరణం రాజసానికి, సుపరిపాలనకు గుర్తు
- సీఎం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్
- కాళోజీ జంక్షన్ వద్ద నిరసన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న వినయభాస్కర్

కాళోజీ జంక్షన్, మే 31: కాకతీయ కళాతోరణం రాష్ట్ర అధికారిక చిహ్నం నుంచి తొలగిస్తే మరో ఉద్యమం చేస్తామని మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయభాస్కర్ హెచ్చరించారు. శుక్రవారం హనుమకొండలోని కాళోజీ జంక్షన్ వద్ద టార్చ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వినయభాస్కర్ మాట్లాడుతూ.. కాకతీయ కళాతోరణం రాచరికానికి గుర్తు అని వ్యాఖ్యలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ అజ్ఞాని అన్నారు. తెలంగాణ చరిత్రను రూపుమాపాలని చేస్తున్న కుట్రలను తిప్పికొడతామన్నారు. చరిత్ర గుర్తులను తొలగిస్తుంటే వరంగల్ మంత్రులు సురేఖ, సీతక్క వ్యతిరేకించకపోవడం సిగ్గుచేటన్నారు. టెంపుల్, ట్యాంక్స్, టౌన్స్ విధానంతో కాకతీయులు జనరంజక పాలన అందించారని వినయభాస్కర్ తెలిపారు. కాకతీయ కళాతోరణం తొలగిస్తే 800 ఏండ్ల కాకతీయ రాజుల చరిత్రను తీసేసిన ద్రోహులుగా మిగులుతారని ఆయన పేర్కొన్నారు. అధికారిక చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగించి ప్రజల నుంచి కేసీఆర్‌ను దూరం చేయాలనే దురాలోచనలో ముఖ్యమంత్రి ఉన్నారని ఆయన ఆరోపించారు. ఎవరితో చర్చించకుండానే రేవంత్‌రెడ్డి ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నాడని ఆయన విమర్శించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలను వ్యతిరేకిస్తుంటే కేసులు పెడుతున్నారని, కేసులకు బెదిరేదిలేదన్నారు. నిజమైన కాంగ్రెస్ వాదులు రేవంత్‌రెడ్డి నిర్ణయాన్ని వ్యతిరేకించాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు. లేదంటే ఉద్యమిస్తామని వినయభాస్కర్ హెచ్చరించారు.

బీఆర్ఎస్‌ది రాజకీయ రాద్ధాంతం

- కాకతీయ కళా తోరణంపై ఇంకా ఏ నిర్ణయం జరగలేదు..
- కాకతీయ ఉత్సవాలను విస్మరించింది బీఆర్ఎస్ నేతలే..
- వరంగల్‌ను ముక్కలు చేసినప్పుడు ఏం చేశారు?
- 3న ఉద్యమకారులకు సన్మానం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, మే 31: తెలంగాణ రాష్ట్ర రాజముద్రలో కాకతీయ కళా తోరణం అంశాన్ని బీఆర్ఎస్ రాజకీయ రాద్ధాంతం చేస్తోందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం హనుమకొండ నయీంనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. కాకతీయ కళా తోరణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ విషయానికి సంబంధించి తమ అభిప్రాయాలను కూడా ముఖ్యమంత్రికి తెలియచేశామన్నారు. కాకతీయ కళాతోరణం విషయంలో రాద్ధాంతం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు కాకతీయ ఉత్సవాలను ఎందుకు నిర్వహించలేదని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. వరంగల్ జిల్లాను ఆరు ముక్కలుగా చేస్తున్న సమయంలో జిల్లా బీఆర్ఎస్ నేతల నోళ్లు ఎందుకు మూతపడ్డాయని ప్రశ్నించారు. హంటర్ రోడ్డులోని టైర్ రిట్రేడింగ్ సెంటర్, సెంట్రల్ జైలు ఇతర జిల్లాలకు తరలినప్పుడు. జోనల్ వ్యవస్థ విషయంలో బీఆర్ఎస్ నేతలు కళ్లప్పగించి చూశారంటూ మండిపడ్డారు.

ఈ నెల 3వ తేదీన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని తెలంగాణ ఉద్యమకారులను సన్మానించనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఉదయం 10:30 గంటలకు హంటర్‌రోడ్డులోని డీ-కన్వెషన్ హాలులో సన్మాన కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమ నిర్వహణ కమిటీ చైర్మన్‌గా రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ వ్యవహరించనున్నట్లు తెలిపారు. పశ్చిమ పరిధిలోని ఉద్యమకారులను సన్మానించి వారి పాత్ర, త్యాగాలను స్మరించనున్నట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమకారులను గౌరవించడం, పోరాటాన్ని మననం చేసుకోవడం బాధ్యతగా గుర్తించి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 2వ తేదీ వరకు హనుమకొండ బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఉద్యమకారుల వివరాల సేకరణ ఉంటుందన్నారు. ఉద్యమకారులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చని రాజేందర్‌రెడ్డి సూచించారు.

రాజకీయాలకు అతీతంగా కార్యక్రమ నిర్వహణ

వరంగల్ పశ్చిమ పరిధిలోని ఉద్యమకారుల సన్మాన కార్యక్రమం రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కమిటీ చైర్మన్ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ చెప్పారు. ఉద్యమకారులను గుర్తించడంలో తమకు సహకరించేందుకు సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టు నారాయణరెడ్డి, వివిధ సంఘాల ప్రతినిధులు పుల్లూరు సుధాకర్, గోపాల్‌రెడ్డి, చిల్లా రాజేంద్రప్రసాద్, జైసింగ్ రాథోడ్, తోట పవన్, బోడ డిన్నా, దారం జనార్దన్, వలీ ఉల్లాఖాద్రీ, రహీమున్నీసా బేగం, మంద వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

వడగాలులతో విలవిల

- 45.8 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రత
- మరో వారం రోజుల వరకు ఇదే పరిస్థితి



వడగాలులకు చెవులకు చేతులను అడ్డుపెట్టుకుంటున్న వాహనదారుడు

హనుమకొండ, మే 31 (ఆంధ్రజ్యోతి): భానుడు రోజు రోజుకూ మరింత భగ్గుమంటున్నాడు. ఎండవేడికి జనం తట్టుకోలేకపోతున్నారు. వడగాలులతో విలవిలలాడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండ తీవ్రత మరింత పెరిగింది. శుక్రవారం ములుగులో అత్యధికంగా 45.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో 14 జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రత 45.1 డిగ్రీలపైనే రికార్డయింది. మంచిర్యాలలో అత్యధికంగా 47.1 డిగ్రీలకు చేరుకున్నది., తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రత నమోదైన జిల్లాలో ములుగు తొమ్మిదో స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 45.5 డిగ్రీలు, హనుమకొండలో 44.6 డిగ్రీలు, మహబూబాబాద్‌లో 44.6 డిగ్రీలు, వరంగల్‌లో 44.6 డిగ్రీలు, జనగామలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. గురువారం కన్నా ఒక 1.8 డిగ్రీలు పెరిగింది.



ఎండకు తాళలేక గూడూరు మండలం సీతానాగారంలో ఓ చెట్టు నీడన సేద తీరుతున్న మేకలు, కాపలాదారులు

ఉదయం 8 గంటలకే సూరీడు నిప్పులు చిమ్ముతున్నాడు. పగలు బయటకు వెళ్లినవారికి చుక్కలు కనిపిస్తున్నాయి. పది, పదకొండు ప్రాంతంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. మధ్యాహ్నం రోడ్లపై జనం సంచరించడం లేదు. సాయంత్రం దాకా ఎండ తీవ్రత కొనసాగుతోంది. నిప్పుల కొలిమి తలపించేలా వాతావరణం మారిపోతోంది. రోజంతా తీవ్రమైన ఎండలతో ఉక్కపోతతో జనం తల్లడిల్లుతున్నారు. రాత్రి కూడా వేడి తగ్గడం లేదు. మళ్లీ ఉదయమే ఎండ మొదలవుతోంది. దీంతో రాత్రిపూట చాలామంది నిద్రకుదూరమవుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు నిరంతరం నడుస్తూనే ఉక్కపోత ఇబ్బంది పెడుతూనే ఉంది. ఎండ వేడితో చాలా మంది నీరసించిపోతున్నారు. వడదెబ్బకు గురవుతున్నారు. రానున్న నాలుగు రోజుల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉష్ణోగ్రత 48 డిగ్రీలకుపైనే నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యే ప్రమాదం ఉన్నందువల్ల ఈ నాలుగు రోజులు బయట తిరగరాదని హెచ్చరిస్తున్నారు. విద్యుత్, ఎలక్ట్రానిక్ వస్తువులు వేడికి పేలిపోయే ప్రమాదం ఉన్నందువల్ల వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.



పన్నుల వసూళ్లకు సిబ్బంది నియామకం

వరంగల్ కార్పొరేషన్, మే 31: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు సంబంధించిన ఎలాంటి బిల్లులు వసూలు చేసే అర్హత ఔట్‌సోర్సింగ్ బిల్ కలెక్టర్లు, ప్రైవేటు ఉద్యోగులకు లేదని సీడీఎంఏ హైదరాబాద్ నుంచి వరంగల్ బల్దియా కార్యాలయానికి సర్క్యులర్ అందిన విషయం తెలిసిందే. కాగా రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మునిసిపల్ కార్యాలయాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వసూలు చేసిన డబ్బులను స్వప్రయోజనాల కోసం వాడుకుని చేతులెత్తేసినట్లు హైదరాబాద్‌కు ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశాల మేరకు బల్దియా పరిధిలో పన్నులు వసూలు చేస్తున్న సిబ్బందిని తొలగించారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్‌లలో డివిజన్‌కు ఒకరి చొప్పున 66 మంది, ఈ సేవా కేంద్రాలలో బిల్లులు వసూలు చేసేందుకు 10 మందిని నియమిస్తూ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల రెవెన్యూ విభాగంలో పని చేసి వీఆర్ఏలు, వీఆర్‌వోలుగా పని చేసిన వారిని ప్రభుత్వం పలు మున్సిపాలిటీలకు నియమించింది. కాగా, కొత్తగా నియమించబడిన వారు బిల్ కలెక్టర్లు, ఈ సేవా కేంద్రాల్లో వార్డు అధికారులుగా పని చేస్తారు. కాగా, కమిషనర్ నియమించిన వారి పేర్లతో కూడిన జాబితాను అధికారికంగా విడుదల చేశారు. అయితే తొలగించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మొదట ఏ విభాగంలో నియమించబడ్డారో అదే స్థానానికి పంపిస్తారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇందుకు ఎక్కువ మంది శానిటేషన్ విభాగంలో పీహెచ్ (పబ్లిక్ హెల్త్) వర్కర్లు ఉండడంతో తేలు కుట్టిన దొంగల్లా కొట్టుమిట్టాడుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో పాల్గొనండి..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా


ఉద్యోగ విరమణ పొందిన అధికారులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మే 31: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. శుక్రవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్ఐ మునీరుల్లా, ఏఎస్ఐలు సమ్మెలాల్, శ్యామ్‌సుందర్, సమ్మయ్య, హెడ్‌కానిస్టేబుల్ యాకూబ్‌రెడ్డిలను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. కుటుంబసభ్యులు ఇచ్చిన సహకారంతో పోలీసులు వారి విధుల్లో రాణిస్తున్నారని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందిన అనంతరం ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం, యోగం సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ శుభం నాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీధర్, స్వర్ణన్‌రాజ్, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌కుమార్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేశ్‌కుమార్



హసన్‌పర్తి, మే 31: దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన రౌతు రమేశ్‌కుమార్ నియమితులయ్యారు. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో జరిగిన డీబీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో రమేశ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాకు చెందిన వారికి ప్రాధాన్యం కల్పించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చుంచు రాజేందర్ (దేవన్నపేట), రాష్ట్ర కమిటీ సభ్యులుగా బొర్ర సంపూర్ణ (హసన్‌పర్తి), మేకల అనిత (హసన్‌పర్తి), భిక్షపతి, కొమ్ముల కరుణాకర్, సురేష్, విజయకు స్థానం కల్పించారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న బడిబాట కార్యక్రమంలో డీబీఎఫ్ భాగస్వామ్యం ఉంటుందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలు, విద్యా చైతన్య ఉద్యమాలను చేపడుతామన్నారు. తన నియామకానికి సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి


ఐలయ్య (ఫైల్)

చెన్నారావుపేట, మే 31: వడదెబ్బతో వృద్ధుడు గురువారం రాత్రి మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. పల్లకొండ ఐలయ్య(75) వడ పందుల కాపరిగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. భార్య గతంలోనే చనిపోగా, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే గురువారం పందులను మేపడానికి ఆరు బయటకు తీసుకెళ్లాడు. రోజంతా ఎండలోనే ఉన్నాడు. సాయంత్రం ఇంటికి రాగా తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు, విరోచనాలు కావటంతో కుటుంబ సభ్యులు స్థానిక వైద్యుడి వద్దకు తరలించారు. అనంతరం ఆస్పత్రి తరలించేందుకు యత్నిస్తుండగా అప్పటికే మృతిచెందాడు. బాధిత కుటుంబానికి ఏకలవ్య సంఘం బాధ్యులు రూ.3 వేలను ఆర్థికసాయం అందించారు. మండల అధ్యక్షుడు పులిచేరు జంపయ్య, ప్రధాన కార్యదర్శి పల్లకొండ తిరుపతి, కార్యదర్శి రాయపురి శ్రీను, పల్లకొండ కుమారస్వామి, వెంకటేష్, మల్లయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.











తెలంగాణ బలి దేవత కాంగ్రెస్సే

- వందలాది మంది అమరులయ్యింది ఆ పార్టీ వల్లే...
- అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది?
- కాంగ్రెస్ పదేళ్ల తాత్సారం వల్లే కదా బలి దానాలు: కేటీఆర్



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో వందలాది మంది అమరులయ్యింది ఎవరి వల్ల? అమరుల స్థూపం ఎవరి వల్ల నిర్మించాల్సి వచ్చింది.. గతంలో రేవంత్‌రెడ్డి చెప్పినట్లు తెలంగాణ బిడ్డల్ని చంపిన బలి దేవత ఎవరు...? అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు ప్రశ్నించారు. 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌ను ఆయన శుక్రవారం విమర్శించారు. 1952లోనే ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది, 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మంది తెలంగాణ బిడ్డల్ని కాల్చి చంపింది అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాదా..? అని నిలదీశారు. 1971 పార్లమెంట్ ఎన్నికల్లో 11/14 సీట్లలో తెలంగాణ ప్రజా సమితి పార్టీని గెలిపిస్తే ఆ పార్టీని మాయం చేసింది, దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజాస్వామికంగా తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. 2004లో మాట ఇచ్చి, పదేళ్ల తాత్సారం చేసి వందలాది మంది తెలంగాణ బిడ్డలు ఆత్మ బలి దానం చేసుకునే దుస్థితికి కారణమైంది అప్పుడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్సేనని కేటీఆర్ ఆరోపించారు.

తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తేజం పేరిట కేసీఆర్(కేశవ చంద్ర రమావత్) సినిమా కోసం రూపొందించిన పాటను మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. నటుడు రాకింగ్ రాకేష్ నిర్మించిన కేసీఆర్ సినిమాలోని ఆ పాటను శుక్రవారం నంది నగర్‌లోని కేసీఆర్ నివాసంలో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో ఎంపీ డి.దామోదర్ రావు, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మధుసూదనాచారి, సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, యాంకర్ జోర్దార్ సుజాత, సింగర్ విహ, గీత రచయిత సంజయ్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం ర్యాలీ జరగనుంది. రాష్ట్ర అవతరణ వేడుకలను బీఆర్ఎస్ పార్టీ మూడు రోజులు పాటు నిర్వహించాలని నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్ నుంచి అసెంబ్లీ ఎదుట ఉన్న అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతోపాటు ఆ పార్టీకి చెందిన ముఖ్య నేతలంతా పాల్గొంటారు.

ట్యాపింగ్ వ్యవహారంలో కేసీఆర్‌పై దుష్ప్రచారం

- టీవీ, యూట్యూబ్ చానళ్లపై పోలీసులకు బీఆర్ఎస్ ఫిర్యాదు

బంజారాహిల్స్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్ పాత్ర లేకపోయినప్పటికీ కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు ఉద్దేశ్యపూర్వకంగా ఆయన పేరును బదనాం చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ పార్టీ నేతలతో కలిసి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ప్రభుత్వం కోరినట్టు ఇంటెలిజెన్స్ ఇతర విభాగాల అధికారులు నివేదికలు ఇచ్చారు తప్పితే ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేసీఆర్ పాత్ర ఉన్నట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. అరెస్టయిన పోలీసు అధికారులు వాంగ్మూలం ఇచ్చారంటూ కేసీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని కొన్ని టీవీ, యూట్యూబ్ చానళ్లు కేసీఆర్ పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా విష ప్రచారం నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

- ప్రజా సమస్యలు వదిలి.. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్షలా?
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్ రాజకీయాలు చేస్తున్నాయని.. దేశంలో శత్రువులుగా ఉంటున్న ఆ రెండు పార్టీలు తెలంగాణలో మిత్రులుగా వ్యవహరిస్తున్నాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై బీజేపీ దీక్ష చేపట్టడంపై శుక్రవారం ఆయన స్పందించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా ఫోన్‌ట్యాపింగ్‌పై దీక్ష చేయడం వెనుక ఉద్దేశం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, విపక్ష నాయకుల ఫోన్ల మీద కేంద్రం పెగాసస్ వాడిందన్న ఆరోపణలపై విచారణకు ఎందుకు డిమాండ్ చేయలేదో రాష్ట్ర బీజేపీ నాయకులు చెప్పాలన్నారు.

రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే నకిలీ మద్యం: క్రిశాంక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో నకిలీ మద్యం అమ్ముతున్నారని సీజ్ చేసిన సోమ్ డిస్టిల్లరీస్ కంపెనీని రాష్ట్రాన్ని లూటీ చేసేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడకు తెస్తోందని బీఆర్ఎస్‌నేత మన్నె క్రిశాంక్ ఆరోపించారు. మధ్యప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ విభాగానికి ఈ బీరు కంపెనీ.. రూ.575 కోట్ల రుణాన్ని ఎగవేసిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత శాఖ వాస్తవాలు తెలుసుకోకుండా అటువంటి సంస్థకు ఎలా అనుమతిచ్చారని మంత్రి జూపల్లిని ప్రశ్నించారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ వాయిదా వేయండి: ఆర్ఎస్పీ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష ఈ నెల 9న నిర్వహించొద్దని, ఆ పరీక్షను వాయిదా వేయాలని ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నేత ఆర్.ఎస్ ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) పరీక్ష కూడా ఉందని, చాలా మంది నిరుద్యోగులు ఐబీ పరీక్ష రాస్తున్నారని, ఎన్నికల కారణంగా పలువురు ప్రభుత్వ ఉద్యోగులు గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు సన్నద్ధం కాలేదని తెలిపారు. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని పరీక్షను నెలరోజులు వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

జోరుగా నిషేధిత బీటీ పత్తి విత్తనాల విక్రయాలు

- రెండు ముఠాలకు చెందిన ఐదుగురి అరెస్ట్



మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న నిషేధిత పత్తివిత్తనాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నిషేధిత బీటీ పత్తివిత్తనాలను విక్రయిస్తున్న రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని మహేశ్వరం ఎస్‌వోటీ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 1000 కిలోల బీటీ పత్తివిత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పత్తివిత్తనాల రవాణా జరుగుతోందన్న సమాచారంతో మహేశ్వరం ఎస్‌వోటీ, మాడ్గుల్ పోలీసులు కలిసి బ్రహ్మంపల్లి గ్రామం వద్ద నిఘా పెట్టారు. కారులో నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తున్న రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం కొత్త బ్రాహ్మణపల్లికి చెందిన దుగ్గిపూడి మారెడ్డి (58), అల్లం వినోద్ కుమార్ (42), అల్లం మారెడ్డిని అరెస్ట్ చేశారు. మరో ఘటనలో నాచారంలోని వైష్ణవి అగ్రిటెక్ సంస్థలో పనిచేస్తున్న షాద్‌నగర్‌కు చెందిన ఎర్రదొడ్డి నల్లపారెడ్డి సత్యపాల్‌రెడ్డి (52), కేశంపేటకు చెందిన అన్నపురెడ్డి మల్లారెడ్డి (44)ని అరెస్ట్ చేసి.. వారి నుంచి నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. రెండు ముఠాలకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి సుమారు వేయి కిలోల నిషేధిత పత్తివిత్తనాలు, 5 ఫోన్లు, వేయింగ్ మిషన్, ఓ కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

నేడు గవర్నర్‌ను కలవనునన్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు(శనివారం) కలవనున్నారు. ఉదయం 10 గంటలకు రాజ్‌భవన్‌కు వెళ్లి.. గవర్నర్‌తో సమావేశం కానున్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొనాలని గవర్నర్‌ను సీఎం ఆహ్వానించనున్నారు. కాగా, మహారాష్ట్రలో రుణమాఫీ పథకం అమలు ఎలా జరిగిందనే విషయంపై అధ్యయనానికి రాష్ట్రం నుంచి మహారాష్ట్ర వెళ్లిన అధికారుల బృందం రాష్ట్ర ప్రభుత్వానికి త్వరలో నివేదిక ఇవ్వనుంది.

ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి

(మొదటిపేజీ తరువాయి)



కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా..? కేసీఆర్‌పై చర్య తీసుకోకపోవడానికి కారణమేంటి..? ప్రజలకు రేవంత్ సమాధానం చెప్పాలి" అని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, దానిని కక్కిస్తామని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు ఎందుకు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారో సమాధానం చెప్పాలని నిలదీశారు. ఫోన్ ట్యాపింగ్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంత దిగజారుడు రాజకీయాలకు పాల్పడిందో జైల్లో ఉన్న పోలీసు అధికారుల నేరాంగీకార పత్రాలను పరిశీలిస్తే అర్థమవుతోందని లక్ష్మణ్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌తో వ్యాపారులను హింసించి డబ్బులు వసూలుచేశారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బీఎల్ సంతోష్‌పై పెట్టిన కేసులను పరిశీలించాలని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ డిమాండ్ చేశారు.

రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనున్న రాష్ట్రం

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.2,000 కోట్లు అప్పు తీసుకోనుంది. ఈ మేరకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు శుక్రవారం ఇండెంట్ పెట్టింది. 16 ఏళ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 19 ఏళ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్లను రుణంగా తీసుకోనుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూ.4,000 కోట్ల అప్పు కోసం ఇండెంట్ పెట్టింది. తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని 11 రాష్ట్రాలు రూ.19,500 కోట్ల అప్పుల కోసం ఆర్‌బీఐని ఆశ్రయించాయి. జూన్ 4న జరిగే ఈ-వేలం ద్వారా ఈ అప్పులు తీసుకోనున్నాయి.

కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

- అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోష్‌ను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎస్‌ను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

అక్టోబరులో స్థానిక ఎన్నికలు!

ఒకేసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు.. రుణమాఫీ పూర్తయ్యాకే నిర్వహించే అవకాశం

- అప్పటికి బీసీ రిజర్వేషన్లూ కొలిక్కి తెచ్చే కసరత్తు



హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలతోపాటు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకూ ఒకే సారి ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయడంతోపాటు బీసీ రిజర్వేషన్ల అంశం తేలాకే ఈ ఎన్నికలకు వెళ్లాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలిసింది. వాస్తవానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జూన్‌లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, బీసీ రిజర్వేషన్ల విషయం తేలకపోవడం, కులగణనకు ఇంకా సమయం పట్టే అవకాశం ఉండడంతో తర్జన భర్జన పడుతోంది. కులగణన వివరాల ప్రకారం కాకుండా.. కేవలం ఓటరు జాబితాలో పేర్కొన్న కులాల వారీగా రిజర్వేషన్లను లెక్కగట్టి ఎన్నికలకు వెళ్తే.. కోర్టుల్లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. మరోవైపు ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. రుణమాఫీ పూర్తయితే ప్రజల్లో సానుకూలత పెరుగుతుందని ఆ పార్టీ భావిస్తోంది. అప్పటిలోగా కులగణనపైనా స్పష్టత వస్తుందని, అక్టోబరులో ఎన్నికలను నిర్వహిస్తే బాగుంటుందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

రిజర్వేషన్ల ఖరారుపై సమాలోచన

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా బీసీ రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు జనాభా దామాషా ప్రకారం రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లను కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం ఆయా రాష్ట్రాలు వాటి విచక్షణ మేరకు రిజర్వేషన్లు కల్పిస్తూ ఎన్నికలను జరుపుతున్నాయి. స్థానిక ఎన్నికల్లో బీసీ జనాభా దామాషా మేరకు రిజర్వేషన్లను పెంచాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. అయితే, రిజర్వేషన్లు 50శాతం కంటే మించకూడదని గతంలో సుప్రీం కోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీచేసింది. దీంతో ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ విధానంలో జనాభా దామాషా ప్రకారం పోగా.. మిగిలింది బీసీలకు కేటాయించాల్సి రావడమే సమస్యగా పరిణమించింది. ఈ విధానం కోసమైతే ఓటరు జాబితాను పరిశీలించి, వివరాలు సేకరిస్తే రిజర్వేషన్లను నిర్ణయించవచ్చు. అయితే, అప్పుడు తమకు రిజర్వేషన్ తగ్గిందనే అంశంపై బీసీలు సహా ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం ఎన్నికలపైనా ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 23 శాతానికి తగ్గించింది. ఇదే విధానంలో 2019లో స్థానిక ఎన్నికలను నిర్వహించింది. అప్పుడు కొంతమంది కోర్టుకు వెళ్లడంతో.. ఆ ప్రభుత్వాన్ని కోర్టు ఈ విధానంలో ఎందుకు వెళ్లారంటూ మందలించింది. ఈ ఒక్కసారికి అనుమతించాలని, తరువాత నిర్వహించబోయే ఎన్నికలకు రిజర్వేషన్లను తేల్చి, దాని ప్రకారమే నిర్వహిస్తామని గత ప్రభుత్వం కోర్టుకు చెప్పింది. కానీ, ఆతర్వాత ఇందుకు అవసరమైన చర్యలను తీసుకోకపోవడం ప్రస్తుత ప్రభుత్వానికి సమస్యగా మారింది. మరోవైపు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఖరారు చేయాల్సిన బీసీ రిజర్వేషన్ల అంశంపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన వకుళాభరణం కృష్ణమోహన్ నేతృత్వంలోని పూర్తిస్థాయి డెడికేటెడ్ కమిషన్ (బీసీ కమిషన్) కృషి చేస్తోంది. కుల సంఘాలతో పాటు, నిపుణులు, ప్రొఫెసర్లతో వరుస సమావేశాలను జరుపుతోంది. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగియగానే ఇందుకు సంబంధించిన పలు అంశాలను సీఎంతోనూ చర్చించి, ఒక నివేదికను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. కాగా, ఆగస్టులో ప్రస్తుత బీసీ కమిషన్ పదవీకాలం ముగియనుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కమిషన్‌నే కొనసాగిస్తుందా, లేక కొత్త కమిషన్‌ను నియమిస్తుందా అన్నది తెలియాల్సి ఉంది.

ఒకే సారి నిర్వహిస్తే...

సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు మూడు దఫాల్లో నిర్వహిస్తే.. మూడుసార్లు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. ఇప్పటికే రాష్ట్రంలో గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు ఏదో ఒక ఎన్నిక జరుగుతుండగా.. నెలలపాటు కోడ్ అమల్లో ఉంది. దీంతో ప్రభుత్వ పనులు ఆలస్యమవడంతో పాటు, సామాన్య జనానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఈ పరిస్థితి మళ్లీ పునరావృతం కాకూడదంటే పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఒకే సారి నిర్వహించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది. ఈ మూడు ఎన్నికలకు రిజర్వేషన్ల అంశం ముడిపడి ఉన్నాయని, జూన్ నుంచి ఆగస్టు వరకు సమయం ఉంటే ఈ అంశాన్ని తేల్చేసే అవకాశం ఉంటుందని సర్కారు భావిస్తోంది. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రిజర్వేషన్ల అంశం కొలిక్కి వస్తే.. సెప్టెంబరు లేదా అక్టోబరులో మూడు ఎన్నికలతో గ్రామీణ ప్రాంతాల్లో తీన్ మార్ మోగనుంది.

రూపు మారనున్న మాతా శిశు సంరక్షణ పథకం

కేసీఆర్ కిట్ ఔట్.. ఎంసీహెచ్ కిట్ ఇన్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పేరును ఇప్పటికే రేవంత్ సర్కారు తొలగించింది. దాని స్థానంలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్(ఎంసీహెచ్) కిట్ పేరుతో అమలు చేస్తోంది. అంతేకాక ఈ పథకం రూపురేఖల్ని పూర్తిగా మార్చేయబోతోంది. ప్రధానంగా దీన్ని ఎలా నిర్వహించాలన్న దానిపై కసరత్తు ప్రారంభించింది. పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పథకాన్ని నడపాలా? లేక కేంద్రం ఇచ్చే ప్రధాన మంత్రి మాతృవందన యోజన(పీఎంఎంవీవై)తో కలిపి కొనసాగించాలా అన్నదానిపై చర్చిస్తున్నారు. ఈ పథకంపై ఇటీవలే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. ఎన్నికల కోడ్ కారణంగా దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. కోడ్ ముగియగానే కేంద్రం భాగస్వామ్యంతోనా... లేక రాష్ట్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్వహిస్తారా అన్న దానిపై స్పష్టత రానుంది.

రాష్ట్ర ప్రభుత్వంపై భారం తగ్గే ఛాన్స్

ప్రస్తుతం పీఎంఎంవీవై కింద కేంద్రం గర్భిణులకు రూ.6 వేల ఆర్థిక సాయాన్ని ఇస్తోంది. కేంద్రం ఇచ్చే నిధులను తీసుకొని.. దానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున కొంత జమ చేస్తే... పాత పద్ధతిలోనే ఎంసీహెచ్ కిట్ కింద రూ. 13 వేలు ఇవ్వవచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకంతో కలిపి అమలుచేయడం వల్ల రేవంత్ సర్కారుపై ఆర్థిక భారం కూడా సగానికిపైగా తగ్గుతుంది. ఇదే విషయాన్ని అధికారులు మంత్రికి వివరించినట్లు తెలుస్తోంది. కాకపోతే కేంద్రం నిధులను ఈ పథకం కింద వినియోగిస్తే... కచ్చితంగా పేరు, బ్రాండింగ్‌లో వారి నియమ నిబంధనలను పాటించాల్సివుంటుందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. దీంతో రెండు రకాల ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, జూన్ 4 తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని అధికారులకు మంత్రి సూచించినట్టు చెప్తున్నారు.

తెలంగాణ చిహ్నంలో అమరుల స్థూపం పెడితే.. మీకెందుకు బాధ?

- కీరవాణికి ఆస్కార్ వచ్చినప్పుడు.. కేసీఆర్, కేటీఆర్ అభినందించలేదా?
- మహేష్ కుమార్ గౌడ్
- సమ్మక్క సారలమ్మలను చంపింది కాకతీయరాజులు కాదా?: బెల్లయ్యనాయక్

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): "ఉద్యమకారుల అభిప్రాయం మేరకు తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్థూపం పెడితే మీకెందుకు కడుపు నొప్పి?" అంటూ బీఆర్ఎస్ నేతలను టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. నిజమైన తెలంగాణ వాదులు కోరుకున్న దిశగా కాంగ్రెస్ ప్రభుత్వ అడుగులు పడుతుంటే.. కేసీఆర్ కుటుంబం నానా యాగీ చేయాలని చూస్తుందన్నారు. టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అమరుల స్థూపానికి రూ. వంద కోట్లు వెచ్చించిన కేసీఆర్ ప్రభుత్వం.. అందులో ఒక్క అమరవీరుని పేరయినా చెక్కిందా అని ప్రశ్నించారు. చిన జీయర్ స్వామిని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోపెట్టినప్పుడు, అందెశ్రీ గీతాన్ని సీమాంధ్ర గాయకుడు రామకృష్ణతో పాడించినప్పుడు, ప్రభుత్వ అంబాసిడర్లుగా రకుల్ ప్రీత్ సింగ్, మంచు లక్ష్మి, పుల్లెల గోపీచంద్‌లను నియమించినప్పుడు, రోజా ఇంటికి వెళ్లి ఆంధ్రా బిర్యానీని తిన్నప్పుడు, పనికిరాని ఒక ప్రాజెక్టును కట్టి.. దాని ప్రారంభోత్సవానికి ఏపీ సీఎంను ఆహ్వానించినప్పుడు, శారదాపీఠానికి తెలంగాణలో భూములు ఇచ్చినప్పుడు కేసీఆర్‌కు సెంటిమెంటు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కీరవాణికి ఆస్కార్ అవార్డు వస్తే.. ఇదే కేసీఆర్, కేటీఆర్ ట్విట్టర్ వేదికగా అభినందించారని గుర్తుచేశారు. ఒక మంచి గీతానికి సంగీతం సమకూర్చేందుకు కీరవాణిని సంప్రదిస్తే.. నానా యాగీ చేస్తున్నారని విమర్శించారు. కీరవాణి ఎంపిక అన్నది అందెశ్రీ ఆలోచనేనని వెల్లడించారు. మెజారిటీ ప్రజల అభిప్రాయం ప్రకారం తెలంగాణ చిహ్నం ఎంపిక జరుగుతుందన్నారు. మల్లు రవి మాట్లాడుతూ 2023 ఎన్నికలకు ముందే.. టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి రాచరిక పాలన తీసేసి ప్రజా పాలన తీసుకువస్తామని చెప్పారని, అందులో భాగమే రాచరిక చిహ్నాల తీసివేతన్నారు. ప్రజా పాలనలో భాగంగానే జయజయహే తెలంగాణ పాటని అధికారిక గేయంగా చేస్తున్నట్లు చెప్పారు."తెలంగాణ చిహ్నంలో కాకతీయుల కళాతోరణం కావాలా...?అమరవీరుల స్థూపం వద్దా? సమ్మక్క, సారలమ్మలను చంపింది కాకతీయ రాజులు కాదా? నాతో సహా.. రాష్ట్రంలో 12% ఉన్న గిరిజనులు కాకతీయ కళాతోరణాన్ని ఎందుకు ఒప్పుకోవాలి?" అంటూ టీపీసీసీ ఆదివాసీ సెల్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ప్రశ్నించారు. అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గేయం విషయంలో దేశపతి శ్రీనివాస్, వి. ప్రకాష్ కోడిగుడ్డుపై ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. "అందెశ్రీ కాల్ రికార్డింగ్‌లను విడుదల చేస్తారా? ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకున్న ప్రైవేటు డిస్కషన్ రికార్డును ఎలా విడుదల చేస్తారు?" అంటూ ధ్వజమెత్తారు.

పిల్లల కోసం బెంగ!

3 రోజులుగా శిశు విహార్ వద్దే పెంపుడు తల్లిదండ్రుల నిరీక్షణ

- అన్నం తింటున్నారో లేదో.. ఆరోగ్యం ఎలా ఉందో అంటూ కన్నీళ్లు
- ఒక్కసారి చూస్తాం.. లోపలికి అనుమతించండి అని వేడుకోలు
- లోపల ఉన్న 14 మంది చిన్నారుల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం?
- 'కారా' రూల్స్ సడలించాలంటున్న స్వచ్ఛంద సంస్థలు
- విచారణ ముగిసేదాకా పిల్లలను చూసే అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి
- సొంత తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. పిల్లలను అప్పగించండి:మంత్రి సీతక్క

హైదరాబాద్ సిటీ/యూసుఫ్‌గూడ, పంజాగుట్ట, మే 31 (ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసి కన్నా.. ఆ పిల్లలను ఆ తల్లులు ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్నారు. వారే లోకంగా బతుకుతున్నారు. అలాంటిది.. తమ వద్ద నుంచి పిల్లలను దూరంచేస్తే ఆ తల్లిండ్రులు బాధపడరా? పది నిమిషాలు కనిపించకపోతేనే తల్లడిల్లిపోయే స్థితిలో మూడు రోజులుగా పిల్లలను చూడకుండా ఉన్న ఆ తల్లిదండ్రుల ఆవేదన ఏ స్థాయిలో ఉంటుంది? ఇదంతా యూసుఫ్‌గూడలోని శిశువిహార్ పరిసరాల్లో కళ్లకు కడుతోంది. నిజమే.. సెంట్రల్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) నిబంధనలకు విరుద్ధంగా దత్తత తీసుకొని తప్పే చేశాం అంటూ లెంపలేసుకొంటూనే.. తమ బిడ్డల్ని ఒక్కసారి చూపించండి అంటూ అధికారులను తల్లిదండ్రులు ప్రాధేయపడుతున్నారు. శిశువుల విక్రయానికి సంబంధించి అంతర్రాష్ట్రముఠా గుట్టురట్టవ్వడంతో మూడు రోజుల క్రితం వివిధ చోట్ల నుంచి 14మంది శిశువులు, చిన్నారులను పోలీసులు స్వాధీనం చేసుకొని యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో అప్పగించారు. వీరిలో 12 మంది నెలల వయసు పిల్లలుండగా ఇద్దరు మూడేళ్లలోపు ఉన్నారు. శిశు విహార్‌లో ఉన్న తమ చిన్నారులు ఎలా ఉన్నారో? అన్నం తింటున్నారో లేదో? ఆరోగ్యం ఎలా ఉందో? అనే ఆలోచనతో పెంపుడు తల్లిదండ్రులు ఆకలిదప్పులూ పట్టకుండా బెంగటిల్లుతున్నారు. పిల్లలు వైద్యులపర్యవేక్షణలో ఉన్నా కొందరు జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది.

దత్తత ప్రక్రియ ఆలస్యం.. సంక్లిష్టం!

పొరుగు రాష్ట్రాలతో పోల్చితే తెలంగాణ, ఏపీలో పిల్లల దత్తత ప్రక్రియలో తీవ్ర ఆలస్యం జరుగుతుంది. ఈ కారణంగానే పిల్లలు లేని దంపతులు నిబంధనలకు విరుద్ధంగా శిశువులను దత్తత తీసుకుంటున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, కర్ణాటకలో దరఖాస్తు చేసుకున్న ఆరు నుంచి ఏడాదిలోపు పిల్లల దత్తత ప్రక్రియ పూర్తవుతుంది. తెలుగు రాష్ట్రాల్లో మాత్రం రెండు, మూడేళ్లు పడుతోందని స్వచ్ఛంద సంస్థల బాధ్యులు చెబుతున్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలంటే తొలుత.. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. తర్వాత పాన్‌కార్డు నంబర్, రెసిడెన్స్ ప్రూఫ్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, వివాహ నమోదు పత్రం, దంపతుల బర్త్, హెల్త్ సర్టిఫికెట్లు సమర్పించాలి. భార్యాభర్తల పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఇద్దరు కలిసి దిగిన పెళ్లి ఫొటోను కూడా దరఖాస్తుతో సమర్పించాలి. అలాగే రూ.6వేల డీడీ అప్లికేషన్ ఫారంతోపాటు రూ.40 వేలు దత్తత తీసుకునే సమయంలో సంబంధిత అనాథాశ్రమానికి లేకుంటే ప్రభుత్వ సంస్థలకు చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న అనంతరం రెండు నుంచి మూడేళ్లకు పిల్లలను దంపతులకు అప్పగిస్తారు. అప్పగించిన తర్వాత కూడా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పిల్లలను పర్యవేక్షించాలి. దత్తత తీసుకున్న జంటల ఆర్థిక పరిస్థితి ఎలా ఉంది? వారు పిల్లాడిని బాగా చూసుకుంటున్నారా? లేదా? అనేవి ప్రతి ఆరు నెలలకోసారి పరిశీలించాలి. ఈ సందర్భంగా సదరు తల్లిదండ్రుల నుంచి ఆరునెలలకోసారి రూ.2వేల చొప్పున తీసుకుంటారు.

3 రోజులుగా పడిగాపులు పడుతున్నాం

నా పేరు అరుణ. భర్త పేరు సాయి. మాది ఏపీలోని చీరాల సమీపంలోని బోయనపాలెం. పిల్లలు కలగకపోవడంతో ఐదు నెలల బాబును ఓ నర్సు ద్వారా తెచ్చుకున్నాం. బాబుకు శ్రీమన్విత్ అని పేరు పెట్టుకున్నాం. మా అమ్మకు నేను ఒక్కదాన్నే కావడంతో ఆమె ఎంతో ప్రేమతో నా బాబుకు ఎకరన్నర పొలం రాసేందుకు సిద్ధమైంది. ఇంతలోనే పోలీసులు మా బాబును తీసుకొచ్చి శిశువిహార్‌లో పెట్టారు. 3 రోజులుగా ఇక్కడే ఉన్నాం. చూసేందుకు అవకాశం ఇవ్వడం లేదు. దయచేసి మా బాబును మాకు ఇప్పించండి. - అరుణ, చీరాల, ఏపీ

3 నెలల్లోపు దత్తత ఇవ్వాలి

సమాజంలో చాలా జంటలు సంతానలేమి సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారికి పిల్లలను దత్తత తీసుకునే అవకాశాన్ని త్వరగా కల్పించాలి. కారా వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నాక మూడు నెలల్లో చట్టబద్ధంగా దత్తత ప్రక్రియ పూర్తి అయ్యేలా నిబంధనలు సడలించాలి. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలి. ప్రస్తుతం యూసుఫ్‌గూడలోని శిశువిహార్‌లో ఉంటున్న పిల్లలను చూసే అవకాశాన్ని మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు కల్పించాలి.

-డాక్టర్ మమతా రఘువీర్,
తరుణి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు

ప్రతి జిల్లాలో శిశువిహార్ పెట్టాలి



దత్తత కార్యక్రమం ఆలస్యమవుతుండడంతోనే చాలా మంది పిల్లలను అక్రమ పద్ధతిలో కొనుగోలు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం దత్తత టైం లిమిట్ తగ్గించి సకాలంలో పిల్లలను అప్పగిస్తే దంపతులు సంతోషంగా ఉండటంతోపాటు సంరక్షణను బాధ్యతగా నెరవేరుస్తారు. ప్రభుత్వం కూడా ప్రతి జిల్లాలో శిశువిహార్ కేంద్రాలు పెట్టాలి. తద్వారా అనాథ పిల్లలకు ఆశ్రయం అందుతోంది.

-రేవతి, హైకోర్టు న్యాయవాది

పాప పేరిట ఆస్తి కూడా రాశాం



ఈ దంపతులు పేర్లు పెరుగు దుర్గాభవాని, చక్రపాణి. వీరిది ఏపీలోని బాపట్ల జిల్లా కర్లపల్లి మండలం చింతాయపాలెం. పెళ్లయి 20 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మూడేళ్ల క్రితం విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సు సాయంతో 8 రోజుల పాపను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేశారు. అధికారులొచ్చి తమ పాపను తీసుకెళ్లడంతో శిశువిహార్ వద్ద పడిగాపులు పడుతున్నారు. పాపకు భవ్యశ్రీ అని పేరు పెట్టుకొని, మూడేళ్లుగా పెంచుకుంటున్నామని.. ప్రాణం కంటే ఎక్కువగా చూసుకున్నామని చెప్పారు. "పాప పేరిట ఆస్తిని అంతా రాశాం. మంత్రి సీతక్క ఆఫీస్ అడ్రస్ చెప్పండి సార్.. అక్కడికి వెళ్లి అమ్మను ప్రాధేయపడి పాపను తీసుకెళ్తాం" అని ఈ దంపతులు అడుగుతున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు : సీతక్క



పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడలోని శిశువిహార్ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసులు స్వాధీనం చేసుకున్న చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల కుటుంబసభ్యుల వివరాలు సేకరించి, వారికి కౌన్సిలింగ్ ఇచ్చి చిన్నారులను అప్పగించాలని సూచించారు. సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో, చట్టపరంగా దత్తత తీసుకుంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని.. దత్తత కోసం చట్టపరమైన ప్రక్రియను అనుసరించాలని పేర్కొన్నారు. పిల్లల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

దళితుడిని చంపిన వారిని శిక్షించాలి..

బాలసముద్రం, మే 31: సిద్దిపేట జిల్లా రూలర్ మండలం సీతారంపల్లి గ్రామానికి చెందిన దళితుడు మిట్టపల్లి కృష్ణతోపాటు మరో ఐదుగురు హనుమాన్ మాల ధరించిన వారిపై గుడిలోకి రాకుండా అడ్డుకొని దాడి చేసిన వారిని ఉరితీయాలని కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వారి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కులాల పేరుతో దేవాలయాలలోకి రాకుండా అడ్డుకునే హక్కు సనాతన ధర్మ అగ్రకులాలకు లేదని విమర్శించారు. సంగారెడ్డి జిల్లాలో కోహిర్ మండలం బడంపేటలో బేగిరి నర్సింహులు ప్రేమించి పెళ్లి చేసుకున్నందుకు అతడిపై దాడి చేసి హత్య చేయడం నీచ సంస్కృతి అని అన్నారు. కులాలు, మతాల పేరుతో అల్లర్లు సృష్టిస్తూ మానవ మనుగడకు ముప్పుగా మారారన్నారు. కులాంతర వివాహాలు చేసుకుంటే అగ్రకులం పేరుతో రౌడీయిజం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని హత్యలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించి ఉరి తీయాలన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, మహేష్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వేరో నాయకుల ఆరోపణలు అర్థరహితం

కాజీపేట, మే 31: వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును స్వేరో నాయకులు విమర్శించడం అర్థరహితమని, ఎమ్మెల్యే నాగరాజుపై చేసిన ఆరోపణలు స్వేరో నాయకులు వెనక్కి తీసుకోవాలని కాజీపేట మండల ఎస్సీ కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాజీపేట మీడియాపాయింట్‌లో శుక్రవారం ఎస్సీ సెల్ నాయకులు ఎడబోయిన ప్రభాకర్, వస్కుల శంకర్, కట్కూరి రమేశ్, వస్కుల నాగరాజు, మాజీ కార్పొరేటర్ బస్కె శ్రీలేఖ కృష్ణలు మాట్లాడారు. ఎస్సై స్థాయి నుంచి ఎస్పీ స్థాయి వరకు ఎదిగి వర్ధన్నపేట ఎమ్మెల్యే గా సేవలందిస్తున్న నాగరాజును స్వేరోలు విమర్శించడం వారి అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో దళిత ముసుగులో కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయడానికి ఆర్ఎస్ ప్రవీణ్ చేసిన ప్రయత్నాలు రాష్ట్ర ప్రజలకు తెలుసన్నారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతానని ఆశ చూపి తిరిగి దొర కేసీఆర్ తొత్తుగా ఆర్ఎస్పీ మారడాన్ని దళితులు జీర్ణించుకోవడం లేదన్నారు. ఐపీఎస్ చదివిన ఆర్ఎస్పీకి నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అందించిన సహకారాన్ని మరిచిపోయారన్నారు. దొర కేసీఆర్ పంచన చేరిన దళిత ద్రోహి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను దళితులు క్షమించరన్నారు. స్వేరో పేరుతో సొంత సామ్రాజ్యాన్ని నిర్మించుకుని వారితో ఎమ్మెల్యే నాగరాజును విమర్శిస్తే ఊరుకోమన్నారు. ఈ మీడియా సమావేశంలో కాజీపేట మండల అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్, నాయకులు బస్కె ప్రణయ్, వస్కుల శ్రీను, భిక్షపతి, నర్మెట వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న నాయకులు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ దిష్టిబొమ్మ దహనం

ఐనవోలు : వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుపై స్వేరోస్ నాయకులు చేసిన అనుచిత వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ ఎస్సీ సెల్ నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యేపై స్వేరోస్ నాయకుల వాఖ్యలకు నిరసనగా శుక్రవారం ఐనవోలులో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు యాకర సాంబయ్య, మండల అధికార ప్రతినిధి కొత్తూరి సునిల్‌లు మాట్లాడుతూ.. బహుజన నినాదంతో సబ్బండవర్గాలకు మోసం చేసి దొర కాళ్లదగ్గర భాంచన్ గిరి చేస్తున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ స్వేరో పేరుతో బహుజనులను మోసం చేశారన్నారు.. కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునే ప్రసక్తేలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు ఇల్లందుల ఏలిషా, ఐనవోలు అధ్యక్షుడు బరిగెల భాస్కర్, కొత్తూరి మధుకర్, మండల, గ్రామ స్థాయి నాయకులు రహీంపాషా, బరిగెల బాబు, కొండేటి దిలీప్, ప్రతాప్, హరీష్, ఏలియా, మహేందర్, రమేష్, రాజారాం, అశోక్, ఆనందం, రమేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాత పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ బారి


పాత పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పరిశీలిస్తున్న డీసీపీ బారీ, ఏసీపీలు నందిరామ్ నాయక్, విజయ్

మడికొండ, మే 31: మడికొండలోని పాత పోలీస్‌స్టేషన్‌ను డీసీపీ ఏంఏ బారి, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్‌తో కలిసి సందర్శించారు. గతంలో ఇక్కడ ఉన్న పోలీస్‌స్టేషన్‌ను జాతీయ రహదారి వద్దకు మార్చారు. అప్పటి నుంచి పాత పోలీస్‌స్టేషన్ ఖాళీగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు చోటుగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈక్రమంలో శుక్రవారం డీసీపీ బారి పోలీస్‌స్టేన్‌ను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ భవనాలు, స్థలం పోలీస్ శాఖకు సంబంధించిన అవసరాలకు ఏవిధంగా ఉపయోగ పడే అవకాశం ఉంది అనే కోణంలో పరిశీలించారు. అలాగే అంబేద్కర్ కాలనీ పక్కన గల పాత పోలీస్ క్వార్టర్స్ ను సైతం సందర్శించి పరిశీలించారు. డీసీపీ వెంట సైబర్ క్రైం ఏసీపీ విజయ్, మడికొండ ఇన్‌స్పెక్టర్ డి. ప్రతాప్ ఉన్నారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు డీసీపీని కలిసి మడికొండ మీదుగా భారీ వాహనాలు వెళ్తూ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా గతంలో ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదాలకు గురై మృతి చెందారని తెలిపారు. భారీ వాహనాలు రాకుండా చూడాలని డీసీపీని కోరారు. డీసీపీ స్పందించి రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. విషయాన్ని సీపీ దృష్టికి తీసుకెళ్ళి భారీ వాహనాలు రాకుండా కమాన్‌లు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు.

విరమణ ఉద్యోగానికే.. సర్వీస్‌కు కాదు..

తెలంగాణ జల వనరుల మండలి మాజీ చైర్మన్ వి. ప్రకాష్


సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న వి. ప్రకాష్

బాలసముద్రం, మే 31 : ఉద్యోగ విరమణ కేవలం ఉద్యోగానికి మాత్రమేనని సమాజ సేవకు కాదని తెలంగాణ జల వనరుల అభివృద్ధి మండలి మాజీ చైర్మన్ వి ప్రకాష్ అన్నారు. శుక్రవారం హసన్‌పర్తి ఇన్‌చార్జి ఎస్‌డబ్ల్యూవో గ్రేడ్-1 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్రగళ్లపాటి విజయలక్ష్మి ఉద్యోగ విరమణ సన్మాన సభ హనుమకొండ సుబేదారిలోని స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విప్రకాష్ పాల్గొని మాట్లాడారు. విజయలక్ష్మి - వేదాంత దంపతులు హేతువాద నాస్తిక ఉద్యమాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. వారి కుటుంబంలో ఆదర్శ వివాహాలు నిర్వహించినట్లు తెలిపారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో 41ఏళ్ల సర్వీస్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవోల సంఘం నేత కృష్ణ, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ, ఉపాధ్యాయ ఉద్యమ మాజీ నేతలు రమాదేవి, సుధీర్‌బాబు, రాంబ్రహ్మం, ఓం బ్రహ్మం, శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, సాదు రాజేష్, నున్నా అప్పారావు, అనిత, కళ పాల్గొన్నారు.

ప్రతీ ఉద్యోగికి విరమణ సహజం


ఉద్యోగిని సన్మానిస్తున్న అదనపు కమిషనర్ తదితరులు

వరంగల్ కార్పొరేషన్, మే 31: ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. సుదీర్ఘకాలం పాటు పనిచేసిన ఐదుగురు ఉద్యోగులను నగర పాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో శుక్రవారం ఘనంగా సన్మానించారు. పి. వెంకటేశ్వర్లు (ఏఈ) శ్రీనివాస్‌రావు (పంప్ ఆపరేటర్) ఎస్. జంపయ్య, ఖాజీబీ (మాన్ మజ్దూర్) కె.సారంగపాణి(ఫైన్‌మెన్)లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈలో బీఎల్ శ్రీనివాసరావు, రాజయ్య, ఏజేసీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు విస్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్


మాట్లాడుతున్న వినయభాస్కర్

రాంనగర్, మే 31: కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను విస్మరిస్తోందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఆరోపించారు. శుక్రవారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కార్మిక సమ్మేళనం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన వినయభాస్కర్ మాట్లాడుతూ.. దశాబ్దకాలంగా కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కరించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కార్మికులను పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ భవన్ వేదికగా ఉద్యమిస్తామని వినయభాస్కర్ తెలిపారు. ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు తాము అండగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు తీసుకుందన్నారు. ఈ సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నేతలు రాంబాబు, పుల్లా శ్రీనివాస్, రవి, మల్లేశం, రవిందర్‌రెడ్డి, సంజీవ్, రాజు, ఇస్మాయిల్, సతీష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, సర్వర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సమావేశంలో కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలని, ఆటో కార్మికులకు ప్రతీ నెల రూ.15వేల భృతి కల్పించాలని, ఇళ్లలో పనిచేసే కార్మికులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని పలు తీర్మానాలు చేశారు.

మహిళల భద్రత, సంరక్షణపై అవగాహన సదస్సు

బాలసముద్రం, మే 31: మహిళల భద్రత, వారి సంరక్షణ కొరకు మహిళా పోలీసులు షీటీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకశిల వాకర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ.. అపరిచితులు ఫోన్లు చేస్తే ఎత్తకూడదని, సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళలకు ఫోన్ చేసి ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఏకశిల పార్కులో పలు చట్టాలపై వాకర్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏకశిల వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. రాజిరెడ్డి, ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి,

కోశాధికారి సోమయ్య, గౌరవ అధ్యక్షుడు గోదారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎం. గోవర్ధన్‌రెడ్డి, వాకర్స్ జేకే వెంకటేశ్వరావు, డి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చర్చి ఆస్తుల ఆక్రమణపై నిరసన


నిరసన చేపట్టిన సెంటినరీ బాప్టిస్టు సంఘం ప్రతినిధులు, పాస్టర్లు

హనుమకొండ సిటీ, మే 31: హను మకొండ సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆస్తుల ఆక్రమణపై సీబీసీ సంఘం ప్రతినిధులు, పాస్టర్లు నిరసన తెలిపారు. శుక్రవారం హనుమకొండలోని సీబీసీ ప్రాంగణంలో సంఘం అధ్యక్షుడు క్రిష్టఫర్ రూబెన్, కార్యదర్శి విజయ స్వరూప్, ఉపాధ్యక్షుడు విల్సన్, కోశాధికారి విద్యాకర్‌తోపాటు గ్రామీణ సువార్త పాస్టర్లు తదితరులు నిరసన చేపట్టారు. మిషనరీ ఆస్తులను కొల్లగొట్టేందుకు కొందరు వ్యక్తులు రియాల్టర్లతో కుమ్మక్కై ఆక్రమించే చర్యలకు ఒడిగడుతున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు రూబెన్ క్రిష్టఫర్, విజయ్ స్వరూప్‌లు ఆరోపించారు. ఈ చర్యలను ఖండిస్తూ నిరసన చేపట్టినట్లు వివరించారు. ఆస్తుల పరిరక్షణకు చట్టబద్ధంగా పోరాడుతామని వెల్లడించారు.

వాకర్స్ సభ్యులకు టీషర్టుల పంపిణీ


పంపిణీ చేసిన టీషర్టులు ధరించిన లెజెండరీ వాకర్స్

వరంగల్ కార్పొరేషన్, మే 31: హనుమకొండ కాకతీయ యూనివర్సిటీ మైదానంలోని కాకతీయ లెజెండరీ వాకర్స్‌కు శుక్రవారం టీషర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హస న్‌పర్తి ఇన్‌స్పెక్టర్ జువ్వాజి సురేష్ హాజరై వాకర్స్ సభ్యులకు టీషర్టులను అందించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. వయస్సు మీద పడ్డ తర్వాత ఆరోగ్యంపై శ్రద్ధ చూపకుండా ఆరోగ్యంగా ఉన్నప్పటి నుంచే వాకింగ్, యోగా, జాగింగ్ చేయాల న్నారు. వాకర్స్ నాయకులు లింగారెడ్డి, సిరిమల్లె సదానందం, మురళీధర్, బోనగాని యాదగిరిగౌడ్, ప్రదీప్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, మోహన్, మనోహర్, ప్రసాద్, మధులు ఉన్నారు.

ఎరువుల షాపుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

వరంగల్ క్రైం, మే 31: హనుమకొండ సుబేదారి పరిధిలోని ఎరువుల షాపులను వ్యవసాయ అధికారులతో కలిసి సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం షాపులు తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న స్టాకును పరిశీలించి నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. .

● ధర్మసాగర్: ధర్మసాగర్ మండల కేంద్రంలో ఫర్టిలైజర్, విత్తన దుకాణాలను మండల టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ మహేందర్, మండల వ్యవసాయ శాఖ అధికారి పద్మ తదితరులు దుకాణంలోని రికార్డులు, స్టాక్‌లను తనిఖీ చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, విత్తనాల కొరత సృష్టించవద్దని సూచించారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మవద్దని, ప్రతీ రైతు ఎన్ని విత్తనాల ప్యాకెట్స్ తీసుకున్నా రికార్డులో నమోదు చేయాలన్నారు. ప్రతీ రైతుకు కొనుగోలు బిల్లులు ఇవ్వాలన్నారు.

● హసన్‌పర్తి : మండల కేంద్రంలోని ఫర్టిలైజర్స్, మన గ్రోమోర్ సెంటర్లు, ఆగ్రోస్ రైతు సేవా షాపుల్లో మండల వ్యవసాయ అధికారి అద్లూరి అనురాధ ఆధ్వర్యంలో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. షాపుల్లోని విత్తనాల అమ్మకాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, బిల్లులను, కొనుగోలు రసీదులను, రైతు వారి విత్తన కొనుగోలు నమోదు పుస్తకాలను, విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చల్లా ప్రసాద్ మాట్లాడుతూ.. విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ జవ్వాజీ సురేష్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


హసన్‌పర్తిలోని ఫర్టిలైజర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ధూమపానం ఆరోగ్యానికి హానికరం

హసన్‌పర్తి, మే 31: ధూమపానం ఆరోగ్యానికి హానికరమని, పొగాకు ఉత్పత్తులను వాడితే క్యాన్సర్ బారిన పడతారని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు అన్నారు. శుక్రవారం హసన్‌పర్తి ఉన్నతశ్రేణి ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొగాకు ఉత్పత్తులను వాడి ఎక్కడపడితే అక్కడ ఉమ్మివేయడం వలన పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. 2003 కోత్పా చట్టం ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పొగతాగడం చట్టవిరుద్ధమన్నారు. విద్యాశాఖ సహకారంతో జిల్లాలో 72 విద్యాసంస్థలతో అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, టొబాకో ఫ్రీ సంస్థలుగా ప్రకటించాయన్నారు. శ్రీనివాస హర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రామక శ్రీనివాస్ మాట్లాడుతూ.. ధూమపానం, పొగాకును వాడటం వలన హృదయ సంబంధించిన వ్యాధులతో పాటు క్యాన్సర్, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు వస్తాయన్నారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు విద్య, పోలీసు, వ్యవసాయ శాఖ వారు అవగాహన కార్యక్రమాలను నిర్వహించి పొగాకు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్‌మోహన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో యాకూబ్ పాషా, డాక్టర్లు ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమాశ్రీ, డాక్టర్లు హిమబిందు, ఇఫ్కర్ అహ్మద్, ప్రభుదాస్, అనిల్ రెడ్డి, అశోక్‌రెడ్డి, మాధవరెడ్డి, సూపర్‌వైజర్ లచ్చులు, హెల్త్ అసిస్టెంట్స్ కందుకూరి సంతోష్ కుమార్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్ఓ సాంబశివరావు

ధరణి పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం దగా..

వడ్డేపల్లి, మే 31: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ధరణి పేరుతో రాష్ట్రంలోని 6లక్షల 50 వేల ఎకరాల ప్రభుత్వ భూములను ధరణి పేరుతో భూ కబ్జాలకు పాల్పడి పేద ప్రజలను దగా చేశారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ - తెలంగాణ బొజ్జాతారకం పార్టీ (ఆర్‌పీఐ- టీబీ) రాష్ట్ర కో ఆర్డినేటర్ జన్ను సాంబయ్య అన్నారు. హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ కోరిన విధంగా భూమిని జాతీయం చేయాలనే లక్ష్యంతో ఆవిర్భవించిన తమ పార్టీ పేద ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జూన్ 16న భూమిని పంచు.. బడ్జెట్‌ను పెంచు, ఉపాధి ఉద్యోగావకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో పార్టీ కో ఆర్డినేటర్లు శ్రీరాముల షైడి, పసుల శంకర్, పిసిర రజిత, హసీనా బేగం, సాంబలక్ష్మి, జమ్మల నాగరాజు పాల్గొన్నారు.

రేపు మైనారిటీ వివాహ పరిచయ వేదిక

వడ్డేపల్లి, మే 31: మైనారిటీ ఇంటెలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో జూన్ 2న వరంగల్ ఎల్బీ నగర్‌లోని అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా దూ- బ- దూ ములాఖత్(ఉచిత వివాహ పరిచయ వేదిక) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ డాక్టర్ అనిస్‌సిద్దిఖీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లిం యువతి, యువకులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్లు : 99087 63454 / 98490 12987 లలో సంప్రదించాలని కోరారు.

ఇసుక డంప్ సీజ్

ఐనవోలు, మే 31: అనుమతి లేకుండా నిల్వచేసిన మట్టితో కూడిన ఇసుక డంప్‌ను మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారుల పోలీసులతో కలిసి వెళ్లి సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నందనం గ్రామ శివారు ఆకేరు వాగు పరివాహక ప్రాంతంలోని ప్రైవేటు భూమి నుంచి సుమారు 450 ట్రిప్పుల మట్టితో కూడిన ఇసుకను లింగమోరిగూడెం గ్రామ శివారులోని రాంచంద్రారెడ్డి భూమిలో నిల్వ చేశారు. మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వి. చంద్రకళ, మైనింగ్ సర్వేయర్ ఎ.పూర్ణ, తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎస్సై అనిల్‌కుమార్, ఏఆర్ఐ ఎం.మల్లయ్య సంయుక్తంగా వెళ్లి నిల్వచేసిన మట్టితోకూడిన ఇసుక డంప్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు.

నేడు సుమతిరెడ్డి కళాశాలలో సక్సెస్ మీట్

హసన్‌పర్తి, మే 31: మండలంలోని అనంతసాగర్ వద్ద గల సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ సక్సెస్‌మీట్-2024ను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీరెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. వివిధ ఎంఎన్‌సీ కంపెనీల్లో వంద శాతం ప్లేస్‌మెంట్ జరిగిన సందర్భంగా సక్సెస్ మీట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్సార్ విద్యాసంస్థల చైర్మన్ ఎనగందుల వరదారెడ్డి, కాగ్నిజెంట్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్‌లు ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహేందర్, డాక్టర్ శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ స్వాముల శోభయాత్ర

న్యూ శాయంపేట, మే 31 : హనుమకొండ పద్మాక్షికాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలోని హనుమాన్ స్వాములు శుక్రవారం ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో హనుమాన్ చిత్రపటాన్ని ఉంచి శోభయాత్రగా హనమద్గిరి ప్రసన్నంజనేయస్వామి దేవాలయం నుంచి హనుమకొండ చౌరస్తా, బాలాంజనేయ స్వామి దేవాలయం నుంచి పదాక్షికాలనీలోని పుర వీధుల గుండా శోభయాత్ర కొనసాగింది. ఈ శోభయాత్రలో ఆలయ చైర్మన్ బెండల అర్జున్‌రావు, అధ్యక్షుడు గందే కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్‌తో పాటు సుమారు 500 హన్‌మాన్ స్వాములు పాల్గొన్నారు.

జవాబు పత్రాలను అమ్ముకుంటున్న
వారిపై చర్యలు తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మే 31: కేయూలో జవాబు పత్రాలను అమ్ముకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం క్యాంపస్‌లోని ఎగ్జామినేషన్ బ్రాంచి ముందు ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.. జవాబు పత్రాలను అమ్ముకుంటున్న వారి వెనకాల ఎవరున్నారో గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కొంత కాలంగా జవాబు పత్రాలను అమ్ముకుంటూ కేయూ పరువు తీస్తున్న దినసరి కూలీలపే విచారణ చేపట్టి కఠినమైన చర్యలు తీసుకోవాలని, వారి వెనకాల ఉన్నవారిని ముందుకు లాగాలన్నారు. ఇంచార్జి వీసీ, రిజిస్ట్రార్‌లు స్పందించి వెంటనే అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో సంఘం కేయూ ఇంచార్జి పవన్‌కళ్యాణ్, కేయూ అధ్యక్షుడు డి.నరేందర్, ప్రధానకార్యదర్శి బి. పృథ్విరాజ్, ప్రదీప్, రత్నాకర్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ఎంజేపీటీ విద్యార్థుల ప్రతిభ

వరంగల్ ఎడ్యుకేషన్, మే 31: మేథ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో ఆరెపల్లిలోని ఎంజీపీటీ విద్యార్థినులు ఇ. సంజన, బి. ఆశ్రిత, ఎస్. వైష్ణవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు స్పెషల్ ఆఫీసర్ కె. సుదర్శన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ముగ్గురు విద్యార్థినులకు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 6 యేళ్లపాటు కార్పొరేట్ విద్యను అందుతుందని తెలిపారు. ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు రెండేళ్లుగా 100 శాతం ఉత్తీర్ణతతో పాటు ఈ ఏడు 5గురు విద్యార్థులు 10 జీపీఏ సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎంజేపీ సెక్రెటరీ బి.సైదులు, ఆర్‌సీవో ఎ. మనోహర్‌రెడ్డి ప్రోత్సాహంతో విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అంబేద్కర్ భవన్‌లో ఇండియా లెవల్ డ్యాన్స్ పోటీలు

వడ్డేపల్లి, మే 31: హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జూన్ 8, 9 తేదీల్లో మెగా కమల ఎరోబిక్స్ అండ్ డ్యాన్స్, క్రాంతి క్రియేటీవ్స్ ఆధ్వర్యంలో ఇండియా లెవల్ డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు క్రాంతి క్రియేటీవ్స్ సంస్థ మేనేజర్ గాదె క్రాంతి కుమార్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లాసికల్ బెస్ట్ ఫర్మార్‌మెన్స్‌కి రూ.5వేలు, గ్రూప్ బెస్ట్ ఫర్ఫార్‌మెన్స్‌కి రూ.10వేలు, వెస్ట్రన్, ఫోక్ సోలో బెస్ట్ ఫర్ఫార్‌మెన్స్‌కి రూ.5వేలు క్యాష్ బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. పోటీలలో పాల్గొనే వారు జూన్ 5లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు సెల్ నంబర్లు : 97040 56531/ 98884 85552 లలో సంప్రదించాలని కోరారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు దీపక్, రాజ్‌కుమార్, మధు, శ్యామ్, సాయి , శ్రావణ్ , పవన్ పాల్గొన్నారు.

*నిర్నీరం మథితం ఘసేన సహితం సంభావితం శర్కరా
ధూళీ ఖిర్మరిచోద్భవేన రజసావ్యాలోడితం కించన!
జాతీ చంపక కేతకీ సురభితం మృత్పాత్ర మధ్యస్థితం
జిహ్వాయాం విదధాత్యుపక్షమ మిదం మోదాఫలైష్షాఫలమ్!*

పెరుగు... అరటిపండు

అన్నం వండటం నేర్చిన మనిషి ఆ అన్నంలోకి కూర వంటం గురించి ఆలోచించినప్పుడు మొదటగా చేతికి దొరికింది అరటికాయ. దాన్ని కాల్చి, తొక్క తీసి, లోపల గుజ్జుని తిన్నాడు. నూనె వాడకం తెలిశాక దానికి తాలింపు పెట్టుకుని తిన్నాడు. పండించడం నేర్చాక పండుని పెరుగులో కలుపుకొని తిన్నాడు. ఎందుకు పెట్టారో తెలియదు కానీ, దీని వృక్షనామం 'మూసా పేరడైజియాకా' అనడంలోనే ఇది స్వర్గం నుంచి వచ్చిన పండు అనే భావన కనిపిస్తుంది.

పెరుగుకూ, అరటిపండుకూ విరోధం ఏమీ లేదు. రెండూ కఫాన్ని పెంచుతాయి కాబట్టి, జాగ్రత్తగా తినాలంతే. రెండింటికీ వాతాన్ని తగ్గించే గుణం ఉంది కాబట్టి, వాతమే సమస్త అనారోగ్యాలకూ కారణం కాబట్టి, వాతహరమైన అరటి, పెరుగు మిశ్రమం గురించి కొన్ని విషయాలు తెలుసుకోవాలి.

అరటిపండుకు ఆలస్యంగా అరిగే గుణం ఉంది. అయినా పెరుగు లేదా మజ్జిగతో పాటు దీన్ని తీసుకొంటే తేలికగా అరుగుతుంది. నరాల పటుత్వం పెంచుతుంది. పేగుల్లో వచ్చే వ్యాధుల్లో యాసిడ్ ఎక్కువగా పేరుకోకుండా నియంతిస్తుంది. స్వతహాగా ఇది క్షార స్వభావం కలిగిన ఫలం. ఇందులోని పొటాషియం, ఆహారపీచు, సి-విటమిన్, కార్బోహైడ్రేట్స్, షుగరు పదార్థాలు... ఇవన్నీ యాసిడ్‌కు వ్యతిరేకంగా పని చేస్తాయి. ఇవి తక్షణ శక్తిదాయకాలు.

ఔషధ గుణాలెన్నో...

కలరా, జిగురు విరేచనాలు, అమీబియాసిస్, హిస్టీరియా లాంటి మానసిక వ్యాధులు, రక్తస్రావం, పురుషత్వంలో బలహీనతలు, స్త్రీల సంబంధిత వ్యాధులు, అరికాళ్లు, కడుపులో మంటలు, నీరసం, నిస్సత్తువ తగ్గుతాయి. పెరుగు, అరటి జంటను ఆహార ప్రయోజనాలకు చక్కగా వాడుకోగలగాలి. అరటిపండు, పెరుగు, పంచదార కలిపితే పంచామృతాల్లో సగం కలిసినట్టే. తేనె, నెయ్యి, పాలు కూడా కలుపుకొంటే మరీ మంచిది. అప్పుడది అరటిపండు పంచామృతం అవుతుంది. శరీరానికి చలవనీ, పోషణనీ, శక్తినీ ఇచ్చి, ఆరోగ్యాన్ని కాపాడేది ఏదైనా సరే మన రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో చెప్పిన అనేక వంటకాలు, పానీయాలు ఆయుర్వేద పరంగా రూపొందించినవి. భక్తితోనూ తీసుకోతగినవి.



గుండెకు బలం...

'రసాల రసవష్టల్యం మధురం పిత్తనాశనమ్! సుహృద్యం కఫకృత్నోకం కించిద్విష్టంభకారకమ్!'.. ఈ తియ్యని రసాల పానీయం పైత్యాన్ని తక్షణం తగ్గించి, శరీరానికి చలవనిస్తుంది. గుండెకు బలాన్నిస్తుంది. కొద్దిగా కఫాన్ని పెంచుతుంది. అందుకే దాల్చినచెక్క, విఏరియాల పొడి తగినంత కలుపుతారు. ఇవి కఫం పెరగకుండా చూస్తాయి. ఈ అరటిపండు లస్సీకి మలబద్ధకం కలిగించే గుణం కొంచెం ఉందని (కించిద్విష్టంభకారకమ్) క్షేమశర్మ చెప్పాడు. కలరా లాంటి వ్యాధులు వచ్చినప్పుడు ఈ పానీయాన్ని తాగితే విరేచనంలో నీటి శాతాన్ని తగ్గించి, ప్రాణాపాయ స్థితిని తప్పిస్తుంది. స్వతహాగా అరటిపండు విరేచనకారే. ఫైబరు కలిగినది కదా. షుగరు వ్యాధి, స్థూలకాయాలతో బాధపడేవారు మినహా అందరూ ఆస్వాదించదగిన గొప్ప పానీయం ఇది.

అరటిపండు లస్సీ...

శుభ్రమైన వస్త్రంలో పెరుగు వడగట్టి, నీటిని తీసేసి, లస్సీ కోసం వాడాలని చెప్పాడు క్షేమశర్మ. ఎటు తిరిగీ చిలికి, పలచగానే చేస్తాం కదా.. మళ్లీ వడగట్టడం దేనికనే సందేహం రావచ్చు. పెరుగులో నీటికి వగరు గుణం ఉంటుంది. తియ్యని పానీయం తయారు చేస్తూ, వగరు నీటిని కలపడం దేనికనేది ఆయన భావన. వడగట్టిన పెరుగు నీటిని విడిగా మజ్జిగలో కలిపి తాగవచ్చు.

మంచి మట్టి కుండ తీసుకొని, అందులో వడగట్టిన పెరుగు, గుజ్జుగా చేసిన అరటిపండు, దాల్చిన చెక్క, పంచదార, విఏరియాల పొడి కలిపి, బాగా చిలకాలి. లేదంటే మిక్సీ పట్టుకోవచ్చు. చిక్కని, తియ్యని, ఘాటైన ద్రవం తయారవుతుంది. ఈ పానీయంలో మల్లెపూలు, మొగలి రేకులు, సంపెంగలు కలిపి కాసేపు మూతపెట్టి ఉంచండి. పూల పరిమళం ఆ లస్సీకి బాగా పట్టుకుని ఉంటుంది. తాగే ముందు మరొకసారి వడగట్టుకుని, పూలన్నిటినీ తీసేస్తే పరిమళ భరితమైన అరటిపండు లస్సీ తయారైనట్టే. ఇలాంటి గొప్ప పానీయం తాగేవారిని చూసి ఇతరులు అసూయపడతారని అంటాడు క్షేమశర్మ.

• గంగరాజు అరుణాదేవి

మీకు తెలుసా?

ఏ సప్లిమెంట్లు ఎప్పుడు?



మనందరం ఏవో ఒక సప్లిమెంట్లు తీసుకుంటూనే ఉంటాం. విటమిన్ మాత్రలు, క్యాల్షియం టాబ్లెట్లు వాడుకుంటూ ఉంటాం. అయితే ఏ సప్లిమెంట్లు ఎప్పుడు వేసుకోవాలో మీకు తెలుసా?

ఉదయం: విటమిన్ సి, బి కాంప్లెక్స్, అమీనో యాసిడ్లు, ఎమ్‌సిటి ఆయిల్

బ్రేక్‌ఫాస్ట్: విటమిన్ ఎ, డి, ఇ, కె సప్లిమెంట్లు, బ్రేక్‌ఫాస్ట్ తిన్న తర్వాత వేసుకోవాలి.

మధ్యాహ్నం: మెగ్నీషియం, ఒమేగా 3 మధ్యాహ్న భోజనం వేళ వేసుకోవాలి.

రాత్రి: క్యాల్షియం, యాంటీఆక్సిడెంట్లు, ప్రొబయాటిక్స్, మినరల్ సప్లిమెంట్లు రాత్రి భోజనం తర్వాత వేసుకోవాలి.





అందుబాటులో ఉండే ప్రతి ఆహారాన్ని తినాలంటే మధుమేహగ్రస్తులకు (డయాబెటిక్) కాస్త ఇబ్బందే. ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిందే. డయాబెటిక్ సమస్య ఉండే వారు.. ఇంట్లోనే మింట్ మిల్లెట్ పులావ్, మల్టీ గ్రెయిన్ మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ సలాడ్, మూంగ్‌దాల్ వెజిటేబుల్ సూప్ వంటలను సులువుగా చేసుకోవచ్చు ఇలా...

మధుమేహులకు... మేలైన వంటకాలు!

వంటిల్లు



మింట్ మిల్లెట్ పులావ్

కావాల్సిన పదార్థాలు

కొర్రలు- 1 కప్పు, పచ్చి కొబ్బరి పాలు- 1 కప్పు, పుదీనా ఆకులు- 1 కప్పు, తరిగిన అల్లం- 1 ఇంచు(సన్నగా తరగాలి), బిర్యానీ ఆకు- 1, యాలకులు- 2, లవంగాలు-2, దాల్చిన చెక్క- 1, నెయ్యి- టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, పచ్చిమిర్చి- 2 (సన్నగా తరగాలి)

తయారీ విధానం

ముందుగా కొర్రలను శుభ్రంగా మూడుసార్లు కడగాలి. చల్లని నీటిలో కొర్రలను రాత్రంతా నానబెట్టాలి. వంట చేసేప్పుడు ముందుగా మూకుడులో కొబ్బరిపాలు వేసి గోరువెచ్చగా వేడిచేసి పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత పుదీనా ఆకులను శుభ్రంగా కడిగి పక్కన ఉంచుకోవాలి. మరో మూకుడులో నెయ్యి తీసుకోవాలి. నెయ్యి వేడయ్యాక బిర్యానీ ఆకు, యాలకులు, లవంగాలు, దాల్చిన చెక్క వేసి గరిటెతో కలపాలి. మంచి సువాసన వచ్చేదాక గరిటెను తిప్పుతూ వేయించుకోవాలి. ఇందులో తరిగిన అల్లం ముక్కలతో పాటు పచ్చిమిర్చి ముక్కలు వేయాలి. తరిగిన పుదీనా ఆకులు వేయాలి. పుదీనా వాసన వచ్చేంత వరకూ వేయించాక.. నానబెట్టిన కొర్రలు వేయాలి. మూడు నిముషాల పాటు గరిటెతో తిప్పితే.. కొర్రలకు మసాలా పదార్థాలు, పుదీనా ఫ్లేవర్ అంటుతుంది. ఆ తర్వాత పక్కన బెట్టిన కొబ్బరి పాలు వేసి రెండు నిముషాలు కలిపాక.. తగినంత ఉప్పు వేయాలి. మూకుడు మీద మూత బెట్టి కనీసం ఇరవై నిముషాలు ఉడకబెట్టాలి. చివరగా మంటను తగ్గించి మిశ్రమాన్ని గరిటెతో కలపాలి. మింట్ మిల్లెట్ పులావ్ రెడీ. అవసరం అనుకుంటే పుదీనాతో పాటు నెయ్యిలో వేయించిన జీడిపప్పును గార్నిష్ చేసుకోవాలి. వేడివేడి మింట్ మిల్లెట్ పులావ్ తింటే ఎంతో రుచికరంగా ఉంటుంది.

మల్టీ గ్రెయిన్ మిల్లెట్ ఇడ్లీ

కావాల్సిన పదార్థాలు

జొన్నలు- అరకప్పు, సజ్జలు-అరకప్పు, రాగులు- అరకప్పు, మూడు స్పూన్లు- నగ్గుబియ్యం, సన్నబియ్యం- అరకప్పు, మినప్పప్పు- ఒకటిన్నర కప్పు, ఉప్పు- రుచికి తగినంత

తయారీ విధానం

ముందుగా బౌల్‌లో జొన్నలు, సజ్జలు, రాగులు, సగ్గుబియ్యం, సన్నబియ్యం, మినప్పప్పు వేసిన తర్వాత నీళ్లు పోసి శుభ్రం చేయాలి. రెండుసార్లు కడగాలి. ఆ తర్వాత వీటిని రాత్రంతా నానబెట్టుకోవాలి.

రాత్రంతా నానబెట్టిన తర్వాత ఈ మిల్లెట్స్‌ను జార్‌లో వేసి తగినంత ఉప్పు వేసి మిక్సీ పట్టుకోవాలి. ఇడ్లీలకు తగినట్లు మిక్సీ పట్టుకోవాలి. ఈ మిశ్రమాన్ని ఒక పాత్రలో వేసి రాత్రంతా పులియబెట్టాలి. ఉదయాన్నే ఉప్పు సరి చూసుకోవాలి. లేకుంటే తగినంత కలపాలి. ఇక ఇడ్లీ పాత్రల్లో పిండి వేసి.. ఇడ్లీలు చేసుకోవటమే. ఈ మల్టీగ్రెన్ మిల్లెట్ ఇడ్లీలను పల్లీల చట్నీ లేదా సాంబార్‌తో తినాలి.

మిల్లెట్ సలాడ్

కావాల్సిన పదార్థాలు

సజ్జలు- కప్పు, చిన్న టమోటాలు- కప్పు, కీరా- 1, పాలకూర ఆకులు- 3, లేత కొత్తిమీర- 3 ఆకులు, మిక్స్ బెల్ పెప్పర్ ముక్కలు- కొన్ని, తరిగిన తాజా పుదీనా ఆకులు- పావు కప్పు, నిమ్మకాయ-1, పావు కప్పు- బ్లాక్ ఆలివ్స్, పెప్పర్- రుచికి తగినంత, ఉప్పు- రుచికి తగినంత, వర్జిన్ ఆలివ్ ఆయిల్- మూడు టేబుల్ స్పూన్లు



తయారీ విధానం

మొదట సజ్జలను రాత్రంతా నానబెట్టుకోవాలి. ఉదయాన్నే వంట చేసేప్పుడు.. మూకుడులో సజ్జలతో పాటు రెండు కప్పుల నీళ్లు పోసి ఉడకబెట్టాలి. ఆ తర్వాత మంటను తగ్గించి.. ఇరవై నిముషాల పాటు ఉంచితే సజ్జలు నీళ్లను పూర్తిగా పీల్చుకుంటాయి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచి చల్లారబెట్టాలి.

మరో మూకుడులో కొన్ని నీళ్లు పోసి తరిగిన పాలకూర ఆకులు, చిన్న టమోటాలు, కొత్తిమీర, మిక్స్ బెల్ పెప్పర్, పుదీనా, బ్లాక్ ఆలివ్స్ వేసి కుక్ చేయాలి. ఆ తర్వాత చల్లార్చాలి. ఈ మిశ్రమాన్ని సజ్జలున్న మూకుడులో వేయాలి. మరో చిన్న మూకుడులో నిమ్మరసం, ఆలివ్ ఆయిల్, పెప్పర్, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని మిల్లెట్స్ మిశ్రమంలో వేసి బాగా కలపాలి. ఆ తర్వాత మూకుడును కాస్త కదిపి.. చివరగా పుదీనా ఆకులతో గార్నిష్ చేసుకుని తినాలి.

మూంగ్‌దాల్ వెజిటెబుల్ సూప్

కావాల్సిన పదార్థాలు

పచ్చి పెసర పప్పు- కప్పు, తరిగిన సొరకాయ ముక్కలు- అర కప్పు, టొమాటో- 1 (సన్నగా తరగాలి), నీళ్లు- నాలుగు కప్పులు, పసుపు- టీస్పూన్, జీలకర్ర- 1 టీస్పూన్, పెప్పర్- అరటీస్పూన్, సన్నగా తరిగిన అల్లం ముక్కలు- పావు టీస్పూన్, నెయ్యి- టేబుల్ స్పూన్, ఉప్పు- రుచికి తగినంత, తాజా కొత్తిమీర- అరకప్పు

తయారీ విధానం

ముందుగా మూకుడులో పెసరపప్పుతో పాటు నీళ్లపోసి మెత్తగా అయ్యేంత వరకూ ఉడికించాలి.

మరో మూకుడులో నెయ్యి వేసి వేడయ్యాక జీలకర్ర వేసి కలపాలి. దీనికి టొమాటో ముక్కలు, అల్లం ముక్కలు, పెప్పర్ పొడి, పసుపు వేసి గరిటెతో బాగా కలపాలి. ఇందులోకి ఉడకబెట్టిన పెసరపప్పు, సొరకాయ ముక్కలు వేసి కలిపాక తగినంత ఉప్పు వేసి మెత్తగా నలపాలి. తాజా కొత్తిమీరతో గార్నిష్ చేసుకుని సూప్ తాగాలి.



కొలువు వదిలి, కూరగాయలు పండిస్తూ...



చదువుకున్న యువతీయువకులు ఎవరైనా పట్నంలో ఉద్యోగం సంపాదించి, అక్కడే స్థిరపడాలని కలలు కంటారు. కానీ ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన స్మరికా చంద్రాకర్, పట్నం ఉద్యోగాన్ని వదిలేసి, కూరగాయలను పండించడం కోసం ఊరి బాట పట్టింది. ఎకరానికి 55 టన్నుల టమాటాలు పండిస్తూ, 8 రాష్ట్రాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదిగిన స్మరికా స్ఫూర్తివంతమైన కథ ఇది.

వినూత్నం



పూణెలో ఐదేళ్ల పాటు టెలికాం సెక్టార్‌లో పని చేసిన స్మరికా, 2018లో రాయ్‌పూర్‌కు వెళ్లిపోయి, బాలింతలు, పిల్లల ఆరోగ్యభద్రతకు సంబంధించిన స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగం చేసింది. ఆమె నాన్న, తాతయ్యలు ఆరు దశాబ్దాలుగా ఛత్తీస్‌ఘడ్, దమ్తారి జిల్లాలోని చార్కుడియా గ్రామంలో వ్యవసాయం చేస్తూ ఉన్నారు. చిన్నప్పటి నుంచి వాళ్లనే చూస్తూ పెరిగిన స్మరికా, వాళ్ల అడుగు జాడల్లోనే నడవాలని అనుకుంది. కానీ ఎమ్‌బిఎ చదువు, ఆమెను పూణె వైపు పరుగులు పెట్టించింది. అయినా ఆమె వ్యవసాయం పట్ల ఆసక్తి కోల్పోలేదు. రాయ్‌పూర్‌లో ఉద్యోగం చేసే సమయంలో వారాంతాల్లో ఇంటికి వెళ్లిపోయి కుటుంబ వ్యవసాయ పద్ధతులను మరింత క్షుణ్ణంగా అర్థం చేసుకోవడం మొదలుపెట్టింది. అప్పట్లో వాళ్ల కుటుంబం వరి పండిస్తూ ఉండేది. ఉద్యోగం మానేసి పూర్తిగా వ్యవసాయానికే అంకితమైపోదామని నిర్ణయించుకున్న స్మరికా వ్యవసాయ పద్ధతుల్లో తనదైన శైలిని కనబరచాలని అనుకుంది. ఆ సందర్భం గురించి మాట్లాడుతూ... " 2021లో పూర్తి స్థాయిలో వ్యవసాయం చేయగలిగే ఆత్మవిశ్వాసాన్ని సాధించి, ఉద్యోగానికి రాజీనామా చేసి మా ఊరు వచ్చేశాను. అంతకంటే ముందు, 2018 నుంచి 2021 వరకూ, అధిక ధరల వల్ల వరి పంటతో మా కుటుంబానికి రాబడి తగ్గడాన్ని నేను గమనించాను. బదులుగా ఒకే పంటను పండిస్తే, వాతావరణం అనుకూలించకపోతే పంట మొత్తం ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోతుంది. కాబట్టి ఏ పంటను పండించాలా అని ఆలోచిస్తుండగా, నాన్న, దుర్గేష్ చంద్రాకర్, కూరగాయలను పండిద్దామని అనడంతో, వాటిని పండించడమే మేలని నిర్ణయించుకున్నాను" అంటూ వ్యవసాయంలో అడుగుపెట్టిన తొలినాళ్ల గురించి చెప్పుకొచ్చింది స్మరికా.

క్షుణ్ణంగా తెలుసుకుని...

ఏ పంట పండాలన్నా భూసారం బేషుగ్గా ఉండాలి. మట్టిలో పోషకాల కొరత ఉండకూడదు. అలాగే మొక్కల మధ్య తగిన దూరం పాటించాలి. వీటి గురించిన లోతైన అవగాహన కోసం 20 ఎకరాల పొలంలో పంటలను సాగు చేసే ముందు వ్యవసాయ నిపుణులను కలిసి తగిన సూచనలు, సలహాలను పొందింది స్మరికా. నీటి వృథాను అరికట్టడం కోసం తుంపరి సేద్యాన్ని ఆశ్రయించింది. ఈ రకమైన సేద్యంతో ద్రవరూప ఎరువులు నేరుగా మొక్కల వేర్లలోకి చేరుకునే అదనపు ప్రయోజనం కూడా దక్కుతుందని ఆమె గ్రహించింది. తుంపరి సేద్యం చేసే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలను కూడా సద్వినియోగం చేసుకుంది. "పొలాన్ని దున్నిన తర్వాత, 12 ట్రాలీల ఆవు పేడను జోడించి కొన్ని రోజుల పాటు ఎండకు అలాగే వదిలేశాను. అలాగే భూసారాన్ని పెంచడం కోసం సూక్ష్మపోషకాలు, ఎంజైమ్‌లను కూడా జోడించాను. తర్వాత టమాటా మొక్కలను నాటడం కోసం బెడ్లను ఏర్పాటు చేసి మొక్కల మధ్య ఎడం ఉండేలా చూసుకున్నాం. వంకాయ మొక్కలను అంతర పంటగా కాకుండా విడిగా నాటాం. దాంతో మేం ఆశించిన ఫలితాలొచ్చాయి. మార్కెటింగ్‌లో స్మరికాకు ఆమె చదివిన ఎమ్‌బిఎ కూడా ఎంతో బాగా తోడ్పడింది.

8 రాష్ట్రాలకు ఎగుమతి చేస్తూ...

కూరగాయలను అమ్మడం కోసం, పంట కోతకొచ్చే ముందే స్థానిక మండీలకు వెళ్లి, రైతులతో మాట్లాడి, దుకాణదారులు, వ్యాపారులతో ఒక నెట్‌వర్క్ తయారుచేసుకుంది. "మేం ఎకరానికి 55 టన్నుల చొప్పున 13 ఎకరాల్లో టమాటాలను పండించగలిగాం. బ్రోకర్లతో మాట్లాడి ముందుగానే ధరలను నిర్ణయించుకుంటూ ఉంటాను. తర్వాత కూరగాయలను ప్యాక్ చేసి బ్రోకర్ల దగ్గరకు చేరుస్తూ ఉంటాను. అలా మా కూరగాయలు స్థానికంగానే కాకుండా, భువనేశ్వర్, పాట్నా, కోల్‌కతా, గౌహతి, ఢిల్లీ, హైదరాబాద్, బెంగుళూరు, విశాఖపట్నాలకు ఎగుమతి అవుతూ ఉంటాయి. టమాటో, వంకాయలను కోసిన తర్వాత, ఎరువులు, వెర్మికంపోస్ట్‌లను కలిపి నేలను అలాగే మూడు నెలల పాటు ఏ పంటా వేయకుండా వదిలేస్తాం. అలా వదిలేయడం వల్ల భూమి తిరిగి సారవంతమై రెండో పంటకు సిద్ధమవుతుంది. ఈ ఏడాది సొరకాయలు, దోసకాయలను పండించాలని అనుకుంటున్నాం. ఈ పంటల తర్వాత మళ్లీ టమాటాలు, వంకాయలను పండిస్తాం. హార్టికల్చర్‌లో భాగంగా మా 20 ఎకరాల భూమిని 35 ఎకరాలకు విస్తరించాలన్నదే నా లక్ష్యం" అంటూ ఉత్సాహంగా చెప్పుకొస్తోంది స్మరికా.

గ్రామీణులకు ఉపాధి కల్పిస్తూ...

స్మరికా కూరగాయల తోటల్లో కూరగాయలు కోయడానికీ, వాటిని ప్యాక్ చేయడానికీ, లోడ్ చేయడానికి 70 మంది పని చేస్తూ ఉంటారు. వాళ్ల గురించి ప్రస్థావిస్తూ.... "కూరగాయలను పండించడం వల్ల, మా గ్రామంలో ఉపాధి అవకాశాలు పెరిగాయి. దాంతో ప్రజలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లే బాధ తప్పింది. పీక్ సీజన్‌లో నేను ఇంకా ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తూ ఉంటాను." అని చెప్పుకొచ్చింది స్మరికా. స్మరికా తండ్రి, తాత, అమ్మమ్మలు కూడా స్మరికాను చూసి ఎంతో గర్వపడుతున్నారు. "నిజానికి మా గ్రామస్థులందరికీ కూడా ఇది గర్వించదగిన విషయం. స్మరికా మంచి రైతే కాదు, మంచి వ్యాపారవేత్త కూడా" అని గర్వంతో పొంగిపోతూ చెప్తున్నాడు స్మరిక తండ్రి దుర్గేష్.

మేకప్

నవయవ్వనంగా...

మేకప్‌తో వృద్ధాప్య ఛాయలను కొంత మేరకు దాచవచ్చు. అయితే అందుకోసం సరైన మేకప్ ఉత్పత్తులను, మెలకువలను అనుసరించాలి. వయసును దాచే మేకప్ టిప్స్ ఏవంటే..

అతి అనర్థం: వృద్ధాప్య ఛాయలు దాచడం కోసం అతిగా మేకప్ వేస్తే అసలుకే మోసం వస్తుంది. మేకప్ ముడతల్లో ఇంకిపోయి, చర్మం మీది సన్నని గీతలు మరింత స్పష్టంగా కనిపిస్తాయి. కాబట్టి మేకప్ మరీ మందంగా కాకుండా, వాటిని తగ్గించే ప్రయత్నం చేయాలి.

లిక్విడ్ మేకప్: వయసు పైబడేకొద్దీ చర్మం తేమ కోల్పోయి, పొడిబారుతుంది. కాబట్టి చర్మం మృదువుగా కనిపించడం కోసం లిక్విడ్ మేకప్ ఉత్పత్తులు ఎంచుకోవాలి. బ్లషెస్, బ్రాంజర్స్ కూడా ద్రవ రూపంలోనివే ఎంచుకోవాలి.

మాయిశ్చరైజర్: ప్రతి రాత్రీ నిద్రకు ముందు మాయిశ్చరైజర్ తప్పనిసరిగా అప్లై చేసుకోవడంతో పాటు ఉదయం మేకప్‌కు ముందు టింటెడ్ మాయిశ్చరైజర్‌ను పూసుకోవాలి.

సహజ మెరుపు: పైబడే వయసుతో చర్మం సహజసిద్ధమైన మెరుపును కోల్పోతుంది. కాబట్టి బ్లషర్, బ్రాంజర్ల వాడకాన్ని తగ్గించి, బదులుగా లిక్విడ్ హైలైటర్‌ను పెంచాలి.

ఐ మేకప్: తక్కువ ఐమేకప్ చేసుకోవాలి. ముదురు రంగు, స్మోకీ కలర్స్‌కు బదులుగా తేలికపాటి రంగులను ఎంచుకోవాలి. ముదురు రంగు ఐలైనర్, ఐ షాడోలతో వయసుకు మించి కనపడతారు. కాబట్టి తేలిక రంగులే ఎంచుకోవాలి.



న్యాచురల్ లిప్‌స్టిక్: బోల్డ్ కలర్స్‌కు బదులుగా న్యూడ్ లేదా లేత రంగు లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. లిప్‌గ్లాస్‌లు, చమ్కీల్లా మెరిసే లిప్‌స్టిక్‌ల జోలికి వెళ్లకూడదు. లిప్‌లైన్ కూడా సహజసిద్ధంగా ఉండేలా చూసుకోవాలి. అదనపు లిప్‌స్టిక్‌ను బ్లాటింగ్ పేపర్‌తో తొలగించి, పల్చగా పౌడర్ అద్దుకోవాలి.

ఐ మేకప్: కృత్రిమ కనురెప్పలకు బదులుగా నాణ్యమైన మస్కారా ఉపయోగించాలి. ఐ షాడో కూడా లేత గులాబీ రంగులో ఉండేలా చూసుకోవాలి. మస్కారా, ఐలైనర్ పొదుపుగా వాడుకోవాలి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/okRYNp6 లో చదవండి.

మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ



శర్వానంద్ హీరోగా నటించిన 35వ చిత్రం 'మనమే' ఈ నెల 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రకథానాయిక కృతి శెట్టి శుక్రవారం ఈ సినిమా విశేషాలను మీడియా సమావేశంలో వెల్లడించారు.

- ఈ సినిమాలో నా పాత్ర పేరు సుభద్ర. ఇప్పటివరకూ చేసిన పాత్రలకు భిన్నంగా ఉంటుంది. క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేసిన నాకు ఈ పాత్ర చాలా కొత్తగా అనిపించింది. 'ఇంత స్ట్రిక్ట్‌గా ఉండాలా' అని దర్శకుడు శ్రీరామ్‌ను అడిగాను. అలాగే కావాలనడంతో ఆయన్ని ఫాలో అయ్యా.
- శర్వానంద్ అద్భుతంగా నటించారు. నిన్నే సినిమా చూశా. ప్రతి సీన్‌లో ఆయన అదరగొట్టారు. ఇందులో నా ఫేవరెట్ సీన్ ఒకటుంది. దాని కోసం చాలా వెయిట్ చేశా. ఎలా చేయాలా అని ఆలోచించా. కానీ శర్వానంద్ చాలా క్యాజువల్‌గా వచ్చి ఒకే ఒక్క నిమిషంలో ఆ సీన్ చేయడంతో చాలా ఆశ్చర్యపోయా.
- స్ట్రాంగ్ ఎమోషన్స్ కలిగిన ఎంటర్‌టైనింగ్ ఫిల్మ్ 'మనమే'. కిడ్, పేరెంట్ ఎమోషన్ కూడా ఉంది. గ్లోబల్ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది. శర్వానంద్, నేను, పాప.. ఈ మూడు పాత్రల చుట్టూ తిరిగే కథ ఇది. అందుకే 'మనమే' అని పేరు పెట్టారు.
- చిత్రం షూటింగ్ లండన్‌లో జరిగింది. అక్కడి వెదర్ ఎప్పటికప్పుడు మారిపోయేది. ఒక్కోసారి హఠాత్తుగా వర్షం పడేది. అటువంటి వాతావరణంలోనూ నిర్మాత చక్కగా ప్లాన్ చేయడం వల్ల షూటింగ్ బాగా జరిగింది.
- ప్రస్తుతం మూడు తమిళ చిత్రాల్లో నటిస్తున్నాను. అలాగే ఓ మలయాళ సినిమా కూడా చేస్తున్నాను.



తెలంగాణ తేజం

'జబర్దస్త్' ఫేమ్ రాకింగ్ రాకేశ్ ప్రధాన పాత్ర పోషించిన చిత్రం 'కేసీఆర్' (కేశవ చంద్ర రమావత్). ఈ చిత్రంలోని 'తెలంగాణ తేజం' అంటూ సాగే గీతాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆవిష్కరించారు. గోరేటి వెంకన్న రచించి.. మను, కల్పనతో కలసి ఆలపించారు. చరణ్ అర్జున్ స్వరాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో చిత్రబృందంతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం

సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'హరోంహర'. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ నాయుడు గ్రాండ్‌గా నిర్మించిన ఈ యాక్షన్ థ్రిల్లర్ థియేట్రికల్ ట్రైలర్‌ను సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా విడుదల చేశారు. ఈ ట్రైలర్‌ను మహేశ్‌బాబు సోషల్ మీడియా ద్వారా విడుదల చేసి, సుధీర్‌బాబుకు, టీమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ట్రైలర్ లాంచ్ వేడుకకు దర్శకులు అనిల్ రావిపూడి, సంపత్ నంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'సుధీర్‌బాబు రాంబోలా ఉంటాడు. ఇందులో జేమ్స్‌బాండ్ ఇన్ కుప్పం అని చెప్పడం ఆసక్తికరంగా ఉంది. రాయలసీమ యాస లో సుధీర్‌బాబు అద్భుతంగా మాట్లాడారు. ఆయన కెరీర్‌లోనే ఇది బిగ్గెస్ట్ హిట్ కావాలి' అని కోరారు. 'ట్రైలర్ టెర్రిఫిక్‌గా ఉంది. విజువల్స్ బాగున్నాయి. సినిమా పెద్ద హిట్ కావాలి' అన్నారు సంపత్ నంది. సుధీర్‌బాబు మాట్లాడుతూ 'యాక్షన్ సినిమా చేయమని కృష్ణగారు చాలా సార్లు చెప్పారు. ఈ సినిమా ఆయనకు ఆనందం కలిగిస్తుందని నమ్ముతున్నా. ఇండియన్ సినిమాలో 'హరోం హర' లాంటి బ్యాక్‌డ్రాప్ ఉన్న సినిమా రాలేదనే చెప్పాలి. యాక్షన్ సీన్లు టాప్ రేంజ్‌లో ఉంటాయి. నిర్మాతలు బాగా ఖర్చు పెట్టారు. దర్శకుడు సాగర్ ఈ సినిమా కోసం సరికొత్త ప్రపంచాన్ని సృష్టించారు' అని చెప్పారు. జూన్ 14న సుధీర్‌బాబు మాస్ సంభవం చూడబోతున్నారని దర్శకుడు జ్ఞానసాగర్ ద్వారక చెప్పారు.

సినిమా చూడకుండానే రివ్యూ ఇస్తున్నారు



విష్వక్‌సేన్

'సినిమా చూసి నిజాయితీగా సమీక్ష రాయడంలో తప్పు లేదు. కానీ కొంత మంది సినిమా చూడకుండానే ఆ పని చేస్తున్నారు. మరికొందరు కావాలనే నెగెటివ్ రివ్యూలు రాస్తున్నారు. అయితే వాటిని పట్టించుకోకుండా ప్రేక్షకులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రాన్ని చూసేందుకు వస్తున్నారు' అని హీరో విష్వక్‌సేన్ అన్నారు. ఆయన హీరోగా కృష్ణచైతన్య దర్శకత్వం వహించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా విష్వక్‌సేన్ మీడియాతో మాట్లాడుతూ 'కొన్నాళ్లుగా థియేటర్ల దగ్గర ప్రేక్షకుల సందడి కనిపించ లేదు. ఇప్పుడు మా 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం కోసం మళ్లీ ప్రేక్షకులు థియేటర్ల బాట పడుతున్నారు. మా సినిమాకు వస్తున్న ప్రేక్షకాధరణకు చాలా ఆనందంగా ఉంది. 'విష్వక్ సినిమాల ఎంపికలో వైవిధ్యం చూపుతారని ప్రశంసలు వస్తున్నాయి. నాలోని నటుడిగా సవాల్ విసిరేలా ఉంటేనే సినిమా చేయడం అలవాటు. ఇకముందు కూడా ఇలాంటి కొత్తదనం ఉన్న కథలతో వస్తాను' అన్నారు. 'బాలకృష్ణ గారు, వారి కుటుంబ సభ్యులు 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా బావుందని మెచ్చుకున్నారు. మంచి వసూళ్లు వస్తున్నాయని అన్ని ఏరియాల డిస్ట్రిబ్యూటర్లు ఫోన్ చేసి చెప్పారు. దీనికి త్వరలోనే సీక్వెల్ చేస్తాం' అని కృష్ణ చైతన్య చెప్పారు.

సూపర్ హీరో మూవీ 'వెపన్'

సత్యరాజ్, వసంత్ రవి, తాన్యా హోప్ ముఖ్య పాత్రలు పోషించిన 'వెపన్' చిత్రం ట్రైలర్‌ను గురువారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సత్యరాజ్ మాట్లాడుతూ 'పెన్, మైక్, మీడియా.. అనేవి రియల్ వెపన్స్. అలాగే ఓటు మరో గొప్ప వెపన్. కంటెంట్ బాగుంటే ప్రస్తుతం భాష అనేది హద్దుగా లేదు. దర్శకుడు గుహన్




అద్భుతమైన కథ రాశారు. సూపర్ హ్యూమన్ సాగాలో సాగే ఈ సినిమా ఓ ట్రెండ్ క్రియేట్ చేస్తుంది. నిర్మాత మన్సూర్ బాగా ఖర్చు పెట్టారు. ఈ నెల 7న మా సినిమా విడుదలవుతోంది. చూసి ఆదరించండి' అని కోరారు. 'ఇదొక స్పై థ్రిల్లర్. సెకండాఫ్ చాలా విభిన్నంగా ఉంటుంది. సత్యరాజ్ లోని ఓ కొత్త కోణాన్ని ఈ చిత్రంలో చూస్తారు. సెకండ్ వరల్డ్ వార్‌ను బేస్ చేసుకుని కథ రాసుకున్నా. ఈ సినిమా కోసం కొన్ని చోట్ల ఏఐ టూల్స్ వాడాం' అని చెప్పారు దర్శకుడు గుహన్. సూపర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్ లా ఈ సినిమా కూడా ఓ సూపర్ హీరో మూవీలా నిలిచిపోతుందని నటుడు వసంత్ రవి చెప్పారు. కొత్త కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని తాన్యా హోప్ తెలిపారు.

'సత్యభామ' కోసం ఫైట్ చేశా



కాజల్ అగర్వాల్ లీడ్ రోల్‌లో నటించిన 'సత్యభామ' చిత్రం ఈ నెల ఏడున విడుదల కానుంది. నవీన్‌చంద్ర కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకుడు. విడుదల నేపథ్యంలో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో చిత్ర సమర్పకుడు శశికిరణ్ తిక్క మాట్లాడుతూ 'గూఢచారి' చిత్రం చేస్తున్న సమయంలోనే నా మిత్రుడు రమేశ్ ఈ కథ చెప్పారు. ప్రేక్షకులకు చెప్పాల్సిన కథ అనిపించింది. ఈ సినిమా పూర్తిగా హైదరాబాద్ బేస్డ్‌గా ఉంటుంది' అని చెప్పారు. దర్శకుడు సుమన్ చిక్కాల మాట్లాడుతూ 'ఇందులో ఎమోషన్‌తో పాటు యాక్షన్ ఉంది. అవి రెండూ చేయగలరు కనుకే కాజల్‌ను తీసుకున్నాం. ప్రతి పోలీస్ ఆఫీసర్ జర్నీలో ఒక స్పెషల్ కేసు ఉంటుంది. ఇందులో కాజల్ కూడా ఒక కేసుని పర్సనల్‌గా తీసుకుని, దాని విషయంలో ఎమోషనల్ అవుతుంది' అని చెప్పారు. కాజల్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో కొత్త ప్రయత్నం చేశా. ఇలాంటి పాత్ర, చిత్రం చేయడం ఇదే మొదలు. కథ వినగానే కొత్తగా అనిపించి ఓకే చెప్పేశా. 'సత్యభామ' కంటే ముందు లేడీ ఓరియెంటెడ్ చిత్రాల కోసం చాలా ఆఫర్లు వచ్చాయి కానీ అంగీకరించలేదు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాను. కెరీర్‌లో మొదటిసారిగా భారీ ఫైట్లు చేశా. ఇది నా సెకండ్ ఇన్నింగ్స్ కాదు కానీ కెరీర్ మరో కొత్త దశలో వెళుతుందనుకోవచ్చు' అన్నారు.

మిడిల్ క్లాస్ కష్టాలు



అజయ్ ఘోష్, చాందిని చౌదరి ముఖ్య పాత్రలు పోషించిన 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ సినిమాను విడుదల చేస్తోంది. శివ పాలడుగు దర్శకత్వంలో హర్ష గారపాటి, రంగారావు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. నవ్విస్తూ కంట తడిపెట్టేలా ఈ ట్రైలర్ ఉంది. మిడిల్ క్లాస్ కష్టాలు చూపిస్తూ కలను నెరవేర్చుకోవడానికి వయసుతో సంబంధం లేదని ఈ చిత్రంలో చూపించబోతున్నారని ట్రైలర్ చూశాక అర్థమవుతుంది. 'అన్నీ మన కోసమే చేసుకోకూడదు.. కొన్ని మన అనుకునేవాళ్ల కోసం వదులుకోవాలి' అంటూ మూర్తి పాత్ర పోషించిన అజయ్ ఘోష్ చెప్పిన ఎమోషనల్ డైలాగ్ ఆకట్టుకుంటుంది.


'జై బోలో కృష్ణ'

దివంగత నటుడు సూపర్‌స్టార్ కృష్ణ మనవడు అశోక్ గల్లా హీరోగా నటిస్తున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. కృష్ణ జయంతి సందర్భంగా శుక్రవారం ఈ చిత్రం నుంచి 'జై బోలో కృష్ణ' అంటూ సాగే



గీతాన్ని యూనిట్ విడుదల చేసింది. కృష్ణాష్టమి నేపథ్యంలో సాగే ఈ గీతానికి రఘురామ్ అడ్వకేట్ సాహిత్యం అందించగా, భీమ్స్ సిసిరోలియో స్వరాలందించారు. స్వరాగ్ కీర్తన్ ఆలపించారు. ఈ చిత్రంలో వారణాసి మానస కథానాయిక. అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని యూనిట్ తెలిపింది.

ఈసారి క్రికెటర్ బయోపిక్‌తో...



'దేదే ప్యార్ దే 2, రెయిడ్ 2, సన్ ఆఫ్ సర్దార్ 2, సింగమ్ అగైన్' లాంటి పలు చిత్రాల షూటింగ్‌తో బిజీగా ఉన్నారు బాలీవుడ్ హీరో అజయ్ దేవ్‌గణ్. ఇప్పుడు ఆయన తన తదుపరి చిత్రాన్ని ప్రకటించారు. ఆయన హీరోగా పాత తరం క్రికెటర్ పల్వాంకర్ బాలూ జీవిత గాథను తెరపైకి తెస్తున్నారు. నిర్మాత ప్రీతీ సిన్హా సోషల్ మీడియా ద్వారా ఈ చిత్రానికి సంబంధించిన వివరాలను తెలిపారు. తిగ్మాన్షు ధూలియా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్రగుహ రాసిన 'ఏ కార్నర్ ఆఫ్ ఏ ఫారెన్ ఫీల్డ్' పుస్తకం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. భారతదేశంలో తొలి తరం దళిత క్రికెటర్‌గా పల్వాంకర్ ఖ్యాతి గడించారు. ఈ ఏడాది చివర్లో ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది. ఇటీవలే అజయ్ దేవ్‌గణ్ క్రీడానేపథ్య చిత్రం 'మైదాన్'తో విజయాన్ని సొంతం చేసుకున్నారు. 'మిషన్ మంగళ్' చిత్రం దర్శకుడు అజయ్‌శక్తితో ఆయన ఓ చిత్రం చేయబోతున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తోంది.

చెస్‌లో ఇషాని రికార్డు



హైదరాబాద్: చెస్‌లో నగరానికి చెందిన ఐదేళ్ల బాలిక ఇషాని చక్కిలం అరుదైన రికార్డును నెలకొల్పింది. 9.3 నిమిషాల్లో 104 చెక్‌మేట్ (ఒక్క ఎత్తులో)లను పూర్తి చేసి అబ్బురపరిచింది. శుక్రవారం రాయదుర్గంలోని తన నివాసంలో పలువురు చెస్ నిపుణుల మధ్య ఇషాని ఈ రికార్డును నమోదు చేసింది. ఇషాని ఆటను ప్రత్యక్షంగా వీక్షించిన మంత్రి కొండా సురేఖ, బ్రిటీష్ డిప్యూటీ హై-కమిషనర్ గారెత్ విన్ తదితర ప్రముఖులు ఆమెను అభినందించారు. ఈ రికార్డును వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సు (లండన్)లో నమోదు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నిషాంత్‌కు పారిస్ బెర్త్



బ్యాంకాక్: ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత, యువ బాక్సర్ నిషాంత్ దేవ్ పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ దక్కించుకున్నాడు. శుక్రవారం ఇక్కడ జరిగిన బాక్సింగ్ ఒలింపిక్ క్వాలిఫయర్స్ 71 కిలోల విభాగంలో నిషాంత్ క్వార్టర్స్‌లో వాసిలె సెబోటరి (మాల్డోవా)ను ఓడించి సెమీస్ చేరడంతో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాడు. భారత్ నుంచి బాక్సింగ్‌లో ఇది నాలుగో పారిస్ ఒలింపిక్ కోటా. పురుషుల్లో మాత్రం నిషాంత్‌దే తొలి బెర్త్. ఇప్పటికే నిఖత్ జరీన్ (50 కి), ప్రీతి పవార్ (54 కి), లవ్లీనా (75 కి) పారిస్ క్రీడలకు ఎంపికైన సంగతి తెలిసిందే. ఇక, అమిత్ పంఘాల్ (51 కి), సచిన్ (57 కి) తమ విభాగాల్లో క్వార్టర్స్ చేరారు.

వరల్డ్ బాక్సింగ్‌కు భారత్ జై

న్యూఢిల్లీ: భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ)..వరల్డ్ బాక్సింగ్‌కు జై కొట్టింది. ఈ విషయాన్ని బీఎఫ్ఐ అధ్యక్షుడు అజయ్ సింగ్ శుక్రవారం వెల్లడించారు. అవినీతి ఆరోపణలతో ఇంటర్నేషనల్ బాక్సింగ్ అసోసియేషన్ (ఐబీఏ) గుర్తింపును అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సస్పెండ్ చేసింది. దాంతో ఐఓసీకి అనుబంధంగా కొత్తగా వరల్డ్ బాక్సింగ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే ఆయా ఆదేశాల బాక్సింగ్ సమాఖ్యలు ఐబీఏతో కొనసాగితే 2028 లాస్‌ఏంజెల్స్ ఒలింపిక్స్ కమిటీ నుంచి బాక్సింగ్‌ను తప్పిస్తామని ఐఓసీ ఇటీవల హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ఐబీఏ నుంచి వైదొలగి వరల్డ్ బాక్సింగ్‌లో చేరుతున్నట్టు అజయ్ సింగ్ వివరించారు.

సమరానికి సై

నేడు బంగ్లాతో భారత్ వామప్

రేపటి నుంచే టీ20 ప్రపంచకప్

మెగా టోర్నమెంట్‌కు సమయం సమీపించింది. మరి కొద్ది గంటల్లో టీ20 వరల్డ్ కప్‌నకు తెర లేవనుంది. ఇప్పటికే కొన్ని జట్లు వామప్ మ్యాచ్‌ల ద్వారా తమ బలాలు, బలహీనతలపై అంచనాకొచ్చేశాయి. వాటిని సమీక్షించుకొని, తప్పులు సవరించుకొని అసలు సమరానికి సన్నద్ధమయ్యాయి. టీమిండియా కూడా సిసలైన ఫైట్‌కు ముందు బంగ్లాదేశ్‌తో నేడు ప్రాక్టీస్ మ్యాచ్‌లో తలపడనుంది.



న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌లో ఈనెల 5న జరిగే అసలు సమరానికి టీమిండియా అస్త్రశస్త్రాలను పరీక్షించుకోనుంది. ఈక్రమంలో బంగ్లాదేశ్‌తో శనివారం వామప్ మ్యాచ్‌లో రోహిత్ సేన తలపడనుంది. టీమిండియాలోని 15 మంది ఆటగాళ్లు.. ఐపీఎల్‌లో ఆయాజట్లకు ప్రాతినిధ్యం వహించారు. దాంతో అందరికీ మ్యాచ్ ప్రాక్టీస్ కొరత ఏమాత్రం లేదు. ఈ ప్రాక్టీస్ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ మినహా మిగిలిన 14 మంది క్రికెటర్లంతా బరిలో దిగనున్నారు. విరాట్ శుక్రవారమే జట్టుతో చేరిన నేపథ్యంలో అతడు ఈ మ్యాచ్‌కు దూరం కానున్నాడు. అయితే మెగా టోర్నీకి కాంబినేషన్లను రూపొందించడమే భారత్‌కు సవాలు కానుంది. మంచి ఫామ్‌లో ఉన్న యశస్వీ జైస్వాల్‌ను తుది జట్టులో ఎలా చేర్చాలన్నదే జట్టు మేనేజ్‌మెంట్ ముందున్న సమస్య. జైస్వాల్‌ను తీసుకొంటే పవర్ హిట్టర్ శివమ్ దూబేను పక్కన పెట్టక తప్పదు. అందువల్ల జైస్వాల్‌ను పక్కన పెడితే..రోహిత్, విరాట్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు. అదే జరిగితే టోర్నమెంట్ తదుపరి దశలో దూబేకు అవకాశం కల్పించవచ్చు. అలవోకగా సిక్సర్లు దంచే దూబే టోర్నమెంట్‌లో ఎక్స్ ఫాక్టర్ అవుతాడనేది విశ్లేషకుల అంచనా. బుమ్రాతో కొత్త బంతిని పంచుకొనే బౌలర్ విషయంలోనూ జట్టు సముచిత నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఐపీఎల్‌లో సిరాజ్‌తో పాటు అర్ష్‌దీప్ ధారాళంగా పరుగులు ఇచ్చుకున్నారు. దాంతో వీరి ఫామ్ జట్టును కలవరపరుస్తోంది. కొత్తగా ఏర్పాటు చేసిన డ్రాప్ ఇన్ పిచ్‌లపై అర్ష్‌దీప్ మెరుగ్గా బౌలింగ్ చేస్తాడని క్రికెట్ పండితులు చెబుతున్నారు. అమెరికాలో భారత్ మ్యాచ్‌లు ఉదయాన్నే మొదలవుతాయి కనుక..బౌలింగ్‌లో వైవిధ్యం కనబర్చడం ముఖ్యం. ఈ కోణంలో చూస్తే సిరాజ్ కంటే అర్ష్‌దీప్ మెరుగైన ప్రత్యామ్నాయం అవుతాడు. ఇక..స్లో వికెట్‌పై షకీబల్, మెహ్దీ హసన్, ముస్తాఫిజుర్‌ను మిడిలార్డర్ బ్యాటర్లు ఎలా ఎదుర్కొంటారనేది ఆసక్తికరం. కాగా, టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఆదివారం ఉదయం 6.30 గంటలకు ఆతిథ్య అమెరికా, కెనడా జట్ల మధ్య జరగనుంది. అదేరోజు రాత్రి 8 గంటలకు వెస్టిండీస్‌తో పపువా న్యూగిని జట్టు తలపడనుంది.

బేస్‌బాల్ దేశంలో.. క్రికెట్‌కు దారి దొరికేనా?

18వ శతాబ్దం మధ్య కాలంలో అమెరికాలో ఆదరణ పొందిన క్రికెట్ ఆ తర్వాతి కాలంలో కనుమరుగైంది. ఇప్పుడు మళ్లీ టీ20 వరల్డ్‌కప్‌తో క్రమంగా వేళ్లూనుకోవాలనుకొంటోంది. కానీ, బేస్‌బాల్ మేనియా నెలకొన్న అగ్రరాజ్యంలో మెగా ఈవెంట్‌తో క్రికెట్ ఏమేరకు యువతను ఆకర్షించగలుగుతుందనేది చర్చనీయాంశంగా మారింది. ప్రపంచ క్రికెట్‌ను నడిపిస్తోంది భారత్ అనడంలో సందేహం లేకపోయినా.. అమెరికాలో కూడా క్రికెట్ విస్తరణకు భారీగా అవకాశాలున్నాయని ఐసీసీ లెక్కలేస్తోంది. యూఎస్‌లో భారీగా క్రికెట్ అభిమానులున్నారని చెబుతోంది. అంతేకాకుండా 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు దక్కడం కూడా ఆట పాపులారిటీని పెంచే అవకాశం ఉంది. అందులోనూ ఈ వరల్డ్‌కప్‌నకు స్ప్రింట్ దిగ్గజం ఉసేన్ బోల్ట్‌ను ప్రచారకర్తగా ఎంచుకోవడం కూడా అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వ్యూహంలో భాగమే. యూఎస్‌లో ముద్ర వేయగలిగితే.. విశ్వవ్యాప్తంగా క్రికెట్ విస్తరణకు మార్గం మరింత సుగమమవుతుందన్నది ఐసీసీ ఆలోచన.

సుదీర్ఘకాలం తర్వాత..: పొట్టికప్‌లో భాగంగా అమెరికాలోని మూడు స్టేడియాలు న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడాలో మొత్తం 16 మ్యాచ్‌లు జరగనున్నాయి. కాగా, 1844లో యూఎస్, కెనడా మధ్య న్యూయార్క్‌లో అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ జరిగింది. మళ్లీ 180 ఏళ్ల తర్వాత వరల్డ్‌కప్‌తో ఇక్కడ క్రికెట్ జోష్ కనిపించనుంది. ఒకానొక దశలో జెంటిల్మన్ క్రీడను అమెరికాలో విపరీతంగా ఆడేవారు. కానీ, 1860ల్లో దేశంలో నెలకొన్న అంతర్యుద్ధం కారణంగా బేస్‌బాల్‌కు ఆదరణ పెరిగింది. అయితే, క్రికెట్ మూలాలున్న దేశాల వారు అమెరికాలో ఎక్కువగా స్థిరపడడం సానుకూలాంశం. అయితే, క్రికెట్‌ను కూడా బాస్కెట్‌బాల్, బేస్‌బాల్ తరహాలో కెరీర్‌గా మలచుకోవచ్చనే భరోసా యువతలో కలిగించగలిగితే చాలని ప్రస్తుత టోర్నీలో తలపడుతున్న యూఎస్ జట్టు స్పిన్నర్ నిసర్గ్ పటేల్ చెప్పాడు. ఈ క్రమంలో ఆటను మూలాలకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



మురికివాడల నుంచి కప్పు దాకా..

మురికివాడలో పుట్టినా.. తన క్రికెట్ ప్రతిభతో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవాలనుకొంటున్నాడు ఉగాండ పేసర్ జుమా మియాగి. తొలిసారి టీ20 వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించిన ఈ జట్టు ఆశలన్నీ మియాగిపైనే పెట్టుకొంది. రాజధాని కంపాలలోని మురికివాడల్లో పుట్టి పెరిగిన జుమా.. అండర్-19 క్రికెట్‌తో వెలుగులోకి వచ్చాడు. రెండేళ్ల తర్వాత ఇప్పుడు జట్టు బౌలింగ్‌కు వెన్నెముకగా మారాడు. జట్టులోని మరో సభ్యుడు సైమన్ సెజాజి, రిజర్వ్ ఆటగాడు ఇన్నోసెంట్ మెవిబేజ్‌లతో పాటు మరికొందరి ఆటగాళ్లది కూడా ఇలాంటి కథే. ఉండడానికి తగిన ఇల్లు, తాగడానికి పరిశుభ్రమైన నీరు లేని ప్రదేశంలో పుట్టిన వీళ్లు.. ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో దేశానికి ఆడుతూ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. అక్కడి సమాజం వీళ్లను వెలుగు రేఖలుగా భావిస్తోంది. ఉగాండా కోచ్ అభయ్ శర్మ కూడా వీరి దుస్థితిని చూసి చలించిపోయాడు. ఆటతో తమ తలరాతలు మార్చుకోవాలనే పట్టుదల వారిలో ప్రస్ఫుటంగా కనిపిస్తోందని చెప్పాడు. అయితే, కెన్యా మాదిరి క్రికెట్‌లో తెరమరుగవకుండా ఉండేందుకు వారికి అండదండలు అందించాలని శర్మ అన్నాడు.



ప్రాక్టీస్ ఏర్పాట్లపై టీమిండియా అసంతృప్తి

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌నకు సిద్ధమయ్యేందుకు తమకు ఏర్పాటు చేసిన ప్రాక్టీస్ సౌకర్యాలపై టీమిండియా అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రస్తుతం న్యూయార్క్‌లో ఉన్న రోహిత్ సేన నెట్ ప్రాక్టీస్ కోసం కాంటియేగ్ పార్క్‌ను కేటాయించారు. బుధవారం నుంచి ఆటగాళ్లు ఇక్కడ సాధన ఆరంభించారు. ఇక వామప్ మ్యాచ్‌తో పాటు మూడు గ్రూప్ మ్యాచ్‌లు జరిగే నాసౌ కౌంటీ క్రికెట్ స్టేడియంలో అయితే ఎలాంటి ప్రాక్టీస్ సౌకర్యాలు లేవు. అలాగే భోజన ఏర్పాట్లు కూడా సరిగా లేవని సమాచారం. మరోవైపు ప్రాక్టీస్‌లో సౌకర్యాలలేమిపై ఏ జట్టు కూడా తమకు ఫిర్యాదు చేయలేదని ఐసీసీ చెబుతోంది.

సెమీస్‌లో గాయత్రి జోడీ

సింగపూర్: తెలుగమ్మాయి గాయత్రి గోపీచంద్-ట్రీసా జాలీ జోడీ సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో టైటిల్ దిశగా దూసుకెళుతోంది. గతరౌండ్లో ప్రపంచ రెండో ర్యాంక్ జంటను చిత్తుచేసిన గాయత్రి ద్వయం ఈసారి ఆరో ర్యాంకర్‌ను కంగుతినిపించి సెమీఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగిన మహిళల డబుల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో గాయత్రి-ట్రీసా జంట 18-21, 21-19, 24-22తో ప్రపంచ ఆరో ర్యాంక్ జోడీ కిమ్ సో యోంగ్-కాంగ్ హీ యోంగ్ (దక్షిణ కొరియా)పై గెలిచింది. సూపర్ 750 సిరీస్ ఈవెంట్‌లో సెమీస్‌లో ప్రవేశించడం గాయత్రి జంటకిదే తొలిసారి. శనివారం జరిగే సెమీస్ పోరులో 4వ సీడ్ నమి మత్సుయమ-చిహారు షిడా (జపాన్)తో గాయత్రి జోడీ అమీతుమీ తేల్చుకోనుంది.

స్వియటెక్, గాఫ్ జోరు

రుబ్లేవ్ అవుట్ ● ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో మరో సంచలనం చోటు చేసుకుంది. ఈసారి ఆరో సీడ్ ఆండ్రీ రుబ్లేవ్ తిరుగుముఖం పట్టాడు. అన్‌సీడెడ్ మాటియో ఆర్నాల్డీ.. రష్యా స్టార్ రుబ్లేవ్‌కి షాకిచ్చాడు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో ఇటలీ ఆటగాడు మాటియో ఆర్నాల్డీ 7-6 (6), 6-2, 6-4తో రుబ్లేవ్‌ను కంగుతినిపించాడు. రెండోసీడ్ సిన్నర్ 6-4, 6-4, 6-4తో కొటోవ్‌పై నెగ్గి నాలుగో రౌండ్ చేరాడు. ఇక మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ స్వియటెక్ 6-4, 6-2తో బౌజ్కోవాని, మూడో సీడ్ కొకొ గాఫ్ 6-2, 6-4తో 30వ సీడ్ యాస్ట్రెమ్‌స్కాని, ఐదో సీడ్ వొండ్రుసోవా 6-1, 6-3తో పాక్వెట్‌ని, 8వ సీడ్ జెబ్యూర్ 6-4, 7-6 (5)తో లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తుచేశారు.

శ్రీరామ్ ముందుకు.. యుకీ ఇంటికి: ఫ్రెంచ్ ఓపెన్‌లో శుక్రవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల డబుల్స్‌లో యుకీ భాంబ్రీ ఇంటిబాట పట్టగా.. శ్రీరామ్ బాలాజీ ముందంజ వేశాడు. స్థానిక ఆటగాడు అల్బనో వొలివేటితో కలిసి బరిలో దిగిన యుకీ భాంబ్రీ ఆరంభ రౌండ్లో 3-6, 6-7 (5)తో పీర్స్/సఫియులిన్ జంట చేతిలో ఓటమి పాలయ్యాడు. ఇక..మిగ్వెల్ యాంజెల్ (మెక్సికో)తో జట్టు కట్టిన శ్రీరామ్ బాలాజీ 6-3, 6-4తో రీస్ స్టాడర్/వెర్బీక్ జోడీపై విజయం సాధించి రెండోరౌండ్లో అడుగుపెట్టాడు.

బిజినెస్

కదం తొక్కిన ఆర్థికం

2023-24లో జీడీపీ వృద్ధి రేటు 8.2 %.. క్యూ4లో 7.8 శాతానికి పరిమితం

- తయారీ రంగం ఆలంబనగా జోరు
- ప్రపంచంలో శరవేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా భారత్



న్యూఢిల్లీ: తయారీ రంగం అందించిన ఊతంతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ అంచనాలను మించి 8.2 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. దీంతో ప్రపంచంలో వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది. అంతే కాదు, ఈ వృద్ధితో భారత ఆర్థిక వ్యవస్థ 3.5 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి చేరడమే కాకుండా వచ్చే కొద్ది సంవత్సరాల కాలంలో 5 లక్షల కోట్ల డాలర్ల లక్ష్యాన్ని చేరడానికి రంగం సిద్ధం చేసుకుంది. అయితే నాలుగో త్రైమాసికంలో (2024 జనవరి-మార్చి) మాత్రం వృద్ధి రేటు 7.8 శాతానికి మందగించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంలో నమోదైన స్థూల జాతీయోత్పత్తి రేటు (జీడీపీ) 6.2 శాతం కాగా ఏడాది మొత్తానికి నమోదైన వృద్ధి రేటు 7 శాతంగా ఉంది.

పోటీ ఆర్థిక వ్యవస్థ చైనా 2024 తొలి మూడు నెలల కాలంలో నమోదు చేసిన వృద్ధి రేటు 5.3 శాతం కన్నా భారత్ నమోదు చేసిన వృద్ధి చాలా ఎక్కువగా ఉంది. ఈ ఏడాది మార్చి 31వ తేదీతో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు గణాంకాలను జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన 2024-25 ఆర్థిక సంవత్సరంలో దేశం 7 శాతం వృద్ధిని సాధిస్తుందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అంచనా.

జీడీపీ పరిమాణం రూ.174 లక్షల కోట్లు

ఎన్ఎస్ఓ గణాంకాల ప్రకారం స్థిర ధరల ప్రాతిపదికన 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ పరిమాణం రూ.173.82 లక్షల కోట్లుగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి తొలి సవరించిన అంచనాల ప్రకారం జీడీపీ పరిమాణం రూ.160.71 లక్షల కోట్లు లేదా 7.7 శాతం. దీని ప్రకారం చూసినట్టయితే గత ఏడాది జీడీపీ వృద్ధి రేటు 8.2 శాతం అని ఎన్ఎస్ఓ తెలిపింది. కాగా ప్రస్తుత ధరల ప్రాతిపదికన చూసినట్టయితే 2023-24 ఆర్థిక సంవత్సరంలో 9.6 శాతం వృద్ధి నమోదైంది. జీడీపీ పరిమాణం గత ఏడాదితో పోల్చితే రూ.269.50 లక్షల కోట్ల నుంచి రూ.295.36 లక్షల కోట్లకు పెరిగింది. ఇక మార్చి త్రైమాసికంలో జీడీపీ పరిమాణం స్థిర ధరల ప్రకారం గత ఏడాదితో పోల్చితే రూ.43.84 లక్షల కోట్ల నుంచి రూ.47.24 లక్షల కోట్లకు పెరిగింది. అంటే 7.8 శాతం వృద్ధితో సమానం. ఇదే త్రైమాసికంలో వర్తమాన ధరల ప్రకారం ఇది రూ.71.23 లక్షల కోట్ల నుంచి రూ.78.28 లక్షల కోట్లకు పెరిగింది. అంటే 9.9 శాతంతో సమానం.

2023-24లో వృద్ధి రేటు తీరిదీ...

ఏప్రిల్-జూన్ (క్యూ1)	8.2 శాతం
జూలై-సెప్టెంబరు (క్యూ2)	8.1 శాతం
అక్టోబరు-డిసెంబరు (క్యూ3)	8.6 శాతం
జనవరి-మార్చి (క్యూ4)	7.8 శాతం

జీవీఏ రూ.158.74 లక్షల కోట్లు

కాగా స్థూల విలువ జోడింపు (జీవీఏ) 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.148.05 లక్షల కోట్ల నుంచి (2022-23) రూ.158.74 లక్షల కోట్లకు పెరిగింది. అంటే జీవీఏ వృద్ధి రేటు 6.7 శాతం నుంచి 7.2 శాతానికి పెరిగింది.

ఇది ట్రైలర్ మాత్రమే

"రాబోయే కాలంలో మన ఆర్థిక వ్యవస్థ సాధించబోయే జోరుకు ఇది ఒక ట్రైలర్ మాత్రమే. భారత ప్రజల శ్రమించి పని చేసే తత్వానికి ఇది ప్రతీక. భారతదేశం ప్రపంచంలో వేగవంతంగా వృద్ధిచెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందనేందుకు ఇది ఒక సంకేతం"

- ప్రధాని నరేంద్ర మోదీ

మూడో విడతలోనూ అదే జోరు

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం మూడో విడతలో కూడా వృద్ధిలో ఇదే జోరు కొనసాగుతుంది. అన్ని ప్రధాన సూచీలు ఇదే సంకేతం ఇస్తున్నాయి. 2023-24 సంవత్సరంలో మనం సాధించిన వృద్ధి అద్భుతం. ప్రపంచంలోని అన్ని ప్రధాన ఆర్థిక వ్యవస్థల వృద్ధి కన్నా ఇది అధికం. తయారీ రంగం సాధించిన 9.9 శాతం వృద్ధి మోదీ ప్రభుత్వ విజయాలకు నిదర్శనం. ప్రపంచ సవాళ్ల నడుమన కూడా మనం సాధించిన విజయానికి ఇది తార్కాణం.

- నిర్మలా సీతారామన్, ఆర్థిక మంత్రి

విత్త లోటు 5.63 శాతం

కేంద్ర ప్రభుత్వ విత్త లోటు 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీడీపీలో 5.63 శాతంగా నమోదైంది. నగదు పరిమాణంలో చూసినట్టయితే విత్త లోటు (ప్రభుత్వాదాయాలు, వ్యయాల మధ్య వ్యత్యాసం) రూ.16.53 లక్షల కోట్లుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి ఒకటో తేదీన ప్రతిపాదించిన తాత్కాలిక బడ్జెట్లో ప్రకటించిన అంచనా 5.8 శాతం (రూ.17.34 లక్షల కోట్లు) కన్నా ఇది మెరుగైన స్థితి. ప్రభుత్వాదాయం పెరగడంతో పాటు వ్యయాలు తగ్గడం ఇందుకు కారణం. కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (సీజీఏ) విడుదల చేసిన గణాంకాల ప్రకారం ప్రభుత్వానికి సమకూరిన ఆదాయం సవరించిన అంచనాలతో పోల్చితే 101.2 శాతం ఉంది. నికర పన్ను వసూళ్లు రూ.23.26 లక్షల కోట్లుండగా మొత్తం వ్యయాలు రూ.44.42 లక్షల కోట్ల మేరకు (సవరించిన అంచనాల్లో 98.9 శాతం) ఉన్నాయి. కాగా మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రెవిన్యూ లోటు జీడీపీలో 2.6 శాతం, వాస్తవిక లోటు 1.6 శాతంగా నమోదయ్యాయి.

కెనరా హెచ్‌ఎస్‌బీసీలో ఐపీఓ ద్వారా 14.5% వాటాల విక్రయం

- కెనరా బ్యాంక్

న్యూఢిల్లీ: జీవిత బీమా సంస్థ కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో 14.5 శాతం వాటాలను విక్రయించేందుకు డైరెక్టర్ల బోర్డు ఆమోదం లభించిందని కెనరా బ్యాంక్ ప్రకటించింది. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ద్వారా ఈ వాటాలను విక్రయించాలని చూస్తున్నట్టు తెలిపింది. ఈ షేర్లను బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో నమోదు చేయనున్నట్టు పేర్కొంది. కెనరా హెచ్‌ఎస్‌బీసీ లైఫ్‌లో కెనరా బ్యాంక్‌కు 51 శాతం వాటా ఉండగా హెచ్‌ఎస్‌బీసీ ఇన్సూరెన్స్ (ఆసియా, పసిఫిక్) హోల్డింగ్స్‌కి 26 శాతం, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు 23 శాతం వాటా ఉంది. తనకున్న 51 శాతం వాటాలో 14.5 శాతం వాటాలను ఐపీఓ ద్వారా విక్రయించాలని కెనరా బ్యాంక్ నిర్ణయించింది. కాగా, రుణ పత్రాల (బాండ్స్) మార్కెట్ నుంచి రూ.17,000 కోట్లు సమీకరించేందుకు కెనరా బ్యాంక్ సిద్ధమవుతోంది.

బీఓఐ 666 రోజుల ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకం

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) 666 రోజుల కాల వ్యవధి ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) పథకాన్ని తీసుకొచ్చింది. ఈ ఎఫ్‌డీపై సీనియర్ సిటిజన్లకు 7.8 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 7.95%, ఇతరులకు 7.3 శాతం వడ్డీ చెల్లిస్తారు. జూన్ 1 నుంచి ఈ ఎఫ్‌డీ అమల్లోకి వస్తుంది. ఈ ఎఫ్‌డీపై డిపాజిటర్లు రుణాలు కూడా తీసుకోవచ్చని బీఓఐ తెలిపింది. ఏదైన అవసరం ఏర్పడితే ఈ ఎఫ్‌డీని మధ్యలోనే వెనక్కి తీసుకునే సౌలభ్యమూ ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,850 ▲	66,800 ▲	1,00,000 ▼
ముంబై	72,356 ▲	66,278 ▲	92,449 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

జూన్ 1వ తేదీ

హైదరాబాద్	505	విజయవాడ	490
వరంగల్	507	గోదావరి	485
చిత్తూరు	563	విశాఖపట్నం	500

డజను గుడ్లు రూ. 66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	142	విజయవాడ	146
వరంగల్	142	గుంటూరు	149
కరీంనగర్	142	ఒంగోలు	149
మహబూబ్‌నగర్	144	చిత్తూరు	147
కర్నూలు	144	నెల్లూరు	147
విశాఖపట్నం	135	అనంతపురం	146
గోదావరి	146		

కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్‌లోకి అరబిందో ఫార్మా

- ఎంఎస్‌డీతో ఒప్పందం..
- 1,000 కోట్లతో ప్లాంట్ ఏర్పాటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన ఔషధ సంస్థ అరబిందో ఫార్మా తాజాగా కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్‌లోకి ప్రవేశించింది. బయోలాజికల్స్ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కోసం ప్లాంట్ ఏర్పాటుకు మెర్క్ షార్ప్ అండ్ డోహ్మె సింగపూర్ ట్రేడింగ్ పీటీఈ లిమిటెడ్ (ఎంఎస్‌డీ)తో తన అనుబంధ సంస్థ థెరానియమ్ బయోలాజిక్స్ ఒప్పందం కుదుర్చుకుందని అరబిందో ఫార్మా శుక్రవారం వెల్లడించింది. ఇందులో భాగంగా, థెరానియమ్ బయోలాజికల్స్ రూ.1000 కోట్ల పెట్టుబడితో ఏటా 2.5-3 కోట్ల వయల్స్ తయారీ సామర్థ్యంతో కూడిన ప్లాంట్‌ను మెదక్ జిల్లాలోని హత్నూర మండలం, బోరపట్ల గ్రామంలో ఏర్పాటు చేయనుంది. ఈ ప్లాంట్‌లో తయారు చేసే ఉత్పత్తులను ఎంఎస్‌డీకి సరఫరా చేయనుంది. బయోలాజికల్స్ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ కార్యకలాపాల కోసం థెరానియమ్‌లో మైనారిటీ వాటా కలిగిన అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ క్యూరాటెక్ బయోలాజిక్స్ గత ఏడాది అక్టోబరులో ఎంఎస్‌డీతో లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను కుదుర్చుకుంది. అందులో భాగంగా ఒప్పందం ఖరారుపై చర్చలను ఈ మార్చి 31 నాటికి ముగించాల్సి ఉండగా.. డెడ్‌లైన్‌ను మే 31 వరకు పొడిగించుకున్నాయి.

ఆర్బిక్యులర్ ఫార్మాలో రూ.165 కోట్ల పెట్టుబడులు

- టాటా క్యాపిటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాటా క్యాపిటల్ నిర్వహణలోని టాటా క్యాపిటల్ హెల్త్‌కేర్ ఫండ్-2 హైదరాబాద్ కంపెనీలపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ కేంద్రంగా పని చేసే ఆర్బిక్యులర్ ఫార్మాస్యూటికల్ టెక్నాలజీస్‌లో 2 కోట్ల డాలర్ల (సుమారు రూ.166.84 కోట్లు) పెట్టుబడులు పెట్టింది. అయితే కంపెనీ ఈక్విటీలో ఇది ఎంత వాటాకు సమానమనే విషయాన్ని రెండు కంపెనీలు వెల్లడించలేదు. ఆర్బిక్యులర్ ఫార్మా క్లిష్టమైన జెనరిక్ ఔషధాల అభివృద్ధిలో నిమగ్నమై ఉంది. ఈ క్లిష్టమైన జెనరిక్ ఔషధాలకు అమెరికా, తదితర దేశాల్లో మంచి మార్కెట్ ఉంది. అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత పటిష్ఠం చేసుకోవటానికి హెల్త్‌కేర్ ఫండ్ పెట్టుబడులు ఎంతగానో ఉపయోగపడతాయని ఆర్బిక్యులర్ ఫార్మా ఎండీ ఎంఎస్ మోహన్ తెలిపారు.

5 రోజుల తర్వాత లాభాలొచ్చాయ్

సెన్సెక్స్ 75 పాయింట్లు అప్

ముంబై: వరుసగా ఐదు రోజుల్లో 2 శాతం నష్టపోయిన ఈక్విటీ సూచీలు వారాంతం ట్రేడింగ్‌లో స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నాయి. సెన్సెక్స్ 75.71 పాయింట్లు పెరిగి 73,765.15 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 42.05 పాయింట్ల వృద్ధితో 22,530.70 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో సగం లాభపడగా.. మిగతా సగం నష్టపోయాయి. టాటా స్టీల్ 1.80 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలవగా.. బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి. నెస్లే ఇండియా మాత్రం 2 శాతానికి పైగా క్షీణించింది. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.76 శాతం వరకు పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో యుటిలిటీస్, రియల్టీ 2 శాతానికి పైగా పుంజుకోగా.. పవర్, సర్వీసెస్, మెటల్, టెలికాం సూచీలు ఒక శాతానికి పైగా పెరిగాయి. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించి 83.42 వద్ద ముగిసింది.

స్వల్పంగా తగ్గిన ఫారెక్స్ నిల్వలు

వరుసగా మూడు వారాల పాటు పెరుగుతూ వచ్చిన విదేశీ మారకం (ఫారెక్స్) నిల్వలు మళ్లీ కాస్త తగ్గుముఖం పట్టాయి. ఆర్‌బీఐ శుక్రవారం విడుదల చేసిన డేటా ప్రకారం.. ఈ నెల 24తో ముగిసిన వారంలో ఫారెక్స్ నిల్వలు 202.7 కోట్ల డాలర్లు తగ్గి 64,667 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం వారంలో నిల్వలు ఆల్‌టైం గరిష్ఠ స్థాయి 64,870 కోట్ల డాలర్ల స్థాయికి చేరాయి.

ప్రారంభించారు.. మూసేశారు..

- తెలంగాణ అమరవీరుల స్మారకం ప్రజలు చూసేదెన్నడో?
- అన్ని పనులు పూర్తయినా స్వాధీనం చేసుకోని హెచ్ఎండీఏ

ఖైరతాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కోసం అమరులైన త్యాగధనులను ఎప్పటికీ స్మరించుకునేలా ఏర్పాటు చేసిన అమరవీరుల స్మారకం సందర్శకులకు అందుబాటులోకి రావడంలేదు. అన్ని హంగులతో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 జూన్ 22న దీనిని ప్రారంభించినా, చిన్న చిన్న పనులున్నాయని సందర్శకులకు అందుబాటులోకి తీసుకురాలేదు. ప్రస్తుతం పూర్తి స్థాయిలో పనులు ముగిసినా సందర్శకులకు అందుబాటులోకి తీసుకురాలేకపోవడంపై చాలామంది అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ స్మారకం రోడ్లు భవనాల శాఖ ఆధీనంలో ఉండగా దీనిని స్వాధీనం చేసుకోవాలని గత నవంబర్‌లోనే హెచ్ఎండీఏకు లేఖ ఇచ్చినా ఇప్పటికీ స్వాధీనం చేసుకోవడం లేదు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలను కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా చేయనున్న నేపథ్యంలో ఈ స్మారకాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తే బాగుంటుంది. ఈ విషయమై ప్రభుత్వ వర్గాలు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. కాగా, కేవలం అమెరికాలో మాత్రమే కనిపించే నమూనాతో రూపొందించిన ఈ తెలంగాణ అమరవీరుల స్మారకాన్ని 1700 టన్నుల స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తయారుచేశారు. దీపం ఆకారంలోని ఈ నిర్మాణం ఎప్పటికీ వెలిగేలా ఏర్పాట్లు చేయడంతో చాలామంది దాన్ని తిలకించేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. 3.29 ఎకరాల స్థలంలో 2.85 లక్షల చదరపు అడుగుల నిర్మాణంతో చూడముచ్చటగా రూపొందించారు. రెండు లైన్ల పార్కింగ్ వసతితో తొలి, మలి దశ తెలంగాణ అమరుల చిత్రాలతో కూడిన మ్యూజియం, రెస్టారెంట్, ఆడిటోరియంతో పాటు బయటి ప్రాంతంలో 30 అడుగుల మ్యూజికల్ ఫౌంటెయిన్, రకరకాల చెట్లతో లాన్‌ను ఏర్పాటు చేశారు.



తెరుచుకోని తెలంగాణ అమరవీరుల స్మారకం

తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ భూ సేకరణ శాఖ, కలెక్టర్, ఖమ్మం వారి కూడీ ప్రకటన
ఫారం -VII

భూసేకరణ పునరుపాధి కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19 (1) లోని సబ్-రూల్-1) రూల్) 25 ప్రకారం

కలెక్టర్ ఫైల్ నెం.జి1/0153/2022, తేది:15.03.2024
యల్ ఏ ఓ కల్లూరు ఫైల్ నెంబర్. ఎ/1568/2022 తేది:17.02.2024

తెలంగాణా ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, ఖమ్మం గారు దిగువ నిర్దిష్ట పరిచిన ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలములోని కిష్టారం గ్రామములో ఉన్న భూమి సుమారు విస్తీర్ణము ఎ.36.02 1/4 గుం॥. నిమిత్తం అనగా జే.వి.ఆర్ ఓ.సి-II కొరకు ఈ దిగువ చూపిన భూమి అవసరము అయి ఉన్నందున భావించనైనది.

కావున ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి మండలములోని కిష్టారం గ్రామములో ఉన్న భూమి సుమారు ఎ. 36.02 1/4 గుం॥. గల భూమి యొక్క వివరములు, ఈ క్రింద చూపిన వారి నుండి భూసేకరణ నిమిత్తం, ప్రాథమిక డిక్లరేషన్ జారీచేయనైనది.

షెడ్యూలు

గ్రామం:కిష్టారం మండలం: సత్తుపల్లి జిల్లా: ఖమ్మం

క్ర. సం	సర్వే నంబర్ సబ్‌డివిజన్ తో	సర్వే నెంబరు	భూమి విస్తీర్ణం	భూమి టైటిల్	భూమి రకము	పట్టాదారు మరియు అనుభవదారు వివరములు	హద్దులు	చెట్లు మరియు కట్టడములు
1	78/5/2/A	78/58	0.04	బంజరాయి	మెట్ట	సిద్దెల నాగేశ్వర్ రావు తండ్రి శేషయ్య సిద్దెల శేషయ్య తండ్రి పిచ్చయ్య	తూర్పు: పత్తిపాటి వర్ణమ్మ, పడమర: నాగేశ్వరరావు, ఉత్తరం: ఎన్.సి.సి.ఎల్, దక్షిణం: శీలం వెంకటేశ్వరావు	
2	78/5/2/B	78/58	0.04	బంజరాయి	మెట్ట	సిద్దెల వంశం తండ్రి శేషయ్య సిద్దెల శేషయ్య తండ్రి పిచ్చయ్య	తూర్పు: పత్తిపాటి వర్ణమ్మ, పడమర: నాగేశ్వరరావు, ఉత్తరం: ఎన్.సి.సి.ఎల్, దక్షిణం: శీలం వెంకటేశ్వరావు	
3–123	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

(మిగతా 13వ పేజీలో)

యాదాద్రి ప్లాంట్.. దొంగల ముఠా పట్టివేత

- ఏడాదిగా విలువైన పరికరాల చోరీ.. హైదరాబాద్ విక్రయం
- రూ. 1.49కోట్ల సామగ్రి, నగదు స్వాధీనం.. 11 మంది అరెస్టు
- చోరీకి గతంలో అక్కడ పనిచేసిన ఓ పోలీసు అధికారి సహకారం?

నల్లగొండ, మే 31: ఏడాదిగా నల్లగొండ జిల్లా దామరచర్ల వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ (వైటీపీఎస్)లో యంత్ర పరికరాలు, జీఐ బండిల్స్, అల్యూమినియం షీట్లు ఏడాదిన్నరగా చోరీ అవుతున్నాయి. వైటీపీఎస్‌లో చొరబడుతున్న దొంగలు, విలువైన వస్తువులను స్క్రాప్‌గా అమ్ముకొని కోట్లలో సొమ్ము చేసుకుంటున్నట్లుగా ఆరోపణలొచ్చాయి. ఈ చోరీ కేసును నల్లగొండ జిల్లా పోలీసులు ఛేదించారు. చోరీకి సంబంధించి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ చందన దీప్తి వివరాలను వెల్లడించారు. నిందితుల నుంచి రూ.71 లక్షల విలువైన నాలుగు జీఐ బండిల్స్‌ను, రూ.58లక్షల నగదును, రూ.20లక్షల విలువైన ఓ బెలినో కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను మొత్తం రూ.1.49 కోట్ల విలువైన వస్తువులను, నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన వైటీపీఎస్ ప్రాజెక్టులో భారీ నిర్మాణాలు జరుగుతుండగా, అందుకు అవసరమైన పరికరాలను ఆ ప్రాజెక్టు ప్రాంతంలో నిల్వ ఉంచారు. ఏడాదిన్నర కాలంగా ఈ పరికరాలు భారీ ఎత్తున చోరీకి గురికావడం గమనించిన నిర్మాణ కంపెనీ బీహెచ్ఈఎల్, ఇతర నిర్మాణ సంస్థలు వాడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాయి. ఈ మేరకు మూడు కేసులను నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టారు. తమ ఆదేశాల మేరకు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఆధ్వర్యంలో మిర్యాలగూడ రూరల్ సీఐ వీరబాబు, వాడపల్లి ఎస్ఐ రవి, వేములపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్, మాడ్గులపల్లి ఎఎస్సై శోభన్‌బాబు, వాడపల్లి పీఎస్ సిబ్బంది, సీసీఎస్ కానిస్టేబుల్ విష్ణులతో కలిసి ప్రత్యేక బృందంగా ఏర్పడి వారం రోజులుగా చేసిన విచారణతో మూడు కేసులను నమోదు చేశామని. మిర్యాలగూడకు చెందిన షేక్ మహ్మద్, షేక్ మునీర్, షేక్ రజాక్, మహ్మద్ జానీ, మంద మహేశ్, దామరచర్ల మండలం ఇరికిగూడెంకు చెందిన కంబాల అశోక్, అదే మండలం వీర్లపాలెంకు చెందిన మంద శ్రీను, వాడపల్లికి చెందిన మహ్మద్ అఫ్రోజ్, వీర్లపాలెంకు చెందిన మంద నాగేందర్‌బాబు, యూపీకి చెందిన అమిత్‌కుమార్ భరద్వాజు, రవీంద్ర ప్రసాద్ అనే వ్యక్తులను అరెస్టు చేశామని వెల్లడించారు. వీరు వైటీపీఎస్ ఆవరణలోకి డీసీఎంలను పంపి క్రేన్ ఆపరేటర్ సహకారంతో చోరీ చేసిన పరికరాలను హైదరాబాద్‌లోని ముషీరాబాద్‌కు చెందిన షరీఫుద్దీన్‌కు విక్రయించి సొమ్ము చేసుకుని పంచుకున్నట్లు వెల్లడించారు. ఈ కేసులో విచారణ కొనసాగుతుందని నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి పోలీస్ కస్టడీ ద్వారా మిగతా విచారణ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇంకా ఎవరెవరు భాగస్వాములు ఉన్నారో విచారణ చేయాల్సి ఉందన్నారు.

ఓ పోలీస్ అధికారి హస్తం?

చోరీ ముఠాకు గతంలో పవర్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించిన ఓ పోలీస్ అధికారి అండదండలు అందించినట్లు చర్చ సాగుతోంది. అందుకు ప్రతిఫలంగా దొంగల నుంచి లక్షల్లో తీసుకున్నట్లు సమాచారం. సెక్యూరిటీ ఎస్సైగా విధులు నిర్వహించి సీఐగా పదోన్నతిపై బదిలీ అయిన అధికారి. తాను విధుల్లో ఉన్నప్పుడే విలువైన యంత్రపరికరాలను ముఠా సభ్యులు తరలించారని పలువురు ఆరోపిస్తున్నారు. బరువైన యంత్రాలను సైతం హైడ్రాలిక్ క్రేన్‌లతో అద్దె వాహనాల్లోకి లోడ్ చేసి ప్రధాన గేటు ద్వారానే తరలించినట్లు విమర్శలొస్తున్నాయి.

నకిలీ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌తో 16కోట్ల నష్టం!

- సర్కార్‌కు సమాచారశాఖ ఉద్యోగులసంఘం ఫిర్యాదు

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో 2017-18లో చీఫ్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్‌గా పని చేసిన ఒక అధికారి రూ.16 కోట్లతో నకిలీ పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ (యాంప్లిఫయర్లు, మైకులు, స్పీకర్లు వంటివి) కొనుగోలు చేశారని, అది కనీసం పది రోజులైన పని చేయలేదని సమాచార శాఖ అధికారులు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఇటీవల ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. గత ఆరేళ్లగా ఈ పరికరాలన్నీ సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం స్టోర్ రూమ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై 2018లో విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టి.. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలంటూ అప్పటి కమిషనర్‌కు సిఫార్సు చేసినా, తర్వాత ఆ కేసును మూసివేశారని పేర్కొన్నారు. కాగా, టీఎస్ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో రూ.13 కోట్ల ఖర్చుతో 124 షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించగా వాటిలో 22 షార్ట్ ఫిల్మ్‌లను మాత్రమే ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రసారానికి ఇచ్చారని తెలిపారు. అప్పటి సమాచార శాఖ కమిషనర్, ఎఫ్‌డీసీ ఈడీ కుమ్మక్కై రూ.6 కోట్లు స్వాహా చేశారని ఆరోపించారు. దీనిపై ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా ఇప్పటి వరకు చర్య తీసుకోలేదని ఉద్యోగుల సంఘం పేర్కొంది.

ఆర్ అండ్ బీ కార్యదర్శిగా బి.విజయేందిర

- ఈఎన్‌సీగా పి.మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, మే31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్ అండ్ బీ(రహదారులు మరియు భవనాలు) శాఖ కార్యదర్శిగా బి.విజయేందిర నియమితులయ్యారు. అలాగే ఆర్ అండ్ బీ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ, అడ్మిన్)గా పి.మధుసూదన్ రెడ్డి నియామకం జరిగింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది. ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న విజయేందిరకు ఆ విభాగం కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు.. ఇంటర్ కేడర్ డిప్యూటేషన్ పూర్తవ్వడంతో ఆయన తెలంగాణ నుంచి రిలీవ్ అయ్యి ఏపీ సాధారణ పరిపాలన శాఖలో రిపోర్ట్ చేశారు. ఇక, ప్రస్తుత ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ (అడ్మిన్) పింగళి సతీష్ శుక్రవారం పదవీ విరమణ చేశారు. దీంతో ఆ బాధ్యతలను మధుసూదన్ రెడ్డికి అప్పగించారు. కాగా, శుక్రవారం ఒక్కరోజే ఆర్ అండ్ బీ శాఖలో వివిధ హోదాల్లో ఉన్న తొమ్మిది మంది పదవీ విరమణ చేశారు. రహదారులు, భవనాల శాఖలో మార్చి నుంచి రిటైర్మెంట్లు మొదలవ్వగా మే 31 నుంచి డిసెంబరు వరకు వివిధ హోదాల్లో ఉన్న 37 మంది అధికారులు రిలీవ్ కాబోతున్నారు.

నీటి పారుదల ఈఎన్‌సీ సర్వీసు పొడిగింపు

- సీఎం నిర్ణయానికి వ్యతిరేకమన్న సంఘాలు

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, క్వాలిటీ కంట్రోల్) బి.నాగేంద్రరావు పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఆయన పదవీ విరమణ చేయగా ఆయనను కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఆరు నెలల పాటు పునర్నియామకం చేస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా జీవో నంబర్ 142ను జారీ చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు/పునరుద్ధరణ ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగ సంఘాలు మాత్రం ఈ నిర్ణయాన్ని తప్పుపట్టాయి. సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయానికి వ్యతిరేకంగా ఉత్తర్వులు ఇచ్చారని మండిపడ్డాయి. దీనిపై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించాయి.

ఐదుగురు ఎస్ఈల స్థానంలో...

ఇక శుక్రవారం పదవీ విరమణ చేసిన ఎస్ఈల స్థానంలో కొత్తవారికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నర్సంపేట ఎస్ఈగా వి.జగదీశ్‌కు, పోచంపాడు ఎస్ఈగా టి.శ్రీనివాస రావు గుప్తాకు, సంగారెడ్డి ఎస్ఈగా బి.ఏసయ్యకు, స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎస్ఈగా పి.రవీందర్‌రెడ్డికి, భద్రాచలం ఎస్ఈగా హెచ్.వి.రాంప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

2న హైకోర్టులో తెలంగాణ ఆవిర్భావోత్సవాలు

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావోత్సవాలు జరగనున్నాయి. ఉదయం 9.30 గంటలకు చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే జాతీయ జెండాను విష్కరించనున్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకావాలని సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, లా ఆఫీసర్లుకు హైకోర్టు రిజిస్ట్రార్ ఆహ్వానాలు పంపారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రండి!

కేసీఆర్‌కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం, ప్రత్యేక లేఖ

మాజీ సీఎంకు ఆహ్వాన పత్రిక స్వయంగా ఇచ్చిన ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్

సానుకూలంగా స్పందించిన బీఆర్ఎస్ అధినేత!.. వేడుకల ఏర్పాట్లపై ఆరా

హైదరాబాద్, మే 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటులో భాగస్వాములందరినీ(స్టేక్ హోల్డర్స్) రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌నూ కూడా వేడుకలకు ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేసిన ఆహ్వాన పత్రిక, ప్రత్యేక లేఖను అందించింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(ప్రోటోకాల్ శాఖ) హర్కార వేణుగోపాల్ సీఎం రేవంత్ రెడ్డి తరఫున ఆహ్వాన పత్రాన్ని కేసీఆర్‌కు శుక్రవారం స్వయంగా అందజేశారు. హర్కార వేణుగోపాల్, ప్రొటోకాల్ శాఖ డైరెక్టర్ అర్వింద‌ర్‌సింగ్, డిప్యూటీ డైరెక్టర్ బేగ్.. హైదరాబాద్, నందిహిల్స్‌లోని కేసీఆర్ నివాసానికి వెళ్లి ఆయన్ను వేడుకలకు ఆహ్వానించారు. ఉదయం పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే వేడుకకు, సాయంత్రం ట్యాంక్ బండ్ వద్ద తలపెట్టిన కార్యక్రమానికి హాజరు కావాలని ముఖ్యమంత్రి తరఫున కేసీఆర్‌ను ఆహ్వానించారు. ఈ ఆహ్వాన పత్రాన్ని, సీఎం పంపిన సందేశాన్ని కేసీఆర్ స్వీకరించారు. దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న తీరు, ఏర్పాట్ల వివరాలను కేసీఆర్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడిన హర్కార వేణుగోపాల్.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను కేసీఆర్‌ను ఆహ్వానించినట్లు చెప్పారు. ప్రభుత్వ ఆహ్వానానికి కేసీఆర్ సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.

రాష్ట్ర ఆవిర్భావంలో భాగస్వాములందరికీ ఆహ్వానం

కేసీఆర్‌తో సహా రాష్ట్ర ఆవిర్భావంలో భాగస్వాములందరినీ రాష్ట్ర ప్రభుత్వం వేడుకలకు ఆహ్వానిస్తోంది. రాష్ట్ర ఆవిర్భావంలో తమ వంతు పాత్ర పోషించిన రాజకీయ పార్టీలను, 1969 ఉద్యమకారులు, మలి దశ ఉద్యమకారులను ఆహ్వానించింది. అలాగే, 650 మంది అమరవీరుల కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా ఆహ్వానిస్తోంది. రాష్ట్రంలోని అన్ని పార్టీల అధినేతలనూ ఆహ్వానిస్తుంది. అందరి భాగస్వామ్యంతోనే ప్రత్యేక తెలంగాణ కల సాకారమైందనే సంకేతం ప్రజల్లోకి బలంగా వెళ్లేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీని ఉద్యమకారులు, భాగస్వామ్య పార్టీల సమక్షంలో ప్రభుత్వం సన్మానించనుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న స్వయం సహాయక గ్రూపు మహిళలనూ ఆహ్వానించింది. స్వయం సహాయక సంఘాలకు చెందిన సుమారు 12 వేల మంది ఈ వేడుకకు హాజరు కానున్నారు.

(12వ పేజీ తరువాయి)

124	158/48/2/A	158/1/1C	0.08 1/4	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసే బోయిన నరసింహారావు	
125	158/48/2/B	158/140/1	0.01 1/4	బంజరాయి	మెట్ట	సూరటి నరసింహా రావు భర్త సోమయ్య	తూర్పు: పతిపాటి వజ్రమ్మ పడమర: నాగేశ్వరరావు ఉత్తరం: ఎస్‌సీసీఎల్ దక్షిణం: శీలం వెంకటేశ్వరరావు	
126	158/48/2/C	158/105/1	0.00	బంజరాయి	మెట్ట	సూరటి యాలాద్రి తండ్రి సోమయ్య	తూర్పు: పతిపాటి వజ్రమ్మ పడమర: నాగేశ్వరరావు ఉత్తరం: ఎస్‌సీసీఎల్ దక్షిణం: శీలం వెంకటేశ్వరరావు	
127	158/48/2/D	158/108	0.00 1/2	బంజరాయి	మెట్ట	జోసేబోయిన రఘుపతి తండ్రి అప్పయ్య	తూర్పు: శీలం కళ్యాణి పడమర: సుశీల ఉత్తరం: అడవి దక్షిణం: జోసే బోయిన నరసింహారావు	
128	158/49/2	158/1/10	0.09 1/4	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసె బోయిన నరసింహారావు	
129	158/50/A	158/108	0.02 1/2	బంజరాయి	మెట్ట	జోసె బోయిన రఘుపతి తండ్రి అప్పయ్య	తూర్పు: శీలం కళ్యాణి పడమర: సుశీల ఉత్తరం: అడవి దక్షిణం: జోసె బోయిన నరసింహారావు	
130	158/50/B	-	0.02 3/4	బంజరాయి	మెట్ట	జోసె బోయిన నరసింహా రావు తండ్రి రఘుపతి	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: ఎస్. రమేష్ దక్షిణం: జోసె బోయిన నరసింహారావు	
131	158/50/C	158/1/10	0.00 1/4	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
132	158/51/A	158/108	0.02	బంజరాయి	మెట్ట	జోసె బోయిన రఘుపతి తండ్రి అప్పయ్య	తూర్పు: శీలం కళ్యాణి పడమర: సుశీల ఉత్తరం: అడవి దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
133	158/51/B		0.03	బంజరాయి	మెట్ట	జోసె బోయిన నరసింహా రావు తండ్రి రఘుపతి	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: ఎస్. రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
134	158/52/A	158/108	0.03 1/4	బంజరాయి	మెట్ట	జోసె బోయిన రఘుపతి తండ్రి అప్పయ్య	తూర్పు: శీలం కళ్యాణి పడమర: సుశీల ఉత్తరం: అడవి దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
135	158/52/B	158/1/10	0.03 1/4	బంజరాయి	మెట్ట	జోసె బోయిన నరసింహా రావు తండ్రి రఘుపతి	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: ఎస్. రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
136	158/52/C	158/1/10	0.00 1/2	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
137	158/53/A	158/108	0.02 1/4	బంజరాయి	మెట్ట	జోసె బోయిన రఘుపతి తండ్రి అప్పయ్య	తూర్పు: శీలం కళ్యాణి పడమర: సుశీల ఉత్తరం: అడవి దక్షిణం: జోసె బోయిన నరసింహారావు	
138	158/53/B	-	0.02 1/4	బంజరాయి	మెట్ట	జోసె బోయిన నరసింహా రావు తండ్రి రఘుపతి	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: ఎస్. రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
139	158/53/C	158/1/10	0.01	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసె బోయిన నరసింహారావు	
140	158/54/2	158/1/10	[illegible]	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	జీడి మామిడి-99 [illegible]
141	158/55/2	158/1/10	0.13	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
142	158/56/2/A	-	0.05	బంజరాయి	మెట్ట	పెద్ద గొండ్ల సరస్వతి భర్త సూర్యనారాయణ	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహా రావు ఉత్తరం: శీలం వెంకటేశ్వర రావు దక్షిణం: షేక్ బాజీ	
143	158/56/2/B	158/1/10	0.05 1/4	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసె బోయిన నరసింహా రావు	
144	158/57/A	158/108	0.02 3/4	బంజరాయి	మెట్ట	జోసె బోయిన రఘుపతి తండ్రి అప్పయ్య	తూర్పు: శీలం కళ్యాణి పడమర: సుశీల ఉత్తరం: అడవి దక్షిణం: జోసెబోయిన నరసింహా రావు	
145	158/57/B		0.02 3/4	బంజరాయి	మెట్ట	జోసె బోయిన నరసింహా రావు తండ్రి రఘుపతి	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: ఎస్. రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహా రావు	
146	158/57/C	-	0.11 3/4	బంజరాయి	మెట్ట	పెద్ద గొండ్ల సరస్వతి భర్త సూర్యనారాయణ	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహా రావు ఉత్తరం: శీలం వెంకటేశ్వర రావు దక్షిణం: షేక్ బాజీ	
147	158/57/D	158/1/10	0.03 3/4	బంజరాయి	మెట్ట	బోయిన నరసింహా రావు తండ్రి సిద్దయ్య	తూర్పు: పెద్ద గొండ్ల సూర్య నారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: వరకాల రమేష్ దక్షిణం: జోసె బోయిన నరసింహా రావు	
148	158/58/A	158/159	0.01	బంజరాయి	మెట్ట	లోయ పెద్దరాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వర రావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
149	158/58/B	158/155	0.05 3/4	బంజరాయి	మెట్ట	లోయ రాజమ్మ భర్త వెంకయ్య	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: పెద్ద గొండ్ల సరస్వతి ఉత్తరం: శీలం రామకృష్ణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	జామాయిల్ - 700
150	158/58/C		0.05 1/2	బంజరాయి	మెట్ట	పెద్ద గొండ్ల సరస్వతి భర్త సూర్య నారాయణ	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహారావు ఉత్తరం: శీలం వెంకటేశ్వర రావు దక్షిణం: షేక్ బాజీ	[illegible]
151	158/59/2		0.39 1/2	బంజరాయి	మెట్ట	పెద్ద గొండ్ల సరస్వతి భర్త సూర్య నారాయణ	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహారావు ఉత్తరం: శీలం వెంకటేశ్వర రావు దక్షిణం: షేక్ బాజీ	
152	158/60/2/A	158/155	0.06 1/2	బంజరాయి	మెట్ట	లోయ రాజమ్మ భర్త వెంకయ్య	తూర్పు: లోయ పెద్ది రాజు పడమర: పెద్ద గొండ్ల సరస్వతి ఉత్తరం: శీలం రామకృష్ణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
153	158/60/2/B		0.02 3/4	బంజరాయి	మెట్ట	పెద్ద గొండ్ల సరస్వతి భర్త సూర్య నారాయణ	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహారావు ఉత్తరం: శీలం వెంకటేశ్వర రావు దక్షిణం: షేక్ బాజీ	
154	158/61/2/A	158/159	0.01	బంజరాయి	మెట్ట	లోయ పెద్ద రాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వర రావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
155	158/61/2/B	158/156	0.01 1/4	బంజరాయి	మెట్ట	లోయ వెంకటేశ్వర రావు తండ్రి పెద్ది రాజు	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: లోయ శ్రీనివాసరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాస రావు	జామాయిల్-9 [illegible]
156	158/61/2/C	158/162/1	0.01 1/4	బంజరాయి	మెట్ట	బీమల చిన్న వెంకట రమణ భర్త సాయి	తూర్పు: లోయ శ్రీనివాసరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకట రమణ	జామాయిల్ -980 తాటి చెట్లు -8
157	158/61/2/D	-	0.01 1/4	బంజరాయి	మెట్ట	లోయ శ్రీనివాసరావు తండ్రి గురవయ్య	తూర్పు: లోయ వెంకటేశ్వరరావు పడమర: బీమల వెంకటరమణ ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	జామాయిల్ -980
158	158/61/2/E	158/155	0.02 3/4	బంజరాయి	మెట్ట	లోయ రాజమ్మ భర్త వెంకయ్య	తూర్పు: లోయ పెద్దరాజు పడమర: పెద్దగొండ్ల సరస్వతి ఉత్తరం: శీలం రామకృష్ణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
159	158/62/2/A	158/159	0.02	బంజరాయి	మెట్ట	లోయ పెద్దరాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వరరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
160	158/62/2/B	158/156	0.02 1/4	బంజరాయి	మెట్ట	లోయ వెంకటేశ్వర రావు తండ్రి పెద్దిరాజు	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: లోయ శ్రీనివాసరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
161	158/62/2/C	158/162/1	0.02 1/4	బంజరాయి	మెట్ట	బీమల చిన్న వెంకట రమణ భర్త సాయి	తూర్పు: లోయ శ్రీనివాసరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	[illegible]
162	158/62/2/D	-	0.02 1/2	బంజరాయి	మెట్ట	లోయ శ్రీనివాసరావు తండ్రి గురవయ్య	తూర్పు: లోయ వెంకటేశ్వరరావు పడమర: బీమల వెంకటరమణ ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
163	158/63/A	158/159	0.08	బంజరాయి	మెట్ట	లోయ పెద్ద రాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వరరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
164	158/63/B	158/156	0.03	బంజరాయి	మెట్ట	లోయ వెంకటేశ్వర రావు తండ్రి పెద్దిరాజు	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: లోయ శ్రీనివాసరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
165	158/63/C	158/162/1	0.02 3/4	బంజరాయి	మెట్ట	బీమల చిన్న వెంకటరమణ భర్త సాయి	తూర్పు: లోయ శ్రీనివాసరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
166	158/63/D	-	0.02 3/4	బంజరాయి	మెట్ట	లోయ శ్రీనివాసరావు తండ్రి గురవయ్య	తూర్పు: లోయ వెంకటేశ్వరరావు పడమర: బీమల వెంకటరమణ ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	తాటి చెట్లు - 08
167	158/64/2/A	158/159	0.02 1/4	బంజరాయి	మెట్ట	లోయ పెద్దరాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వరరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
168	158/64/2/B	158/156	0.02 3/4	బంజరాయి	మెట్ట	లోయ వెంకటేశ్వర రావు తండ్రి పెద్దిరాజు	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: లోయ శ్రీనివాసరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
169	158/64/2/C	158/162/1	0.02 3/4	బంజరాయి	మెట్ట	బీమల చిన్న వెంకటరమణ భర్త సాయి	తూర్పు: లోయ శ్రీనివాసరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
170	158/64/2/D	-	0.02 1/2	బంజరాయి	మెట్ట	లోయ శ్రీనివాసరావు తండ్రి గురవయ్య	తూర్పు: లోయ వెంకటేశ్వరరావు పడమర: బీమల వెంకటరమణ ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
171	158/65/2/A	158/159	0.02 1/4	బంజరాయి	మెట్ట	లోయ పెద్దరాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వరరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
172	158/65/2/B	158/156	0.02 1/4	బంజరాయి	మెట్ట	లోయ వెంకటేశ్వర రావు తండ్రి పెద్దిరాజు	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: లోయ శ్రీనివాసరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
173	158/65/2/C	158/162/1	0.02 1/4	బంజరాయి	మెట్ట	బీమల చిన్న వెంకటరమణ భర్త సాయి	తూర్పు: లోయ శ్రీనివాసరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
174	158/65/2/D	-	0.02 1/4	బంజరాయి	మెట్ట	లోయ శ్రీనివాసరావు తండ్రి గురవయ్య	తూర్పు: లోయ వెంకటేశ్వరరావు పడమర: బీమల వెంకటరమణ ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
175	158/66/2/A	158/161	0.03 1/4	బంజరాయి	మెట్ట	జక్కం అప్పారావు తండ్రి [illegible]	తూర్పు: గడ్డె ఆదారయ్యలు పడమర: లోయ పెద్దిరాజు ఉత్తరం: లోయ వెంకటేశ్వరరావు దక్షిణం: జక్కం అప్పారావు	తాటి చెట్లు - 02 జామాయిల్ - 740
176	158/66/2/B	158/159	0.01 3/4	బంజరాయి	మెట్ట	లోయ పెద్ద రాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వరరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకట రమణ	
177	158/66/2/C	158/156	0.01 3/4	బంజరాయి	మెట్ట	లోయ వెంకటేశ్వర రావు తండ్రి పెద్దిరాజు	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: లోయ శ్రీనివాసరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
178	158/66/2/D	158/162/1	0.02	బంజరాయి	మెట్ట	బీమల చిన్న వెంకటరమణ భర్త సాయి	తూర్పు: లోయ శ్రీనివాసరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
179	158/66/2/E	-	0.02	బంజరాయి	మెట్ట	లోయ శ్రీనివాసరావు తండ్రి గురవయ్య	తూర్పు: లోయ వెంకటేశ్వరరావు పడమర: బీమల వెంకటరమణ ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
180	158/67/2	158/161	0.08	బంజరాయి	మెట్ట	జక్కం అప్పారావు తండ్రి [illegible]	తూర్పు: గడ్డె ఆదారయ్యలు పడమర: లోయ పెద్దిరాజు ఉత్తరం: లోయ వెంకటేశ్వరరావు దక్షిణం: జక్కం అప్పారావు	
181	158/1/1/2/A	158/188	0.01 1/2	బంజరాయి	మెట్ట	కండే సాంబయ్య తండ్రి నాగులు కండే నాగులు	తూర్పు: SCCL దారి పడమర: గడ్డె ఆదారయ్యలు ఉత్తరం: వెలిశాల సామ్రాజ్యం దక్షిణం: గడ్డె ఆదారయ్యలు	
182	158/1/1/2/B	158/188	0.01 1/2	బంజరాయి	మెట్ట	కండే వెంకటేశ్వర రావు తండ్రి నాగులు కండే నాగులు	తూర్పు: కడెం సాంబశివరావు పడమర: కడెం నరసింహారావు ఉత్తరం: వెలిశాల సామ్రాజ్యం దక్షిణం: కడెం వెంకటేశ్వరరావు	తాటి - 1
183	158/1/1/2/C	158/188	0.01 1/2	బంజరాయి	మెట్ట	కండే నరసింహారావు తండ్రి నాగులు కండే నాగులు	తూర్పు: SCCL దారి పడమర: గడ్డె ఆదారయ్యలు ఉత్తరం: వెలిశాల సామ్రాజ్యం దక్షిణం: మారిశెట్టి సాంబశివ గుప్తా	జామాయిల్ - 1200 వేప - 8
184	158/1/1/2/D	158/60/10	0.03 3/4	బంజరాయి	మెట్ట	గడ్డె ఆదారయ్యలు తండ్రి వెంకట రామయ్య	తూర్పు: కడెం వెంకటేశ్వరరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: గడ్డె రమేష్ దక్షిణం: మారిశెట్టి సాంబశివ గుప్తా	జామాయిల్ - 900 తాటి చెట్లు - 2 వేప - 2
185	158/1/1/3/A	158/188	0.23	బంజరాయి	మెట్ట	కండే సాంబయ్య తండ్రి నాగులు కండే నాగులు	తూర్పు: SCCL దారి పడమర: గడ్డె ఆదారయ్యలు ఉత్తరం: వెలిశాల సామ్రాజ్యం దక్షిణం: గడ్డె ఆదారయ్యలు	
186	158/1/1/3/B	158/188	0.23	బంజరాయి	మెట్ట	కండే వెంకటేశ్వర రావు తండ్రి నాగులు కండే నాగులు	తూర్పు: కడెం సాంబశివరావు పడమర: కడెం నరసింహారావు ఉత్తరం: వెలిశాల సామ్రాజ్యం దక్షిణం: కడెం వెంకటేశ్వరరావు	
187	158/1/1/3/C	158/188	0.23	బంజరాయి	మెట్ట	కండే నరసింహారావు తండ్రి నాగులు కండే నాగులు	తూర్పు: SCCL దారి పడమర: గడ్డె ఆదారయ్యలు ఉత్తరం: వెలిశాల సామ్రాజ్యం దక్షిణం: మారిశెట్టి సాంబశివ గుప్తా	
188	158/1/1/3/D	158/60/10	0.21	బంజరాయి	మెట్ట	గడ్డె ఆదారయ్యలు తండ్రి వెంకటరామయ్య	తూర్పు: కడెం వెంకటేశ్వరరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: గడ్డె రమేష్ దక్షిణం: మారిశెట్టి సాంబశివ గుప్తా	
189	158/1/1/3/E	158/165	0.25	బంజరాయి	మెట్ట	గడ్డ రమేష్ తండ్రి వెంకటేశ్వర రావు	తూర్పు: కడెం వెంకటేశ్వరరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: వెలిశాల సామ్రాజ్యం దక్షిణం: గడ్డె ఆదారయ్యలు	జామాయిల్ - 1100 టేకు - 08 తాటి - 05 వేప - 02
190	158/1/1/3/F	158/161	0.18	బంజరాయి	మెట్ట	జక్కం అప్పారావు తండ్రి [illegible]	తూర్పు: గడ్డె ఆదారయ్యలు పడమర: లోయ పెద్దిరాజు ఉత్తరం: లోయ వెంకటేశ్వరరావు దక్షిణం: జక్కం అప్పారావు	
191	158/1/1/3/G	158/159	0.08 1/4	బంజరాయి	మెట్ట	లోయ పెద్దరాజు తండ్రి గురవయ్య	తూర్పు: జక్కం అప్పారావు పడమర: లోయ వెంకటేశ్వరరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	జామాయిల్-980 [illegible]
192	158/1/1/3/H	158/156	0.08 1/4	బంజరాయి	మెట్ట	లోయ వెంకటేశ్వర రావు తండ్రి పెద్దిరాజు	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: లోయ శ్రీనివాసరావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
193	158/1/1/3/I	158/162/1	0.05 1/4	బంజరాయి	మెట్ట	బీమల చిన్న వెంకటరమణ భర్త సాయి	తూర్పు: లోయ శ్రీనివాసరావు పడమర: జక్కం అప్పారావు ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: బీమల వెంకటరమణ	
194	158/1/1/3/J	-	0.05 1/4	బంజరాయి	మెట్ట	లోయ శ్రీనివాసరావు తండ్రి గురవయ్య	తూర్పు: లోయ వెంకటేశ్వరరావు పడమర: బీమల వెంకటరమణ ఉత్తరం: జాల వెంకటరమణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	[illegible]
195	158/1/1/3/K	158/155	0.03	బంజరాయి	మెట్ట	లోయ రాజమ్మ భర్త వెంకయ్య	తూర్పు: లోయ పెద్దిరాజు పడమర: పెద్దగొండ్ల సరస్వతి ఉత్తరం: శీలం రామకృష్ణ దక్షిణం: లోయ శ్రీనివాసరావు	
196	158/1/1/3/L	-	0.08 3/4	బంజరాయి	మెట్ట	పెద్దగొండ్ల సరస్వతి భర్త సూర్య నారాయణ	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహారావు ఉత్తరం: శీలం వెంకటేశ్వరరావు దక్షిణం: షేక్ బాజీ	
197	158/1/1/3/M	158/108	0.12 1/2	బంజరాయి	మెట్ట	జోసెబోయిన రఘుపతి తండ్రి అప్పయ్య	తూర్పు: శీలం కళ్యాణి పడమర: సుశీల ఉత్తరం: అడవి దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
198	158/1/1/3/N	-	0.12 1/2	బంజరాయి	మెట్ట	జోసెబోయిన నరసింహారావు తండ్రి రఘుపతి	తూర్పు: పెద్దగొండ్ల సూర్యనారాయణ పడమర: సూరటి వేలాద్రి ఉత్తరం: ఎస్ రమేష్ దక్షిణం: జోసెబోయిన నరసింహారావు	
199	158/1/1/3/O	-	0.18	బంజరాయి	మెట్ట	ముడిగొండ్ల సుశీల భర్త రాములు	తూర్పు: జోసెబోయిన నరసింహారావు పడమర: కూరపాటి శ్రీను ఉత్తరం: ఫారెస్ట్ దక్షిణం: సూరటి నరసింహారావు	
200	158/1/1/3/P	158/60	0.02 0.00 3/4	బంజరాయి	మెట్ట	పువ్వాడ నాగేంద్రబాబు తండ్రి శ్రీను పువ్వాడ మురళి తండ్రి శ్రీను	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహారావు ఉత్తరం: శీలం వెంకటేశ్వరరావు దక్షిణం: షేక్ బాజీ	
201	158/1/1/3/Q	-	0.25	బంజరాయి	మెట్ట	శీలం రామకృష్ణ తండ్రి వెంకటేశ్వర రావు	తూర్పు: కొత్తపల్లి ఇస్రాయిల్ పడమర: శీలం జమలమ్మ ఉత్తరం: అడవి దక్షిణం: పెద్దగొండ్ల సూర్యనారాయణ	వేప - 8 [illegible] - 30 [illegible] - 10 ముష్టి - 5 పాల - 05 [illegible] - 04
202	158/1/1/3/R	158/143/3	0.07	బంజరాయి	మెట్ట	శీలం కళ్యాణి భర్త రామకృష్ణ	తూర్పు: కొత్తపల్లి ఇస్రాయిల్ పడమర: శీలం రామకృష్ణ ఉత్తరం: అడవి దక్షిణం: పెద్దగొండ్ల సూర్యనారాయణ	
203	158/1/1/3/S	158/143/2	0.07	బంజరాయి	మెట్ట	శీలం అన్నపూర్ణ భర్త నరసింహా రావు	తూర్పు: కొత్తపల్లి ఇస్రాయిల్ పడమర: శీలం రామకృష్ణ ఉత్తరం: అడవి దక్షిణం: పెద్దగొండ్ల సూర్యనారాయణ	
204	158/1/1/3/T	158/146	0.35	బంజరాయి	మెట్ట	శీలం జమలమ్మ భర్త వెంకటేశ్వర రావు	తూర్పు: కొత్తపల్లి ఇస్రాయిల్ పడమర: శీలం రామకృష్ణ ఉత్తరం: అడవి దక్షిణం: పెద్దగొండ్ల సూర్యనారాయణ	జీడి మామిడి 70 [illegible]
205	158/1/1/3/U	158/133/1	0.26	బంజరాయి	మెట్ట	జల వెంకటరమణ తండ్రి వెంకటేశ్వర రావు	తూర్పు: వెలిశాల సామ్రాజ్యం పడమర: పెద్దగొండ్ల సూర్యనారాయణ ఉత్తరం: లోయ వెంకటేశ్వరరావు దక్షిణం: శీలం రామకృష్ణ	జామాయిల్-980 [illegible]
206	158/1/1/3/V	158/91	0.38	బంజరాయి	మెట్ట	కొత్తపల్లి ఇస్రాయిల్ తండ్రి నాగయ్య	తూర్పు: వెలిశాల సామ్రాజ్యం పడమర: శీలం రామకృష్ణ ఉత్తరం: అడవి దక్షిణం: లోయ పెద్దిరాజు	జామాయిల్- 1342 వేప -1 తాటి చెట్లు - 1
207	158/1/1/3/X	158/157&158/163	0.37	బంజరాయి	మెట్ట	వెలిశాల సామ్రాజ్యం భర్త రత్తయ్య	తూర్పు: SCCL WAY పడమర: కండే సాంబయ్య ఉత్తరం: అడవి దక్షిణం: ఒడ్డేల భవాని	జామాయిల్-1200 వేప - 2 టేకు - 42
208	158/1/1/3/Y	-	0.20	బంజరాయి	మెట్ట	ఓడెల భవాని భర్త సత్య నారాయణ	తూర్పు: రాయల సరోజినీ [illegible]	
209	88/2/A	88/A/1	1.08 1/2	[illegible]	మెట్ట	మొరంపూడి జగదీష్ తండ్రి సత్య నారాయణ	తూర్పు: మొరంపూడి మధుసూదన్‌రావు పడమర: కందిపోగు వెంకటేశ్వరరావు ఉత్తరం: ముడిగొండ్ల రాములు దక్షిణం: మొరంపూడి జగదీష్	జామాయిల్-225 [illegible]
210	88/2/B	88/A/1/1	1.08 1/2	[illegible]	మెట్ట	మొరంపూడి మధుసూదన్ రావు తండ్రి సత్య నారాయణ	తూర్పు: రాయల సరోజినీ పడమర: కందిపోగు పుల్లమ్మ ఉత్తరం: ముడిగొండ్ల రాములు దక్షిణం: మొరంపూడి జగదీష్	జామాయిల్-225 [illegible]
211	87/2/A		0.10 1/4	[illegible]	మెట్ట	రాయల సరోజినీ భర్త రంగా రావు	తూర్పు: లోయ రాజమ్మ పడమర: బోయిన నరసింహారావు ఉత్తరం: శీలం వెంకటేశ్వరరావు దక్షిణం: షేక్ బాజీ	
		మొత్తం	36.02 1/4					

సెక్షన్ (15) చట్టము ప్రకారము చట్టము 30/2013 క్రింద పై భూసేకరణపై వచ్చిన అభ్యంతరములను గాను సంబంధిత సమాచారమును సంబంధిత వారికి తెలియచేసి యున్నాము. కావున ఇట్టి తుది ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ చట్టము ప్రకారము భూ నిర్వాసితులు అవుతున్న కుటుంబీకులకు భూ సేకరణ పునరావాస, పునరావాస కల్పనకుగాను తదుపరి ప్రతిపాదనలు శ్రీయుత జిల్లా కలెక్టరు, ఖమ్మం గారి ద్వారా నియమించబడిన పునరావాస మరియు పునరుపాది అధికారి మరియు శ్రీయుత రెవిన్యూ డివిజనల్ అధికారి కల్లూరు గారి ద్వారా జరుపబడును.

భూసేకరణ తలపెట్టిన ఆ భూమిలో బొగ్గు ఇనుము స్లేట్ మరియు ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజములు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయపు పని వేళలో జిల్లా కలెక్టరు ఖమ్మం మరియు భూ సేకరణ అధికారి/ రెవిన్యూ డివిజనల్ అధికారి, కల్లూరు వారి కార్యాలయములో పరిశీలించుకొనుటకు నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/-	సం/-	సం/-
రెవెన్యూ డివిజనల్ అధికారి, కల్లూరు.	అదనపు కలెక్టర్, ఖమ్మం.	జిల్లా కలెక్టర్ ఖమ్మం.

DIPR RO No.01/LA-PP/ADVT/Publication/2024-25

సాహితీ వైభవానికి గ్రహణం!

కాళోజీ కళాక్షేత్రం, పోతన స్మారక చిహ్నంపై నిర్లక్ష్యం.. శంకుస్థాపనలతోనే సరిపెట్టిన బీఆర్ఎస్ సర్కారు

- ఏళ్లకు ఏళ్లు గడిచినా పూర్తవ్వని పనులు.. అవి కూడా నాసిరకమే
- పూర్తయ్యేదెప్పుడు? సాహితీ ప్రియులు, భాషాభిమానుల ప్రశ్న
- పదేళ్ల ఉత్సవాల సందర్భంగా రేవంత్ సర్కారైనా సంకల్పం తీసుకుంటుందా?


నిర్మాణ దశలో ఉన్న కాళోజీ కళాక్షేత్రం

వరంగల్, మే 30 (ఆంధ్రజ్యోతి): ఒకరిది తెలంగాణ పురిటి గడ్డ.. మరొకరు తెలంగాణ తొలిపొద్దు! మొదటివారు తియ్యని తేట తెలుగు పద్యాల తెమ్మెర బమ్మెర పోతనైతే, రెండోవారు 'మన యాసల్నే మన బతుకున్నది' అని తెలంగాణ యాస గురించి సగర్వంగా చెప్పి తెలంగాణ భాషా దినోత్సవానికి ప్రతీకగా నిలిచిన ఉద్యమగళం కాళోజీ! అయితే.. ఈ మహానుభావులను భావితరాలు స్మరించుకునే గొప్ప లక్ష్యంతో చేపట్టిన నిర్మాణాలకు నిర్లక్ష్యం అనే గ్రహణం పట్టుకుంది. ఏళ్లు గడిచినా పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. 2017లో వరంగల్ జిల్లాలోని పోతన పుట్టిన బమ్మెర గ్రామంలో ఆయన స్మారక చిహ్నం నిర్మాణ పనులకు శంకుస్థాపన జరిగినా ఇప్పటికీ పూర్తికాలేదు. అంతకుముందే.. 2014లో హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రానికి శంకుస్థాపన చేసినా అదీ పూర్తవలేదు. తెలంగాణ సిద్ధించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను మరింత ఘనంగా జరుపుకోవాలని ప్రభుత్వం సంకల్పించిన తరుణంలో ఈ నిర్మాణాలు నిర్లక్ష్యం అనే చెద పట్టి కొట్టుమిట్టాడుతున్న వైనంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం!

ఏడాదిలోగా పూర్తిచేస్తానన్న కేసీఆర్

కాళోజీ స్మారకార్థం గత ప్రభుత్వం 2014 సెప్టెంబరు 9న హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో కాళోజీ కళాక్షేత్రానికి నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అట్టహాసంగా శంకుస్థాపన చేసింది. కుర్చీ వేసుకుని కూర్చుని ఏడాదిలోపు పనులను పూర్తి చేయిస్తానని నాటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. ప్రముఖ ఆర్కిటెక్ట్ హఫీజ్‌తో కళాక్షేత్రం ప్లాన్ తయారు చేయించారు. తొలుత రూ.50కోట్ల అంచనాతో కాళోజీ కళాక్షేత్రానికి నిధులు మంజూరు చేశారు. నాలుగు అంతస్తులుగా (జీ ప్లస్ 4) భవనాలు నిర్మించాలని నిర్ణయించారు. వీటిని మూడు దశల్లో పూర్తి చేయాలని అప్పటి సర్కారు ఆదేశించింది ప్రభుత్వం. మొదటి అంతస్తులో ఆర్టియం, ప్రీ ఫంక్షన్ ఏరియా, ఆఫీసు గదులు, ఫుడ్ కౌంటర్, స్టోర్ రూమ్స్, వాష్ రూమ్స్.. రెండో అంతస్తులో గ్రంథాలయం, ఆఫీసు, స్టోర్స్, లాబీ, వాష్‌రూమ్‌లు.. మూడు, నాలుగో అంతస్తుల్లో ప్రీ ఫంక్షన్ లాబీ, బాల్కనీ, టెర్రస్, క్యాట్‌వాక్ లాబీ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు చేశారు. రెండేళ్లుగా నిధుల జారీ విషయంలో నాటి ప్రభుత్వం నాన్చుడు ధోరణితో కళాక్షేత్రం పనులు నిలిచిపోయాయి. తర్వాత నిర్మాణ వ్యయం రూ.50కోట్ల నుంచి రూ.70కోట్లకు పెరిగింది. నాలుగేళ్లలో కేవలం రూ.30కోట్ల వరకే నిధులు విడుదల చేయటంతో పాటు బిల్లులు సక్రమంగా రాకపోవటంతో నిర్మాణ సంస్థ పనుల నుంచి వైదొలిగింది. దీంతో అప్పటి ప్రభుత్వం మరొకరికి పనులప్పగించింది. ఈ క్రమంలో పదేళ్లుగా దాదాపు 60శాతం వరకు పనులు పూర్తి చేసినా ఈ పనులన్నీ నాసిరకంగా ఉన్నాయంటూ కొత్త ప్రభుత్వానికి నివేదికలు వెళ్లాయి. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావిడిగా కాళోజీ కళాక్షేత్రాన్ని అప్పటి మంత్రి కేటీఆర్‌తో ప్రారంభించేందుకు స్థానిక నేతలు ప్రయత్నాలు చేశారు. కానీ, నిర్మాణం పూర్తి కాకుండానే ఎలా ప్రారంభిస్తారని సోషల్ మీడియాలో ప్రశ్నలు, వ్యాఖ్యలు వైరల్ కావటంతో చివరి నిమిషంలో కేటీఆర్ తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

ఏడేళ్లు గడిచినా సగం పనులూ అవ్వలేదు

భాగవత పురాణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన పోతనామాత్యుడు పుట్టింది వరంగల్ జిల్లా బమ్మెరలోనే. అక్కడే పోతన స్మారక చిహ్నం నిర్మాణం కోసం 2017 ఏప్రిల్ 28న అప్పటి సీఎం కేసీఆర్ భూమిపూజ నిర్వహించారు. పర్యాటక శాఖ నిధుల ద్వారా పోతన స్మారక చిహ్నం నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు నాలుగున్నర ఎకరాల్లో పోతన భారీ విగ్రహంతో పాటు పోతన మ్యూజియం, యాంఫీ థియేటర్, స్మృతివనం, గ్రంథాలయం, కల్యాణమండపం, గార్డెనింగ్, పోతన సమాధి, పోతన పొలం వద్ద బావి సుందరీకరణ, కొత్తగా రోడ్లు తదితరాల కోసం నాటి ప్రభుత్వం రూ.14 కోట్లు కేటాయించింది. ఏడేళ్లు గడిచినా ఇప్పటిదాకా సగం పనులు కూడా పూర్తి కాలేదు. పురావస్తు శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.70 లక్షల వ్యయంతో చేపట్టిన పోతన సమాధి, పోతన వ్యవసాయం చేసిన బావి ఆధునికీకరణ పనులు అసంపూర్తిగా మిగిలాయి. నిధులులేమితో పనులు ముందుకు సాగటం లేదు. అలాగే యాంఫీథియేటర్ ఆవరణలో 100టన్నులు గల 18 అడుగుల పోతన కాంస్య విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేయాల్సి ఉంది. కొత్త ప్రభుత్వమైనా కాళోజీ కళాక్షేత్రంతో పాటు పోతన స్మారక చిహ్నం నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసేలా దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఏప్రిల్‌లో ఖజానాకు రూ.14,068 కోట్లు!

- ఖర్చులు రూ.13,918 కోట్లు.. కాగ్ నివేదికలో వెల్లడి

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్‌లో ప్రభుత్వ ఖజానాకు రూ.14,068.41 కోట్లు సమకూరాయి. ఇందులో రెవెన్యూ రాబడుల ద్వారా రూ.11,818.88కోట్లు రాగా.. అప్పుల రూపంలో రూ.2,246.62కోట్లు, రుణాల రికవరీ కింద రూ.2.91కోట్లు వచ్చాయి. అయితే కేంద్ర గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్ల కింద ఒక్క రూపాయీ రాలేదు. ఈ మేరకు 'కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్' (కాగ్) శుక్రవారం ఓ నివేదికను విడుదల చేసింది. ఇక వివిధ రకాల వ్యయాల కింద మొత్తం రూ.13,918.31 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. ఇందులో ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలకు రూ.2,777.29 కోట్లు, అప్పుల వడ్డీ చెల్లింపులకు రూ.1,865.15 కోట్లు, ఉద్యోగుల వేతనాలకు రూ.2,847.17కోట్లు, పింఛన్లకు రూ.1,331.75కోట్లు, సబ్సిడీలకు రూ.976.97కోట్లను ఖర్చు చేశారు.మూలధన వ్యయం కిందే రూ.3,119.98 కోట్లను ఖర్చు చేయడం గమనార్హం.

ఈ నెలంతా జైలులోనే కవిత!

హైకోర్టుకు వేసవి సెలవులే కారణం

- తీర్పు వస్తుందని భావించినా నిరాశే!!
- ఈ నెల 3తో జ్యుడీషియల్ రిమాండ్ పూర్తి
- మరోసారి రిమాండ్ పొడిగింపునకు చాన్స్



న్యూఢిల్లీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి.. తిహాడ్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరోసారి నిరాశే ఎదురైంది. కవిత బెయిల్ పిటిషన్‌పై శుక్రవారం తీర్పు వెలువడుతుందని ఆశించినా.. న్యాయస్థానం నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఈడీ అధికారులు కవితను మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ఆ తర్వాత ఆమె తిహాడ్ జైలులో ఉండగానే.. సీబీఐ అరెస్టు చేసింది. తన కుమారుడికి పరీక్షలున్నాయని.. తనకు మధ్యంతర బెయిల్ కావాలని కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను రౌస్ అవెన్యూ కోర్టు తిరస్కరించింది. ఆ తర్వాత తనను దర్యాప్తు సంస్థలు అక్రమంగా అరెస్టు చేశాయని, బెయిల్ మంజూరు చేయాలని అదే న్యాయస్థానాన్ని మరోసారి ఆశ్రయించినా.. నిరాశే మిగిలింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాల్ చేస్తూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. బెయిల్ మంజూరు చేయాలని కవిత తరఫున న్యాయవాదులు.. ఢిల్లీ మద్యం కేసులో కవితదే కీలకపాత్రని ఆమెకు బెయిల్ ఇవ్వొద్దని ఈడీ, సీబీఐ వాదనలను వినిపించాయి. మే 27, 28 తేదీల్లో సుదీర్ఘ వాదనలు విన్న జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వ్ చేశారు. జూన్ 1వ తేదీ నుంచి 29 వరకు కోర్టుకు వేసవి సెలవులు ఉన్న నేపథ్యంలో.. గురు లేదా శుక్రవారాల్లో తీర్పు వెలువరించే ప్రయత్నం చేస్తామని న్యాయమూర్తి స్పష్టంచేశారు. అయితే.. ఈ రెండ్రోజుల్లో హైకోర్టు తీర్పును వెలవరించలేదు. శుక్రవారం కవిత తరఫున న్యాయవాది మోహిత్ రావు బెయిల్ పిటిషన్ అంశాన్ని కోర్టులో ప్రస్తావించగా.. కేసు లిస్టు కాలేదని రిజిస్ట్రార్ చెప్పారు. దీంతో కవిత బెయిల్ పిటిషన్లపై తీర్పు వేసవి సెలవుల తర్వాతే వెలువడే అవకాశం ఉందని న్యాయనిపుణులు అభిప్రాయ పడుతున్నారు. జూన్ 30న ఆదివారం కావడంతో బెయిల్ పిటిషన్‌పై జూలై మొదటి వారంలోనే తీర్పు వచ్చే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా కవిత జ్యుడీషియల్ కస్టడీ జూన్ 3తో ముగియనుంది. కవితతోపాటు మరో నలుగురిని అదనంగా చేరుస్తూ ఈడీ అదనపు చార్జిషీటును దాఖలు చేయగా, ట్రయల్ కోర్టు అనుమతించింది. ఈ నేపథ్యంలో కవితతోపాటు మిగిలిన నలుగురిని జూన్ 3వ తేదీన రౌస్ అవెన్యూ కోర్టు ముందు హాజరు పర్చాలని న్యాయమూర్తి ఆదేశించిన విషయం తెలిసిందే.! కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించాలని దర్యాప్తు సంస్థలు కోరే అవకాశం ఉంది.

అమెరికా స్పెల్ బీలో తెలంగాణ సంతతి విద్యార్థి గెలుపు

- 90 సెకన్లలో 29 పదాలు తప్పుల్లేకుండా చెప్పిన బృహత్
- రూ.41.64 లక్షలతోపాటు పలు బహుమతులు సొంతం



న్యూఢిల్లీ, మే 31: అమెరికాలో నిర్వహించే స్క్రిప్స్ జాతీయ స్పెల్లింగ్ బీ పోటీలో తెలంగాణ సంతతికి చెందిన 12 ఏళ్ల బృహత్ సోమ సత్తా చాటాడు. ఫైనల్‌లో 90 సెకన్లలోనే 29 పదాల స్పెల్లింగ్స్ తప్పుల్లేకుండా చెప్పి టైటిల్ గెలుచుకున్నాడు. అలాగే రూ.41.64 లక్షల నగదుతో పాటు వివిధ బహుమతులు దక్కించుకున్నాడు. బృహత్‌కు గట్టి పోటీనిచ్చిన టెక్సాస్‌కు చెందిన ఫైజాన్ జాకీ 25 పదాలు మాత్రమే చెప్పి రెండో స్థానానికే పరిమితమయ్యాడు.. అతడు రూ.20.82 లక్షల ప్రైజ్‌మనీ అందుకున్నాడు. 'బృహత్ జ్ఞాపకశక్తి అమోఘం. అతడు ప్రశాంతంగా పదాల స్పెల్లింగ్స్ చెబుతుంటే ఆశ్చర్యపోయా' అని ఈడబ్ల్యూ స్క్రిప్స్ కంపెనీ సీఈవో ఆడం సిమ్సన్ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం బృహత్ ఏడో తరగతి చదువుతున్నాడు. అతడి కుటుంబం ఫ్లోరిడాలో నివాసముంటోంది. బృహత్ తండ్రి శ్రీనివాస్ స్వస్థలం తెలంగాణలోని నల్లగొండనే.. బృహత్ ఈ పోటీలో పాల్గొనడం ఇది మూడోసారి.. 2022లో 163వ స్థానం, 2023లో 74వ స్థానంలో నిలిచాడు. బృహత్ కంటే ముందు పలువురు భారత సంతతి విద్యార్థులు కూడా టైటిల్ గెలుపొందారు.

యువకుడి బొటన వేలు కొరికి ఎత్తుకెళ్లిన కుక్క



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రసాద్

మంచిర్యాల, భగత్‌నగర్, కొల్లాపూర్, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీధి కుక్కల స్వైరవిహారంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం వీధి కుక్కలు రెచ్చిపోయడంతో ఇద్దరు బాలురుతో సహా ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సున్నంబట్టి వాడలో మార్బుల్, టైల్స్ పనిచేస్తూ జీవనం సాగించే తాళ్లపెల్లి ప్రసాద్ అనే యువకుడిపై వీధి కుక్క దాడి చేసింది. అతడి ఎడమ చేతి బొటన వేలును కొరికి ఎత్తుకెళ్లింది. అనంతరం సమీపంలోని బృందావనం కాలనీలో ఓ ఇంటికి పెయింటింగ్ చేస్తున్న నలుగురు కూలీలపై దాడి చేయడంతో వారు స్వల్పంగా గాయపడ్డారు. బొటన వేలు కోల్పోయిన ప్రసాద్ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరో దాడిలో నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మునిసిపాలిటీలోని 11వ వార్డుకు చెందిన నరేశ్, శ్రుతి దంపతుల కుమారుడు ధనుష్. ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్క దాడి చేయడంతో బాలుడి ముఖంపై తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో ఇంటి వద్ద ఆడుకుంటున్న త్రిలోక్ అనే బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరిచాయి.

ఏపీ జువెనల్ భవనం.. తెలంగాణకు అప్పగింత

సైదాబాద్, మే 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజనలో భాగంగా సైదాబాద్‌లోని జువెనైల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీసెస్(జువనైల్ శాఖ) కార్యాలయంలో ఏపీకి కేటాయించిన భవనాన్ని తెలంగాణకు అప్పగించారు. ఏపీ జువెనైల్ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూధన్ రావుతో కూడిన బృందం సైదాబాద్‌లోని ప్రధాన కార్యాలయానికి చేరుకుని తమ కార్యాలయ భవన తాళాలను తెలంగాణ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ అధికారుల బృందాన్ని తెలంగాణ జువెనైల్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బేగ్, గోపీకుమార్, జ్వాల, నవీన్‌కుమార్, అఫ్జల్ సత్కరించారు.

భూకబ్జా కేసుల్లో ఆశన్నగారి జీవన్‌రెడ్డికి నిరాశ

హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): భూకబ్జా ఆరోపణలతో నమోదైన రెండు వేర్వేరు కేసుల్లో ఆర్మూరు మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు హైకోర్టులో ఊరట లభించలేదు. ఆ కేసుల దర్యాప్తుపై స్టే విధించడానికి నిరాకరించింది. జీవన్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లలో వివరణ ఇవ్వాలని పోలీసులకు, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీచేసింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని చేవెళ్ల, మోకిల పోలీస్‌స్టేషన్లలో నమోదైన రెండు వేర్వేరు కేసులను కొట్టేయాలని కోరుతూ జీవన్‌రెడ్డి, ఆయన భార్య రజిత, తల్లి రాజుబాయి, అనిల్‌రెడ్డి, వాచ్‌మెన్ సురేశ్ తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. వారిపై సామ దామోదర్ రెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. చేవెళ్ల మండలం ఎర్లపల్లిలోని సర్వే నెంబర్ 32 సహా ఇతర సర్వేనెంబర్లలో ఉన్న 20 ఎకరాల తమ భూముల్లో జీవన్‌రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు కబ్జాకు పాల్పడ్డారని, అక్కడ ఉన్న నిర్మాణాలు కూల్చేసి కొత్త నిర్మాణాలు చేపట్టారని చేవెళ్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. శంకర్‌పల్లి మండలం టంగుటూర్ వద్ద ఉన్న భూముల విషయంలో సైతం మోసం చేశారని కేసు పెట్టారు. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ జీవన్‌రెడ్డి పెట్టుకున్న పిటిషన్‌లు తొలుత జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి వద్దకు విచారణకు రాగా.. ఆయన విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. దీంతో ఆ పిటిషన్లు జస్టిస్ లక్ష్మీనారాయణ ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. వాదనలు విన్న ధర్మాసనం.. దర్యాప్తుపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. విచారణను 3కు వాయిదా వేసింది.

8 నిమిషాల్లో రూ.2.86 కోట్లు స్వాహా!

- జీఎస్టీ రిఫండ్ కుంభకోణంలో తవ్వేకొద్దీ అక్రమాలు

హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ రిఫండ్ కుంభకోణం కేసులో పోలీసులు తవ్విన కొద్దీ విస్తుబోయే విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఈ కుంభకోణంలో నిందితులు మొత్తం రూ.46కోట్లను కొల్లగొట్టిన విషయం తెలిసిందే.! ఎలక్ట్రిక్ వాహనాల పేరుతో ఏడు బోగస్ కంపెనీలను సృష్టించి, ఈ మొత్తాన్ని జీఎస్టీ క్లెయిమ్ పేరుతో స్వాహా చేశారు. ఇటీవలే ఈ కేసులో ఏడు ఫేక్ కంపెనీలకు చెందిన పలువురు నిందితులు అరెస్టవ్వగా.. వీరికి సహకరించిన మాదాపూర్ సర్కిల్-2 డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్(డీఎస్‌టీవో) వేమవరపు వెంకటరమణను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. కమిషన్ కక్కుర్తితో వెంకటరమణతోపాటు.. పలువురు జీఎస్టీ అధికారులు కేటుగాళ్లతో మిలాఖత్ అయినట్లు పోలీసులు వివరించారు. ఆడిట్ లెక్కలు చూడకుండానే.. క్లెయిమ్‌లు రాగానే జీఎస్టీ మొత్తాలను విడుదల చేసినట్లు గుర్తించామన్నారు. గ్రోమోర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కంపెనీకి చెందిన రూ.2.86 కోట్ల జీఎస్టీ రిఫండ్‌ను కేవలం ఎనిమిది నిమిషాల్లో బదిలీ అయ్యేందుకు వెంకటరమణ సహకరించినట్లు తెలిపారు. అందుకోసం తమ పరిధిలో ఉన్న గ్రోమోర్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ కంపెనీ.. నల్లగొండకు బదిలీ అయినట్లు చూపిస్తూ.. ఆ జిల్లాకు చెందిన సీఎస్టీవో స్వర్ణకుమార్ ద్వారా ఆ మొత్తం నగదు బదిలీ అయ్యేలా చేసినట్లు వివరించారు.

తప్ప తాగి.. లారీతో తొక్కిస్తూ!

- సుల్తానాబాద్‌లో లారీ డ్రైవర్ బీభత్సం
- ఒకరి మృతి.. నలుగురికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్, మే 31: పెద్దపల్లి జిల్లాలో రాజీవ్ రహదారిపై ఓ లారీ డ్రైవర్ బీభత్సం సృష్టించాడు. పూటుగా మద్యం సేవించిన డ్రైవర్.. నియంత్రణ కోల్పోయి రాంగ్‌రూట్‌లోకి దూసుకొచ్చి.. పాదచారులు, పానీపూరి బండ్లు, పలు వాహనాలను ఢీకొన్నాడు. చివరికి ఓ చెట్టును ఢీకొట్టి లారీ ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా.. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం సాయంత్రం సుల్తానాబాద్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. వరంగల్ నుంచి గోదావరిఖని వెళుతున్న లారీ సుల్తానాబాద్ వద్ద అదుపు తప్పింది. ముందుగా బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై వెళ్తున్న యూసుఫ్, అతడి భార్య నసీమా నజీమా (39), కూతురు, కొడుకు కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఒక్కసారిగా డివైడర్‌పై నుంచి రాంగ్‌రూట్‌లోకి దూసుకెళ్లి.. అటు ఇటు ఢీకొంటూ వెళ్లి చివరికి చెట్టును ఢీ కొట్టి ఆగిపోయింది. ఈక్రమంలోనే చొప్పదండికి చెందిన వినయ్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడి వారు లారీ డ్రైవర్‌ను చితకబాది పోలీసులకు అప్పగించారు. గాయపడ్డ వారిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నసీమా ఆరోగ్యం విషమించి మరణించారు. ఆమె ఇక్కడి పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు.

గొర్రెల పంపిణీ పథకంలో రూ.700 కోట్ల గోల్‌మాల్!

(మొదటి పేజీ తరువాయి)

ఏసీబీ గుర్తించింది. ఉద్దేశపూర్వకంగానే ఈ పథకంలో ప్రైవేటు వ్యక్తుల్ని భాగస్వాములను చేసి ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించినట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది. ప్రైవేటు వ్యక్తులతో కలిసి నిధులు పక్కదారి పట్టించాలని జిల్లా స్థాయిలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్లతోపాటు, ఇతర అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటికే పట్టుబడ్డ వారు ఇచ్చిన సమాచారం, దర్యాప్తులో సేకరించిన ఆధారాల మేరకు కల్యాణ్, రాంచందర్‌ను అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.



అక్రమాలకు బీజం వేశారిలా..

పశుసంవర్ధకశాఖ అధికారులు, బ్రోకర్లు, కాంట్రాక్టర్లు అంతా కుమ్మక్కై నిధులను దారిమళ్లించారు. రాంచందర్ టీఎస్ఎస్‌జీడీసీఎఫ్ ఎండీగా పనిచేసిన సమయంలో కీలక నిర్ణయం జరిగింది. తొలుత గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించినపుడు యూనిట్ ధర రూ.1.25 లక్షలు ఉండేది. రెండో విడతకు వచ్చేసరికి యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచారు. గొర్రెల ధర పెరిగిందని, ఇతర రాష్ట్రాల్లో గొర్రెలు దొరకడంలేదనే సాకులు చూపిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. యూనిట్ ధరను రూ.50 వేలు పెంచింది. దీనిని ఆసరగా చేసుకొని పశుసంవర్ధకశాఖ అధికారులు అక్రమాలకు తెరలేపారు. లబ్ధిదారులను(గొల్ల, కురుమలను), పశుసంవర్ధకశాఖ అధికారులను జతచేసి ఇతర రాష్ట్రాలకు గొర్రెల కొనుగోళ్లకు పంపించాల్సి ఉండగా... 'లోలోన' అనే ఒక ప్రైవేటు కంపెనీ ఎండీ మొహిదొద్దీన్‌తో గొర్రెలు సరఫరాచేసేందుకు కాంట్రాక్టు మాట్లాడుకున్నారు. అందుకు ప్రతిఫలంగా సదరు బ్రోకర్ క్యాష్ బ్యాక్ ఆఫర్ ప్రకటించారు. ఒక్కో యూనిట్‌కు రూ.15 వేలు క్యాష్ బ్యాక్ ఇస్తానని, భోజనం, వసతి ఖర్చులకు రూ.5 వేలు ఇస్తానని, ఉచిత రవాణా వసతి కల్పిస్తానని బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీంతో ఒక్కో యూనిట్‌పై రూ 20 వేలు క్యాష్ బ్యాక్ ఆఫర్... పశుసంవర్ధకశాఖ అధికారులకు వచ్చింది. రెండో విడతలో రూ. 1.75 లక్షల యూనిట్ విలువలో రూ.20 వేలు ఉన్నతాధికారులు గిట్టుబాటు చేసుకున్నారు.

నిధులు దారిమళ్లించారు ఇలా..

ఇతర రాష్ట్రాలకు వెళ్లి గొర్రెలు కొనుగోలుచేయటానికి లబ్ధిదారులతోపాటు పశుసంవర్ధకశాఖ అధికారులను పంపించాల్సి ఉండగా.. రాంచందర్ ఎండీగా ఉన్న సమయంలో ఈ నిబంధనను మార్చారు. ఇతర శాఖలకు చెందిన అధికారులను కూడా గొర్రెల కొనుగోళ్లకు పంపేలా నిబంధనలు సడలించారు. గొర్రెల కొనుగోలు, లబ్ధిదారులకు పంపకంలో ప్రైవేటు వ్యక్తి, కాంట్రాక్టర్ మొహిదొద్దీన్‌పాటు ఆయన కుమారుడు అంతా తామై వ్యవహరించారు. తండ్రీ, కొడుకులు ఆయా ప్రభుత్వ విభాగాలతో ఏర్పాటైన బృందాలతో కలిసి గతేడాది ఆగస్టు 13 నుంచి 23 తేదీల మధ్యకాలంలో ఏపీలో పర్యటించారు. పల్నాడు, ప్రకాశం, గుంటూరుతోపాటు మరికొన్ని ప్రాంతాల్లోని 18 మంది రైతుల నుంచి 133 యూనిట్లు(2,793 గొర్రెలు) సేకరించారు. బిల్లులు చెల్లింపు జరిపేందుకు రైతుల బ్యాంకు ఖాతాలు, ఆధార్ కార్డులు ఇతర పత్రాలను ప్రభుత్వ అధికారులు తీసుకున్నారు. ఇక్కడే తమ అధికారాన్ని ఉపయోగించి నిధులు దారిమళ్లించేందుకు పథకం రూపొందించారు. గొర్రెలు కొనుగోలు చేసినవారి ఖాతాల్లో కాకుండా ప్రైవేటు వ్యక్తుల బ్యాంకు ఖాతాలు, వివరాలు నమోదు చేశారు. దీంతో రైతుల ఖాతాలకు బదులుగా బ్రోకర్లకు చెందిన బ్యాంకు ఖాతాల్లోకి రూ. 2.10 కోట్లు మళ్లించారు. గొర్రెలు విక్రయించిన డబ్బులు రాకపోవటంతో ఏపీ రైతులు ఆందోళనకు గురయ్యారు. కాంట్రాక్టర్‌ను నిలదీసినా ప్రయోజనం లేకపోయింది. పశుసంవర్ధకశాఖ డైరెక్టరేట్‌లో ఆరాతీయగా... డబ్బుల చెల్లింపులు పూర్తయినట్లు అధికారులు ధ్రువీకరించారు. దీంతో కాంట్రాక్టర్ వెళ్లి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్లు- 406, 409, 420 ప్రకారం గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదుచేశారు. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో కేసు ఏసీబీకి బదిలీ అయింది. లోతుగా దర్యాప్తు జరుపుతున్న ఏసీబీ అధికారులు మొదటి దశలో ప్రైవేటు వ్యక్తులు, ఆ తర్వాత ప్రభుత్వ అధికారులు, ఇప్పుడు మాజీ ఓఎస్డీ, సీఈవో వరకు వెళ్లారు. తర్వాతి దర్యాప్తులో రాజకీయ నేతలకు నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

ఇద్దరూ.. ఇద్దరే..!

గొర్రెల యూనిట్ ధరను ఏకంగా రూ.50 వేలు పెంచడం ద్వారా పెద్దఎత్తున అవినీతికి రాంచందర్ తెరలేపినట్టు, 'లోలోన' సంస్థ పేరుతో దందా నడిపించిన దళారీ మొహిదొద్దీన్, అప్పటి పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఓఎస్డీ కల్యాణ్‌కుమార్ పా(సూ)త్రధారులుగా ఉన్నట్లు ఏసీబీ తేల్చింది. కల్యాణ్, రాంచందర్‌పై గతంలో పలు ఆరోపణలు ఉన్నాయి. పశుసంవర్ధక శాఖలో 2021-23 మధ్యకాలంలో రాంచందర్ ఎండీగా పనిచేసిన సమయంలో పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. గొర్రెల కొనుగోళ్లలో ప్రైవేటు వ్యక్తులకు పెత్తనం ఇవ్వడం ద్వారా నిధులు దారిమళ్లించేందుకు ఆస్కారం కల్పించారన్న అభియోగాలు ఉన్నాయి. దీంతోపాటు ఎన్‌సీడీసీ రుణం ఇవ్వకపోయినా 80 వేల మంది లబ్ధిదారుల నుంచి అదనపు డీడీలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఫైళ్ల మాయం సమయంలోనూ కల్యాణ్‌పై తీవ్ర ఆరోపణలు వచ్చాయి.

నేతల ప్రమేయంపై ఆరా...

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. నిధుల గోల్‌మాల్‌పై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఏసీబీని ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఈ కేసులో ఏసీబీ దూకుడుగా వ్యవహరిస్తోంది. లభిస్తున్న ఆధారాల మేరకే కేసుతో సంబంధం ఉన్న ప్రస్తుత, మాజీ ప్రభుత్వ అధికారుల్ని అరెస్ట్ చేస్తోంది. ఇప్పుడు ఏకంగా అప్పటి పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వద్ద ఓఎస్డీగా చేసిన కల్యాణ్ పట్టుబడటంతో ఈ కేసులో రాజకీయ ప్రమేయంపైనా ఏసీబీ కూపీ లాగేందుకు సిద్ధమవుతోంది. నేతల అండదండలతోనే అక్రమాలు జరిగాయనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆ కోణంలో నిందితుల్ని విచారించి వివరాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నారు. దర్యాప్తులో లభించే ఆధారాల మేరకు రాజకీయ నాయకుల్ని టచ్ చేసేందుకు ఏసీబీ సిద్ధమవుతున్నట్లు సమాచారం.

లబ్ధిదారులకు టోకెన్లు... కాగితాలపై గొర్రెలు

ఈ పథకంలో కొందరు లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లే అందలేదు. గొల్ల, కురుమలకు గొర్రెలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రాసుకున్నారు. ఉదాహరణకు... నల్లగొండ జిల్లాలోని ఒక గ్రామంలో లబ్ధిదారులకు ప్లాస్టిక్ కాయిన్లు పంపిణీ చేశారు. పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారుల తోపాటు దళారులు కలిసి కాయిన్లు అప్పగించారు. గొర్రెలు తెచ్చినవారికి లబ్ధిదారులు ఈ కాయిన్లు చూపిస్తే... వాళ్లు గొర్రెలు ఇచ్చిపోతారు. కానీ, దళారులు గొర్రెలు తెచ్చింది లేదు.. లబ్ధిదారులకు ఇచ్చిందిలేదు. కానీ, కాయిన్లు మాత్రం వారివద్దే ఉండిపోయాయి. కాగితాలపైనే గొర్రెల యూనిట్ల పంపిణీ జరిగిపోయింది. ఈలోగా గొర్రెల పంపిణీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిగింది. విచారణాధికారులు నల్లగొండ జిల్లాకు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ చేయగా.. లబ్ధిదారులు ప్లాస్టిక్ కాయిన్లు చూపించారు. వారి పేర్లను జాబితాలో చూస్తే లేవు. గొర్రెల యూనిట్లు అందినట్లే ఉంది.

నెలలుగా పత్తాలేని మొహిదొద్దిన్..

గొర్రెల కొనుగోళ్ల బిల్లు చెల్లింపుల్లో అక్రమాలకు పాల్పడ్డ కేసులో ఏ1గా ఉన్న మొహిదొద్దీన్ పత్తా లేకుండా పోయాడు. మొహిదొద్దీన్‌తోపాటు ఆయన కుమారుడు ఏసీబీ కేసు నమోదైనప్పటి నుంచి అజ్ఞాతంలోకి జారుకున్నారు. తండ్రీకొడుకులిద్దరూ దుబాయ్‌లో తలదాచుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించిన ఏసీబీ అధికారులు వారిని భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఫ్రెష్ అండ్ ఫాస్టర్, సైమో సంస్థలకు మొహిదొద్దీన్ ఎండీగా ఉన్నారు. నెట్ డీల్ షీప్ అండ్ గోట్ ఫామ్స్‌కు డైరెక్టర్‌గా ఉన్న మొహిదొద్దీన్ తన పేరు ఎస్ఎస్ మొయిద్‌గా రికార్డుల్లో నమోదు చేసినట్లు ఏసీబీ గుర్తించింది. నియో మల్టీప్లెక్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు ప్రొప్రైటర్‌గా ఉన్నట్లు ఏసీబీ ఆధారాలు సేకరించింది.

మొత్తం పథకంపై సమగ్ర విచారణ

గొర్రెల పంపిణీ పథకం మొదలైనప్పటి నుంచే అక్రమాలు మొదలయ్యాయి. రెండో విడతతోపాటు మొదటి విడతలో కూడా పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. మొదటి విడత గొర్రెల పంపిణీ పథకం సమయం లో షీప్ అండ్ గోట్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా లక్ష్మారెడ్డి పనిచేశారు. అప్పుడు పశుసంవర్ధకశాఖలో వివిధ జిల్లాల్లో పనిచేస్తున్న అధికారుల పై కేసులు నమోదయ్యాయి. కొందరు అధికారులు సస్పెండ్ కూడా అయ్యారు. అప్పట్లో లక్ష్మారెడ్డి ప్రమేయంపై ఆరోపణలు వచ్చాయి. మొదటి విడతలో లక్ష్మారెడ్డి, రెండో విడతలో రాంచందర్ ప్రమేయం ఉన్నట్లు ఆరోపనలు వచ్చిన నేపథ్యంలో... యావత్ గొర్రెల పంపిణీ పథకంపై సమగ్ర విచారణ జరపాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈమేరకు విచారణ జరుగుతుండటం గమనార్హం. గొర్రెల పంపిణీలో అక్రమాలపై విచారణ జరుగుతుండటంతో... అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.



రంగారెడ్డి జిల్లా నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ అధికారులు

ఎన్‌వోసీకి రూ.2.50 లక్షల లంచం

- నిర్మాణదారుడి నుంచి డబ్బులు తీసుకుంటూ ఇరిగేషన్ ఈఈ, ఏఈలు,
- గండిపేట సర్వేయర్‌కూ భాగస్వామ్యం
- నలుగురినీ అరెస్టు చేసిన ఏసీబీ

సంగారెడ్డి క్రైం/హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): నీటి పారుదల శాఖలో లంచావతారుల బాగోతం బట్టబయలైంది. ఒకే సారి ముగ్గురు అధికారులు అవినీతి నిరోధక శాఖకు అడ్డంగా దొరికిపోయారు. నాలా సమీపంలో భవన నిర్మాణానికి సంబంధించి ఎన్‌వోసీ ఇచ్చేందుకు రూ.2.50లక్షలు డిమాండ్ చేసిన అధికారులు.. తొలుత రూ.1.50లక్ష తీసుకున్నారు. మిగతా రూ.లక్ష తీసుకుంటుండగా గురువారం రాత్రి ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఇదే కేసులో గండిపేట తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ గతంలోనే రూ.40వేలు తీసుకున్నట్లు తేలడంతో.. అతడినీ అదుపులోకి తీసుకున్నారు. మణికొండలోని నెక్నాంపూర్‌కు చెందిన బొమ్ము ఉపేంద్రనాథ్ రెడ్డి తన ఇంటి నిర్మాణానికి సంబంధించిన ఎన్‌వోసీ కోసం నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భన్సీలాల్, అసిస్టెంట్ ఇంజనీర్లు కార్తీక్, నిఖేశ్ కుమార్‌ను సంప్రదించారు. నాలా సమీపంలో నిర్మించనున్న భవనానికి ఎన్‌వోసీ ఇవ్వాలంటే రూ.3లక్షలు లంచం ఇవ్వాలని అధికారులు డిమాండ్ చేయగా.. రూ.2.50 లక్షలు ఇచ్చేందుకు ఉపేంద్రనాథ్ రెడ్డి ఒప్పుకొన్నారు. ఈ మేరకు తొలుత రూ.1.50లక్షలను ముట్టజెప్పారు. మిగతా రూ.లక్ష కోసం అధికారులు వేధిస్తుండటంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. రంగంలోకి దిగిన అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హిల్స్‌లోని రంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ (ఎస్ఈ) నార్త్‌ట్యాంక్ డివిజన్ కార్యాలయంలో గురువారం రాత్రి నిఘా పెట్టారు. బాధితుడు ఉపేంద్రనాథ్ రెడ్డి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ముగ్గురు అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరో ఉన్నతాధికారి సైతం ఈ కేసులో చిక్కాల్సి ఉండగా తృటిలో తప్పించుకున్నట్లు తెలిసింది. ఇదే కేసులో గండిపేట ఎమ్మార్వో కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న పి.గణేశ్ గతంలోనే రూ.40వేలు తీసుకున్నట్లు తేలడంతో, అతడినీ అదుపులోకి తీసుకున్నారు. నలుగురు నిందితులను నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించారు.

కేసు మూసేయాలంటే రూ.3లక్షలు ఇవ్వాల్సిందే

- లంచం డిమాండ్ చేసిన కుషాయిగూడ సీఐ, ఎస్సై
- మధ్యవర్తి నుంచి తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

ఏఎస్‌రావునగర్/హైదరాబాద్ సిటీ, మే 31 (ఆంధ్రజ్యోతి): ఓ స్థలం వివాదానికి సంబంధించి నమోదైన కేసును మూసేయడానికి రూ.3లక్షలు లంచం తీసుకుంటూ కుషాయిగూడ సీఐ, ఎస్సై సహా మరో మధ్యవర్తి ఏసీబీకి దొరికిపోయారు. కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ జి.వీరస్వామి, ఎస్సై షేక్ షఫీతోపాటు మధ్యవర్తిత్వం నెరిపిన ఉపేందర్‌ను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. ఏసీబీ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కుషాయిగూడలోని వాసవి శివనగర్ కాలనీలో సర్వే నంబర్ 199లో ఉన్న స్థలానికి సంబంధించి ఓ మహిళకు, స్థానికంగా నివాసం ఉండే సింగిరెడ్డి భరత్‌రెడ్డికి వివాదం నడుస్తోంది. సదరు మహిళ ఫిర్యాదు మేరకు భరత్‌రెడ్డిపై ఏప్రిల్‌లో కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తనపై కుషాయిగూడ పోలీసులు అన్యాయంగా కేసు నమోదు చేశారంటూ భరత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు 41ఏ సీఆర్‌పీసీ కింద పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆ తర్వాత కేసును మూసివేయడానికి రూ.3లక్షలు ఇవ్వాలని, ఇందులో కొంత మొత్తం ఇన్‌స్పెక్టర్‌కూ ఇవ్వాల్సి ఉంటుందని ఎస్సై షఫీ చెప్పారు. కుషాయిగూడకు చెందిన ఉపేందర్ మధ్యవర్తిగా వ్యవహరించినా ఫలితం లేకపోయింది. దీంతో భరత్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు... ఉపేందర్ రూ.3లక్షల నగదును శుక్రవారం ఈసీఐఎల్‌లోని బాధితుడి ఆఫీసులో తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎస్సై షఫీ సూచన మేరకే తాను డబ్బు తీసుకున్నట్లు ఉపేందర్ పేర్కొనడంతో వారినీ అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం రాత్రి వరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులు.. ఇతర సిబ్బందినీ విచారించారు.



ఏసీబీ అధికారులకు పట్టుబడ్డ కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎస్సై షేక్ షఫీ, మధ్యవర్తి ఉపేందర్

ప్రైవేట్ బడుల్లో.. పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌ల విక్రయంపై నిషేధం

ఆదేశాలు జారీ చేసి విద్యా శాఖ

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్‌లు వంటి వాటి విక్రయాలపై నిషేధం విధిస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఈమేరకు తాజాగా సర్క్యులర్ జారీ చేసింది. అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం రూపొందించిన సిలబస్ పుస్తకాలను ఉపయోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయాన్ని తీసుకుంది. నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లల్లో చదివే ప్రతీ విద్యార్థి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టి) సంస్థ రూపొందించిన సిలబస్‌నే చదవాలి. ఈమేరకు ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వమే ఉచితంగా పుస్తకాలను సరఫరా చేస్తోంది. ప్రైవేట్ పాఠశాల్లోని విద్యార్థుల కోసం ప్రభుత్వమే పబ్లిషర్లను ఎంపిక చేసి పుస్తకాలను ముద్రింపజేస్తోంది. ఇలా ప్రతి ఏటా సుమారు 2.5 లక్షల పాఠ్యపుస్తకాల సెట్‌లను పబిషర్ల ద్వారా ముద్రింప చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తోంది. అయితే ప్రతిసారీ ఇలా పెద్ద ఎత్తున పాఠ్యపుస్తకాలు మార్కెట్లోకి తీసుకెళుతున్నా అవి అమ్ముడు పోవడం లేదు. ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులకు కూడా తప్పకుండా ప్రభుత్వ రూపొందించిన సిలబస్ పుస్తకాల ద్వారానే బోధన సాగించాలంటూ గతంలో ప్రభుత్వం జీవో నంబరు 1 ఉత్తర్వులు కూడా ఇచ్చింది. అయినా సరే మెజారిటీ ప్రైవేట్ స్కూళ్లల్లో ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రాంతాలకు చెందిన పబ్లిషర్లు రూపొందించిన ఇతర పుస్తకాలను సరఫరా చేస్తున్నారు. ఆయా స్కూళ్ల యాజమాన్యాలతో సదరు పబ్లిషర్స్ ఒప్పందాన్ని కుదుర్చుకుని ఈ పుస్తకాలను విద్యార్థులకు అంటగడుతున్నారు. ప్రభుత్వం రూపొందించిన సిలబస్ పుస్తకాల ధర సుమారు రూ. 250 నుంచి రూ. 300ల వరకు ఉంటే స్కూళ్లు అందించే పుస్తకాల ధరలు ఏకంగా రూ. 1200 నుంచి రూ. 4 వేల వరకు ఉంటున్నాయి. దీని వల్ల విద్యార్థులపై ఆర్థిక భారం పడడమే కాకుండా, ప్రభుత్వం రూపొందించిన సిలబస్ కూడా ఇందులో ఉండదు. దీని వల్ల ప్రభుత్వం అనుమతించిన పబ్లిషర్లు నష్ట పోతున్నారు. అందుకే విద్యాశాఖ ప్రైవేటు బడుల్లో వాటి విక్రయాలను నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే తాజా సర్క్యులర్‌తో సమస్య తీరదని ప్రభుత్వ పబ్లిషర్లు అంటున్నారు. అన్నిచోట్ల ప్రభుత్వం ఆమోదించిన సిలబస్ పుస్తకాలే వినియోగించేలా కఠిన తీసుకోవాలని వారు అభ్యర్థిస్తున్నారు.





ఏసీబీకి చిక్కిన ఎస్ఈ నాగేంద్రకుమార్, డీఈ నరేంద్రకుమార్, ఏఈ మధుకర్

ఏసీబీ వలలో విద్యుత్ ఎస్ఈ, డీఈ, ఏఈ

- ట్రాన్స్‌ఫార్మర్, ఎల్టీ లైన్ స్తంభం ఏర్పాటు చేసేందుకు రూ.19 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం

వనపర్తి టౌన్, మే 31 : ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు ఎల్టీ లైన్ స్తంభం ఏర్పాటు చేసేందుకు రూ.19వేల లంచం తీసుకున్న విద్యుత్ అధికారులు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఏకంగా ఎస్ఈతోపాటు డీఈ, ఏఈ దొరికిపోవడం విద్యుత్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నిర్వెన్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ నాలుగేళ్లుగా విద్యుత్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన బంధువు పెద్ది లక్ష్మీనారాయణ పాలెం గ్రామం దగ్గర సర్వే నంబర్ 94/21లో సీఎంఆర్ హోటల్ నడుపుతున్నారు. హోటల్ నిర్వహణ కోసం 3 ఫేజ్ 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, ఎల్టీ లైన్ స్తంభం అవసరం ఉండగా ఏప్రిల్ 2వ తేదీన కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వాటి ఏర్పాటుకు రూ. 2,05,432 అంచనా వేసి దాని కాంట్రాక్టును ప్రవీణ్‌కుమార్‌కు అప్పగించారు. ఆ అంచనాల ఫైల్‌ను డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) నరేంద్రకుమార్ వద్దకు పంపించగా... ఎస్ఈకి రూ.19 వేలు లంచం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. ఈ క్రమంలో పక్కా ప్రణాళికతో వచ్చిన అధికారులు శుక్రవారం అసిస్టెంట్ ఇంజనీర్ (టెక్నికల్) మధుకర్‌కు కాంట్రాక్టర్ ప్రవీణ్‌కుమార్ రూ.19వేలను ఇచ్చిన తర్వాత దాడులు చేసి, వారిని పట్టుకున్నారు. ఈ కేసులో ఏ1 గా సూపరింటెండింగ్ ఇంజనీర్ నాగేంద్రకుమార్, ఏ2గా డివిజనల్ ఇంజనీర్ నరేంద్రకుమార్, ఏ3గా అసిస్టెంట్ ఇంజనీర్ (టెక్నికల్) మధుకర్ పేర్లను చేర్చారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

నవ్య స్మార్ట్

శనివారం • 1 జూన్ 2024



75 ఉచిత గేమ్స్



యూట్యూబ్ - ప్లేయబుల్స్ ఫీచర్ 75 వరకు గేమ్స్‌ని యూజర్లు అందరికీ ఉచితంగా అందుబాటులోకి తెచ్చింది. యాంగ్రీ బర్డ్స్ షోడౌన్, కట్ ద రోప్, టాంబ్ ఆఫ్ ద మాస్క్ వంటి గేమ్స్ ఈ ఉచిత పరిధిలో ఉన్నాయి. ఈ ప్లేయబుల్స్ ఫీచర్‌ని యూట్యూబ్ గత ఏడాది ఆరంభించింది. 30 ఆర్కేడ్ గేమ్స్‌ని యూట్యూబ్ ప్రీమియమ్ చందాదారులకు అదీ ఎంపిక చేసిన మార్కెట్లలో మార్చి 28 వరకు ఆఫర్ చేసింది. చందాలతో నిమిత్తం లేకుండా ఇప్పుడు తమ వద్ద గేమ్స్‌ని అందరు యూజర్లకు అందిస్తోంది. అయితే ఈ అందుబాటు దశలవారీగా ఉంటుందని తెలిసింది. తమ కలెక్షన్‌లోని ఫ్రీగేమ్స్ అన్నింటినీ ఇదే ప్లాట్‌ఫాంపై ఉచితంగా ఆడుకోవచ్చని యూట్యూబ్ ఒక బ్లాగ్‌పోస్ట్‌లో తెలిపింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ డివైజులు రెంటిలోనూ అలాగే వెబ్‌లోనూ ఈ సదుపాయం ఉంది. ఎక్స్‌ప్లోర్ మెనూలో ప్లేయబుల్ సెక్షన్ ఉంటుంది.

నెట్‌ఫ్లిక్స్ విండోస్‌లో ఆఫ్‌లైన్ 'నో'!



నెట్‌ఫ్లిక్స్ - విండోస్ యాప్ యూజర్లకు ఆఫ్‌లైన్‌లో వీక్షణకు ఉన్న అవకాశాన్ని తొలగిస్తోందని సమాచారం. వైఫై అవసరం లేకుండా ఆఫ్‌లైన్‌లో నెట్‌ఫ్లిక్స్ కంటెంట్‌ను యూజర్లు చూసేవారు. అందుకోసం కంటెంట్‌ను ముందుగానే డౌన్‌లోడ్ చేసుకునేవారు. రాబోయే రోజుల్లో ఈ అవకాశాన్ని విండోస్ యూజర్లకు నెట్‌ఫ్లిక్స్ తొలగించనుంది. స్మార్ట్‌ఫోన్ యాప్‌లో మాత్రమే ఆ సౌలభ్యం ఉండనుంది. ఎక్స్ యూజర్ ఒకరు ఈ విషయాన్ని పోస్ట్ చేశారు. నెట్‌ఫ్లిక్స్ అందించే వెబ్‌సిరీస్, మూవీలను ఇకపై ల్యాప్‌టాప్‌లలో చూసే అవకాశం ఉండదని పేర్కొన్నారు. ముందస్తుగా డౌన్‌లోడ్ చేసుకుని, పర్యటనల్లో ముఖ్యంగా ల్యాప్‌టాప్‌లో చాలా మంది వీక్షించేవారు. ఇకపై ఆ అవకాశం ఉండబోదన్నది ఆ పోస్టు సారాంశం. మరో ఎక్స్ యూజర్ కూడా ఇదే సమాచారాన్ని షేర్ చేశారు. అయితే అందులో డౌన్‌లోడ్ విషయం లేదు. దీనిపై యూజర్ల స్పందనను రాబట్టి, తదనుగుణంగా మార్పులు, చేర్పులు చేపట్టాలన్నదే ఈ లీక్‌లోని పరమార్థమని 'ఆండ్రాయిడ్ అథారిటీ' పేర్కొంది.

ఏఐ కాల్ స్కానర్



ట్రూకాలర్ - ఏఐ కాల్‌స్కానర్‌ను పరిచయం చేసింది. ఏఐ జనరేటెడ్ వాయిస్‌లను ఇది గుర్తిస్తుంది. అదే సమయంలో తద్వారా తలెత్తే స్కాములను అరికడుతుంది. ప్రస్తుతం ఇది ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. కాల్‌లో వినిపించే గొంతు నిజంగా ఒక వ్యక్తిదా లేదంటే కృత్రిమ వాయిసా అన్నది ఈ స్కానర్ పసిగడుతుంది. ఏఐ వాయిస్ సింథసైజర్స్ వ్యక్తుల గొంతులను సెకండ్ల సమయంలోనే ఇది రెప్లికేట్ చేయగలుగుతుంది. అసంబద్ధ వాయిస్ క్లోనింగ్ - స్పీచ్ సింథసిస్ టెక్నాలజీస్ మరింత పురోగతి సాధించడమే కాదు, వాటికి విస్తృత స్థాయిలో సమ్మతి ఉంటోందని కంపెనీ తెలిపింది. ఈ నేపథ్యంలో కృత్రిమ గొంతును ఉపయోగించి జరిగే మోసాలను అరికట్టేందుకు దీన్ని అభివృద్ధిపర్చింది. అమెరికాలో పరిచయం చేసిన ఈ ఏఐ స్కానర్ ప్రస్తుతం ప్రీమియమ్ చందాదారులకు అందుబాటులో ఉంది. కాల్ అనుమానాస్పదంగా అనిపిస్తే చాలు యూజర్ వెంటనే ఏఐ కాల్ స్కానర్ బటన్‌ను యాక్టివేట్ చేయాలి. కాలర్ వాయిస్‌ను రికార్డు చేసి, పరీక్షించి వినిపిస్తున్న గొంతు కరెక్టా కాదా అన్నది తెలుస్తుంది.



పిల్లలకు ఫిట్‌బిట్ వాచీ

కిడ్స్‌కు ఉపయోగ పడేలా 'ఫిట్‌బిట్ ఏస్ ఎల్‌టీఈ' అమెరికాలో విడుదలైంది. ఓలెడ్ స్క్రీన్‌కు తోడు కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3 ప్రొటెక్షన్ దీనికి ఉంది. ఏడేళ్లు నిండిన పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన మొట్టమొదటి వాచీ అని కంపెనీ పేర్కొంది. ఇది ఉంటే ఫోన్ అవసరం ఉండదు. కాలింగ్, మెసేజింగ్, లొకేషన్ షేరింగ్‌కు సపోర్ట్ ఉంది. ఫిట్‌బిట్ ఆర్కేడ్ సపోర్ట్ ఉంది. దాంతో గేమ్‌లను కూడా పొందొచ్చు. పిక్సెల్ డెన్సిటీ 333పీపీఐ. ఇన్‌బిల్ట్ స్పీకర్, మైక్రోఫోన్ ఉన్నాయి. వాటర్ రెసిస్టెన్స్ 50ఎం. 328ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. పదహారు గంటల సేపు బ్యాటరీ లైఫ్ ఉంటుంది. యూఎస్‌బీ టైప్-సి పోర్ట్ మీదుగా చార్జింగ్ వీలు ఉంటుంది. వైఫై అలాగే బ్లూటూత్ కనెక్టివిటీ కూడా ఉంది. అమెరికాలో దీని ధర సుమారుగా రూ.19,200. అమెజాన్ నుంచి కొనుగోలు చేయవచ్చు.

క్రోమ్‌బుక్ ప్లస్ ల్యాప్‌టాప్స్‌కు ఏఐ ఫీచర్స్


గూగుల్ - క్రోమ్‌బుక్ ప్లస్ ల్యాప్‌టాప్స్‌కు జెమిని, గూగుల్ ఏఐ ఫీచర్స్‌ను తీసుకువస్తోంది. అయితే అవి క్రోమ్ ఓఎస్‌పై రన్ అవుతూ ఉండాలి. గూగుల్ సెట్ హార్డ్‌వేర్ అవసరాలకు అనుగుణంగా పవర్ కలిగి ఉండాలి. గేమ్స్ డ్యాష్‌బోర్డ్ అనుభవాన్ని కూడా పొందవచ్చు. దీంతో గేమ్‌ప్లేని రికార్డు చేసుకోవచ్చు. కంట్రోల్స్‌ను కస్టమైజ్ చేసుకోవచ్చు. కొత్తగా అందే ఏఐ ఫీచర్ల సహాయంతో....



● ల్యాప్‌టాప్ మౌస్‌పై రైట్ క్లిక్‌తో ఏఐ ఫీచర్లను అందుకోవచ్చు. దీంతో టెక్స్ట్ రాసుకోవచ్చు. యూజర్ ఇచ్చే ఇన్‌పుట్‌తో టెక్స్ట్ పొందొచ్చు. రీరైటింగ్ సదుపాయం కూడా ఉంది. ఫార్మల్, షార్టర్, రీ ఫ్రేజింగ్ వరకు అన్ని సౌకర్యాలను పొందవచ్చు.

● బిల్ట్ ఇన్ క్రోమ్ ఓఎస్‌తో వాల్‌పేపర్లను యూజర్లు క్రియేట్ చేసుకోవచ్చు. వీడియోకాల్స్‌కు బ్యాక్‌గ్రౌండ్‌ను క్రియేట్ చేసుకోవచ్చు.

● ఏఐ ఫోటో ఎడిటింగ్ ఫీచర్ మరొకటి. దీంతో ఎడిట్ చేయాలని భావిస్తున్న ఆబ్జెక్టును ట్యాప్ లేదంటే సర్కిల్‌తో చేయవచ్చు. తిరిగి యథాస్థానానికి లేదా రీసైజ్ చేసేందుకు కూడా అవకాశం దీంతో ఉంటుంది.



● హోమ్ స్క్రీన్‌పైనే జెమిని యాప్ ద్వారా జెమినితో చాట్ చేయవచ్చు. దీంతో 2టీబీ గూగుల్ వన్ ఏఐ ప్రీమియమ్ ప్లాన్‌ని ఏడాదికి గూగుల్ ఆఫర్ చేస్తోంది. తద్వారా జెమిని అడ్వాన్స్‌డ్, జెమిని ఇన్ డాక్స్ షీట్ స్లయిడ్స్, జీమెయిల్ తదితరాలు పొందవచ్చు.

ఆటోమేటిక్ అప్డేట్‌తో ఈ సౌకర్యాలను క్రోమ్‌బుక్ ప్లస్‌లో పొందవచ్చు.

చాట్స్‌లో ఏఐ పవర్డ్ ఇమేజ్



వాట్సాప్ - చాట్స్‌లోనే ఏఐ పవర్డ్ ఇమేజెస్‌ను జనరేట్ చేసే పనిలో ఉందని తెలిసింది. టెక్స్ట్ ప్రాంప్ట్‌తో ఈ పని జరుగుతుందని చెబుతున్నారు. 'డబ్ల్యూఏబీటాఇన్ఫో' నివేదిక ప్రకారం వాట్సాప్ ఒక షార్ట్ కట్‌ను అటాచ్‌మెంట్ సెక్షన్‌కు 'ఇమాజిన్' పేరిట కలుపుతోంది. అది చాట్స్‌లోనే ఏఐ పవర్డ్ ఇమేజెస్‌ను జనరేట్ చేస్తుంది. వాట్సాప్ చాట్ అసిస్టెంట్‌కు క్లిష్టమైన టాస్కులను అర్థం చేసుకునే ఎబిలిటీ ఉంటుంది. అయితే మెటా ఏఐ ఇప్పటికి కొన్ని దేశాల్లోని పరిమిత సంఖ్యలో యూజర్లకు అందుబాటులో ఉంది. అంటే ఏఐ పవర్ ఇమేజ్ జనరేషన్ కూడా పరిమితంగానే ఉంటుంది. ఈ వెసులుబాటు ఉనికిలోకి వస్తే, యూజర్ టెక్స్ట్ ప్రాంప్ట్, డిస్క్రిప్షన్ ఆధారంగానే హై క్వాలిటీ ఇమేజ్ జనరేట్ అవుతుంది. ఈ క్రమంలో యూజర్లు ఏఐ జనరేటెడ్ ఇమేజెస్ కోసం చాట్ అటాచ్‌మెంట్‌ను ఓపెన్ చేయాలి. టాప్‌లో మెటా ఏఐ రింగ్ ఇమేజిన్ కనిపిస్తుంది. ప్రాంప్ట్‌తో అక్కడ ఇమేజ్‌లను పొందవచ్చు. అవి వర్ణనకు అనుగుణంగా ఉంటాయి.

ఏఐ టాస్క్‌లకు వీలుగా మీడియాటెక్ చిప్‌సెట్స్

మీడియాటెక్ - మిడ్ రేంజ్ స్మార్ట్‌ఫోన్ల కోసం ముఖ్యంగా ఏఐ టాస్కులను నెరవేర్చేందుకు వీలుగా డైమెన్సిటీ 7300, డైమెన్సిటీ 7300ఎక్స్‌ని మీడియా టెక్ చిప్‌సెట్స్‌ని ప్రకటించింది. ఏఐ మల్టీ టాస్కింగ్‌కు తోడు మెరుగైన ఫొటోగ్రఫీ, గేమింగ్ సామర్థ్యాల పెంపునకు ఈ చిప్‌సెట్స్ ఉపయోగపడతాయి. ఈ రెంటినీ 4ఎన్ ఎం ప్రాసెస్‌పై అభివృద్ధిపర్చారు. ఆక్టా-కోర్ సీపీయు అదీ 4ఎక్స్ ఆర్మ్‌టెక్స్-ఎ78 కోరెస్ - 2.5జీహెచ్‌జెడ్ వద్ద 4ఎక్స్ ఆర్మ్ కోర్టెక్స్ -ఏ55 కోరెస్‌ను కలుపుకొని ఉండేవా టిని సపోర్ట్ చేస్తాయి. చెరి 20 శాతం మేర ఫాస్టర్ ఎఫ్‌పీఎస్, ఎనర్జీ ఎఫిషియెన్సీకి ఉపయోగపడతాయి. ఈ సిరీస్ 5జీ, వైఫై గేమ్ కనెక్షన్స్, బ్లూటూత్ ఎల్ఈ ఆడియోకు ఉపయోగపడతాయి. మొత్తమ్మీద ఏఐ టాస్కులకు తోడు మెరుగైన గేమింగ్ అనుభవం పొం దేందుకు ఈ చిప్‌సెట్స్ తోడ్పడతాయని చెప్పవచ్చు.

'నథింగ్' నుంచి కొత్త ఫోన్



నథింగ్ కొత్త ఫోను 2ఎ స్పెషల్ ఎడిషన్ దేశీ మార్కెట్లోకి వచ్చింది. మీడియా టెక్ డైమెన్సిటీ 7200 ప్రొ ప్రాసెసర్ ఉంది. 6.7 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, అమోల్డ్ డిస్‌ప్లే, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉన్నాయి. 50 ఎంపి డ్యూయల్ కెమెరా సెటప్, 32ఎంపి ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. 5000ఎంఏహెచ్ బ్యాటరీ, 45 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ కూడా ఉంది. ఎరుపు, పసుపు, నీలం రంగుల్లో సింగిల్ హార్డ్‌వేర్‌తో వచ్చింది. ప్రాథమికమైన తెలుపురంగునూ విడిచిపెట్టలేదు. బ్యాక్ పానెల్‌లో గ్రే ఉంది. 12జీబీ ర్యామ్, 256 స్టోరేజీ ఉన్నాయి. ఫోన్ ధర రూ.27,999 కాగా ఆరంభ డిస్కౌంట్‌ను కూడా ఇస్తోంది.

ఫోన్ లింక్ యాప్ అప్డేట్



మైక్రోసాఫ్ట్ తన ఫోన్ లింక్ యాప్‌ని అప్డేట్ చేసింది. ఫలితంగా ఆండ్రాయిడ్ డివైజ్‌ల్లోని అదీ విండోస్ డెస్క్‌టాప్‌లోనే ఇమేజ్ నుంచి టెక్స్ట్‌ని తీయవచ్చు. నిజానికి ఫోన్ లింక్ అనేది అటు పీసీ ఇటు ఆండ్రాయిడ్ ఫోన్‌కు వారధిగా పనిచేస్తుంది. నోటిఫికేషన్స్, కాల్స్, మెసెజ్‌లకు రెస్పాన్స్ వంటివి డీల్ చేస్తుంది. ఫొటో టూల్ విషయానికి వస్తే ఆండ్రాయిడ్ నుంచి నేరుగా పీసీలకు ఫొటోలను మరే సహాయం లేకుండా చేరవేస్తుంది. తాజాగా చేసిన ఆధునీకరణ విషయానికి వస్తే...



● ముందు ఆండ్రాయిడ్ ఫోన్ - ఫోన్ లింక్ యాప్ ద్వారా విండోస్ మెషీన్‌కు లింక్ అయిందీ లేనిది సరి చూసుకోవాలి.

● లింక్ అయితే చాలు, ఫోన్ లింక్ యాప్‌తో డెస్క్‌టాప్ విండోస్‌పైకి ఫోన్‌లోని ఫొటోలను తెచ్చుకోవచ్చు.


● ఫోన్ లింక్ యాప్‌లోని ఫొటోస్ సెక్షన్‌లో నేవిగేట్ చేయాలి.

● టెక్స్ట్ ఉన్న ఫొటోని సెలెక్ట్ చేసుకోవాలి. టెక్స్ట్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

● టెక్స్ట్ డిటెక్ట్ కాగానే మౌస్‌తో దాన్ని హైలైట్ చేయాలి. సెలెక్ట్ ఆల్ టెక్స్ట్ లేదా కాపీ టెక్స్ట్ ఆప్షన్‌ను ఉపయోగించుకోవాలి.

● ఎక్కడ కావాలనుకుంటే అక్కడ కాపీ చేసిన టెక్స్ట్‌ను పేస్ట్ చేసుకోవాలి. లేదంటే క్లిప్ బోర్డ్ యాక్సెస్ కోసం విండోస్ + వి ని ఉపయోగించాలి.

టెలిగ్రామ్ యాప్‌లో కోపైలెట్ చాట్‌బోట్



మైక్రోసాఫ్ట్‌కు చెందిన కోపైలెట్ చాట్‌బోట్ టెలిగ్రామ్ యాప్‌లోకి అందుబాటులోకి వస్తోంది. మామూలుగా మాట్లాడుకోవడం నుంచి టెక్స్ట్ ప్రాంప్ట్‌తో సమాచారాన్ని పొందడం వరకు పలు ప్రయోజనాలు దీంతో టెలిగ్రామ్ యూజర్లకు సమకూరుతాయి. ఫిట్‌నెస్, స్పోర్ట్స్, గేమింగ్, ట్రావెల్ సహా పలు టాపిక్‌లపై స్పందించే లక్షణం కోపైలెట్‌కు ఉంది. అలాంటి దీన్ని ఇప్పుడు టెలిగ్రామ్ - స్మార్ట్‌ఫోన్, డెస్క్‌టాప్‌లపై ఉపయోగించుకోవచ్చు. అయితే ప్రస్తుతానికి ఇది బేటా టెస్టింగ్‌లోనే ఉందని సమాచారం. అలాగే ఇది టెక్స్ట్ ప్రాంప్ట్‌లతోనే పనిచేస్తుంది. చాట్ జీపీటీ మాదిరి వాయిస్ ప్రాంప్ట్‌లతో పని చేయదు. దరిమిలా దీన్ని పొందాలంటే...

● మొబైల్ లేదంటే డెస్క్‌టాప్‌పై టెలిగ్రామ్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలి.

● సైన్ చేయాలి. సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. ట్రైనౌ ని టాప్ చేయాలి. లేదంటే 'అట్‌కోపైలెట్అఫీషియల్‌బ్లాట్' కోసం యాప్‌లో సెర్చ్ చేయాలి.

● అపై ప్రాంప్ట్‌తో సంభాషణ మొదలుపెట్టాలి.

పబ్లిక్ యూజర్లకు మాత్రం ఇప్పటికిప్పుడు టెలిగ్రామ్ యాప్‌లో సంబంధిత ఫీచర్లు పరిమితంగానే ఉన్నాయి.

క్లోజ్ ఫ్రెండ్స్‌తోనే టీన్స్ ఇంటరాక్షన్



ఇన్‌స్టాగ్రామ్ - టీనేజర్లపై ఆంక్షలు విధించే ఫీచర్ 'లిమిట్'ను విడుదల చేసింది. సన్నిహిత స్నేహితులతో మాత్రమే ఇంటరాక్ట్ అయ్యే విధంగా టీనేజర్లను పరిమితం చేసేందుకు ఇది వీలు కల్పిస్తుంది. టీనేజర్లు అనవసరంగా వేధింపులకు గురికాకుండా ఉండేలా చూడటం ఈ ఫీచర్ లక్ష్యం. టీనేజర్ల విషయంలో ఇన్‌స్టాగ్రామ్ కొన్నేళ్లుగా ఎప్పటికప్పుడు తగుచర్యలు తీసుకుంటూనే ఉంది. అందులో భాగంగానే ఈ ఫీచర్‌ను ఇప్పుడు తీసుకు వచ్చింది. వేధింపులకు వ్యతిరేకంగా టీనేజర్లు యుద్ధం చేసేందుకు 'లిమిట్ టూల్' ఉపయోగపడుతుందని 'టెక్ క్రంచ్' పేర్కొంది. సన్నిహిత స్నేహితులు మినహా మిగిలిన వ్యక్తుల కామెంట్లు ఈ టూల్‌తో మ్యూట్‌లోకి వెళతాయి. 'క్లోజ్‌ఫ్రెండ్' సెట్టింగ్స్‌లో ఈ లిమిట్ డిఫాల్ట్‌గా ఉంటుంది. యూజర్ ప్రిఫెరెన్స్‌లకు అనుగుణంగా ఇదిలేకుంటే అప్పుడు వారు 'రీసెంట్ ఫాలోవర్స్'ను సెలెక్ట్ చేసుకోవచ్చు. తల్లిదండ్రుల ఫిర్యాదులు, అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని ఈ లిమిట్‌ని తీసుకు వచ్చినట్టు కంపెనీ పేర్కొంది.









స్మార్ట్ హోమ్ టిప్స్

ఇప్పుడు ట్రెండింగ్‌లో ఉన్న పదం స్మార్ట్. వ్యక్తి, వ్యవహారానికే కాదు అది ఇంటికీ వర్తిస్తోంది. చేతిలో ఫోన్‌నే కాదు ఇంటినీ స్మార్ట్‌గా, ఎనర్జీ ఎఫిషియెంట్‌గా మార్చుకోవచ్చు. అందుకు కొన్ని టిప్స్ పాటించాలి. ముఖ్యంగా...

● ఎనర్జీ ఎఫిషియెంట్, స్మార్ట్ డివైజ్‌ల వాడకంతోనే అసలు ప్రక్రియ మొదలవుతుంది. అదే స్మార్ట్ హోమ్‌వైపుగా అడుగులు వేసేందుకు తోడ్పడుతుంది.

● స్మార్ట్ ప్లగ్స్: మంచి ప్లగ్స్ ఉపయోగిస్తే, ఎనర్జీ వినియోగం తగ్గుతుంది. ఇప్పుడు వస్తున్న డివైజ్‌లతో కన్వెన్షనల్ అప్లయెన్స్‌కు తోడు అవసరమైన విధంగా వాడుకోనూవచ్చు. ఎక్కడో దూరంలో ఉన్నప్పటికీ మర్చిపోయిన లైట్లను ఆర్పివేయడం వంటివి చేయవచ్చు. సెలవుల్లో లైట్ల డిమ్ చేయడం సహా ఎనర్జీ ప్లగ్‌తో ఇంధన వినియోగాన్ని మానిటర్ చేయవచ్చు.

● స్మార్ట్ సెన్సర్స్: ఎనర్జీ మేనేజ్‌మెంట్‌లో ఇవి విప్లవాత్మక పరిణామాలకు దారితీయించాయి. ఫ్యాన్స్ నుంచి ప్యూరిఫైయర్ల వరకు వినూత్న పరిష్కారాలకు సెన్సర్లు దోహదపడ్డాయి. నీటి దుర్వినియోగాన్ని అరికట్టడం నుంచి స్మార్ట్ హోమ్ ఎకోసిస్టమ్స్ వరకు సర్వత్రా సెన్సర్లతో పని జరుగుతుంది.

● స్మార్ట్ బల్బులు, లైట్లు: స్మార్ట్‌ఫోన్, స్మార్ట్ స్పీకర్‌తో కంట్రోల్ అయ్యే విధంగా ఉండేవి ఎంచుకోవాలి. పవర్ వినియోగాన్ని అదుపులో ఉంచుకోవడానికి ఇవి ఉపయోగపడతాయి.

● స్మార్ట్ అప్లయెన్సెస్: వీటి కొనుగోలుకు మొదట్లో ఖర్చు ఎక్కువే అవుతుంది. శాంసంగ్ వంటి కంపెనీల ఉత్పత్తులు ఉపయోగిస్తే విద్యుత్తును ఆదా చేసుకోవచ్చు. ఫ్రిడ్జ్‌లు వంటి ఉపకరణాల విషయంలో ఈ జాగ్రత్త తప్పనిసరి.

● స్మార్ట్ థెర్మోస్టాట్స్ కంట్రోల్: ఎనర్జీ సేవింగ్‌లో థెర్మోస్టాట్ బాగా ఉపయోగపడుతుంది. వృథా నివారణకు తోడ్పడుతుంది. రిమోట్ కంట్రోల్ సామర్థ్యాలతో ఎనిమిది శాతం మేర వృథా తగ్గుతుంది. ఇంటికి దూరంగా ఉండే వ్యక్తులకు ఇది ప్రయోజనకరం.



ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 1 జూన్ 2024

అసోంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సిల్చార్(నిట్ఎస్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. స్పాన్సర్డ్/సెల్ఫ్ స్పాన్సర్డ్ కేటగిరీ(ఫుల్ టైం అండ్ పార్ట్ టైం)/ప్రాజెక్టు స్టాఫ్/ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయి(పార్ట్ టైం) కేటగిరీల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. విభాగాల వారీగా రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

నిట్ సిల్చార్

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- **సివిల్ ఇంజనీరింగ్:** జియో టెక్నికల్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ డైనమిక్స్ అండ్ ఎర్త్‌క్వేక్ ఇంజనీరింగ్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- **కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్:** కంట్రోల్ అండ్ ఇండస్ట్రియల్ ఆటోమేషన్, పవర్ అండ్ ఎనర్జీ సిస్టమ్ ఇంజనీరింగ్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్:** కమ్యూనికేషన్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్, ఆర్ఎఫ్ అండ్ టెరాహెర్ట్జ్ కమ్యూనికేషన్స్
- **ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్:** ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్
- **మెకానికల్ ఇంజనీరింగ్:** క్యాడ్-క్యామ్ అండ్ ఆటోమేషన్, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, మెటీరియల్స్ అండ్ మాన్యుఫాక్చరింగ్ టెక్నాలజీ, థర్మల్ ఇంజనీరింగ్, రెన్యువబుల్ ఎనర్జీ.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బ్యాచిలర్స్ డిగ్రీ(ఇంజనీరింగ్/టెక్నాలజీ) లేదా తత్సమాన డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు ప్రథమ శ్రేణీ మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 శాతం వరకు సడలింపు వర్తిస్తుంది. స్పాన్సర్డ్/సెల్ఫ్ స్పాన్సర్డ్ కేటగిరీ(ఫుల్ టైం అండ్ పార్ట్ టైం), ప్రాజెక్ట్ స్టాఫ్ కేటగిరీ అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. ఇన్‌స్టిట్యూట్ ఎంప్లాయి(పార్ట్ టైం) కేటగిరీ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. వీరు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500.
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరితేదీ:** జూలై 1
- **షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితా వెల్లడి:** జూలై 10
- **రిటెన్ టెస్ట్‌లు, ఇంటర్వ్యూలు:** జూలై 25
- **ఈ-మెయిల్:** deanacd@nits.ac.in
- **వెబ్‌సైట్:** www.nits.ac.in



మౌలానా ఆజాద్ వర్సిటీలో ఎంటెక్


హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ(సెంట్రల్ యూనివర్సిటీ-మనూ)కి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ- ఎంటెక్(కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్) పార్ట్ టైం ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్'. మొత్తం 30 సీట్లు ఉన్నాయి. స్పాన్సర్డ్/సెల్ఫ్ ఫైనాన్స్ మోడ్‌లో అడ్మిషన్స్ ఇస్తారు. పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఉర్దూ/ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. హాస్టల్ సౌకర్యం లేదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

అర్హత: పదోతరగతి/ఇంటర్/డిగ్రీ స్థాయిలో ఉర్దూ ఒక సబ్జెక్ట్‌గా/సెకండ్ లాంగ్వేజ్‌గా లేదా ఉర్దూ మాధ్యమంలో చదివి ఉండాలి. లేదా మనూ గుర్తింపు పొందిన సంస్థ నుంచి ఉర్దూ మాధ్యమంలో మదర్సా కోర్సు పూర్తిచేసి ఉండాలి. లేదంటే సంస్థ అందించే ఎలిమెంటరీ ఉర్దూ కోర్సు(ఆడిట్ కోర్సు)ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఇందులో కనీసం 40 శాతం మార్కులు రావాలి.

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో(బీఈ/బీటెక్)(కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/కంప్యూటర్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)/ఐఈటీఈ/ఏఎంఐఈ(ఈసీఈ/సీఎస్ఈ/ఐటీ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఐటీ/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్/ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫిజిక్స్/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/ఆపరేషన్ రీసెర్చ్/అప్లయిడ్ ఫిజిక్స్)/ఎంసీఏ పూర్తిచేసిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **ఆన్‌లైన్ సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 15
- **ఇంటర్వ్యూకి ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 22
- **ఇంటర్వ్యూలు:** జూలై 29
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఆగస్టు 2
- **అడ్మిషన్ ఫీజు చెల్లింపు:** ఆగస్టు 15, 16
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 26 నుంచి
- **వెబ్‌సైట్:** https://manuu.edu.in

నేషనల్ ఆర్కైవ్స్‌లో సర్టిఫికెట్ కోర్సు



నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ ఆర్కైవల్ స్టడీస్- 'షార్ట్ టర్మ్ సర్టిఫికెట్ కోర్స్ ఇన్ రెప్రోగ్రఫీ'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ కోర్సుని జూన్ 24 నుంచి ఆగస్టు 2 వరకు నిర్వహిస్తారు. ఇందులో రీ ప్రొడక్షన్ ఆఫ్ డాక్యుమెంట్స్ అండ్ మాన్యుస్క్రిప్ట్స్, మైక్రోఫిల్మింగ్, ఆటోమేటెడ్ ఇన్ఫర్మేషన్ స్టోరేజ్, రిట్రైవల్ అండ్ డిసెమినేషన్ సంబంధిత అంశాలు వివరిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. సైన్స్ డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. ప్రైవేట్ అభ్యర్థులకు 30, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 50 ఏళ్లలోపు వయసు ఉండాలి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం
- **కోర్సు ఫీజు:** రూ.300
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూన్ 7
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** ఎడ్యుకేషనల్ సర్టిఫికెట్‌లు; కులం, వయసు, స్పాన్సర్‌షిప్ ధ్రువీకరణ పత్రాలు
- **చిరునామా:** డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఆర్కైవ్స్, నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా, జన్‌పథ్, న్యూఢిల్లీ - 110001
- **వెబ్‌సైట్:** https://nationalarchives.nic.in

న్యూఢిల్లీలోని ఇండియన్ సొసైటీ ఫర్ ట్రెయినింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రెయినింగ్ అండ్ డెవలప్‌మెంట్(పీజీడీటీడీ) 2024 జూలై బ్యాచ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది 18 నెలల వ్యవధి గల డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్. ఇందులో హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన అంశాలు బోధిస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 12 సబ్జెక్ట్‌లు, మూడు నెలల వ్యవధి గల ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ ఉంటాయి. బ్యాంకులు, బిజినెస్ సంబంధిత సంస్థలు, అడ్మినిస్ట్రేషన్ విభాగాలు, అగ్రికల్చర్- హెల్త్ - ఎడ్యుకేషన్ విభాగాలు, డిఫెన్స్ ఫోర్సెస్, సోషల్ సెక్టార్-వాలంటరీ సంస్థలు, కన్సల్టెన్సీలలో పనిచేస్తున్న హెచ్ఆర్‌డీ ఆఫీసర్స్, ట్రెయినింగ్ ప్రొఫెషనల్స్, లైన్ మేనేజర్స్, ప్రొఫెషనల్స్‌కు ఈ కోర్సు ప్రయోజనకరంగా ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేసుకొన్ననాటి నుంచి నాలుగేళ్లలోపు ప్రోగ్రామ్‌ను పూర్తిచేయాల్సి ఉంటుంది. ఏటా రెండుసార్లు అడ్మిషన్ ప్రక్రియ నిర్వహిస్తారు.

ఐఎస్‌టీడీలో పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో మూడు సెమిస్టర్‌లు ఉంటాయి. ప్రతి సెమిస్టర్‌లో నాలుగు సబ్జెక్ట్‌లు ఉంటాయి. మొదటి సెమిస్టర్‌లో బిజినెస్ స్ట్రాటజీ అండ్ హెచ్ఆర్‌డీ, ఇన్‌స్ట్రక్షనల్ డిజైన్, ట్రెయినింగ్ మెథడ్స్-కాగ్నిటివ్, ట్రెయినింగ్ మెథడ్స్ -ఎక్స్‌పీరియెన్షల్; రెండో సెమిస్టర్‌లో ఫెసిలిటేషన్ స్కిల్స్, కమ్యూనికేషన్ అండ్ ప్రజంటేషన్ స్కిల్స్ ట్రెయినింగ్ మెజర్‌మెంట్ అండ్ ఎవల్యూషన్, మేనేజింగ్ ట్రెయినింగ్ ప్రాసెస్; మూడో సెమిస్టర్‌లో డేటా అనలిటిక్స్, ఇన్నొవేషన్ అండ్ ఛేంజ్ మేనేజ్‌మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్ టీ అండ్ డీ, ఎలక్టివ్ సబ్జెక్ట్(టాలెంట్ మేనేజ్‌మెంట్, డెవలప్‌మెంట్ సెంటర్ మేనేజ్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ) పేపర్లు ఉంటాయి. వీటికి సంబంధించిన రీడింగ్ మెటీరియల్, ఈ-జర్నల్ అందిస్తారు. వారాంతాల్లో ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. సంస్థకు చెందిన ప్రొఫెషనల్స్ మెంటార్లుగా వ్యవహరిస్తారు. మొదటి రెండు సెమిస్టర్‌లు పూర్తయ్యాక మెంటార్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ప్రాజెక్ట్ పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ప్రొక్టోర్డ్ ఆన్‌లైన్ విధానం ద్వారా పరీక్షలు నిర్వహిస్తారు. ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ఏడాదిపాటు సంస్థలో ఉచితంగా మెంబర్‌షిప్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. బీఈ/బీటెక్, ఎంబీబీఎస్, సీఏఐబీ, ఏసీఏ, ఏఐసీడబ్ల్యుఏ, ఎంఈడీ వంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారు; మెడికల్, ఇంజనీరింగ్, ఐటీ, మార్కెటింగ్, ఫైనాన్స్, అకౌంట్స్, పబ్లిక్ రిలేషన్స్ తదితర విభాగాల్లో పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సాయుధ దళాల ఉద్యోగులు, మాజీ సైనిక అధికారులు, పారా మిలిటరీ దళాల అభ్యర్థులు, సీనియర్ సిటిజన్స్ కూడా అర్హులే. అనుభవం ఉండాల్సిన అవసరం లేదు.

- **ప్రోగ్రామ్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.50,000+18 శాతం జీఎస్‌టీ(ఇన్‌స్టాల్‌మెంట్‌లో చెల్లించే అవకాశం ఉంది); సంస్థ మెంబర్లు, వారి కుటుంబ సభ్యులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.45,000+18 శాతం జీఎస్‌టీ; సాయుధ దళాల ఉద్యోగులు, మాజీ సైనిక అధికారులు, పారా మిలిటరీ దళాల అభ్యర్థులకు రూ.30,000+18 శాతం జీఎస్‌టీ
- **దరఖాస్తు ఫీజు:** రూ.1500+18 శాతం జీఎస్‌టీ(రూ.270)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 30
- **వెబ్‌సైట్:** www.istd.in



యూపీఎస్సీ ఎన్‌డీఏ ఎగ్జామ్

నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ) నోటిఫికేషన్‌ను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) విడుదల చేసింది. త్రివిధ దళాల్లో 2025 జూన్ 2 నుంచి ప్రారంభం అయ్యే 154వ కోర్సుల్లో, 116వ ఇండియన్ నేవల్ అకాడమీ(ఐఎన్ఏసీ) కోర్సుల్లో ప్రవేశాలకు ఈ పరీక్షను ఉద్దేశించారు. అర్హులైన మహిళా, పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- యూపీఎస్సీ - నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ ఎగ్జామినేషన్(2)-2024

ఖాళీలు: మొత్తం 404. వీటిలో నేషనల్ డిఫెన్స్ అకాడమీ పోస్టులు 370(ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్ ఫోర్స్-120) ఉన్నాయి. వాటిలో 28 గ్రౌండ్ డ్యూటీకి సంబంధించిన ఖాళీలు. నేవల్ అకాడమీ(10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్) ఖాళీలు 34 ఉన్నాయి.

అర్హత: ఆర్మీ వింగ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే వారు ఏదైనా గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. ఎయిర్ ఫోర్స్, నేవీ పోస్టులకు 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్(ఇండియన్ నేవల్ అకాడమీ) ద్వారా దరఖాస్తు చేసుకునే వారు ఫిజిక్స్, మేథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. దీంతోపాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలు ఉండాలి. ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు 2006 జనవరి 1కి ముందు, 2009 జనవరి 1 తరవాత జన్మించి ఉండకూడదు.

దరఖాస్తు: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఎంపిక విధానం: అభ్యర్థులను రెండు దశల్లో ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటెలిజెన్స్- పర్సనాలిటీ టెస్ట్, ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ, మెడికల్ టెస్ట్ తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

కోర్సులు: నేషనల్ డిఫెన్స్ అకాడమీ అండ్ నేవల్ అకాడమీ(ఎన్‌డీఏ అండ్ ఎన్ఏ), ఆర్మీ 10+2 బీటెక్ క్యాడెట్ ఎంట్రీ పరీక్షలో మెరిట్ సాధిస్తే డిగ్రీ కోర్సులకు ఎంపికవుతారు. అలా ఎంపికైనవారు బీఏ, బీఎస్సీ, బీటెక్ కోర్సుల్లో తాము ఎంచుకున్న దాన్ని ఉచితంగా చదవవచ్చు.

శిక్షణ: తుది అర్హత సాధించిన అభ్యర్థులు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, పుణెలో చదువు శిక్షణ పొందుతారు. అనంతరం ఆర్మీ క్యాడెట్లను డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీకి; నేవల్ క్యాడెట్లను ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడమీకి; ఎయిర్ ఫోర్స్ క్యాడెట్‌లు హైదరాబాద్‌లోని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అకాడమీకి సంబంధిత ట్రేడ్ శిక్షణ కోసం పంపుతారు. కోర్సు విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులను ఉద్యోగాల్లోకి తీసుకుంటారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌లో ప్రారంభ స్థాయి ఆఫీసర్ ఉద్యోగాలైన లెఫ్టినెంట్, సబ్-లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్/గ్రౌండ్ డ్యూటీ ఆఫీసర్ హోదాతో కెరియర్ ప్రారంభం అవుతుంది.

దరఖాస్తు రుసుము: రూ.100. ఎస్సీ, ఎస్టీ, మహిళా అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: సెప్టెంబరు 1

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: అనంతపురం, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, వరంగల్.

వెబ్‌సైట్: https://upsc.gov.in/



జాబ్ కార్నర్

ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్

ఎయిర్ ఫోర్స్‌లో ఉన్నత ఉద్యోగాలకు ఉద్దేశించిన ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్-02/2024) నోటిఫికేషన్ విడుదలైంది. కోర్సు 2025 జూలైలో ప్రారంభం కానుంది.

- ఎయిర్ ఫోర్స్ కామన్ అడ్మిషన్ టెస్ట్(ఏఎఫ్ క్యాట్)02/2024, ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ

1. **ఏఎఫ్‌క్యాట్ ఎంట్రీ:** ఫ్లయింగ్/గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్)/గ్రౌండ్ డ్యూటీ(నాన్ టెక్నికల్)
2. **ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ:** ఫ్లయింగ్

అర్హతలు: ఇంటర్(ఫిజిక్స్, మేథ్స్), సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ/బీఈ, బీటెక్ ఉత్తీర్ణతతో నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: ఫ్లయింగ్ బ్యాచ్‌కు 20-24 ఏళ్లు. గ్రౌండ్ డ్యూటీ(టెక్నికల్/నాన్-టెక్నికల్) బ్రాంచ్‌కు 20-26 సంవత్సరాల మధ్య ఉండాలి.

పే స్కేల్: ఫ్లయింగ్ ఆఫీసర్‌కు రూ.56,100 - రూ.1,77,500.

ఎంపిక విధానం: పోస్టును అనుసరించి ఆన్‌లైన్ పరీక్ష, స్టేజ్-1, స్టేజ్-2 పరీక్షలు, ఇంటర్వ్యూ, కంప్యూటరైజ్డ్ పైలెట్ సెలెక్షన్ సిస్టం పరీక్ష, వైద్య పరీక్షలు, ధ్రువపత్రాల పరిశీలన తదితరాలను నిర్వహించి శిక్షణకు ఎంపిక చేస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: జూన్ 28

ఆన్‌లైన్ పరీక్ష తేదీలు: 2024 ఆగస్టు 9, 10, 11

వెబ్‌సైట్: https://afcat.cdac.in/AFCAT/




తెలివైన తీర్పు

ఒక ఊరిలో ఆనంద వర్మ అనే గ్రామాధికారి ఉండేవాడు. అతను చాలా న్యాయమైన తీర్పులు చెబుతాడని చుట్టుపక్కల ఊళ్లల్లో మంచి పేరు ఉండేది. ఆనంద వర్మ నివసించే ఊరిలోనే రాజారావు అనే భూస్వామి ఉండేవాడు. ఆ భూస్వామి దగ్గర సాంబయ్య అనే నౌకరు పనిచేస్తూ ఉండేవాడు. ఒక రోజు సాంబయ్య బియ్యం బస్తా మోస్తూ- పొరపాటున భూస్వామి పెంచుకుంటున్న కోడిపై పడేశాడు. కోడి చచ్చిపోయింది. రాజారావుకు చాలా కోపం వచ్చింది. "ప్రతి రోజు గుడ్లు పెట్టే నా కోడిని చంపేశావు. కోడి బతికి ఉంటే ఒక ఏడాదిలో ఎన్ని గుడ్లు పెట్టేదే గణించి.. వాటికి సరిసమానమైన సొమ్ము నాకు ఇవ్వు" అని సాంబయ్యను బెదిరించాడు. తన తప్పు లేదని సాంబయ్య ఎంత వేడుకున్నా ఒప్పుకోలేదు. దాంతో సాంబయ్య తప్పనిసరి పరిస్థితుల్లో ఆనందవర్మ దగ్గరకు వెళ్లాడు. ఆనందవర్మ తన కార్యాలయానికి రాజారావును కూడా పిలిచాడు. రాజారావు వాదన విన్న తర్వాత- "మీ వాదన సరైనదే అనిపిస్తోంది. సాంబయ్య మీకు వంద రూపాయలు చెల్లించాలి" అన్నాడు. వెంటనే రాజారావు వైపు తిరిగి - "మీరు కోడికి ఎలాంటి దాణా పెడతారు?" అని అడిగాడు. "ప్రతి రోజు బియ్యం.. జీడిపప్పు.. రకరకాల మందులు.. వీటికి ప్రతి ఏడాది 500 రూపాయలు ఖర్చు పెడతా" అంటూ రాజారావు గొప్పగా చెప్పాడు. అప్పుడు ఆనందవర్మ - "గుడ్ల ఖరీదు సాంబయ్య మీకు చెల్లించాల్సి వచ్చినప్పుడు- దాణాకి అయ్యే ఖర్చు మీరు సాంబయ్యకు చెల్లించండి" అని తీర్పు ఇచ్చాడు. దాంతో రాజారావుకు అసలు విషయం అర్థమయింది. సాంబయ్యతో రాజీ చేసుకున్నాడు.

సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 321

1		5			3			
	2		6					
	3				8	4		
4	9			6		5	8	
	5	7		8			2	3
		2	4				6	
					2		3	
			1			9		2

సుడోకు - 320 సమాధానం

1	2	8	7	5	3	9	6	4
5	4	7	2	9	6	8	1	3
3	9	6	8	1	4	2	5	7
7	1	5	4	6	2	3	9	8
4	8	9	5	3	7	1	2	6
6	3	2	1	8	9	4	7	5
2	6	4	3	7	1	5	8	9
9	5	3	6	2	8	7	4	1
8	7	1	9	4	5	6	3	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.